పరమసంత్ పరమదయాల్
పండిత్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

# సత్సంగ సుధ

**(ఏడవ భాగము)**

**గురు పూర్ణిమ**


**నవ వివాహితులకు ఉపదేశం**

**సంత్ మతం-ఆత్మానుభూతి**

*అనువాదం :*
**జ్యోతిరాణి**

*ప్రోత్సాహకులు :*
**దయాల్ ఆనందరావు మహారాజ్**
**దయాల్ శివమంగళ్ సింగ్ మహారాజ్**

# జ్యోతిరాణి




విద్యార్హతలు : బి.యస్సీ., ఎం.ఎ. (తెలుగు),
ఎం.ఎ. (హిందీ), సంస్కృతంలో [illegible]
ఇంగ్లీష్ టైప్‌రైటింగ్, షార్ట్‌హ్యాండ్

ఉద్యోగం : సబ్-ఎడిటర్, [illegible] దినపత్రిక
వందలాది వ్యాసాలు, వివిధ [illegible]
అడ్వర్టయిజ్‌మెంట్లు, ఫీచర్లు, [illegible]

రచనలు :
1. మధుజ్వాల (కవితా సంపుటి 198[illegible]
(1983లో శ్రీశ్రీ సాహిత్య [illegible])
2. భక్తమీరా (గేయ [illegible] 198[illegible]
(దీనికి 1986లో [illegible]
3. మంచు పందిరి (కవితా సంపుటి 19[illegible])

అనువాదాలు :
4. ధర్మచారిణి (ఆధ్యాత్మిక [illegible] 1988)
5. ప్రవచన తరంగిణి (1989)
6. ఉపదేశ తరంగిణి (1991)
7. సత్సంగ సుధ (ప్రథమ భాగం 1993)
8. సత్సంగ సుధ (రెండవ భాగం 1994)
9. సత్సంగ సుధ (మూడవ భాగం 1995)
10. రాజభిక్షువు (ఆధ్యాత్మిక [illegible] 1995)
11. ఏడు వారాల కథలు (1995)
12. భోక్త ఆరోగ్యానికి [illegible] (1996)
13. స్వామీజీ మహారాజ్ జీవిత చరిత్ర (1996)
14. ఆనంద యోగం ([illegible] 1996)
15. కాంతి సుధ్యం (ఆధ్యాత్మిక [illegible] 1997)
16. సమాంతర రేఖలు (1997 [illegible])
17. గురువాణి (1997)
18. చాత్తాద శ్రీ వైష్ణవులు (1997)
19. మహారామాయణం (ప్రథమ భాగం 1998)
20. హుజూర్ రాయ్‌సాలిగ్‌రామ్ మహరాజ్ [illegible] (1998)
21 సత్సంగ సుధ (నాలుగవ భాగం 1998)
22. మహారామాయణం (రెండవ భాగం 1999)
23. గుప్త రహస్యం (1999)
24. సత్సంగ సుధ (ఐదవ భాగం 1999)
25. సత్సంగ సుధ (ఆరవ భాగం 2000)
26. మహారామాయణం(మూడవ భాగం 2000)




పరమ సంత్ పరమదయాల్ పండిత్ ఫకీర్ చంద్‌జీ మహారాజ్

# పరమ సంత్ పరమ దయాల్ పండిత్
# ఫకీర్ చంద్‌జీ మహారాజ్
# సందేశం

1. నీ నడవడిని, ప్రవర్తనను పవిత్రంగా ఉంచుకో! మనిషివి కా!
2. సదా ఆశావాదివై ఉండాలి.
3. స్మరణ మనసును శాంతింపచేస్తుంది.
4. మనసు, వాక్కు, కర్మల ద్వారా పరిశుద్ధంగా ఉండాలి.
5. నీ వ్యక్తిగత స్వార్థం కోసం ఇతరులను మోసగించకు.
6. నీ శరీరం హరిమందిరం. ప్రభువు స్వయంగా ఇందులో కొలువై ఉన్నాడు. ఆయన్ని అన్వేషించు. అవశ్యం లభిస్తాడు.
7. ఆత్మ-పరమాత్మల కలయికలో, మనసే ఆటంకం అవుతుంది. మనసును వశం చేసుకో. ఆత్మ తనకు తానుగా పరమాత్మ వైపు ఆకర్షింపబడుతుంది.
8. సాధారణమైన, సరళమైన జీవనం గడుపుతూ ఉన్నతంగా ఆలోచించు.
9. అసహ్యాన్ని అసహ్యంతో తొలగించటం అసాధ్యం.
10. నీవిచ్చిన మాటను నిలబెట్టుకో. అదే మానవత.
11. కర్మ నియమం నుండి ఎవరూ తప్పించుకోలేరు.
12. నీ కోసం నీవు ఆచరించని అంశాన్ని ఇతరులకు ఎన్నటికీ వర్తింపచేయకు. నీవు పాటించని సూత్రం ఇతరులు పాటించాలని అనుకోకు.
13. నీ భారం ఇతరులపై పడదోసే ప్రయత్నం చేయకు.
14. సదా శుభసంకల్పం చేయాలి.
15. నీకు ఎవరిమీద విశ్వాసం కుదిరితే వారిని ఒక్కరినే పరిపూర్ణంగా నమ్ముకో. ఈ రోజు దేవిని, రేపు రాముణ్ణి, ఎల్లుండి కృష్ణుణ్ణి, ఆ తరువాత బాబాజీని విశ్వసించి, పూజిస్తే రెంటని చెడ్డ రేవడిలా ఉంటుంది నీ పరిస్థితి.
16. ఇతరుల సొమ్మును ఆశించకు.

17. ఎవరి భోజనం వారే సంపాదించుకుని తినాలి.

18. స్త్రీలే జాతి నిర్మాతలు. సత్సంతానానికి జన్మనివ్వండి.

19. సత్యమైన సత్పురుషుడైన సద్గురువు శరణు వేడుకో. మోసగించే గురువుల బారి నుండి తప్పించుకో.

20. నామం జపించే ముందు నిష్కల్మషుడవు, నిజాయితీ పరుడవు కావటం తప్పనిసరి. మనసులో భేద భావాలకు, ఈర్ష్యా ద్వేషాలకు చోటివ్వకు. దానిని పవిత్రంగా ఉంచుకో. ఒకవైపు నామం జపిస్తూ, మరొక వైపు హానికరమైన ఆలోచనలు, కర్మలు చేస్తే ఆ నామం నీకు కీడును కలిగిస్తుంది.

21. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అభ్యాసం చేయి.

22. గురుచరణాలే ప్రకాశం. బుద్ధి, జ్ఞానం, వివేకములే గురునామం. అంతరంలో ప్రకాశాన్ని దర్శించుకో.

23. ప్రతిరోజూ దానం చేయి. నీ పేదరికం తొలగిపోతుంది.

24. ఇళ్ళల్లో శాంతి ఉండేలా చూడు. కలహాలు జరిగే ఇంట్లో ఏదో ఒక ఆపద, నష్టం సంభవించి తీరుతుంది.

25. ఎలాంటి కర్మచేస్తావో అలాంటి ఫలితం అనుభించక తప్పదు.

26. పూర్వజన్మలోనో, ఈ జన్మలోనో నీవు చేసిన కర్మల ఫలితమే నీకు లభిస్తుంది. అంతే! నిన్నెవరూ కష్టపెట్టరు. సుఖపెట్టరు.

27. సంపూర్ణ విశ్వాసంతో నీ గురువును అంతరంలో సాక్షాత్కరింపచేసుకుని జనన మరణాల చక్రం నుండి విముక్తి పొందడానికీ, నిజగృహానికీ చేరుకోవడానికి ప్రయత్నించాలి.

28. నేనెవరిని? ఎక్కడి నుండి వచ్చాను? ఎక్కడికి వెళ్లాను? అసలైన భగవంతుడెవరు? ఎక్కడుంటాడు? నిజగృహానికి ఎలా చేరుకోగలను? అని ప్రతి మనిషీ ఆలోచించాలి.

29. గురువును మనిషి అనుకోకు. ఆయన సర్వాధారుడైన పరమాత్ముడని విశ్వసిస్తేనే నీవు ఇహపరాలలో జయం పొందుతావు.

30. మానసిక, శారీరిక బ్రహ్మచర్యాన్ని విధిగా పాటించు.

31. క్షమ, ప్రేమ, శుభ సంకల్పం, శరణాగతి, నిష్కామకర్మ,బ్రహ్మచర్య పాలన నిన్ను ఉద్ధరిస్తాయి.

32. సంత్ మతంలోకి రావాలనుకుంటే ముందుగా తప్పనిసరిగా నీవు చేయవలసిన పని ఒకటుంది. మాంసభోజనం, మద్యపానం, వ్యభిచారం, దొంగతనం ఈ నాలుగు అలవాట్లనూ వదిలితీరాలి. లేకుంటే సాధన జరగదు.

33. నీవు ఎవరికైనా ఋుణపడి ఉంటే వెంటనే దానిని చెల్లించు. ఎదుటివారు మరిచిపోయి, అడగకపోతే నీవు తిరిగి ఇవ్వకుంటే నిన్ను ఏ భగవంతుడూ, ఏ గురువూ, ఏ సంత్ మహాత్ముడూ రక్షించలేడు. ఆ ఋుణం తీర్చడం కోసమైనా నీవు మరో జన్మ ఎత్తవలసి వస్తుంది.

34. సదా సజ్జన సాంగత్యములో ఉండాలి.

35. మనం అందరం ప్రకాశస్వరూపులమే!

36. పరమతత్వాధారుణ్ణి కలుసుకోవాలనే తపన కలిగినవారే దుఃఖజీవులు. అలాంటి వారిని గురుదేశానికి తీసుకుపొమ్మని నా గురువు నన్ను ఆదేశించాడు.

37. ఏదైనా పనిని ప్రారంభించదలుచుకుంటే అది తప్పక విజయవంతం అవుతుందన్న ప్రగాఢ విశ్వాసంతో మొదలుపెట్టు. అవుతుందో, కాదోననే సంశయాలను వదలి దానిని ప్రారంభిస్తే జయం కలుగుతుంది.

38. గురుధారణ చేయడమంటే గురువు కాళ్ళకు తలవంచి మొక్కడం కాదు. గురువచనాలను ఆచరించటం!

39. సత్యమార్గాన్ని చూపించటం, వాస్తవాన్ని బోధించటం నా కర్తవ్యం. చెప్పటం వరకే నా బాధ్యత. ఆచరించే వంతు మీదే!

40. ఈ భవసాగరం నుండి నిన్ను బయటికి లాగగలిగే సమర్థుడు సద్గురువే.

41. మనిషి తన భారాన్ని ఇతరులపై వేయకూడదు. ఇదే మానవత. మీ స్వార్థం కోసం నీ సంబంధితులను వేధించటం అపరాధం.

42. జనన మరణాల చక్రం నుండి, 84 లక్షల చక్రం నుండి తప్పించుకోవాలనుకున్న వారే నా వద్దకు రావాలి. వచ్చి గురుసేవ చేయాలి. గురువును సేవించకుంటే ఏమీ లభించదు.

43. గురు సేవ ఎలా చేయాలి? గురువును దర్శించుకుని ఆయన వచనాలను శ్రద్ధగా వినాలి. ఆ తరువాత మననం చేసుకోవాలి. వాటిలోని సారాన్ని జీర్ణించుకోవాలి. ఆచరించాలి. అప్పుడే నీ పడవ తీరం చేరుతుంది. ప్రతిరోజూ సత్సంగం చేయాలి. గురువచనాలను వినాలి.

# సత్సంగ సుధ ఏడవ భాగంలో . . .


| | | | |
|---|---|---|---|
| 1. | గురు పూర్ణిమ | 24-6-1971 | 1 |
| 2. | గురు పూర్ణిమ | 4-7-1974 | 7 |
| 3. | గురు పూర్ణిమ-ఆ ఇంటి అన్వేషణ | 18-7-1970 | 14 |
| 4. | చివరి గురు పూర్ణిమ | 20-8-1980 | 37 |
| 5. | నవ వివాహితులకు ఉపదేశం | 1-5-1968 | 44 |
| 6. | నూతన సంవత్సరం | 1-1-1975 | 54 |
| 7. | శ్రావణమాసం | 21-7-1974 | 57 |
| 8. | బొంబాయి సత్సంగం | 14-1-1969 | 74 |
| 9. | పరమ శాంతి | 31-5-1970 | 85 |
| 10. | పారతత్వ సత్యం-శాంతి-వాస్తవం | | 93 |
| 11. | ప్రతిష్టించని దేవుడు | 25-3-1973 | 97 |
| | **సంత్ మతం-ఆత్మానుభూతి** | | |
| 12. | సత్సంగం ద్వారా జ్ఞానప్రాప్తి | 11-1-1973 | 102 |
| 13. | వేర్పాటు భక్తి వలన ముక్తి లభించదు | 14-1-73 | 107 |
| 14. | స్మరణ, ధ్యానం, భజనల ద్వారా ఇష్ట ప్రాప్తి | 21-1-1973 | 120 |
| 15. | సాధన ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి | 22-1-1973 | 127 |
| 16. | నిజమైన రహస్యం | 17-11-1973 | 131 |
| 17. | సత్యమేవ జయతే | 23-12-1973 | 136 |

# స్వామీజీ మహారాజ్ జయంతి

## 22-8-2000

సందర్భంగా వెలువడుతున్న పరమ దయాల్ ఫకీర్ చంద్
మహారాజ్‌గారి బోధనల సత్సంగ సుధ (ఏడవ భాగం)కు,
మహారాజ్‌లకు, ఆచార్యులకు, సహృదయ పాఠకులైన
సత్సంగీయులకు హార్దిక అభినందనలతో...

# వేముల మార్కండేయ

## కిరాణం అండ్ జనరల్ మర్చంట్స్

ఇ.నెం. 6-8-36, రాగన్న దర్వాజ
హన్మకొండ - 506 001
ఫోన్. నెం. 78115

(డోర్ డెలివరి సౌకర్యం కలదు.)

**మా వద్ద**
**రాధాస్వామి సంత్ సాహిత్యం**
**దాతాదయాల్ మహర్షి శివవ్రత్‌లాల్ మహారాజ్**
**పరమదయాల్ పండిత్ ఫకీర్‌చంద్ మహారాజ్‌ల**
**గ్రంథాలు తెలుగులో లభిస్తాయి.**

# గురు పూర్ణిమ

## పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

### మానవతా మందిరం, హోషియార్‌పూర్

### సత్సంగ సందేశం

### తేది 24-6-1971

ఈరోజు గురుపూర్ణిమ. తమ ఇష్టదైవం పట్ల గానీ, గురువు పట్ల గానీ తమ విశ్వాసాన్నీ, కృతజ్ఞతనూ తెలుపుకునేటందుకు ఇలాంటి పండుగలు జరుపుకునే సంప్రదాయం ఉండటం హిందువుల్లోని చెప్పుకోదగిన లక్షణం. ఒక మహాపురుషుని వల్ల మానవజాతికి మేలు జరిగితే ఆయన్ని ఆరాధించటం, స్మృతి చిహ్నంగా ఆయన కీర్తిని గుణగానం చేయటం తరతరాలుగా వస్తున్న ఆచారం. నేను కూడా ఈ భారతీయ సమాజంలోని బ్రాహ్మణుడినే. ఈనాటి ఈ గురుపూర్ణిమ సందర్భంలో నా గురువైన హుజూర్ దాతాదయాల్ శివవ్రత్‌లాల్ మహారాజ్‌కు నా కృతజ్ఞతాభి వందనాలర్పించుకుంటున్నాను. ఆయన నా సాంసారిక, సామాజిక, ఆధ్యాత్మిక జీవన విధానాలను సరైన మార్గంలో నడిపించాడు. నాకు ఎనలేని ఉపకారం చేసిన నా గురువు పదే పదే తలపుకొస్తున్నాడు.

ఒకప్పుడు నేను అజ్ఞానిని. మూర్ఖుడిని. నా చిన్న వయసులో ఆరు నెలలపాటు మాంసాహారం తిన్నాను. మూడుసార్లు మద్యం పుచ్చుకున్నాను. ఒకసారి వేశ్య దగ్గరకు వెళ్ళాను. ఇవి తప్ప నా జీవితంలో నేనే తప్పులూ చేయలేదు. కానీ చేసిన ఈ దోషాలను ఆ తరువాత తలచుకుని ఎంతో బాధపడ్డాను. పశ్చాత్తాపపడ్డాను. ఇది 1905 నాటి మాట. మా అన్నగారు పండిత్ రామనారాయణ సలహా మేరకు నా ఈ చెడు కర్మలను కడిగివేసే ఉపాయం ఒక్కటేనని తోచింది. అదే భగవంతుని దర్శనం. ఆ క్షణం నుండే భగవంతుని అన్వేషణ ప్రారంభించాను. ఎంతకీ ఆయన దర్శనం కాకపోయేసరికి ఓ రోజు బాధపడుతూ ఇరవై నాలుగు గంటలపాటు నిర్విరామంగా ఏడ్చేశాను. ఆనాటి తెల్లవారుఝామున కలలో మహర్షి శివవ్రత్‌లాల్ మహారాజ్ దర్శనం అయింది. నా భగవంతుడు ఆయన రూపంలో అవతరించాడన్న విశ్వాసం కుదిరింది. మొదటిసారిగా ఆయనను లాహోర్‌కు వెళ్లి దర్శించుకున్నాను. ఆయన చరణ

సన్నిధిలో వాలిపోయాను. ఆయన నాపై దయతలచి గురు మతంవైపు నేను ఆకర్షితమయ్యేలా చేశారు. ఆనాటి ఆయన సుందరమైన, ప్రకాశవంతమైన ముఖం ఇప్పటికీ నాకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. సామాజిక జీవనంలో ఆయన ఆదేశించిన తరహాలోనే ఇప్పటికీ నడుచుకుంటున్నాను.

1915లో దాతాదయాల్ నాకు గురుపదవి నిస్తూ "ఫకీర్! నీలో సత్యప్రియత్వం అనే మంచి గుణం ఉంది. నా ఆజ్ఞను పాటించు. సత్యమైన సద్గురువు దర్శనం సత్సంగీయుల రూపంలో నీకు లభిస్తుంది" అంటూ నేను అన్వేషించే సత్యమైన సద్గురువు, పరమతత్వం చిరునామా చూపించారు. గురు పదవిని అధిష్ఠించాక నన్ను విశ్వసించిన సత్సంగీయుల అనుభవాలే నాకళ్ళు తెరిపించాయి. తమ అంతరంలో దర్శనమిచ్చానని ఎందరో ఉత్తరాలు రాస్తుంటారు. నేనిక్కడ కూర్చుని ఉండి వాళ్ళ అంతరంలోకి ఎలా వెళ్ళగలిగాను? నేను ఎవరి స్వప్నంలోకీ పోలేదనీ, ఎవరి సురత్‌ను అధిరోహింపచేయలేదనీ, మరణ సమయంలో ఎవరినీ తీసుకుపోలేదనీ, మునిగే వాళ్ళను రక్షించలేదనీ, విద్యార్థుల పరీక్షలు రాయలేదనీ, జాగ్రదవస్థలో కూడా ఎవరి వద్దకూ వెళ్ళలేదని నాకు తెలుసు. నా రూపంలో వారికి కనిపించింది నేను కాదని నాకు స్పష్టంగా బోధపడింది.

ఈ అనుభవంతో నాకో సత్యం అర్థమైపోయింది. నా అంతరంలో కనిపించిన రూపాలు బయటనుండి రాలేదనే నిజం నాకు అనుభవానికి వచ్చింది. ఇదంతా మాయ. ప్రారబ్ధ కర్మానుసారం, ఈ జన్మలోని సంస్కారాలు, భావ విచారాలు నా మస్తిష్కంపై ప్రభావం చూపాయి. అంతరంలోని సాధనలో రూప ప్రాకట్యం తరువాత కనిపించేది బ్రహ్మదేశం. అనగా పారబ్రహ్మ శబ్ద బ్రహ్మల స్థానం. ఈ స్థానాల్లో అభ్యాసం చేసేటప్పుడు శబ్దంలో ఉంటూ శబ్దాన్ని వింటున్న వస్తువును, ప్రకాశంలో ఉంటూ ప్రకాశాన్ని చూస్తున్న వస్తువును, దానికి సాక్షిగా ఉన్న వస్తువును అన్వేషిస్తుంటాను. ఆస్థితి నుండి కిందికి దిగి వచ్చిన తరువాత జాగ్రత, స్వప్న, సుషుప్తి, తురియా, తురియాతీత స్థితులు ఎదుటికి వస్తుంటాయి.

శబ్దంలో ఉంటూ శబ్దాన్ని వింటున్నదీ, ప్రకాశంలో ఉంటూ ప్రకాశాన్నీ చూస్తున్నదీ ఐన పరమతత్వం విభిన్న రూపాలు ధరించి ప్రతిస్థానంపై విరాజమానమై ఉంది. అదొక సర్వాధారశక్తి. దీనినే సంతులు అనామీ అంటారు.

అంటే పేరు లేనిదనీ అర్థం. పేరు పెట్టలేనిదనీ అర్థం. గురునానక్ ఆ శక్తిని అకాలపురుషుడు అని అన్నాడు. హిందువులు పరమతత్వాధార కూటస్థుడని అంటారు. ముసల్మానులు లాయిల్లాఇల్లల్లా అంటారు.

నేడు గురుపూర్ణిమ. నా గురువు దాతాదయాల్ ఆదేశానుసారం నా జ్ఞానాన్ని మీకు సత్సంగాలలో ఉపదేశిస్తున్నాను. ఈ రోజున దాతాదయాలుడు శుద్ధదేహ భౌతిక రూపంలో ఇక్కడ లేకపోయినా ఆయన నా కోసమే ఈ ప్రపంచంలో అవతరించాడు.

**తూ ఆయా థా దయాళ రూప మే మేరే కారన్ ప్యారే**

అనే ఈ శబ్దాన్ని పరమదయాల్ మహారాజ్ ఎంతో శ్రావ్యంగా, ఉత్సాహంగా, తనలో తాను నిమగ్నమై గానం చేశారు.

రామచంద్రుని భక్తి నుండో, గురు భక్తినుండో నేను విముఖుడనయ్యానా అనిపిస్తుంది. కానీ నేను పొరపాటు పడలేదని దాతాదయాలుని ఈ శబ్దం చెబుతోంది.

**కోయీ బతావే కైసే గురుకో రిఝావూం**

ఈ మాటలు నాకు అర్థమయ్యేవి కాదు. నాకు ఈ వివేకం కలగడానికే ఈ గురు పదవి ఇవ్వబడింది. కమాల్‌పూర్‌కు చెందిన ఒక మహిళ, శ్రీకృషక్ జీ, ఇతర సత్సంగీయులు నా రూపం తమకు సహాయపడిందని చెప్పిన క్షణాన అది నేను కాదని నాకు బోధపడ్డాక నాకు వివేకం కలిగింది. నిజమైన సద్గురువు చిరునామా లభించింది.

**అఖండ మండలాకారం వ్యాప్తమే న చరాచరమ్**

అయినప్పుడు ఇక ఎవరికి హారతి పట్టాలి? కానీ దాతాదయాల్ ఆదేశానుసారం అన్నీ తెలిసి ఉండీ అజ్ఞానిలా ప్రపంచంలో ఉంటాను. దేనికీ విరుద్ధంగా నడుచుకోను.

నేడు గురుపూర్ణిమ పూజాదినాన్ని నిర్వహిస్తున్నాను.

**పాత్ పాత్ మే గురు కా బాసా**

నాకీ స్థితి వచ్చేసింది. ఇది సనాతన ధర్మం యొక్క అంతిమసోపానం.

నాకు కలిగిన అనుభవ సారాన్ని దాతాదయాలుని వాణి బలపరుస్తూ ఉంది. నా కిప్పుడు ఏ భ్రమా లేదు. నా పరిణామం ఇలా జరగవలసే ఉంది. హుజూర్ దాతాదయాలుని ఆదేశానుసారం, దైవేచ్ఛతో నన్ను నేను సంత్ సద్గురు వక్త్ అన్నాను. వక్త్ అనగా సమయం. నిరంకారీ గురువులు, హంసాగురువులు, సత్‌నామీ గురువులు, రాధాస్వామీ మత గురువులు ఉన్నారు. వీళ్ళందరి కళ్ళు తెరిపించడానికి స్వామీజీ మహారాజ్ 'నామమాల' ను ఉదహరిస్తున్నాను.

అకహ అపార్ అగాధ్ అనామీ, సో మెరే ప్యారే రాధాస్వామీ ।
హైరత్ రూప్ అథాహ దవామి, అస్ మేరే ప్యారే రాధాస్వామీ ॥

రాధాస్వామి మతాన్ని నడిపించిన హుజూర్ మహారాజ్ వాణి ఇది. నే నేవిధంగానైతే దాతాదయాళును పరమతత్వ అవతారమని భావించి పూజించానో ఆయన అదే విధంగా స్వామీజీ మహారాజ్‌ను పూజించాడు. అసలైన దైవానికి ఎలాంటి గౌరవం లభించిందో వినండి.

అగమ్ రూప ధర్ ఆయే అగామీ । సో మెరే ప్యారే రాధాస్వామీ ॥
అలఖ్ ధామ్ కే ఫిర్ హుయె ధామీ । అస్ మెరే ప్యాలే రాధాస్వామీ ॥
సత్ లోక్ మే హుయె సత్ నామీ । వహ మెరే ప్యారే రాధాస్వామీ ॥
భంవర్ గుఫా బైఠే అంతర్యామీ । సో మెరే ప్యారే రాధాస్వామీ ॥
మహాసున్న్ పర్ బైఠక్ ఠానీ । అస్ మెరె ప్యారే రాధాస్వామీ ॥
సున్న్ మే అక్షర్ రూప్ ముకామీ । సో మెరే ప్యారే రాధాస్వామీ ॥
గగన మండల ఓంకార్ అకామీ । అస్ మేరే ప్యారే రాధాస్వామీ ॥
రూప్ నిరంజన్ ధారా శ్యామీ । సో మెరే ప్యారే రాధాస్వామీ ॥
మన్ కే ఘాట్ హుయే అబ్ కామీ । అస్ మేరే ప్యారే రాధాస్వామీ ॥

రాధాస్వామీ మతానుయాయులారా! గురుమతంలోని సత్సంగీయులారా! నేను మీ కళ్ళు తెరిపిస్తాను. అకహ, అగాధ, అనామీ అనగా చెప్పజాలనిదీ, అగాధమైనదీ, నామ రహితమైనదీ అయిన ఒక తత్వం కిందికి వస్తుంది. ఉత్పత్తి క్రమంలో ఇంద్రియాల తీరానికి వచ్చి కోరికలు కోరటం ప్రారంభిస్తుంది.

ఇంద్రీఘాట్ వికార్ ఘటామీ, సోమెరే ప్యారే రాధాస్వామి ।

ఆ దివ్యశక్తి ఈ తీరాలను దాటుకుంటూ కిందికి ఇంద్రియాల తీరంలోకి వచ్చి కోరిక వెల్లడించింది. అదే శక్తి మళ్ళీ, తిరిగి తన నిజరూపంలోకి వెళ్ళిపోయింది. జీవనం అంటే ఏమిటో నాకు అనుభవైక వేద్యం అయింది. అనుభవమైనప్పుడు అపరిమితానందం లభిస్తుంది. రాధాస్వామి మతానుయాయులూ, ఇతర గురుమతానుయాయులు గురుమతమంటే ఏమిటో అర్థం చేసుకోలేదు. వీరంతా పక్షపాతపు పంథాలో మిగిలిపోయారు. గద్దెలూ, ఆశ్రమాలూ మొదలైన వాటి మోహంలో పడిపోయారు. గురువును 'శరీరం' వరకే పరిమితం చేశారు. గురువంటే బాబా సావన్‌సింగ్ అనో, బాబా ఫకీర్ చంద్ అనో, మహర్షి దాతాదయాల్ అనో భావించిన వారికి నిజగృహంలో స్థానం దొరకదు. కబీర్‌సాహెబ్ స్పష్టంగా చెప్పారు.

**గురువును మనిషిగా భావించిన నరుడొక అంధుడు ।**
**లోకంలో దుఃఖితుడై యమునికి బందీ అతడు ॥**

గురువంటే జ్ఞానం, వివేకం. గురువు ఉపదేశించే జ్ఞానమే అసలైన గురువు. ఈ చర్మంతో, ఎముకలతో నిండిన మురికి కూపం వంటి శరీరం గురువు కాదు. ఈ మాయా చక్రంలో నుండి బయట పడండి. కానీ మీరు త్వరగా బయటపడలేరు. ఎందుకంటే ఈ మాయాజాలంలో చాలా ఘోరంగా మీరు బంధింపబడి ఉన్నారు. మీలో 'నేను' అనే అహంకారం ఉంది. సత్యమైన గురువు సత్సంగానికి వెళ్ళి, ఆయన దర్శనం చేసుకుని, శ్రద్ధగా ఆయన వచనాలను విని, అర్థం చేసుకుని, ఆచరించినప్పుడే మీ ఈ అహం పోతుంది. గురువు ద్వారా విన్న దానిని ఆచరించకుంటే ఈ జ్ఞానం వాచకజ్ఞానం గానే మిగిలిపోతుంది. అందుకే ఎంతో మహిమాన్వితమైన సత్సంగాలలో పాల్గొంటూ ఉండండి. ఆ సత్సంగం సత్యసంధుడైన పూర్ణగురువుదై ఉండాలి. పూర్ణ గురువంటే ఏమిటో గురుగ్రంథ సాహెబ్‌లో పదే పదే ప్రస్తావనకు వస్తుంది. రాధాస్వామి మతంలో కూడా గురుచరణాలను శరణువేడాలని ఉంది. భగవద్గీతలో కూడా నాలుగవ పదం యొక్క ప్రస్తావన ఉల్లేఖింపబడింది. ధార్మిక పక్షపాతం ప్రపంచానికి మతిభ్రష్టం, నష్టం చేసింది. నేడు గురుపూర్ణిమ. గురువును పూజించాలి. సేవించాలి. నేనెవరిని సేవించాలి? నా నిజమైన గురువు సత్సంగీరూపంలో దర్శన మిస్తాడనీ దాతాదయాల్ చెప్పారు. సద్గురు ఆదేశం పాటిస్తూ వచ్చాను. సత్సంగీయుల రూపంలో నాకు సద్గురు దర్శనం కలిగింది.

కనుక వీరినే గురువులుగా భావించి సేవిస్తాను. నేను కృతఘ్నుణ్ణి కాను. బాల్యంలో నాలో గల అన్వేషణ అందరిలోనూ ఉంటుంది. సాంసారికులు ఆ అన్వేషణను కొన్నిసార్లు స్త్రీ లాలసలోనూ, మరికొన్ని సార్లు సంతానంపై గల మోహంలోనూ, ఇంకొన్ని సార్లు పేరు ప్రతిష్ఠల కోసం వ్యక్తం చేస్తుంటారు. నా నిజధామానికి, ఆదిగృహానికి చేరుకోవాలనే తపన, అన్వేషణ వినా నాకు మరొక కోరిక ఉండేది కాదు. ఈ రోజు గురు పూర్ణిమ. కబీర్ దోహా వినండి.

**కామే తరే క్రోధీ తరే పాపీ తరే అనంత్।**
**ఆన్ ఉపాసక్ నా తరే తరేన నామ రటంత్॥**

కాముకులు, క్రోధాతురులు, పాపాత్ములైనా తరిస్తారేమోగానీ చేసిన ఉపకారాన్ని మరిచే కృతఘ్నులు మాత్రం తరించలేరు.

కృతఘ్నుడు తరించజాలడని కబీర్ వాణి చెబుతోంది. హిందూజాతి కృతఘ్నతతో ఇప్పటివరకు ప్రవర్తించలేదు. ప్రతి మహాపురుషుని స్మృతి చిహ్నంగా కృతజ్ఞతతో జన్మదినాలవంటి పండగలను జరుపుకుంటూ ఉండటం చూస్తూనే ఉన్నాం. శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, గురునానక్‌ల జన్మదిన వేడుకలు జరుపుకుంటున్నారు. కృతఘ్నుడు ప్రతి రోజూ లక్షసార్లు నామజపం చేసినా నిజగృహానికి చేరుకోవటం అసంభవం.

తల్లిదండ్రులకు వ్యతిరేకంగా నడిచే పిల్లలు కూడా కృతఘ్నులే. ఉపకారం చేసిన వ్యక్తికి ప్రత్యుపకారం చేయకుంటే నీవు కృతఘ్నుడవే! కృతఘ్నత ప్రస్తుతం ప్రజలలో చాలా పెరిగిపోయింది. అందుకే లోకంలో అడుగడుగునా ఉపద్రవాలు ఎదురవుతున్నాయి. దోషాలూ, ఈర్ష్యలూ, ద్వేషాలూ పెరిగిపోయాయి. నేను కృతఘ్నుణ్ణి కాను. మనసును అదుపుచేయడానికి సహస్రదళ కమలం, త్రికుటి, సున్న్, మహాసున్న్, భఁవర్ గుఫాలలో అభ్యాసం చేశాను గనుక అఆఇఈలు నేర్పడం నా వల్లకాదు. మాతృ ఋణం, పితృ ఋణం, రాజ ఋణం, గురు ఋణం ప్రతివారిపైనా ఉంటుంది. ఈ నాలుగింటినీ నిర్వర్తించటం అందరి కర్తవ్యం.

**"అందరికీ శాంతి"**

# గురు పూర్ణిమ

## పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

### మానవతా మందిరం, హోషియార్‌పూర్

### సత్సంగం

### తేది 4-7-1974

ఈరోజు గురుపూర్ణిమ. నాకు నా జీవితం జ్ఞాపకానికి వస్తోంది. చిన్నప్పుడు కృష్ణాష్టమి రోజున శ్రీకృష్ణుణ్ణి ఊయల ఊపేవాణ్ణి. శ్రీరామనవమి జరిపే వాణ్ణి. ఎంతో ప్రేమగా వారి కీర్తనలను గానం చేసేవాణ్ణి. ఓరోజు మా అత్తగారింటికి వెళ్తున్నాను. దారిలో నాకు ఆరోజు శివరాత్రి అని గుర్తొచ్చింది. వెంటనే గుర్రం మీది నుండి దిగి హారతి ఇవ్వసాగాను. రాముడు మానవరూపంలో వస్తాడని రామాయణంలో రాసి ఉంది. అందుకే నేను రాముణ్ణి మానవరూపంలో చూడదలచుకున్నాను. దైవేచ్ఛ నన్ను దాతాదయాల్ గారి చరణాలలోకి తీసుకువెళ్ళింది. ఆయన నన్ను గురుమతం వైపు మళ్ళించాడు. నేను ఆయన్ని ప్రేమించేవాణ్ణి. పూజించేవాణ్ణి. ఆ రోజు నా మేధలో గురువు వేరే, శిష్యుడు వేరే అనే ఆలోచన కూడా వచ్చింది. ఇప్పుడు మేధస్సు స్థితి ఎలా అయిందంటే గురువు యొక్క అస్తిత్వపు ఊహ లేదు. శిష్యుని అస్తిత్వపు ఊహ కూడా లేదు. నా అనుభవం చేరిన చోటు తప్పుకావచ్చు కూడా! గురుమతం యొక్క అంతిమ పరిణామం ఇదేనని సంతులవాణి వలన విశ్వాసం కుదురుతుంది. గురువు ప్రాప్తించాక ఇంకేమీ ఉండదు. ఖాలిక్-సృష్టికర్త ; మఖలూక్ - సృష్టి ; ఖల్‌కత్ - జగత్తు, జన సమూహం, రసూల్-దేవదూత; రాముడు, రహీమ్, కరీమ్, కేశవ్, అల్లా ఎవరూ ఉండరు. ఏమీ ఉండదు. స్వామీజీ మహారాజ్ తన వాణిలో 'బారహమాసా'లో ఆషాఢమాసం నుండి జీవన లీలను వివరించటం ఆరంభించాడు.

**ఆషాఢ మహీనా సిర్‌పర్ ఆయా, ఆసా ధార్ జీవ్ గర్భ్ సమాయా ॥**

ఈ పన్నెండు నెలల్లో ఆయన జీవనంలోని అన్ని స్థితులను వర్ణించాడు. చివరికి "జేఠ్ మహినా" జేష్ట మాసంలో ఆయన రాశారు. జీవనం లోని అంతిమ భాగంలో మానవజీవనం ఇలాంటి స్థితిలోకి చేరుకుంటుంది. ఎక్కడైతే ఆదిస్థితి-ప్రారంభిక స్థితి ఉందో ఆ స్థితిలోకి చేరుకుంటుంది. అక్కడ ఖాలిక్ లేదు,

మఖలూక్ లేదు. ఖిలకత్ లేదు. అక్కడ జాత్-నిజస్వరూపం లేదు. సిఫాత్- అనగా గుణం లేదు. ఒక చోట రాశారు.

**సురత్ చేత్ పాయా విస్మాధి - జహాఁ న బానీ నహీఁ వహాఁ నాద్ ॥**

ఇది అంతిమస్థితి. ఆరంభంలో కూడా నిశ్శబ్దం - అనగా విస్మాధి. చివర్లో కూడా విస్మాధి-నిశ్శబ్దం. నేనెక్కడికి వెళ్తున్నానో నాకు తెలియదు. కానీ నేను తప్పు మార్గంలో లేనని, నా అనుభవం తప్పుకాదని స్వామీజీ వాణి ధైర్యాన్నిస్తున్నది. ఆయన రాశారు -

**హైరత్ హైరత్ హైరత్ హోయీ । హైరత్ నామ ధరా అస్ సోయీ ॥**

ఇదే జరుగుతున్న నా జీవన పరిణామం. కానీ శారీరిక కష్టం కలిగినప్పుడు, మానసిక స్థితి బలహీనమయితే గురువు జ్ఞాపకానికి వస్తాడు. గురువు సహాయం తీసుకుంటాను. దాతాదయాల్ నా పేరిట ఒక శబ్ద్ రాశారు.

**ఫకీరా! జా భవసాగర్ పారా ।**
**గురు సే ప్రేమ్ బఢాయా తూనే, గురు చేలా వ్యవహారా ।**
**గురు చేలా మిల్ ఏక్ భయే జబ్, ఏక్ కా మిలా సహారా ॥**

**కట్ గయీ కాల్ కరమ్ కీ ఫాఁసీ, జన్మజువా నహీఁ హారా ।**
**రాధాస్వామీ కే బలిహారీ, రహే ఫకీర్ సుఖారా ॥**

దాతా దయాల్ జీ మహారాజ్ నాకీ ఆశీర్వాదమిచ్చాడు. కబీర్ సాహబ్ కూడా రాశాడు.

**హమన్ హై ఇశ్క్ మస్తానా, హమన్ కో హోశియారీ క్యా ।**
**రహేఁ ఆజాద్ యా జగ్ సే, హమన్ దునియాఁ సే యారీ క్యా ।**
**జో బిఛుడే హై పియారే సే, భటక్తే దర్ బదర్ ఫిర్తే ॥**

మీరు భ్రమపడుతూనే ఉన్నారు గదా! ఎక్కడి ఇందౌర్? ఎక్కడి ఢిల్లీ! ఇంకా ఎక్కడెక్కడి నుండో మీరంతా వచ్చారు. ఒకప్పుడు నేను కూడా వ్యర్థంగా భ్రమపడి తిరుగుతుండేవాణ్ణి. నా రాముడు ఎక్కడున్నాడోనని వెదికే వాణ్ణి.

**గురుమతం నుండి ఏం లభించింది?**

నేను వేరనీ, గురువు వేరనే ఆలోచనే ఇప్పుడు లేదు. గురువు నుండి **నాకేం లభించింది?** అనుభవం. దాతాదయాల్‌జీ మహారాజ్‌ది కూడా నా

అనుభవమే! స్వామీజీ మహారాజ్, కబీర్ సాహబ్'అనుభవాలు కూడా ఇవే. ప్రతి ఒక మనిషికి ఏదో ఒక అన్వేషణ ఉంటుంది. తన కోరిక గురువు వలన పూర్తవుతుందని అతడు ఆలోచిస్తాడు. గురువు ఏమిస్తాడు? జ్ఞానం, తెలివి, వివేకం. దీని వలన మనిషి సంశయం, భ్రమలు నశించిపోతాయి. నేను అన్వేషించే వస్తువు ఏమని తెలిసింది? నాలోని నేనే! నాలో ఉన్న నేనే! ఇప్పటివరకు నా లోపల బుద్ధి, తెలివి, మర్యాదల శక్తి ఉంది. రేపటి సంగతి తెలియదు. ఈ రోజు గురుపూర్ణిమ. నేను దాతాదయాల్‌కు కృతజ్ఞుడను. ఆయన నా సంశయాలు, భ్రమలు దూరం చేశాడు. గురువేం చేస్తాడు?

**ఘర్‌మే ఘర్ దిఖలాయ్ దే, సో సత గురు చతుర్ సుజాన్ ।**
**పాంచ్ శబ్ద ధున్‌కార్ సున్, బాజే శబ్ద నిశాన్ ॥**

నీకు నీ అంతరంలోని రహస్యం చూపించి, అసలు విషయాన్ని బోధించే వారే సద్గురువు. దాతాదయాల్‌జీ దయతో - మీ అనుభవాలతో నాకు ఆ వస్తువు లభించింది. నా రూపం మీలో ప్రకటమవుతుంది. కానీ అది నేను కాను. నా లోపల ఏ భావ విచారాలు, రంగులు, రూపాలు ఉద్భవించాయో అవి నిజానికి లేవు, అది మాయ అని దీని వలన నాకు నిశ్చయంగా తెలిసిపోయింది. ఈ విశ్వాసం నన్ను మనసునుండి వేరుగా వెళ్ళిపోవడానికి వివశుణ్ణి చేసింది. ఆ తరువాత శబ్ద ప్రకాశాలున్నాయి. దీని వలన ఏం లభించింది? కబీర్ సాహెబ్ చెబుతున్నాడు.

**హమన్ హై ఇష్క్ మస్తానా, హమన్ కో హోశియారీ క్యా ।**
**రహేఁ ఆజాద్ యా జగ్ మే, హమన్ దునియాఁ సే యారీ క్యా ॥**

ప్రపంచం రెండు రకాలు. ఒకటి బాహ్యమైనది. మరొకటి మన అంతరంలోనిది. అంటే మనసుది. మనసు యొక్క జగత్తులో రంగు రూపులు, అనేక ప్రకాశాల విచారాలు, సిద్ధిశక్తులున్నాయి. నాకు వీటితో స్నేహంలేదు. ఎందుకంటే నేను ప్రేమ పిచ్చివాణ్ణి. నాకు నా ఆదిగృహపు అన్వేషణ ఉండేది. ఇప్పుడు మనస్సు అనే జగత్తుతో నాకు సంబంధమే లేదు. ఈ ప్రపంచం నా ఎదుటికి వస్తుంది గానీ నేనిందులో చిక్కుకోను. ఇప్పటి వరకు నా స్థితి ఇది. రేపు ఎలా ఉంటుందో తెలియదు. ఇది భగవంతునిపై ఆధారపడి ఉంది.

**జో బిఛుడే హైఁ పియారే సే, భటక్ తే దర్ బదర్ ఫిర్‌తే ।**
**హమారా యార్ హై హమ్ మే, హమన్ కో ఇంతెజారీ క్యా ॥**

ఖలక్ సబ్ నామ్ అపనే కో, బహుత్ కర్ సర్ పటకతా హై ॥
హమన్ గురునామ్ సాంచా హై, హమన్ దునియా సే యారీ క్యా ॥

మేం గురువులం మా పేరు ప్రతిష్టలకోసం పని చేస్తాం. "నాకు ఇన్ని వేల మంది శిష్యులుండాలి, నా మందిరం ఆశ్రమం నిర్మాణం కావాలి. నాకు పేరురావాలి" అనే స్వార్థంతో చేస్తాం.

ఇప్పుడు నా అన్ని సంశయాలు భ్రమలు తొలగిపోయాయి. ఇది సంతుల అంతిమస్థితి. ఆదిలో ప్రారంభంలో కూడా నిశ్శబ్దం-విస్మాధి, అంతంలో కూడా నిశ్శబ్దమే ఉంటుంది. ఈ మహాత్ములందరూ తమ పేరు ప్రతిష్టలు పెంచుకోవడాని కోసం నామమిస్తారు. నామం అనేది వేరే వస్తువు. మనస్సు అనే ప్రపంచం నుండి వేరై పోయాక ఉండే స్థితి నామం.

న పల్ బిఛుడే పియా హమ్ సే, న హమ్ బిఛుడే పియారే సే ।
ఉన్హీ సే నేహ లాగీ హై, హమన్ కో బే కరారీ క్యా ॥

కబీరా ఇష్క్ కా మాతా, దుయీ కో దూర్ కర్ దిల్ సే ।
జో చల్‌నా రాహ నాజుక్ హై, హమన్ సిర్ బోఝ్ భారీ క్యా ॥

నీ మనసు నుండి 'ద్వైతా'న్ని తీసివెయ్యి. గురువును తన నుండి వేరుగా ఉన్నాడనుకుని పూజించే మనిషిలో ద్వైతం ఉంది. అతడు ఎలా దాటిపోగలడు? అతడు గమ్యానికి, తీరానికి చేరుకోలేడు.

నేడు గురు పూర్ణిమ.

"దాతా! మీ దయకు కృతజ్ఞుణ్ణి. 1905వ సంవత్సరం, సాధుకుటీరం జ్ఞాపకానికి వస్తున్నది. ఆ రోజు నేను మొదటిసారి మీ చరణాలలోకి వచ్చాను. దాతా! సత్యమైన సద్గురువు సత్సంగీయులరూపంలో లభిస్తాడని మీరు చెప్పారు. ఇవాళ నాస్థితి ఇలా ఉంది. ఈస్థితి నా జీవనపరిణామమా? లేక మెదడు పాడైన స్థితా తెలియదు". శరీరాన్ని విడిచిపెట్టే ముందు బోధనా పద్ధతిని మార్చుమని దాతా దయాల్ ఆజ్ఞాపించారు. శిక్షణ అదే! కబీర్ సాహెబ్, ఇతర సంతులు ఇచ్చిన బోధనే కానీ వారు తెరలు కప్పారు. నేను దానిని తీసేశాను. ఇప్పుడు ఏం కానుక చెయ్యాలి? సెక్రటరీగారూ! నా లెక్కలో నుండి 50/- రూపాయలు తీసి మందిరానికి ఇవ్వండి.

మీరంతా ప్రాపంచికులు. మీకు ఈ స్థితి లేదా పదం యొక్క అవసరం లేదు. మీకు ప్రపంచం కావాలి. అందుకే గురు రూపాన్ని అర్థం చేసుకొనండి. గురువని ఎవరిని అంటారు?

గురు ఆది మధ్య అనంత అద్భుత్, అకుల్ అగమ అగోచరమ్ ।
విభు విరజ పార్ అపార్, నిర్గుణ సగుణ సత్య విశ్వేశ్వరమ్ ॥

జిహిమతి లఖే నహిఁ గతి లఖే, యశ్ శుద్ధ తత్వ విచార్ హై ।
జో చరణ కమల్ కీ ఓట్ ఆయా । భవ సే బేడా పార్ హై ॥

గురు విష్ణు మూరత్ శివ్ కీ సూరత్, గురు కో బ్రహ్మ జాన్ తూ ।
గురు బ్రహ్మ హై పరబ్రహ్మ హై, యహ సోచ్ సమఝ్‌కే మాన్ తూ ॥

కర్ గురు కే సంగత్ రాత్ దిన్, నర జన్మ అప్‌నా సుధార్ లే ।
దే ఫేంక్ మాయా బోఝ్ సిర్ సే, యమ కీ శీశ్ న భార్ లే ॥

శీస్ దే తన్ మన్ కో దే, గురు భక్తి రతన్ అమోల్ లే ।
రాధాస్వామీ భేద్ బతాయా తుమ్ కో, హియే తరాజూ తోల్ లే ॥

సత్యమైన వివేకం, సత్యమైన జ్ఞానం, సత్యమైన అనుభవం పేరే గురువు. ఈ జ్ఞానమిచ్చినవారికి కృతజ్ఞులై ఉండాల్సి ఉంటుంది. నేను నా గృహస్థజీవనంలో, లేదా ఉద్యోగంలో, పరమార్థ జీవనంలో నా గురువు దాతాదయాల్ ఆజ్ఞాపించినట్లు నడుచుకున్నాను. అందుకే జీవనంలోని ఏ పార్శ్వంలోనూ ఏ కష్టమూ కలగలేదు. తన ఆదిగృహానికి వెళ్ళాలనే ప్రబలమైన లాలస, ప్రేమ గల వారే అంతిమ స్థితి వరకు వెళ్ళగలుగుతారు. సాంసారికులకు కేవలం గౌరవాదరాలు, ధనసంపదలు మనానందాల కోరికలే ఉంటాయి. ఈ మార్గం కేవలం అర్హులకే పరిమితమై ఉంది.

నానక్ కోటిన్ మే కోవూ, నారాయణ జిన్ చేత్ ।

భగవద్గీతలో కూడా రాశారు. వేలాది సాధారణ మానవులలో ఎవరో ఒకే ఒక భక్తుడుంటాడు. వేలాది మంది భక్తులలో ఎవరో ఒకరు జ్ఞాని అవుతారు. వేలాది జ్ఞానులలో ఎవరో ఒకరు అంతిమ పదానికి చేరుకుంటారు.

గురువు అనగా శుద్ధతత్వ విచారం. ఏ తత్వం నుండి సంపూర్ణ సృష్టి రచన జరుగుతుందో ఆ ఆలోచనా విచారం పేరే గురువు. ప్రపంచంలో ఉండడానికి, సాంసారిక వ్యవహారం కోసం, మానసిక, ఆత్మిక స్థితులను సరైన

రీతిలో ఉంచడానికి ఆ శుద్ధ తత్వపు విచారం, ఆలోచన ఉండాలి. శరీరం, మనసు, ప్రకాశం, శబ్దముల తత్వాల నుండి మనం లాభం పొందగలుగుతాం. ఆ విచారం పేరే శుద్ధ తత్వవిచారం.

గురువును బ్రహ్మ, విష్ణు, శివులని అంగీకరించమని రాశారు. చూడు! బ్రహ్మ సృష్టిరచన చేస్తాడు. ఏ శక్తి పుట్టి మరో వస్తువును పుట్టిస్తుందో అది బ్రహ్మ. ఆ శక్తిని తీసుకుని మనిషి ఏమైనా చేయగలడు. ప్రపంచంలో ఎంత ఉన్నతి సాధించాడు? ఈ జ్ఞానం పేరే గురుబ్రహ్మ. ప్రతి ఒక్క వస్తువుయొక్క గుణ, కర్మ, స్వభావాన్ని అర్థం చేసుకుని మనిషి తన జీవనాన్ని శ్రేష్టతరం చేసుకోగలుగుతాడు. సుఖంగా ఉండగలుగుతాడు. మనను పాలిస్తున్న శక్తి జ్ఞానంతో మనం శారీరకముగా, మానసికంగా సుఖంగా ఉండగలం. కానీ ఈ జ్ఞానాన్ని మీకు గురువే ఇవ్వాలి. డాక్టర్ తన పనిని గురించి చెబుతాడు. ఇతరులు తమ తమ పనులను వివరించి చెబుతారు. ఇలాంటివి కూడా గురువు రూపాలే. ఎందుకంటే వీటి నుండి మనం ఏదో కొంత నేర్చుకుంటాం.

మన ఆరోగ్యాన్ని సరైన రీతిలో ఉంచుకోవడానికి మనం ఎప్పుడూ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా ఉండకూడదు. జీవిక సంపాదించుకోవడానికి ఏదో ఒకపని నేర్చుకోవాలి. నీ పొట్ట పోసుకునేందుకు ఏదో ఒక విద్య లేదా కళ నేర్చుకోవాలి. ప్రస్తుతం చదువు మాత్రమే సరిపోదు. ప్రస్తుతం పరిశ్రమలు చాలా తక్కువగా ఉన్నాయి. అందుకే ఏదైనా టెక్నికల్ పని నేర్చుకోవాలి. ప్రాపంచికులకు, పరమార్థం పట్ల ఇష్టం కలవారికి గురువు చెబుతాడు. పరమార్థంలో నిష్ణాతుడు, మాస్టర్ అనదగిన గురువే పరమార్థం బోధించగలుగుతాడు. ఋషి, మునులు కూడా శారీరిక, మానసిక బ్రహ్మచర్యం గురించి శిక్షణ నిస్తారు. ఆ శిక్షణ కూడా గురు బ్రహ్మ, గురు విష్ణువుల రూపమే! అందుకే ఆ సిద్ధాంతాల మార్గంలో నడవమని చెబుతాను. మీరు పిల్లలను కంటారు, గానీ సిద్ధాంతాలు తెలియవు. అందుకే పిల్లలు దురాచారపరు లవుతున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో కష్టాలకు ఇదే కారణం. గురుమతం నుండి ప్రపంచం దూరంగా వెళ్ళిపోయింది. ఎవరైనా పూర్ణపురుషుని సత్సంగంలోకి వెళ్ళి బతికేందుకు రహస్యాన్ని తెలుసుకో, నేర్చుకో! మనం గురుజ్ఞానాన్ని మరిచిపోయినప్పుడే దుఃఖితులమవుతాం.

నిన్న 20-22 సంవత్సరాల ఓ కుర్రాడొచ్చాడు. "బాబాజీ! యోగ నుండి దారి తప్పాను" అని చెప్పాడు. "నిజం చెప్పు! చేతితో వీర్యాన్ని నష్టం చేయటం

లేదు గదా" అన్నాను. అతడు అంగీకరించాడు. అన్నిటికంటే ముందుగా గురుబ్రహ్మ, గురు విష్ణు, గురు మహేషులను అర్థం చేసుకోమని అందుకే చెబుతుంటాను. "బ్రహ్మ అంటే నాలుగు ముఖాలు గల బ్రహ్మను ధ్యానం చేయాలి. విష్ణువంటే క్షీరసాగరంలో వుండే విష్ణువును ధ్యానం చేయాలి. శివుడంటే జటాధారి, గంగాధారి అయిన శివుణ్ణి ధ్యానం చేయాలనీ" అనుకుంటుంది లోకం. ఇది సరైనది కాదు. ప్రపంచంలో బ్రహ్మ, పారబ్రహ్మ, ఈశ్వరుడు, పరమేశ్వరుడు ప్రకృతి శక్తులు. ఈ శక్తులు లేకుండా మనకు గడవదు. వాటిని సముచితమైన రీతిలో ఉపయోగించుకుంటేనే నీవు సుఖంగా ఉండగలవు. కానీ ఈ జ్ఞానాన్ని ఎవరైనా పూర్ణ పురుషుడే ఇవ్వగలడు. ప్రతి గురువూ ఇవ్వజాలడు. నీకు నీ ఉత్పత్తి, స్థిరత్వం, నాశనం యొక్క జ్ఞానం కలగనంతవరకు నిస్సందేహంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు లేదా గురువు యొక్క ధ్యానం చేస్తూ ఉండు. లేకుంటే నీవు ఇష్టపదానికి - ఇష్ట స్థానానికి చేరుకోజాలవు. బ్రహ్మ అంటే ఏమిటి?

(1) సబల బ్రహ్మ - నీ శరీరానికి శక్తి నిచ్చే ప్రకాశం.

(2) శుద్ధ బ్రహ్మ- శుద్ధ బ్రహ్మ వలన మనసుకు శాంతి లభిస్తుంది.

(3) పారబ్రహ్మ - ఆత్మ దేని అంశమో ఆ ప్రకాశం

(4) శబ్ద బ్రహ్మ - శబ్ద బ్రహ్మమే నామం.

ఇహలోకంలో, పరలోకంలో సుఖంగా ఆనందమయంగా ఉండడానికి అన్నిటితో పని తీసుకోవలసి ఉంటుంది. ఇరవై నాలుగు గంటలూ ఎవరూ బాహ్య గురువు వెంట ఉండజాలరు. సేవ చేయజాలరు. గురుజ్ఞానాన్ని, గురువు మాటలను జ్ఞాపకముంచుకోవటం, దానిని అనుసరించి జీవితం గడపటమే ఎల్లవేళలా గురువునీ వెంట ఉండటం.

నా పాదాలను కడిగి తాగడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు. అలా కడిగి తాగినందువలన నీవు తరించిపోగలవా? లేదు. గురుచరణాలు అంటే ఏమిటి? ప్రకాశం. గురువు శబ్దస్వరూపి రాధాస్వామి దయాలుడు. అందుకే నీ అంతరంలో ఉన్న అసలైన, సత్యమైన సద్గురువు సాంగత్యం చేయి. సాక్షాత్కరింప చేసుకో. ఎల్లవేళలా నీవు సాధనలోనే ఉండజాలవు. అందుకే అక్కడి నుండి ఉత్థానమైనప్పుడు వెళ్ళి గురుజ్ఞానాన్ని జ్ఞాపకముంచుకో.

ఇది సంకల్పమయ ప్రపంచం. జైసాఖ్యాల్ వైసా హాల్! ఎలాంటి ఆలోచన ఉంటే అలాంటి స్థితి తప్పదు. అందుకే నీవెలాంటి ఆలోచనా విచారాలు పెట్టుకుంటే అలాంటి వాతావరణం నీకు ఏర్పడుతుంది. అందుకే సదా శుభవిచారాలు పెట్టుకో. ఈ ప్రపంచంలో సుఖమయ జీవనం గడపడానికి అన్నిటికంటే పెద్ద గురుజ్ఞానం ఏముంది? మీ ఇళ్ళలో శాంతిని నెలకొల్పండి. మనం ఒక పండగ జరిపినప్పుడు దీని వలన మనకేమైనా శిక్షణ లభిస్తుంది. ప్రాచీన సంతులు ఆధ్యాత్మికతతోపాటు ప్రపంచంలో సుఖంగా ఉండేందుకు శిక్షణ నిచ్చారు. నీవు ఏ మతంవాడివైనా గురువాజ్ఞను పాటించు. ఆయన చెప్పిన దానిని ఆచరించు. గురువునుండి నీకేం లభిస్తుంది? మనసుకు అతీతంగా వెళ్ళగల విద్య, పద్ధతి లభిస్తుంది. బ్రహ్మకంటే ముందుకు వెళ్ళు. ఇందుకు స్మరణ, ధ్యానం, భజన ఇవ్వబడుతున్నది. దీని వలన నీవు నీ ఇష్టం వచ్చినపుడు నీ మనసును వదిలి వెయ్యవచ్చనీ, మనసుకు అతీతమైన స్థితిలో ఉండగలగాలనీ, మనసు విచారధారలు సమాప్తం కావాలనీ, స్మరణ, ధ్యానం, భజన ఉపదేశిస్తాడు గురువు. నామదానం అంటే ఏమిటి? స్మరణ, ధ్యానాలు కూడా నామమే! కానీ మనసుకు అతీతంగా వెళ్ళిపోవటమే, మనసును మరిచి పోవటమే అసలైన నామం. ఏ నామంలో నైనా సరే మనసును మరిచి, దానికి అతీతంగా పోవాలి.

"తీన్ లోక్‌సే పారా । వహ హై దేశ్ హమారా"

"అందరికీ శాంతి"

# గురు పూర్ణిమ

## పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

### మానవతా మందిరం, హోషియార్‌పూర్

### సత్సంగం - ఆ ఇంటి అన్వేషణ

### తేది 18-7-1970

నేడు గురుపూర్ణిమ. పవిత్ర పర్వదినం. ఈ పావన పర్వదినాన తన సద్గురువు చరణాలలో కృతజ్ఞతల పుష్పాలను అర్పించటం ప్రతి శిష్యుని కర్తవ్యం. ఆ పూజా సామాగ్రి ఏమిటన్నది వేరే విషయం. ఇదంతా భావనలను

వ్యక్తం చేయటం కోసమే! సద్గురు మహారాజ్‌కు ఆరతి ప్రారంభించక ముందు రెండు విషయాలను పరిశీలించటం అవసరం. మొదటిది యుగళ ఆరతి - అనగా సత్‌జ్ఞాన దాతా, సత్ జ్ఞానం రెండింటిది! రెండవది ఈ ఆరతిలో దర్శింపచేసిన భావం పరమ దయాల్‌జీ మహారాజ్ వచనాలపైనే ఆధారపడింది. ఇప్పుడిక రాధాస్వామి పరమదయాల్‌జీ మహారాజ్‌కూ, ఆయన దయతో ఇచ్చిన సత్‌జ్ఞానానిదీ ఆరతి ప్రారంభమవుతుంది. ఆరతి చదవబడింది. దాని తరువాత సత్సంగం ప్రారంభమైంది.

నా జీవితం జ్ఞాపకానికి వస్తోంది. ఏదో ఒక ఆవేశంలో, ఏదో ఒక ప్రేమలో దాతాదయాల్ జీ దగ్గరికి వెళ్ళి ఇలాంటి ఆరతులు చేసేవాణ్ణి. ఆనాటి ఫోటో ఉంది. ఈ రోజు గురు పూర్ణిమ. నా అనుభవాలను వివరించి పోతానని ప్రతిజ్ఞ చేశాను. ఇప్పుడు నా అంతరంలో పరమాత్ముని కోసమో, ఏదో ఒక గొప్ప శక్తి కోసమో ఆనాటి తపన, ఆ ఆకర్షణ లేవు. దీని అర్థం నేను పరమాత్మణ్ణి సద్గురువును అంగీకరించనని కాదు. అంగీకరిస్తాను. కానీ ఆనాటి తత్పరత, ఆకర్షణ లేవు. చాలాసార్లు "ఫకీర్! నీవు పతితుడవయ్యావు. పంథ నుండి దారితప్పి పదభ్రష్టుడ వయ్యావు. గురువునుండి దారి తప్పావు అని ఆలోచిస్తుంటాను. ఇది నా జీవనం. కానీ నా జీవితంలో ఆ భగవంతుని కోసం, సద్గురువు కోసం, నామం కోసం నేను చేసిన సత్యమైన అన్వేషణే నేనీ స్థితిలోకి రావడానికి దోహదపడింది. ఇప్పుడు నేనీస్థితిలోకి వచ్చాను. ఇతర మహాత్ములెవరైనా దీనికి సాక్ష్యమివ్వగలరా? ఇదో ప్రశ్న. ఆ! ఇస్తారు. అందరికంటే ముందే దాతా దయాల్‌జీ ఇచ్చారు.

**మై నా మై నారే మై నా।**
**మై నా తన్ పింజరే మే రహకర్ బోలీ బోలీరే మై నా ॥**

మనిషి జీవితపు పరిశోధన పూర్తి అయిపోతే ఇక అతడు నేను నేను, నీవు నీవు అనే స్థితులను వదలిపోతాడు. ఇప్పుడు నేను "నేను-నీవు" లో ఉంటూ దానిని వదిలివేయడానికి వివశుడనవుతున్నాను. ఇది నా 83 సంవత్సరాల అన్వేషణా ఫలితం. నాకు గురుమతం నుండి లభించిన దానిని ఈ గురుపూర్ణిమ రోజు చెప్పాలనుకుంటున్నాను.

**మైనా, మైనా రే మైనా,**

**మైనా తన్ పింజరే మే రహకర్, బోలీ బోలీ రే మైనా।**

జబ్ లగ్ మై హై తబ్ లగ్ తూ హై, మోర్ తోర్ కే ఝగడా!!

మై జబ్ గయా గయా తబ్ తూ భీ, అబ కిస్కా హై రగడా।
సత గురు దీనీ సైనా ॥
జో తూ కహతా వహ అంధా హై, మై కహతా దీవానా
మై మై తూ తూ కో జో ఛోడే,
వహీ హై చతుర సయానా। యహ హై సచ్చీ బైనా ॥

జబ్ మై హూం తబ గురు నహీం హై, గురు జబ్ హై మై నాహీం,
ప్రేమ కీ గలీ తంగ్ హై భాయీ, దోనోం కైసే సమాయే। దోనోం రహతే హై నా ॥
మోర్ తోర్ మాయా కీ రసరీ, ప్రాణీ ఫాంస్ ఫంసానే
తోడ్ కీ రసరీ హోగయే న్యారే, ఫిర్ నహీం వహ భర్మానే।
హోగయే సచ్చే మైనా ॥

బకరీ మై కహ గలా కటావే, మై మై కర్ మిమియావే
మై నా మై నా బచన్ సునావే, బేసన్ శక్కర్ ఖావే।
కైసీ మీఠీ హై మై నా ॥

మైనా మైనా బోలీ బోలే బోల్ కీ రటన్ లగావే;
మై తూ త్యాగ్ శాంత్ బన్ జావే, సుఖ ఆనంద ధున్ గావే।
పావే నిత్ చైనా ॥

మై తూ భరమ్ వికార్ హై మన్ కా, మన్ మాయా కా సాథీ,
జో మై కోహిగా దుఃఖ్ సే మరేగా, కుచలే అహం కా హాథీ।
మై తూ దోనోం హైనా।

సురత్ కీ పక్షీ మైనా బన్కర్, మైనా మైనా కహతీ
శూన్య వృక్ష కీ డాల్ పే బైఠీ, దుఃఖ్ సుఖ్ అబ నహీం సహతీ।
దిన్ నహీం జహాం న రైనా ॥

మై నా మై నా తూ నా తూ నా, యహ సద్గురు కీ బానీ
బానీ సున్ సున్ జో చిత్ లావే, బనే సహజ నిర్వాణీ।
మాయా ఫిర్ కభీ వ్యాపేనా ॥

రాధాస్వామి శబ్ద సురత్ కీ, ధున్ గా గాకే సునావే ॥
జో గావేం నిత్ గాకే సునావేం, భవ పింజరే నహీం ఆవేం।
వహ బన్ జావే మైనా ॥

ఇప్పుడు వివశుడనై శరీరంలోకి వస్తాను. ఎందుకంటే శరీరం ఇంకా ఉంది. ఇరవై నాలుగు గంటలు నిర్విరామంగా ఏడ్చాక ఆ తపనలో లాహోర్‌కు చేరిన సంఘటన గుర్తుకొస్తోంది. అది వేసవి కాలం.. ఆ సుందరమూర్తి కుటీరంలో కూర్చుని ఏదో రాస్తున్నాడు. ఆ దృశ్యం నాకళ్ళ ముందు ఇప్పటికే కదలుతోంది. నేను ఆ రోజు ఉదయం ఆరుగంటల నుండి పదకొండు గంటల వరకు సాధూ మొహల్లా వెదుకుతూ తిరిగాను. చిరునామా ఎంతో కష్టంగా దొరికింది. నేను తలుపు తట్టాను. "తలుపు తెరిచే ఉంది. నీవెవరు?" అని లోపలినుండి స్వరం వినిపించింది. ' నేను ఫకీర్ చంద్‌ను. బాగ్ ఆమ్‌వాలే నుండి వచ్చాను' అని చెప్పాను. "కుర్చీలో కూర్చో"మని ఆజ్ఞాపించారు. కూర్చున్నాను. నాకు కనిపించిన దృశ్యంలో దర్శనమిచ్చినతడు కోటు, పట్లూను తొడుక్కుని ఉన్నాడు. ఇక్కడీయన ధోవతి,కుర్తా ధరించి ఉన్నాడు. మనసులో దువిధ -ద్వైదీ భావన వచ్చింది. ఆయన రాసుకుంటూ ఉన్నాడు. పదిహేను నిమిషాల తరువాత ఆయన కుటీరంలో నల్లనికోటు, పట్లూను వేలాడుతూ కనిపించింది. అప్పుడు ఆయనే ఈయన అని నాకు విశ్వాసం కలిగింది. "రా ఫకీర్" అన్నారాయన. నేనాయన ఒడిలో కూర్చుని ఏడవసాగాను. ఆయన ధోవతి, కుర్తా నా కళ్ళలోనుంచి ప్రవహిస్తున్న కన్నీళ్ళతో, ముక్కులో నుండి కారుతున్న నీటితో తడిసిపోయాయి. స్నానం చేయమన్నారాయన. స్నానం చేశాను. నాకు ఈ దీక్ష నామదానం ఆయన అప్పుడిచ్చారు.

గురునే అమృత్ నామ పిలాయా ॥

మోహ జాల్ కీ ఫాఁసీ కాటీ, చౌరాసీ సే ఆన్ ఛుడాయా ।
అబ్ నహీఁ కాల్ కరమ్ కా భయ్ కుఛ్, అభయ దాన్ దే జీవ చితాయా ॥

ఖట్‌కా ఝట్‌కా భట్‌కా ఛూటా, సత్ మారగ్ కీ రాహ చలాయా ।
భూల్ భరమ్ దువిధా సంశయ సే, సహజ్ రీతి సే సహజ్ బనాయా ॥

సహజయోగ విధి సహజ్ కమాయీ, సహజ్ సహజ్ భవసింధు ఫిరాయా ।
సహజ్ శబ్ద గతి సహజ సమాధి, సహజ్ సున్న్ మే సహజ్ రచాయా ॥

ఇక్ రస్ జీవన్ ప్రేమభక్తీ కా, దయా కృపా సే సబ్ హీ దిలాయా ।
ఆవోరే జీవోంకరో సత్సంగ్, సమయ అమోలక్ కాహే గఁవాయా ॥

**రాధాస్వామి ఆయే జీవ చితావన్, సంత రూప ధర్ జీవ చితాయా ।**
**ధన్య జో జీవ శరన్ మే ఆయే, బినా కష్ట్ నిజ కామ్ బనాయా॥**

నేను సత్య ప్రియుడను. సత్యాన్నే ఇష్టపడే మనిషిని. ఒక సత్యమైన మనిషిగా నా ఆత్మను నేను ప్రశ్నిస్తుంటాను. "నీవు 84 లక్షల యోనుల నుండి తప్పించుకోగలిగావా" అని అవును! తప్పించుకున్నాను. వాటిని ఎలా వదిలించుకోగలిగాను? నామం వలన - నా అనుభవంలోకి వచ్చిన విషయాలను చెప్పి పోతానని ప్రతిజ్ఞ చేశాను. **నా చివరిదశలోని సత్సంగాలన్నీ ప్రజల ముందుకు రావాలని నా ప్రబలమైన కోరిక.** కేవలం స్మరణ చేయటం వలన, ధ్యానం చేయటం వలన, శబ్దం వినటం వలన నా మోహం, చౌరాసి (84 లక్షల జీవరాసుల జన్మలు) తెగిపోలేదు. నేనేం చెబుతున్నాను? స్మరణ చేయటం వలన, దాతాదయాలుని ధ్యానం చేయటం వలన, అంతరంలో శబ్దం వినటం వలన నా మోహం తొలగిపోలేదు. నా 84 లక్షల చక్రం తొలగిపోలేదు. సంతుల మార్గంను మట్టిలో కలిపేశావని మీరనవచ్చు. లేదు. నేను అలా చేయలేదు. నేను సంత్ సద్గురు వక్తను. ప్రపంచానికి సత్యమైన జ్ఞానాన్నిచ్చి పోతున్నాను. అదృష్టంలో ఉన్నవారు అర్థం చేసుకుంటారు. లేనివారు లేదు.

నా మోహ మాయల వల ఎలా తెగిపోయిందో చెబుతాను. బోధించడానికి దాతాదయాల్‌జీ కూడా ఈ శబ్దం నా పేరిట రాశారు. నాకు నా అసలు రూపపు చిరునామా చూపాడు. దాతా నా పేరిట రాసిన శబ్దం ఇది.

**ఫకీరా! రూప్ తేరా అతిప్యారా**

చెప్పడానికి ఆయన చెప్పారు. కానీ ఈ శబ్దాన్ని వినటం వలన, ఆ వాణిని పఠించటం వలన నా మోహ మాయల వల తెగిపోలేదు. నా 84 లక్షల చక్రం పోలేదు. పురుషోత్తమదాస్! నీవు నాకు బసరే బగ్దాద్‌లో ఉన్నప్పటి నుండి మిత్రుడవు. ఆ రోజుల్లో నీవు అడిగేవాడివి, "మాస్టర్జీ! ఏమైనా చెప్పండి." అని..... "ఏమైనా దొరికితే చెబుతాను" అని నేను జవాబిచ్చేవాణ్ణి. నాకు ఏం దొరికిందో దానిని నేటి గురుపూర్ణిమ రోజు చెప్పాలనుకుంటున్నాను.

చూడండి! దాతాదయాల్ కూడా ఈ శబ్దంలో రాశారు.

**ఫకీరా రూప్ తేరా అతి ప్యారా ।**
**తూ సత్ చిత్ ఆనంద కే మూరత్, తూ తీనోం సే న్యారా ।**

తేరీ గతి మతి బుద్ధి న జానీ, అటక్ రహీ మంఝు 'ధారా ॥

కర్మ కియా సత్ కీ చఢ ఘాటీ; చిత్ మే వివేక విచారా ।
సత్ చిత్ ఆనంద విలాసా, చహుఁదిశ హర్ష పసారా ॥

నా ఆ కర్మ ఏమిటి? సుమిరణ, ధ్యానం, భజన; నేను ఏదో ఒక వస్తువు అన్వేషణలో దాతా దర్బారులోకి, సన్నిధిలోకి వెళ్ళాను. దానిని పొందడానికి నేనేం కర్మ చేశాను? స్మరణ, ధ్యానం, భజనలే చేశాను. నేను కర్మ చేశాను గదా? 84 లక్షల చక్రాన్ని తొలగించుకునేటందుకు, మాయా మోహాల వలను తొలగించుకోవడానికి నేను ఏ పనిచేశానో అది ఇదే! మిగతా అంశాలు సత్యం మాట్లాడటం, నిజాయితీగా ప్రవర్తించటం, ఎవరి హక్కునైనా తినక పోవటం వంటివి ఆ కర్మకు అవసరమైన వ్యంజనాలు. వ్యంజనాలంటే మీకు తెలుసుగదా! రొట్టెతోపాటు కూరగాయలు అవసరం. ఆయనంటారు, "నీవు కర్మ చేశావు. నీవు సత్ యొక్క శిఖరం ఎక్కావు. కాని ఎలా? ఆలోచించు" అన్నారాయన. కానీ ఈ ఆలోచన నాకు వచ్చేది కాదు.

కరమ్ కియా సత్ కీ చఢా ఘాటీ, చిత్ మే వివేక విచారా ।
సత్త్ చిత్త్ ఆనంద విలాసా, చహూఁ దిశ్ హర్ష్ పసారా ॥

ఈ వివేక భావన నాకు వచ్చేదికాదు. సత్ యొక్క శిఖరం పైకి నేను అధిరోహించాను. శబ్దం విన్నాను. కానీ వివేక విచారం, వివేక నిర్ణయం, వివేక భావన రాలేదు. ఆయన సుందరమూర్తి విగ్రహం నా కళ్ళెదుట ఉంది. లాహోర్‌లోని కుటీరంలో కూర్చొని ఉన్న ఆ ఆకారం నా కళ్ళ ముందర మెదలుతున్నది. దాతా మీరు నన్ను ఎక్కడి నుండి ఎక్కడికి చేర్చారు?

తీన్ త్యాగ్ చౌథే కో ధారే, సో సబ్ కా ఆధారా ।
ద్వంద్వ జగత్ త్రిపుటీ కీ త్రికుటీ, ఛోడ్ చలా ఘర్ బారా ॥

ఆ ఇల్లు రైల్వేమండీలోని 18వ నెంబరు ఇల్లు కాదు. (హోషియార్‌పూర్‌లో పండిత్ పరమదయాల్‌జీ మహారాజ్ ఇల్లు రైల్వేమండిలో 18వ నెంబరుతో ఉంది.) మరేదీ? నా అంతరంలో నుండి నా 'నేను' దేనినో- 'నీవు' చేసి నిలబెడుతుందో అదే ఆ ఇల్లు. ఆ నిలకడ పేరే నా ఇల్లు వాకిలి. నా లోపలనా "నేను"లో నుండి పుత్రుడు, నా గురువు, నా మతం, నా సంప్రదాయం, నా ధర్మం, నా ఈశ్వరుడు, పరమేశ్వరుడు, నా భగవంతుడు, నా బ్రహ్మ అనగా

ఏ నా విచారాలు, తలంపు, ఆలోచనలు వెలువడేవో, నా సురత్‌ను ఎక్కడ నిలిపే వాడినో అదే నా ఇల్లు.

నేను ఈ బంధనాలలో చిక్కుబడి ఉండేవాణ్ణి. వీటి నుండి బయటపడలేక పోయేవాణ్ణి. కానీ వాస్తవానికి ఇదంతా మాయే. అదంతా నాకు సత్యంగా అనిపిస్తుంది. ఎందుకంటే అప్పట్లో నాకు అసలు గృహం చిరునామా దొరకలేదు. నేను ఆ భావనా విచారాలలో బంధింపబడి ఉండేవాణ్ణి. దాతాదయాల్ నాకు చాలా బోధించారు. కానీ నాకు విషయం అర్థమయ్యేది కాదు.

నహీఁ తూ దోయ్ న తీన్ చార్ హై, నహీఁ తూ సహస్ హజారా ।
ఏక్ ఏక్ హై ఏక్ ఏక్ హై, జానే జానన్ హారా ॥

ఏక్ అనేక్ కహాఁ హై తుఝ్ మే, యహ భీ భూల్ వికారా ।
రాధాస్వామి రూప్ లఖ్ అప్నా, తూ వ్యాపక్ సంసారా ॥

ఆ నా 'ఏకత్వం' ఏమిటి? ఉన్నదంతా నేనే! పూర్తిగా వేదాంతుల వలె ఉన్నాను -

దాతాదయాల్ శబ్దం విన్నారు. ఇప్పుడు రాధాస్వామి దయాలుని శబ్దం వినండి. రాధాస్వామి దయాలుని శిక్షణ నుండి విముఖుడనయ్యానని ఎవరూ అనరాదు. స్వామీజీ రాస్తున్నారు.

జేర్ మహేనా జేతా భారీ, జీవ హృదయన్ తపన్ కరారీ
సంత్ దయాల్ జీవ హిత్ కారీ, భేద్ కహేఁ వహ నిజ కర్ భారీ ॥

ఏర్పడిన మన జీవనం దేనినో కోరుకుంటుంది. అనగా జీవికి ఏదో ఒక అన్వేషణ ఉంది. ఆ అన్వేషణే తపన, తాపం. పుత్రుడు కావాలనుకుంటారు.అదొక తపన. ఈశ్వరుణ్ణి కలుసుకోవాలనుకుంటారు. అదొక తపన. జీవుల హృదయాలలో ఒక తపన ఉందంటున్నారు స్వామీజీ మహారాజ్. మరి సంతులేం చేస్తారు? ఆ రహస్యం తెలుపుతారు.

సంత్ దయాల్ జీవ హితకారీ, భేద్ కహేఁ అబ్ నిజకర్ భారీ ।
నహీఁ ఖాలిక్ మఖలూక్ న ఖిల్‌కత్, కర్‌తా కారజ్ కాజ్ న ధిక్కత్ ।
దృష్ట దృష్టా నహీఁ కుఛ్ దర్‌సత్, వాచ్య లక్ష్య నహీఁ పద న పదారథ్ ॥

ఏ రహస్యం చెబుతాడాయన. "ఓ సురత్! ఓ జీవుడా! నీవు ఏ ఇంటి నుంచి వచ్చావో అక్కడ ఖాలిక్ అనగా సృష్టి కర్తలేదు. ఖిల్‌కత్-సృష్టి లేదు.

మఖలూక్ అనగా ప్రాణులు, ప్రజలు - సృష్టింపబడిన వారు లేరు. అక్కడ వస్తువులేవీ లేవు. అయితే అది లేదు. నీ అంతరంలోని 'నేను' మాప్తమైపోయే వరకు నీ అంతరంలో ఆ "నేను" ఉండనే ఉంటుంది. లేదా ని అంతరంలో జీవత్వం ఉన్నంతవరకు లేదా నీ అంతరంలో హంసత్వం ఉన్నంత వరకు, లేదా నీ అంతరంలో సంత్ గుణం, సంత్ తత్వం యొక్క జ్ఞానం, నమ్మకం ఉన్నంతవరకు నీవు ఆ ఇంటికి వెళ్లజాలవు. నీ లోపల ఉన్న నీ అసలైన వస్తువు దేనినో కోరుతున్నది. ఆ కోరిక ఇంకా సమాప్తం కాలేదు. అది వేరే విషయం. కొందరికి ప్రపంచపు కోరిక లేదు. గానీ ముక్తిని పొందాలనే కోరిక ఉంది. ప్రేమ కావాలనే కోరిక ఉండిపోయింది. ఆ కోరిక ఉన్నంతవరకు ఖాలిక్, మఖలూక్, సృష్టి కర్త, సృష్టి సృష్టింపబడిన వారు అన్నీ ఉంటాయి. నేను ఎక్కడి నుండి వచ్చానో అక్కడికి, ఆ నిజగృహానికి వెళ్ళాలనే అన్వేషణ నాలో ఉండేది. గనుక నేను దాతాదయాల్ చరణాలలోకి వెళ్ళాను. ఆయన నాకు రహస్యం చెప్పాడు.

**జాత్ సిఫాత్ న అవ్వల్ ఆఖిర్, గుప్త న ప్రగటి బాతిన్ జాహిర్ ।**
**రామ రహీమ్ కరీమ్ న కేశవ్, కుఛ్ నహిఁ కుఛ్ నహిఁ కుఛ్ నహిఁ థాసో ॥**

**స్మృతి శాస్త్ర నహిఁ వేద్ భాగవత్, కథా పురాణ్ న వాచక తీరథ్ ।**
**సేవ న సేవక్ దాస్ న స్వామీ, నహిఁ సత్ నామ్ న నామీ అనామీ ॥**

అక్కడ శబ్దం లేదు. నామం లేదు. అనామం కూడా లేదు. మీరు మొదట దాతాదయాల్ శబ్దం చదివారు. ఆయన 1905లో నేను స్నానం చేశాక నాకు నామదానమిచ్చారు. ఆ నామం నన్ను ఎక్కడికి చేర్చింది?

**గురు నే అమృత్ నామ పిలాయా ।**
**మోహ జాల్ కీ ఫాఁసీ కాటీ, చౌరాసీ సే ఆన్ ఛుడాయా ॥**

ఆ మోహమనే వల ఎలా తెగిపోయింది? ఏ విధంగా మోహం నశించింది? వివేకం వలన మోహం నశించింది. తెలివి, బుద్ధి వలన దూరమైంది. నాకు ఎలాంటి తెలివి, బుద్ధి లభించింది. మొదట ప్రాపంచిక తెలివి, ప్రాపంచిక బుద్ధి లభించింది? నా భార్య మూడున్నర సంవత్సరాలు వ్యాధిగ్రస్తురాలై మరణించింది. ప్రపంచాన్ని చూస్తుంటాం. జనం లోకం లోకి వస్తుంటారు, వెళ్ళిపోతుంటారు. కొందరికి రోగాలొస్తాయి. మరికొందరికి ఇంకేవో వస్తాయి. ఈ ప్రపంచంలోకి ఎవరొచ్చినా స్థిరంగా ఉండజాలరనే వివేకం కలిగింది. ప్రపంచంలోని ఈ తెలివి వలన, బుద్ధి వలన, వివేకం వలనో మోహమనే ఉచ్చు నరకబడింది. ఇప్పుడిక

అంతరంలోని, లోపలి మోహం-నాలో 'నీవు'ను ఏర్పర్చేది: అంతరంలో దాతాదయాలుని రూపం తయారుచేసేది ఎలా దూరమైంది? అది దూరమై ఉండేది కాదు గానీ దాతాదయాల్ నాపై దయ తలచి ఈ గురుపదవి నిచ్చాడు. నా యీ మోహాన్ని నాశనం చేసేందుకే ఆ పదవి ఇచ్చాడు. నా మనసు నుండి వెలువడిన ఆ 'నీవు'ను దూరం చేయడానికి నాకీ గురు పదవి లభించింది. ఆ మోహాన్ని అనగా 'నీవు'ను మీ సత్సంగీయులే నశింపచేశారు. నన్ను మీరు పూజిస్తారు. నేను మిమ్మల్ని పూజిస్తాను. ఎందుకంటే మీ కారణం వలన నా 'నేను' నుండి వెలువడే నీవు నన్ను బంధించి నాకు సుఖదుఃఖాల నిచ్చే వస్తువు నశించిపోయింది. నా రూపం మీ లోపల సాక్షాత్కరిస్తుందని మీరు చెబుతుంటారు. అలా ప్రగటమైంది నేను కాదు. కనుక సత్యమైన మనిషిని అయిన కారణంగా వారిలోపలికి ఎవరు వెళ్ళి దర్శనమిచ్చారని ఆలోచించడానికి వివశుడనయ్యాను. ఇంతకీ సత్సంగికి అలా లోపల దర్శనమిచ్చినదెవరు?

ఢిల్లీ నుండి భూప్‌సింహ వచ్చాడు. ఎనిమిదేళ్ళుగా నావెనక ఉంటున్నాడు. 'కుంభ' సమయంలో నేను వెళ్ళినప్పుడు టేప్‌రికార్డు తీసుకువెళ్ళి ఇతడు నా అన్ని సత్సంగాలనూ రికార్డు చేశాడు. ఆలోచన వచ్చింది. ఓ భూప్‌సింహ్! నీవు నా వెనుక ఎందుకు తిరుగుతున్నావు అనుకున్నాను. అతడు తనకు సంబంధించిన ఒక సంఘటన చెప్పాడు. అతడు ఒకప్పుడు మానసిక దుఃఖాలతో బాధపడుతున్నాడు. ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. ఆత్మహత్య చేసుకునేందుకు కుతుబ్‌మినార్ నుండి దూకబోయాడు. అప్పుడతనికో ఆలోచన వచ్చింది. తను ఇలా దూకినా ప్రాణం పోకుండా ఎముకలు, కాళ్ళు చేతులు విరిగితే జీవితాంతం మంచానపడి ఉండవలసి వస్తుంది. నదిలో మునిగిచనిపోతే బాగుంటుంది అనుకున్నాడు. అతడు యువకుడు. నదిలో మునిగిపోయే ఆలోచన వచ్చినప్పుడు ఈదే సమస్య ఉంది. నీళ్ళలో మునిగిపోకముందే ఎవరైనా పట్టుకుంటే ఆత్మహత్యా నేరం కింద దావా వేస్తారు. తరువాత తన గదిలోకి వెళ్ళాడు. అక్కడ నేను (అంటే దయాల్ ఫకీర్) ప్రత్యక్షమయ్యాను. నేను (దయాల్ ఫకీర్) అతనికి చెప్పానుట, "భూప్ సింహ! మేలుకో, మేలుకో, నీవు మేలుకొనే సమయం వచ్చింది" అని అన్నానుట. "మేల్కొని ఏం చేయాలి?" అని ప్రశ్నించాడట భూప్‌సింహ. నేను (దయాల్ ఫకీర్)అన్నాను "నీ సమయం వచ్చింది. ఏకహి సాధే సబ్ సధే సబ్‌సాధే సబ్ జాయె" అన్నానట.

"ఆ తరువాత మీరు ఆకాశంలోకి ఎగిరిపోయి నక్షత్రంగా మారారు" అన్నాడతడు.

ఇలాంటి సంఘటనలే సత్సంగీయులకు జరుగుతుంటాయి. నేను మీకు చెబుతుంటాను. " నేను వెళ్ళలేదు. మరి వెళ్ళిందెవరు?" అని ఆలోచిస్తుంటాను. ప్రతి ఒక మనిషి లోపలినుండి ఏ 'నేను' నుండి 'నీవు' వెలువడుతుందో అదే ఇది. అంతే తప్ప నేను కాను. నాకు ఈ జ్ఞానం కలిగినప్పటినుంచి నా మనసు లోపల ప్రకటమయ్యే దాతాదయాల్ రూపం లేదా మరో దృశ్యం అవి లేవుగానీ తెలిసేవి, కనిపించేవి, ప్రకాశించేవి. అంతే! ఇదంతా కాలం, మాయలనీ 'నేను' యొక్క ఆటలనీ నాకు నమ్మకం ఏర్పడింది. ఈ ఊహ, భావన మాయా మోహాల నుండి నన్ను బయట పడవేసింది. నా అంతరంలో ఏ "నేను" నుండి "నీవు" వెలువడేదో, ఎందులో నేను చిక్కుబడి ఉన్నానో దాని నుండి బయటపడ్డాను. అందుకే నేను చెబుతున్నాను. కేవలం స్మరణ, ధ్యానం, భజన చేయటం వలన ఏ మనిషీ ఆ స్థానానికి చేరుకోజాలడు. సత్యమైన జ్ఞానం, సద్గురువు దొరికితేనే అక్కడికి చేరుకోగలం.

ప్రస్తుతం ఈ ప్రపంచంలో ఈ గురు మతంలో పాఖండిజం అనగా మోసం- జరుగుతోంది. కానీ ఈ మోసంలోనే ఆనందం ఉంది. ఈ మాయ రూప మోసంలో మహానందం ఉంది. నేను ఆనందాన్నే పొందుతున్నాను. గురువు రూపాన్నీ నీవు కూడా చూస్తుంటావు. కొందరిలోపల రాముడొచ్చాడు. కృష్ణుడొచ్చాడు. దేవి వచ్చింది. లేదా మరొక రూపం కనిపించింది. వ్యక్తి వాటిలో చిక్కుబడి ఉన్నాడు. వాస్తవానికి అది లేదు. నీ నావతీరం చేరాలంటే కేవలం సద్గురువే సత్యమైన జ్ఞానమిచ్చి నిన్ను దాటించగలడు. కానీ ఈ సమయంలో ఈ సత్యమైన జ్ఞానానికి ప్రాపంచీకులు అర్హులు కారు. ప్రపంచమంతా మనానందం, జ్ఞానానందం, వివేకానందం, ఆత్మానందాల వెనుక పడుతుంటుంది. యావత్ ప్రపంచంలో కొందరు పుత్రానందంలో, మరికొందరు స్వగృహానందంలో, ఇంకొందరు మందిర ఆనందంలో, కొందరు ఆశ్రమాలలో చిక్కుబడి ఉన్నారు. వీరంతా తమ నిజగృహానికి వెళ్ళజాలరు. అందుకే రాధాస్వామి మతంలో పదే పదే చెప్పబడింది.

**పూరా గురు తూ ఢూంఢ్ రే, తేరే భలే కీ కహూం ।**
**జీవత్ గురు కో బూఝ్ రే, తేరే భలే కీ కహూం ॥**

రాధాస్వామి మతంలో, సంత్ మతంలో నీకు పూర్ణ జ్ఞానమిచ్చే పూర్ణ

గురువుకు ఎనలేని ప్రాముఖ్యం ఉంది. మహిమ ఉంది.కానీ పూర్ణ జ్ఞానం పొందడానికి అందరికీ అర్హత లేదు. స్మరణ, ధ్యానం, భజన నీకు ఆనందాన్నివ్వడానికి ఉన్నాయి. నీ జీవనానికి సత్‌చిత్ ఆనందపు సుఖం ఇవ్వడానికి ఉన్నాయి. కానీ సత్‌చిత్ ఆనందంలోనే ఉండేవారి మోహం నశించదు. మాయ నశించదు. వారి జనన మరణాలు సమాప్తం కావు. నేనెక్కడ చెబుతున్నానో నాకు తెలుసు. కానీ నా అనుభవాలు చెప్పిపోతానని నేను శపథం చేశాను అందుకే నేటి ఈ గురుపూర్ణిమ రోజున నా అనుభవాలు చెబుతున్నాను. ఎవరి అదృష్టంలో ఉంటే వారు అర్థం చేసుకుంటారు. అదృష్టంలో లేని వారిని నేనేం చేయగలను? అందుకే అంటుంటాను.

"జిస్‌పర్ దయా ఆది కర్తాకీ, వహ యహ నియామత్ పావై"

కేవలం స్మరణ, ధ్యానం, భజనలతో ఎవరి నౌకా తీరం చేరదు. స్మరణ, ధ్యానం, భజనల వలన నీ జీవనం ఆనందదాయకమవుతుంది. అలా అని నీవిక స్మరణ, ధ్యానం, భజన చేయనవసరంలేదని అనుకోవద్దు. జీవన యాత్రను కొనసాగించడానికి మనిషి ఆత్మానందాన్ని కోరుకుంటాడు. ఆనందాన్ని గ్రహించండి. కానీ దానిలో చిక్కుకొనవద్దు. దాని రూపాన్ని అర్థం చేసుకోవాలి. నీకు కొడుకులున్నారు. ఆనందించు. ధనముంది. ఖర్చుపెట్టు. తిను, సుఖపడు! స్మరణ చేస్తావు. దాని సుఖమందుకో. ధ్యానం చేస్తావు. మనానందం, జ్ఞానానందాన్ని పొందు. మంచి పుస్తకాల స్వాధ్యాయం చేస్తావు. వేదాంతం చదువుతావు! జ్ఞానానందాన్ని పొందు. కానీ ఒక వేళ నీవు నీ ఇంటికి వెళ్ళ దలచుకుంటే నీకు సారభేదం, సార రహస్యం తెలియాలి. నేను మీకు సారభేదం, సార రహస్యం ఇస్తున్నాను. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న గురు మతాల వారు ఎవరూ ఈ సారభేదం, సార రహస్యం చెప్పటం లేదు. అందుకే అనామీ ధామం నుండి సంత్ శరీరంలో నేను అవతరించాను. సంత్ మత శిక్షణను, సంత్ మత ఉపదేశాన్ని విప్పి చెప్పాలని, దాని వలన తన ఇంటికి వెళ్ళ గోరిన జీవునికి మార్గం సులభతరం కావాలని భగవంతుడు నన్ను అనామీ ధామం నుండి సంత్ శరీరంలో పంపించాడు.

నేను ఎవరి అంతరంలోకీ వెళ్ళను. నాయొక్క "నేను" లో నుండి నా 'నీ' వు వెలువడుతున్నది. ఆ 'నీవు' ఇప్పుడిక నన్ను బంధించజాలదు. 'నీవు' లో నేను లుప్తమవుతాను. ఆనందం పొందుతాను. కుటుంబం ఉంది. జనక

మహారాజు వలె కుటుంబ సౌఖ్యాన్ని పొందుతాను. పిల్లలున్నారు. పిల్లల వలన ఆనందం పొందుతాను. సజ్జన మిత్రులైన మీరొస్తుంటారు. మీ నుండి ఆనందం పొందుతాను. స్మరణ ధ్యానం భజన చేస్తాను. వాటి వలన ఆనందం పొందుతాను. కానీ ఇదంతా నిజానికి లేదు గానీ ఉన్నట్లు అనిపిస్తుందని నాకు తెలుసు. సనాతన ధర్మశిక్షణ, బోధన ఇదే! చెప్పు సారభేదీ! ఇదే సనాతన ధర్మ శిక్షణ కాదా? ఎపుడైతే నేను 'నీవు'ను వదిలిపోయినపుడు ముందర ఆ తర్వాత ఏముంటుంది? మనస్సే వదిలిపోతుంది. అభ్యాసంలో ప్రకాశం వస్తుంది. వెలుతురొస్తుంది. దీనిని పారబ్రహ్మ అంటారు. ప్రకాశాన్ని చూసినప్పుడు శబ్దాన్ని విన్నప్పుడు నాకు ఓ ఆలోచన వస్తుంది. ప్రకాశాన్ని చూసే వస్తువు ఒకటి. శబ్దాన్ని వినే వస్తువు మరొకటి. ఇక ఆ వస్తువును అన్వేషిస్తాను. నా లోపల ఏ 'నేను' ఉంటుందో అది ప్రకాశాన్ని చూస్తుంది. ప్రకాశానికి ఏది సాక్షిగా ఉందో ప్రకాశం దేని ఆటనో, శబ్దానికి సాక్షి ఏదో, శబ్దం దేని ఆటనో, శబ్దానిది సాక్షి ఏదో, శబ్దం దేని లీలనో, దానిని వెదుకుతుంటాను. దానిని వెదుకుతూ వెదుకుతూ ఉంటే ఏమవుతుంది? "తూ వ్యాపక్ సంసారా" నా యొక్క 'నా' అనేది, 'ఉంది' అనేది తన అనుభవంలో చూస్తుంది. అది లేనిదే శబ్దం లేదు. ప్రకాశం లేదు. నీవు లేవు. దృశ్యం లేదు. ఏమీ లేదు. ఆ వస్తువే పరమతత్త్వం. నేను సర్వవ్యాపకుడననే నమ్మకం సర్వ వ్యాపకత్వం యొక్క నమ్మకం, అహంకారం తొలగలేదు. అది ఎలా తొలగిపోయింది? దానిని మీరు తొలగించారు ఎలా? నేను సర్వవ్యాపకుడనై పోతే ఏది కోరితే దానిని చేసేయగలను. ఇది నా అనుభవం. నా అనుభవాలను చెప్పి పోతానని ప్రమాణం చేశాను. నేను ఎవరిపైనా దయ, కృతజ్ఞత చూపటం లేదు. నేను నా ఇంటికి వెళ్ళడానికి బయల్దేరాను. నా భగవంతుడు ఎక్కడున్నాడనే అన్వేషణ ఉండేది. అందుకే ఏడ్చాను. ఒకదృశ్యం నన్ను దాతాదయాలుని చరణాలలోకి చేర్చింది. ఆయన నాకు నామమిచ్చాడు.

**గురునే అమృత్ నామ పిలాయా ।**
**మోహ జాల్ కీ ఫాఁసీ కాటీ, చౌరాసీ సే ఆన్ ఛుడాయా ॥**

ఒకవేళ నన్ను నేను సర్వవ్యాపకుడననుకుంటే నాలోని 'నేను' తనం ఎక్కడికి వెళ్ళింది? నేను ఏమీ చేయజాలను. ఈ అనుభవం నాకు మీ వలన కలిగింది. ఎలా? శ్రద్ధా విశ్వాసాలతో ఎందరో నా దగ్గరికి వస్తుంటారు. వారి

'నేను'లో 'నిన్ను' ఏర్పర్చుకునే శక్తి ఉంటుంది. వారు తన 'నీవు' నుండి తమ మనోకామనలను పూర్తి చేసుకుంటారు. చాలా మంది శిరస్సులపై చేయితో నిమిరాను. ప్రసాదాలిచ్చాను. వారి శ్రేయస్సుకోరాను. కానీ వారికి లాభం కలగలేదు. గనుక ఆలోచించడానికి వివశుడనవుతుంటాను. ఇది నా అనుభవం.

నాకు ఏ విశ్వాసం కలిగింది? ఒక తత్వం ఉంది. అదేమిటో ఏది కాదో నాకు తెలియలేదు. బహుశా దాతా దయాల్‌కు తెలిసి ఉండొచ్చు. స్వామీజీకి తెలిసి ఉండొచ్చు. గురునానక్‌కు తెలిసి ఉండొచ్చు. వేదాల ఋషులకు తెలిసి ఉండవచ్చు. నాలుగు రోజుల జీవితం కోసం మోసాల వలను ఎందుకు పరవాలి? అదేమిటి? అకహ, అపార్, అగాధ్, అనామీ. చెప్పలేనిదీ, అంతులేనిదీ, లోతు తెలియనిదీ, నామం లేనిదీ. దాని విషయంలో అదేమిటో చెప్పడానికి అది ఇదనీ, అదనీ, ఏమై ఉందో, ఏదికాదో చెప్పడానికి ఎవరికీ అర్హత, అధికారం లేదు.

**ఏక్ కహూఁతో హై నహీఁ, దూజా కహూఁతో గార్ ।**
**జైసా హై వైసా రహే, కహే కబీర్ విచార్ ॥**

నాకు ఏమనుభవమైంది? ఒక తత్వం ఉంది. ప్రపంచంలో వ్యాపించి ఉన్న ఒక పరమ తత్వ సముద్రం ఉంది. దానిలో కలకలం పుడుతుంది. శబ్ద, ప్రకాశాలు సాక్షాత్కరిస్తాయి. సృష్టి జరుగుతుంటుంది. ఎప్పటినుంచి సృష్టి రచన జరుగుతున్నదో ఎవరికీ అంతు చిక్కలేదు. కోటి యుగాలు గడిచిపోయాయి. ఎన్నో సత్ యుగాలొచ్చాయి. కల్ప కల్పాంతరాలొచ్చాయి. గురునానక్ గారన్నారు.

**లఖ్ లఖా ఆకాశ్ లఖ్ పాతాలాఁ పాతాల్ ।**
**ఔడక్ ఔడక్ భాల్ థకే, వేద్ కహేఁ ఇక్ జాత్ ॥**

అదొక తత్వం. నేనెవరిని? ఒక చైతన్యపు నీటి బుడగను. నాకు ఆ సర్వ వ్యాపకుడైన నిరాధార భగవంతుని చిరునామా దొరకలేదు. మరేం దొరికింది? నేనెవరినో తెలిసింది. నేనొక చైతన్యపు నీటి బుడగను. సముద్రంలో ఆటుపోటులు వస్తుంటాయి. నీటి బుడగలు పుడుతుంటాయి. అలలొస్తుంటాయి. బిందువులు, నీటి తుంపర్లు వస్తుంటాయి. ఇది ఆ పరమతత్వం యొక్క లీల. దాని ఇష్టం ఏది కోరితే అది చేయనీ. నేనెందుకు చింతించాలి. జనన మరణాల గురించీ, మోహం గురించీ ఎందుకు చింతించాలి? ఆ జ్ఞానం వలన నాకేం లభించింది? నేను నా జీవనాన్ని సంతోషంగా గడుపుతున్నాను.

యత్ర యత్ర మనో గచ్ఛతి తత్ర తత్ర సమాధినామ్

ఎక్కడెక్కడ ఏమేం జరుగుతున్నదో అంతా ఆ పరమతత్వపు లీలే! నాకు లోగడ ఉన్న భ్రమలు, భగవంతుని చేరుకుని, జనన మరణాల నుండి తప్పించుకోవాలనే కోరిక, అజ్ఞానంతో నాకు కలిగిన లాభం మొదలైన విషయాలను వివరించాను. ఈ జ్ఞాన ప్రాప్తి కలగడమే నామ ప్రాప్తి అని భావిస్తాను.

**గురునే అమృత్ నామ్ పిలాయా ।**
**మెహ జాల్‌కీ ఫాఁసీ కాటే, చౌరాసీ సే ఆన్ ఛుడాయా ॥**

ఎవరు విడిపించారు? నామం. మరి నామం ఏమిటి? శబ్ద యోగం ఏమిటి? స్వామీజీ అన్నారు.

**సురత్ శబ్ద దోవు అనుభవ రూపా, తూ తో పడా భరమ్ కే కూపా ॥**

నేను అర్థం చేసుకున్నదంతా తప్పు కావచ్చు. నేను అర్థం చేసుకున్నదే సరైనదని నేను వాదించను. నాకు ఆ అమృత నామం లభించింది. ఏ అమృతం లభించింది?

**యత్ర యత్ర మనో గచ్ఛతి తత్ర తత్ర సమాధినామ్ ॥**

ఎక్కడెక్కడికి నా మనసు పోతుందో అక్కడక్కడ సంతోషాన్ని పొందు తుంటాను. ప్రపంచంలో ఉంటాను. పిల్లలతో ఆడుకుంటాను. మీరొస్తుంటారు. మీ బాధలు వింటుంటాను. మిమ్మల్ని ప్రేమిస్తుంటాను. అభ్యాసంలోకి వెళ్తాను. మనసులో ఉన్నప్పుడు దాతాదయాల్‌జీ రూపం ఏర్పర్చు కుంటాను. వినాలన్పించి నప్పుడు శబ్దం వింటాను. ప్రకాశాన్ని చూస్తాను. ఇవన్నీ చేస్తున్నానన్న అహంభావమేమీ నాకు లేదు. 'నేన'నే అంశం సమాప్తమైపోయింది. ఈ అమృతం నాకు లభించింది. కబీర్ ఇదే చెప్పాడు.
**సంతోఁ సహజ్ సమాధ్ భలీ ॥**

అర్థమవుతోందా డాక్టర్ పూరణ్‌సింహ్! సంతులు కూడా ఇదే చెప్పారు. నా ఆత్మకు ఇది సంతుష్టినిస్తుంది.

**సంతోఁ ! సహజ్ సమాధ్ భలీ ।**

**గురు ప్రతాప్ జాదిన్ తే జాగీ । దిన్ దిన్ అధిక్ చలీ ॥**

జహాఁ జహాఁ డోలూఁ సో పరిక్రమా, జోకుఛ్ కరూఁ సో సేవా ।
జబ్ సోవూఁ తబ్ కరూఁ దండవత్, పూజూఁ అవుర్ న దేవా ॥

మరి జీవనం ఎలా మారుతుంది? పిల్లల వలె అవుతుంది. ఐదారు నెల పిల్లలు, సంవత్సరం వయసు గల పిల్లల జీవనంలా అవుతుంది. వాళ్ళు ఎవరినైనా పూజిస్తారా? రామ రామ అని జపిస్తారా? నిద్రొస్తే పడుకుంటారు. మెలుకువ వస్తే నవ్వుతారు. నా స్థితీ ఇదే! ఈ స్థితినాకు 'నామం' వలన లభించింది. నాకు గురువిచ్చిందీ, ఏ రీతిలో నేనా స్థితిని ప్రాప్తించుకున్నానో ఆ రీతి, ఆ అజ్ఞానాన్ని నేను నా కర్మవశాన ప్రపంచానికి చెప్పాను.

కహూఁ సో నామ్ సునూఁ సోయి సుమిరణ్, ఖావూఁ పీవూఁ సో పూజా ।
గృహ ఉజాడ్ ఏక్ సమ్ దేఖూఁ, భావ్ మిటావూఁ దూజా ॥

నోటితో చెబుతున్నాను. ఇదే నా పూజ. అదే నేను నామం జపించటం. అదొక తత్వం. విషయం అర్థమైంది. ఇప్పుడిక ఎవరిని పూజించాలి? ఏ గురువు యొక్క పూర్ణిమ చేయాలి? ఏ రాముని రామనవమిని నిర్వహించాలి? ఏకృష్ణుని జన్మాష్టమిని జరుపుకోవాలి? ఏ గురునానక్ జన్మదినాన్ని జరుపుకోవాలి? ఏ దాతాదయాలుని శివరాత్రిని జరుపుకోవాలి? అన్నీ సమాప్తమయ్యాయి. కానీ తెలిసి ఉండికూడా కావాలనే ప్రపంచంలో పిచ్చివాడినై ఉంటాను. అన్ని పనులూ చేస్తుంటాను.

జాన్ భూఝ్ అన్‌జాన్ బన్, జ్ఞాన్ పాయ్ అజ్ఞాన్ ।
బల్ పౌరుష్ సే రహిత్ హో, తబ్ సచ్చా బల్‌వాన్ ॥

ఇది దాతా శబ్దం.

ఆంఖ్ న మూందూ కాన్ న రూందూఁ, కాయా కష్ట్ నహిఁ ధారూఁ ।
ఖులే నయన్ మే హఁస్ హఁస్ దేఖూఁ, సుందర్ రూప నిహారూఁ ॥

అదొక తత్వం. పృథ్వికూడా దాని రూపమే! సూక్ష్మ ప్రకృతి కూడా దాని రూపమే! అదేమిటి? ఏది కాదు? అనేది నాకు తెలియలేదు. నాకు భగవంతుడు లభించాడని వాదించను. ఆ భగవంతుడు అకాలపురుషుడు, పరమతత్వ ఆధారుడని అర్థమైందంతే! అతనిదే సృష్టి రచన. దానిదే ఆటంతా! అతనిలో నుంచే సూర్యుడు, చంద్రుడు, తారకలు, బ్రహ్మాండం, లక్షలాది విష్ణులు, లక్షలాది శివులు, లక్షలాది మహాత్ములు, మతా గురువులు, లక్షలాది నానక్‌లు,

లక్షలాది కబీర్‌లు, లక్షలాది దాతాదయాలులు ఈ ప్రపంచంలోకి వస్తుంటారు. వచ్చి వెళ్ళిపోతుంటారు. ఇప్పుడు నా భ్రమలు నశించాయి.

**యత్ర యత్ర మనో గచ్ఛతి, తత్ర తత్ర సమాధి నామ్ ॥**

విషయం ఇదే కదా! మీ సనాతన ధర్మశిక్షణనే ఇస్తున్నాను. ఏదో ఒక కొత్త శిక్షణను ఇవ్వటం లేదు. నీవు సనాతనుడవే అయినా నీ ధర్మం మరిచిపోయావు. నీవు జీవితాంతం మందిరానికి, దేవికీ లేక శివునికీ లేక గణేశునికీ లేక నవగ్రహాలకూ పూజలు చేస్తు చేస్తూ ఓడిపోయావు.

**శబ్ద నిరంతర్ మనువా రాతా, మలిన్ వాసనా త్యాగీ ।**
**ఉఠత్ బైఠత్ కబహూఁ, న ఛూటే ఐసీ తాడీ లాగీ ॥**

నీవు అంతరంలో స్మరణ, ధ్యానం, భజనలు చేయటం వలన నీ వాంఛలు పవిత్రమవుతాయి. నీ మంచితనాలు పవిత్రమవుతాయి. దీనిని మించి ఉన్న అసలైన వస్తువు అనుభవం. జ్ఞానం. అదే నాకు లభించింది. దానినే కబీర్ ఇస్తున్నాడు. కబీర్ జ్ఞానం మరొకటేదైనా అయితేకావచ్చు నాకు తెలియదు. ఏ విషయాన్ని గురించీ నేను వాదించను. కబీర్‌కు, గురునానక్‌కు తమ వాణిని రాసే హక్కున్నప్పుడు, ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏదైనా చెప్పడానికి నాకు కూడా హక్కుంది. మిగతా సంతులు వాదించారు. స్వామి దయానందుడు వాదించాడు. రాధాస్వామి దయాలుడు వాదించాడు. కబీర్ వాదించాడు. కానీ నేను వాదించను. ఇది నా అనుభవం. నేను పొరపాటు పడవచ్చు. వాదించి నేనేం చేయాలి గనుక!

**దాదూ దావా దూర్‌కర్, బిన్ దావే దిన్ కట్ట్ ।**
**కైతే సౌదా కర్ గయే, పంసారీ కీ హాట్ట్ ॥**

ఈ లోకంలోకి లక్షలాది మంది నావంటి ఫకీర్లు వచ్చారు. ప్రపంచానికి ఉపదేశమిచ్చి వెళ్లారు. ప్రపంచం మారిపోయిందా? చక్కబడిందా? అని నా ఆత్మను ప్రశ్నిస్తాను. ఇక్కడి లీలంతా నా మనసుకు సాంత్వన చేకూర్చడానికి జరిగింది. నేనెవరిపైనా దయ చూపలేదు. పైగా మీకే కృతజ్ఞతలు చెబుతాను. మీరొస్తారు. ట్రస్టు వారికి మేలు జరగనీ! హరవిలాస్‌కు భగవంతుడు శుభం కలిగించనీ, లాల్‌సింహకు మేలు కలిగించనీ, మిగతా అందరికీ భగవంతుడు శుభం కలిగించనీ! ఇది నా కర్మ.

నేను 1905లో దాతా దయాలుని చరణాలలోకి వెళ్ళినప్పుడు నాకాయన నామమిచ్చాడు. తరువాత "సారబచన్ పద్య్" ఇచ్చి పఠించమన్నాడు. నేను ప్రేమ స్వభావిని. దానిని చదివేటప్పుడు మాయా సంవాదంలో స్వామీజీ అన్ని మతాలను ఖండించాడు. విమర్శించాడు. అన్నీ మాయా కాలాలలో ఉన్నాయని చెప్పాడు. ఈ రోజు పూజ జరుపుకుంటున్న వ్యాస వశిష్ఠులను గురించి చెబుతూ వారిని కూడా "క్యా వ్యాస్ వశిష్ఠ్ భులాయా" అని వారిని అసంపూర్ణులని తీర్మానించాడు. నేను వశిష్ఠ , వేదవ్యాసు, హిందూ ధర్మమును అనుసరించేవాడిని. అలాంటి వాణి చదువుతుంటే మనసు చాలా బాధపడింది. ఏడ్చేశాను. "హుజార్! ఇదంతా ఖండనం. సహించటం నా వలన కాదు" అని దాతాను ప్రార్థించాను. "వదిలెయ్" అని హుజూర్ మహారాజ్ జీవన చరిత్ర, 'కబీర్ సాహెబ్' సాఖీలను నాకిచ్చారు.

ఆ తరువాత పదకొండు సంవత్సరాల వరకు రాధాస్వామి మత గ్రంథం సారబచన్‌ను చదివే మాట అటుంచి తాకనైనా తాకలేదు. అందులో ఖండనం ఉంది. నేనీ మార్గంలో సత్యసంధతతో నడిచి నాకు లభించిన దానిని ప్రపంచానికి చెప్పి పోతానని ప్రతిజ్ఞ చేశాను. గురుపూజ, గురుసేవ, నిజాయితీతో కూడిన సంపాదన, సత్యం చెప్పటం వంటి సంత్ మతంలోని నియమాలను పాటించాను. కొన్నిసార్లు నియమాలను పాటించక పోయినా నేను బాధపడలేదు. ఎందుకంటే ఈ నియమాలను పూర్తిగా అనుసరించేటందుకు శాయశక్తులా ప్రయత్నించాను. నేను చెప్పిందే నిజమైనదని అనను.కానీ నా సాంత్వన కోసం ఇది సరైనది. సంత్ మతం ఇష్టపదం జీవన్ముక్త, విదేహగతి అయి ఉంది. జైనులు, బౌద్ధుల లక్ష్యం కూడా ఇదే. అందరూ ధార్మిక పక్షపాతంలోకి వచ్చి తప్పుడు అలవాట్లు, హఠంలోకి వచ్చి మానవ సమాజాన్ని విడగొట్టారు.

అయితే ఇక ఏం మిగిలి ఉంటుంది? సహజస్వభావం. సహజ స్వభావం ఎలా రూపొందుతుంది? ఓ పసివాడి స్వభావంలా ఉంటుంది. భగవద్గీతలో కూడా ఇదే రాశారు. జ్ఞానులు పసి పిల్లలవలె ఉంటారు. స్వామీజీ కూడా **"బాల్ రూప్ హోయ్ కో ఛేంకీ"** పిల్లవాడిలా అయి జగాన్ని వదిలివెళ్ళు" అన్నారు. ఇదీ ఇష్టపదం. దీని సందేశమే నేను నేడీ వ్యాసపూజ దినాన ఇస్తున్నాను. ఎన్ని పంథాలున్నాయో వాటన్నిటి ఇష్టపదం ఇదే! "జీవనాన్ని సుఖం, శాంతులతో గడపండి!! మనదగ్గర సిద్ధాంతం ఉంది. మరణించాక ఏమవుతుందో? ఎవరికేం తెలుసు?"

ఉత్‌తే కోయీా న ఆయి యాఁ, జాతే పూఛూఁ జాయ్ ।
ఇత్‌నే సబ్‌కోయ జాత్ హై, భార్ లదాయ్ లదాయ్ ॥

ప్రతి మనిషికి తమ తమ వ్యక్తిగత భ్రమలుంటాయి. ప్రతీ మనిషీ ఏదో ఒక స్థలంపై తమ తమ సంకల్ప పరిధిలో ఇమిడి ఉన్నాడు. సంతులు దయ చూపారు. ఆధారం తొలగిన వారికి ఈ జ్ఞానమివ్వాలని చూశారు. అందుకే సంతుల దగ్గరికి కమ్యూనిస్టులు, నాస్తికులు, దేవీ భక్తులు, వేదాంతులు వస్తారు. సంతులు వారి మాటలను అవునంటారు. ఎందుకంటే వారి ఆధారానికి, సంకల్పానికి దెబ్బతగలరాదని వారి అభిప్రాయం. దాతాదయాల్ నా దృష్టిని ఉన్నతం చేసినట్లే సంతులు తమ దగ్గరికి వచ్చేవారి దృష్టిని ఉన్నతం చేయాలనుకుంటారు. దాతాదయాల్ నాకు వివేకాన్ననుసరించి సైగ చేశాడు.

కర్ సత్ సంగ్ వివేక్ కే సాథ్ - తేరే సీస్ రహే గురు హాథ్ ॥

కానీ నాకు దాతాదయాల్ ఆధారం ఉంది. అందుకే నేను వివేకం అందుకో లేకపోయాను. ఆ వివేకం నాకు కలిగించడానికే నాకీ గురు పదవినిచ్చారు. నేను గురువునూ కాను. శిష్యుణ్ణీ కాను. స్వామినీ కాను. సేవకుణ్ణీ కాను. నా స్వామిత్వం, సేవకత్వం, నా గురుత్వం, శిష్యత్వం, నా కొడుకుదనం, తండ్రిదనం, నా ఉద్యోగం ఇవన్నీ ఏమని తెలిశాయి? మాయ. కానీ నీవు ఈ ప్రపంచంలో ఉన్నంత వరకు విద్రోహివి కావద్దు. ఏ శాసనం కింద, చట్టం కింద నివసిస్తున్నావో ఆ శాసనం, ఆ చట్టం నియమాలను ఉల్లంఘిస్తే నీవు విద్రోహ వేరం కింద శిక్షననుభవిస్తావు. అందుకే ప్రపంచంలో ఉంటూ విషయాన్ని అర్థం చేసికొని నీ మెదడును జ్ఞానంలో ఉంచి ప్రపంచంలో వ్యవహరించు. నీకు సోదరులున్నారు, కొడుకులున్నారు, తండ్రి ఉన్నాడు. కోడళ్ళున్నారు. ఆస్తి ఉంది, ఎవరైనా చనిపోతేనో, నష్టం వస్తేనో అయ్యో, అయ్యో! అని నెత్తీ, నోరు బాదుకోకు. ఇదీ సహజ సమాధికి అర్థం!

సంతో సహజ సమాధి భలీ!
గురు పర్‌తాప్ జాదిన్‌సే జాశీ, దిన్ దిన్ అధిక్ చలీ
జహాఁ జహాఁ డోలూఁ సోయీ పరిక్రమా, జో కుఛ్ కర్తూఁ సో సేవా ॥
జబ్ సోవూఁ తబ్ కరూఁ దండవత్ పూజూ అవుర్ న దేవా ॥ సం ॥

సారభేదీ! ఒక విషయం చెప్పుతాను. ఈ ఋషి ముని, పీర్, పైగంబర్, రసూల్, ఔలియాలంతా మాయలో మునిగిఉండేవారు. మాయలో చిక్కుకుని

వారు పంథలను ఏర్పర్చారు. ఏ ఊహ - ఆలోచనతో ఎవరైనా పని ప్రారంభిస్తే ఆ తరువాత ఆ ఊహను, ఆలోచనను వదలడం కష్టమైపోయింది. దానిని నేను పట్టించుకోలేదు. పైగా ఎలా ఎలా నా ఊహ, ఆలోచనా మారిపోసాగిందో నేనూ మారిపోసాగాను. ఎందుకంటే జనం నన్ను పూజించాలనీ, కాళ్ళకు మొక్కాలనీ నాకు పువ్వులర్పించాల్లనీ నాకు ఏ కోరికా లేదు. ఇది నా పూర్వజన్మకర్మ.

నేనెవరి అంతరంలోకీ వెళ్ళను. నాకు ఆ విషయాలే తెలియవు. ఏదైనా ఎవరితోనైనా ఓ మాట చెబితే, అది సఫలమయితే అతడు బాబాజీ మహిమ గలవాడని చప్పట్లు కొడతాడు. దండోర వేస్తాడు. నేనెక్కడికీ వెళ్ళనని నాకు తెలుసు. నేను పరదాలు వేస్తే అసలు విషయాన్ని తెరమరుగుచేస్తే నాలోని 'నేను', 'నీవు' పోవు. కొందరు మహాత్ములు ఈ విషయాన్ని పరదాల్లో దాచారు. వెలికి చూపలేదు. వాళ్ళు జనుల నుండి గౌరవాదరాలు, సిరిసంపదలు స్వీకరించారు. ధామాలు, ఆశ్రమాలు కట్టుకున్నారు. నేను నిర్భయుణ్ణాయి చెప్పిపోతాను. మీరంతా మాయ చక్రం నుండి బయటపడండి! ఈ స్థితిని చూసి సంత్ మత శిక్షణను స్పష్టం చేయడానికి భగవంతుడు నా మెదడును కదిలించాడు. అయితే ఇష్టపదం ఏమిటి? సహజ సమాధి.

**కహుఁతో నామ సునూఁ, సోయి సుమిరణ్ ఖావూఁ పీవూఁ సో పూజా ।**
**గృహ ఉజాడ్ ఎక్ సమ్ దేఖూఁ, భావ్ మిటావూఁ దూజా॥**

**ఆంఖ్ న మూందూఁ, కాన్ న రూఁధూఁ, తనిక్ కష్ట్ నహిఁ ధారూఁ ।**
**ఖులే నయన్ పహిచానూఁ । హఁస్ హఁస్ సుందర్ రూప్ నిహారూఁ ॥**

ప్రపంచానికి ఈ శబ్దయోగాన్ని గురించిన జ్ఞానం లేదు. లోకం నామం-నామం అంటూ గోల చేస్తుంది. నా గురుభాయి అనగా నాతోటి శిష్యుడు ఒకరున్నారు. చాలా శ్రీమంతులు. చిన్నప్పటినుండీ దాతాదయాలుణ్ణి ప్రేమించేవాడు. దాతా దయాల్ అతణ్ణి వైద్య విద్య చదువమని విదేశాలకు పంపించారు. శబ్ద అభ్యాసి. ఇప్పుడు చెవులు సరిగ్గా వినిపించవు. వృద్ధుడయ్యాడు. అతని ఉత్తరం, జన్మపత్రిక వచ్చింది. అతనేం రాశాడంటే -

'నేను శబ్దాన్ని వింటే మెదడు పిచ్చిబారుతోంది. అశాంతి కలుగుతోంది. నేను తరించి పోవడానికి నాకీ శబ్దం లభించింది. కానీ శబ్దం వినాలంటే గాభరా కలుగుతుంది. శబ్దం వినదలచుకోవటం లేదు. దానిని వినకపోతేనే నా మెదడుకు కొంచెం విశ్రాంతి లభిస్తున్నట్లనిపిస్తుంది. శబ్దం వింటే మెదడు సరిగా పనిచేయటం

లేదు. నా అంతం ఎలా అవుతుంది, నాకు ముక్తి లభిస్తుందా? లేదా?'' అని రాశాడు. తన జన్మకుండలినిపంపాడు. "అక్కడ భృగు సంహిత వారిని అడగండి!'' తనకు ముక్తి లభిస్తుందో లేదో? అని తెలుసుకోమని నన్ను ప్రత్యేకంగా కోరాడు.

ప్రపంచం శబ్దయోగాన్ని అర్థం చేసుకోలేదు. నామం! నామం!! నామం!!! ప్రపంచాన్ని పిచ్చివారిని చేసింది ఈ నామం!

"గురు వాక్యమ్ మూల మంత్రమ్'' అమృతమంటే సద్గురువు ఇచ్చే సత్సంగమే! చూడండి! నేను మీకు ఉదాహరణ చెబుతున్నాను. అతని వయసు 82 సంవత్సరాలు. అతడు దాతా దయాలుని ప్రేమికుడు. సురత్ శబ్ద యోగ అభ్యాసికుడు. ఎంతో యోగ్యుడైన డాక్టరు. ఏ కోరికతో అతడు శబ్ద అభ్యాసం చేశాడు? ఇప్పుడు వృద్ధాప్యం వచ్చింది. శబ్దం ధ్వనించినప్పుడు తన మెదడు అశాంతికి లోనవుతుందని చెబుతున్నాడు. ఓ డాక్టర్ పూరణ్ సింహ్! మీరు రాధాస్వామి మతం వారు. ఇతరులకు సత్సంగం చేయిస్తుంటారు.

**పూరా సత్ గురు పాయాయీ, పూరీ పాయీ జుక్తి।**
**హఁసే దియా ఖిలే దియాఁ పిలే దియాఁ బిచ్చే పాయీ ముక్తి॥**

లోకులు తప్పుడు ఊహలు, తప్పుడు ఆలోచనలిస్తుంటారు. మనం అసంపూర్ణంగా ఉండడానికీ, పూర్ణగురువు లభించక పోవడానికే కారణం ఇదే! వారి వారి ప్రకృతి ననుసరించి చెప్పరు. కళ్ళు తెరవండి! ("అతడు తప్పుడు శబ్దం వింటాడు. కాబోలు'' అన్నాడు శ్రీదుర్గాదాస్. అప్పుడు, "అతడు ఎలాంటి శబ్దం వింటాడో నాకు తెలియదు. బహుశా నీకు తెలుసేమో అతడు చాలాసార్లు నా వద్దకు వచ్చాడు. నా మాటలనతడు వినలేదు. అతడు నా పుస్తకాలను తప్పకుండా చదువుతాడు. ఆ తరువాతే నాకు ఉత్తరం రాస్తూ "బాబాజీ! నా స్థితి ఇలా ఉంది'' అన్నాడు. భృగు సంహిత వారికి చూపమని తన జన్మకుండలిని పంపాడు'' అన్నారు పరమదయాల్ మహారాజ్. "లోపం ఇతనిలో ఉంది. శబ్దంలో లేదు. అతని ప్రకృతిలో దోషం ఉంది'' అన్నాడు దుర్గాదాస్ మళ్ళీ.) శబ్దం అంటే నీ ఉనికి, అస్తిత్వం యొక్క చైతన్యపు మొదటి స్థితి. కింద ఉన్న శబ్దాలన్నీ వర్ణాత్మకమైనవీ, ప్రాకృతికమైనవీ! జ్ఞానం పేరే శబ్దం.

**సురత్ శబ్ద దోవు అనుభవ రూపా। తూతో పడా భరమ్ కే కూపా॥**

అందుకే మనిషికి పూర్ణ గురువు దొరకనంత వరకు స్వతంత్రుడు కాజాలడు. దాతాదయాల్, బాబా సావన్ సింహ్‌జీ, స్వామీజీ మహారాజ్‌లు పంథను నడపించడానికి, ఆశ్రమాలు నిర్మించడానికి పనిచేశారు. ఎవరినీ స్వతంత్రులను చేయడాన్నికి పనిచేయలేదు. స్వతంత్రతత కోసం సంకేత మిచ్చారు. సైగచేసి చెప్పారు. స్పష్టంగా విప్పి చెప్పలేదు.

ఈ మాటలను నేనీ రోజు నిర్భయుడనై చెబుతున్నాను. కాని వారి తప్పు ఏం లేదు. ఏ మనిషీ బంధరాహిత్యం పొందాలనుకోడు. అలా కోరుకున్నది నేనే! ఎందుకంటే నాకు సత్యం, వాస్తవం గురించిన అన్వేషణ నాలో ఉండేది. ఈ రహస్యాన్ని నేను మీకు చెబుతున్నాను. ఇది తనకు కూడా తెలియదని భాయి నందూసింగ్ అంటున్నాడు. దాతాదయాల్ శరీర త్యాగం చేసే సమయంలో భాయి నందూసింగ్ అక్కడే ఉన్నాడు. "నందూసింగ్! నీ ప్రకృతి ననుసరించి నీకు చాలా వివరించాను. నీ జీవనం సుఖంగా గడిచిపోతుంది. అయినా ఒక వేళ ఏ విషయమైనా అడగాలనుకుంటే ఫకీర్‌చంద్‌ను అడుగు" అన్నారట దాతాదయాల్. నేను పైస్థాయి మాట చెబుతాను. రేపటి సత్సంగంలో ఇంకా చెబుతాను. నేడు గురుపూర్ణిమ రోజున, వ్యాస పూజ రోజున గురునామ ప్రభావం వివరించాను. నాకు ఏ నామం లభించింది?

**గురునే అమృత్ నామ పిలాయా।**
**మోహ జాల్ కీ ఫాంసీ కాటీ చౌరాసీ సే ఆన్ ఛుడాయా ॥**

నాకిప్పుడు విశ్వాసం కుదిరింది. చౌరాసి 84 లక్షలు మరేదో కాదు. 'నేను' అనే అహంభావం ఉన్నంతవరకు చౌరాసి-84 లక్షల జీవరాశుల జన్మలు ఉంటాయి. "నేను" అనే అహంభావం సమాప్తమైనప్పుడు 84లక్షల జన్మలు దేనికి కల్గుతాయి? ఈ 84 లక్షల జన్మల భ్రమను మనబుద్ధి అంగీకరించింది. నా మటుకు ఏ చౌరాసీ లేదు. నేను ముందు లేను. తరువాత ఉండను. నేనొక చైతన్య బుడగను. పుట్టుకకు మూలమైన 'అనామీ'లో విలీనమై ఉండేవాణ్ణి. ఎలా విలీనమై ఉండేవాణ్ణి? స్వామీజీ వాణి ఇలా ఉంది.

**సున్ రీ సురత్ తూ అపనీ భేద్। తూ ముఝ్ మే థీ సదా అభేద్ ॥**

ఎలా వేరుగా ఉంది? పాలలో వెన్న ఉన్నట్లు ఒకటై, మిళితమై ఉండేది. అలాగే మనం కూడా ముందు అలా అక్కడున్నాం. దానిలో 'గతి'-చలనం ఉత్పన్నమైంది. జీవజంతువులు ఏర్పడ్డాయి. ఏర్పడుతుంటాయి. నాకు జ్ఞానం

కలిగింది. విషయం సమాప్తమై పోయింది. నా 84 లక్షల జన్మల భ్రమ ఇలా దూరమైంది. జనన మరణాలు, రాకపోకలు ఇప్పుడు నాకు బోధపడ్డాయి. అవేమిటి?

**"లబ్ ఖులే అవుర్ బంద్ హుయే, యహ రాజీ జిందగానీ హై"**

అన్ని సమస్యలూ సమాప్తమయ్యాయి.

**అబ్ నహిం కాల్ కరమ్ కా భ్రమ్ కుఛ్, అభయ దాన్ దే జీవ చితాయా॥**

ఇప్పుడు కాలకర్మల భయం ఎలాంటిది? ఏమిటి? అది సమాప్తమైపోయింది. పూర్వజన్మంలోనిది నేనెవరి నుండైనా తీసుకోవల్సి ఉంటే తీసుకోవాలి. ఎవరు నానుండి తీసుకోవాల్సి ఉందో తీసుకుంటారు. ఈ విషయమే అనుభవంలో వచ్చింది.

**ఘట్‌కా అట్‌కా భట్‌కా ఘూటా, సత్ మారగ్ కీ రాహ చలాయా ।**
**భూల్ భరమ్ దువిధా సంశయసే, సహజ్ గతిసే సహజ్ బచాయా ॥**

అయ్యో! నేనెవరిని? ముక్తి లభిస్తుందా? లేదా! భగవంతుడు ఎక్కడున్నాడు మొదలైనవన్నీ భ్రమలు. ఇప్పుడవి సమాప్తమయ్యాయి.

**సహజ్ యోగ విధి, సహజ్ కమాయీ । సహజ్ సహజ్ భవ, సింధు తరాయా ॥**

భవమనే సింధువు - భవమనే సాగరం అంటే మనసు పరిభ్రమణం, మనసు విచారాలే! జ్ఞానం కలిగినప్పుడు భవసాగరం సమాప్తమైపోతుంది.

**సహజ శబ్ద గతి, సహజ సమాధి, సహజ సున్న్ మే సహజ్ రచాయా ।**
**ఇక్ రస్ జీవన్, ప్రేమ భక్తి కా, దయా కిర్పా, సే సహజ్ దిలాయా ॥**

ఒక రసజీవనం చాలు. "ఓ దాతాదయాలా! మిమ్మల్ని స్తుతించాలంటే ఇప్పుడు మీరిక్కడ లేరు." ఆయనకు చేయవలసినంత సేవ నేను చేయలేక పోయినందుకు బాధగా ఉంది. నాలో ప్రేమభావం ఉండేది. ఆయన శిక్షణ, ఉపదేశం, రాధాస్వామి శిక్షణ, సంతుల మార్గం, వారి శిక్షణను నేను ప్రచారం చేసి నేనాయనకు సేవ చేయగలుగుతాను. ఆయనిప్పుడు లేరు. ఎవరికి సేవచేయాలి? మీరున్నారు. మీ సేవ చేస్తాను.

నేను రాధాస్వామినని ఎప్పుడైనా అంటూ ఉంటాను. అలా అన్నప్పుడు నీవు రాధాస్వామివా అని నా ఆత్మను ప్రశ్నిస్తుంటాను. అవును! ఎందుకు? ఎందుకంటే

రాధాస్వామి మతం లేదా సంత్ మతం శిక్షణను నే నిస్తుంటాను. నేను రాధాస్వామి నయ్యానని అన్నప్పుడు నా తలపై కొమ్ములు మొలవలేదుగదా! ఏ ప్రత్యేకతా రాలేదు గదా!

నాలాంటి పిచ్చివారికి సంత్ మతం యొక్క సత్యమైన శిక్షణ నిస్తాను. సత్యమైన రహస్యం చెబుతాను. దీనినే సంతులూ చెబుతారు. రాధాస్వామి దయాలుడు అవతరించి దాదాపు వంద సంవత్సరాలయ్యాయి. గురునానక్ వచ్చి ఐదువందలేండ్లయింది. వారు రాకముందు కూడా ప్రపంచం ఉంది. ఎవరైనా జీవన్ముక్త స్థితిలో ఉండే విదేహ పురుషుని సాంగత్యం చేయడమే రాధాస్వామి సత్సంగం. నేను స్వతంత్రుడనైన వ్యక్తిని. ఏదో ఒక ధర్మం లేదా పంథ వైపు లేను. మొదట్లో ఈ రహస్యాన్ని గుప్తంగా ఉంచారన్న విషయం నిజం. కేవలం అర్హత కలిగిన వారికే చెప్పబడింది. ఎవరినో అనటం ఎందుకు? కబీర్ సైతం చెప్పలేదు. ఆయన కూడా ఇలా అని ధర్మదాసు నోరు మూసేశాడు.

**ధరమ్ దాస్ తోహి లాఖ్ దుహాయీ । సార్ భేద్ బాహర్ నహిఁ జాయీ ॥**

స్వామీజీ కూడా అన్నారు -

**సంత్ బినా కోయీ భేద్ న జానే । వహ తోహే కహేఁ అలగ్ మే ॥**

ఆ రోజులు గతించాయి. ఇప్పుడు కొత్త మార్పులు వస్తున్నాయి. గురువు శరీరం మార్చాడు. దేహం పేరు గురువు కాదు. జ్ఞానం పేరే గురువు. గురునామం జ్ఞానానిది. జ్ఞానం ప్రసాదించడానికే ఆ పదాలను ప్రయోగించి వర్ణన చేయటం జరిగింది. జనానికి శాంతినివ్వడానికి ఆ రోజుల్లోని బోధనలో పరివర్తన తేవటమే గురువు దేహాన్ని మార్చటం. ప్రపంచం ఏమని భావించింది? దాతా దయాల్ వెళ్ళిపోతే ఫకీర్‌చంద్ గురువయ్యాడు. బాబా సావన్‌సింగ్ వెళ్ళిపోతే బాబా చరణ్ సింగ్ గురువయ్యాడు. ఇదొక భ్రమ.

**"గురునే చోలా బదల్ దియా సిదక్ న హోకర్ సిఖ్ "**

మనమొక భావాన్ని విచారాన్ని, ఆలోచనను తీసుకుని దానిపై ఆధారపడతాం. దానిని మార్చం. ఆధారం ఏర్పడి ఉంది గనుక వర్ణన శైలి, శిక్షణ పద్ధతిని మార్చటమే గురువు దేహాన్ని మార్చటం. దేహం పేరు గురువు కాదు.

**గురు కో మానుష్ జాన్‌తే, తే నర్ కహియే అంధ్ ।**
**దుఃఖీ హోయ్ సంసార్ మే, ఆగే యమ్ కా ఫంద్ ॥**

గురు కియా హై దేహ కో, సత గురు చీన్హా నాహి౹
కహే(కబీర్ తా దాస్ కో, తీన్ పాప్ భర్మాహి ॥

సత్యమైన జ్ఞానం వేరే సతగురువు. సద్గురువంటే సత్యమైన జ్ఞానం. యుగం మారిపోయింది. ఇప్పుడు సైన్స్ యుగం. నీవొకవేళ పాత విషయాలను నవతరం వారి ఎదుట ఉంచితే వారికి అవి నచ్చుతాయా? వారు నీ మాటలు వినడానికి సిద్ధంగా ఉంటారా? నవయువకులు మనల్ని మూర్ఖులనుకుంటారు. ఇదంతా మోసమంటారు. అందుకే బోధనలను మార్చే అవసరం ఏర్పడింది. ప్రపంచం ఏర్పడిన నుండి, ప్రపంచం ఉండేంత వరకు అసలైన బోధన, సత్యమైన బోధన ఉంటుంది. కేవలం దాని వర్ణన శైలిలో తేడా వస్తుందంతే! దాని వలన ఏ కాలంలో ఉండేవారికి వారికి తగిన రీతిలో శాంతి లభిస్తుంది.

"అందరికీ శాంతి"

# చివరి గురు పూర్ణిమ
## పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్
### మానవతా మందిరం, హోషియార్‌పూర్
### సత్సంగం
### తేది 20-8-1980

ఈ రోజు గురు పూర్ణిమ. మీరు నాకు సేవ చేశారు. నేను మీకు ఏ సేవ చేయగలను? ఇక్కడికి కాన్‌పూర్ నుండి ఒకాయన వచ్చాడు. మూడేళ్ళ క్రితం నే నతనిలో ప్రకటమయ్యానని చెప్పాడు. "నీవు అతని అంతరంలోకి వెళ్ళనే లేదు. ఈ విషయాన్ని, నిజాన్ని అతనికి చెప్పక అతణ్ణి నీ వలలో ఎందుకు చిక్కుపడేలా చేస్తావు? అతని నుండి ధనం తీసుకుంటావు, కాళ్ళు మొక్కించుకుంటావు. నీవు దోషివి కాదా" అని నా ఆత్మను ప్రశ్నించుకుంటాను. లోగడ మహాత్ములందరూ తమ జీవితాలతో ఆటలాడుకున్నారు. మీకు జ్ఞానం లేదు. మిమ్మల్ని అజ్ఞానంలో ఉంచి మీకు ఆసక్తినీ, ఉత్సాహాన్నీ ఇచ్చి వెళ్ళారు. కానీ తమ జీవితాలను వృధా చేసుకున్నారు. ఏ మహాత్ముడూ, ఏ గురువూ

ఎవరి అంతరంలోకీ వెళ్ళడు. వెళ్ళే వస్తువు ఏదైనా ఉంటే అది రేడియేషన్ ఒక్కటే! రేడియేషన్‌లో తరంగాలుంటాయి. వందేళ్ళక్రితం శాస్త్రజ్ఞులు ఇచ్చిన ప్రసంగాన్ని విజ్ఞాన శాస్త్రం రికార్డు చేసి ఉంచింది. మనం ఆలోచించేదీ, ఊహించేదీ, మాట్లాడేదంతా బ్రహ్మాండంలోకి వెళ్తుంది. ఎవరికైనా ఏ వస్తువుదైనా అవసరం కలిగినప్పుడు అది ఆ వ్యక్తి లోపలికి వెళ్తుంది. ఇది నా అనుభవం. చాలా మంది ఆత్మలను పిలుస్తుంటారని వింటుంటాం. భవిష్యత్తును ఆ ఆత్మ చెప్పజాలదు. మరణించనున్నవారి ఆలోచనా విచారాలు బ్రహ్మాండంలో ఉంటాయి. ఆ ఆలోచనలనే ఈ ఆత్మలు చెబుతాయి గానీ రానున్న కాలంలో జరుగనున్న విషయాలను మాత్రం చెప్పజాలవు.

నేను మీకు చెప్పదలచుకున్నదానికి మాటలు దొరకవు. చనిపోయిన వారెవ్వరూ ఇక్కడికి రారు. రాముడు రాడు, కృష్ణుడు రాడు, గురునానక్ రాడు, దాతాదయాల్ రాడు మరెవరూ రారు. వారి ఆలోచనా విచారాలు బ్రహ్మాండంలో దాగి ఉన్నాయి. ఎవరైనా తమ అంతరంలో మనస్ఫూర్తిగా సత్యమైన హృదయంతో జ్ఞాపకం చేస్తే బ్రహ్మాండంలోని ఆ విచారాలు వచ్చేస్తాయి. మురికి మనిషి ఉంటే మురికి విచారాలు వస్తాయి. ఉదాహరణకు రేడియో! రేడియో తరంగాలు ప్రతిచోటా ఉన్నాయి. రేడియో స్విచ్‌ను నొక్కితే లండన్ స్టేషన్ నుండి వింటావు. న్యూయార్క్‌లోని మాటలూ వింటావు. ఢిల్లీ నుండీ వింటావు. ఇలాగే మన ఊహలు, ఆలోచనా విచారాలు బ్రహ్మాండంలో ఉంటాయి. మనిషి వ్యాపింపచేసే మురికి విచారాలు, మురికి భావాలతో ప్రపంచంలోకి అతడు విషం వ్యాపింప చేస్తున్నాడనవచ్చు. నీ చెడు విచారాలు వాతావరణంలో ఉంటే అవి ఇతరులకు చెడు కలిగిస్తాయి. నాకు లెక్చరివ్వటం రాదు. కానీ విషయాన్ని నేను పూర్తిగా ఉన్నదున్నట్లు చెబుతాను - నీ లోపల ఎలాంటి విచారాలు, భావాలు ఉన్నా అవి బయటికి వెలువడుతూ వాతావరణంలో దాగి ఉంటాయి. వాటి ప్రభావం ఇతరులపై పడుతుంది. సైన్స్ చెబుతున్నది ఇదే! మన ఋషులు ఏం చెప్పి పోయారు? భారతీయ స్త్రీలు ఇతరుల పడకపై పడుకోరు. మనిషి ప్రభావం పడుకున్న బట్టలపై ప్రసరిస్తుంటుంది. ఆ గుడ్డలను ఎవరు ఉపయోగిస్తే, తాకితే వాటి ప్రభావం వీరిలోకి వెళ్తుంది. ఇదీ సైన్స్. మీరు సత్సంగానికి వచ్చారు. నా వార్ధక్యంపై దయ చూపండి. మాటలను అర్థంచేసుకుని మీ జీవనాన్ని బాగు చేసుకొనండి. రూపాయలివ్వటం వల్ల, హారతులు ఇవ్వటం వల్ల మీకు శుభం కలుగుతుందనుకుంటే పొరపాటు. ఇది ప్రాపంచిక వ్యవహారం.

ఇక్కడ ఇచ్చిపుచ్చుకోవడాలు జరుగుతూనే ఉంటాయి. ఎవరూ ఎవరికీ ఏమీ ఇవ్వరు. ఎవరి నుండీ తీసుకోరు. పూర్వజన్మల లెక్కలు ఉంటాయి. ఎవరికి ఎవరినుండి తీసుకొనేది ఉంటే తీసుకుంటారు. ఎవరిది ఎవరు ఇవ్వవలసి ఉంటే ఇచ్చేస్తారు. మరి నేనీ పనిని ఎందుకు చేస్తాను? ఈ సాలెగూటిని ఎందుకు నిర్మించానా అని ఆలోచిస్తుంటాను. కానీ నేను సాలెగూటిని నిర్మించలేదు. సంత్‌మతం, ఆధ్యాత్మికాల వాస్తవాల్ని విప్పి చెప్పాలని వచ్చాను. వీటిలోని మూలాంశాన్ని అర్థం చేసుకొని మోసాల నుండి తప్పించుకుని రక్షణ పొందగోరే వారి కోసం లోకంలో ఫకీర్ శరీరంలోకి వచ్చాను. తప్పించుకోదలచుకోకుంటే నేనేం చేయగలను? ఎవరైనా ఏం చేస్తారు? నేను పనిచేస్తున్న అభిప్రాయం, అసలు ఉద్దేశం ఇదే! నేను ఎవరు అంతరంలోకీ వెళ్ళనని నాకు తెలుసు. ఇప్పుడు నేనేం చేస్తాను? మనసును విడిచి పైకి వెళ్ళి పోతుంటాను. సత్సంగీయు లందరూ నాకు శత్రువులనిపిస్తుంటుంది. మీ రేడియేషన్ నాపై ప్రభావం చూపుతుంది. దీనినుండి తప్పించుకోవడానికి నా వద్ద ఒక్కటే ఉపాయం ఉంది. నేను మీ ఎవరినీ నా స్వప్రయోజనం కోసం ప్రేమించను. మిమ్మల్నే అనేమిటి? నా కొడుకును, కోడలిని కూడా ప్రేమించను. భార్యను కూడా ప్రేమించను. ఎందుకంటే ఆకర్షణ సిద్ధాంతం పని చేస్తుంది. అందుకే నేనెవర్నీ ప్రేమించను. కానీ నేను యిప్పుడు చేరుకున్న చోట ఆకర్షణ సూత్రం కూడా లేదు. అందుకే సంతులు చెబుతుంటారు. "ఓ మానవా! నీ వుండే ప్రపంచం ఇలాగే ఉంటుంది. దీని నుండి నీవు రక్షణ పొందాలంటే, తప్పించుకోవాలంటే నీవు మనసు నుండి పైకి వెళ్ళిపో చాలు". ఈ ప్రపంచంలో మనిషి ఎంతగా ప్రయత్నించినా కోరుకున్నా ఈ రేడియేషన్ నియమం నుండి తప్పించుకొని ఎక్కడకి పోగలడు? ఈ ప్రపంచానికి దయలేదు. ఇది దయలేని ప్రపంచం. అందుకే జననమరణాల చక్రం నుండి శాశ్వతంగా బయటపడాలని సంతులు ప్రయత్నిస్తుంటారు. ఈ జనన మరణాలనుండి తప్పించుకునే పద్ధతి ఏమిటి? నా అనుభవంలోకి వచ్చిన సైన్స్ నిరూపణలే చెబుతుంటాను. డాక్టర్లు మృత్యుముఖంలో ఉన్న వారిని సున్నితపు త్రాసుపై ఉంచారు. వారు చనిపోయాక మళ్ళీ తూచినప్పుడు వారి బరువు తగ్గిపోయింది. కొందరు ఐదు గ్రాములు, మరికొందరు ఏడుగ్రాములు, ఇంకొందరు పదిగ్రాముల బరువు తగ్గారు. బరువు ఉన్న వస్తువు అతన్ని భూమివైపు ఆకర్షించటం సహజం. భూమ్యాకర్షణ నుండి వారు తప్పించుకోలేరు. ఏదైనా భౌతిక పదార్థంతో ప్రేమ గలిగిన వారి ఆత్మ బరువవుతుంది. అందుకే

భూమి వారి ఆత్మను లాగుతుంది. వీరు జనన మరణాల నుండి - రాకపోకల నుండి తప్పించుకోలేరు. ఏం చెప్పాను నేను? మీరు నన్ను శరీరమని అనుకుంటారు. నా దేహాన్ని పూజిస్తారు. ప్రస్తుతకాలపు గురుయిజం పాఖండియిజం అనవచ్చు. "నామం తీసుకో తమ్ముడూ! ఉపదేశం తీసుకో మరణ సమయంలో గురువు వచ్చి నిన్ను సత్ లోకానికి తీసుకువెళ్తాడు" అని చెబుతుంటారు. నీ ఎదుటికి వచ్చే దేహధారి గురువు నిన్ను సత్ లోకానికి తీసుకువెళ్ళజాలడు. హాఁ! మంచి జన్మ లభిస్తుంది. మంచి భావనలు లభిస్తాయి. మంచిమనుషులు లభిస్తారు. ఎందుకంటే ప్రస్తుతం ఆధ్యాత్మలో చాలా మోసం, కపటాలున్నాయి. సత్యాన్ని విప్పి చెప్పాలని నాపైన ఒక బాధ్యత ఉంది. ఆ అజాయబ్ పురుషుడు ఎక్కడుంటాడో నాకు తెలిసిపోయింది. ఆయన మనసుకు అతీతంగా ఉంటాడు. నాకీ అనుభవం మీ సత్సంగీయుల వలన కలిగింది. గనుక ఈ చివరి రోజుల్లో నన్ను గురువుగా నమ్మే నా ప్రియమైన సత్సంగీయులారా! నేను అబద్ధం చెబితే కుష్టురానీ! నేను మిమ్మల్ని నా గురువులుగా భావించి మీ చరణ కమలాలకు నమస్కరిస్తున్నాను. ఎందుకంటే మీ వలన నాకీ జ్ఞానం కలిగింది. ఆ వస్తువు కోసం జీవితాంతం తపించాను, వేలాది రూపాయల్లను నా గురు సేవలో కానుక చేశాను, హారతులిచ్చాను, పన్నెండు సంవత్సరాలు సంపాదించిన దంతా అక్కడికి పంపించాను. కానీ ఆ సమస్య తీరలేదు. అందుకే దాతాదయాల్‌జీ మహారాజ్ నాకు ఈ పని అప్పగించి, "ఫకీర్‌చంద్! నీకు సత్యమైన సతగురువు సత్సంగీయుల రూపంలో లభిస్తాడు" అన్నాడు. మీ అనుభవం వలన నా కళ్ళు తెరుచుకున్నాయి. నేనీ పని వల్లన సుఖంగా లేను. మీకు పూర్తిగా సత్యమైన మాట చెబుతాను కానీ,

**కర్మ ప్రధాన్ విశ్వకర్ రాఖా । జో జస్ కీన్హ సు తస్ ఫల్ చాఖా ॥**

నా అనుభవం చెప్పి పోతానని శపథం చేశాను. దాతాదయాల్‌జీ మహారాజ్‌ను భగవంతుడని విశ్వసించాను. కనుక ఆయన ఆజ్ఞను పాటించవలసిన బాధ్యత నాకు ఉంది. "ఫకీర్! శరీరాన్ని త్యజించడానికి ముందు శిక్షణను మార్చు"మని ఆయన చెప్పారు. కనుక వివశుడనై ఆ పని నెరవేరుస్తున్నాను.

మీరు వస్తుంటారు. నేను చెప్పే చోటికి మీరు వెళ్ళజాలరు. అక్కడికి వెళ్ళటం మన వశంలో లేదు. జన్మ జన్మాంతరాల కర్మ సంస్కారాలుంటాయి. ఎంతో అదృష్టవంతుడు అక్కడికి వెళ్తాడు. హుజూర్ సావన్‌సింగ్‌జీ మహారాజ్

"ఎంతో అదృష్టం వుంటే సత్సంగం లభిస్తుంది. ఇంకెంతో అదృష్టముంటే సత్సంగంలోని విషయాలు అర్థమవుతాయి. ఇంకెంతో అదృష్టం ఉంటేనే వాటిని అతడు ఆచరిస్తాడు" అనే వారు. మీ వంటి గృహస్థుల కోసం నేను "ఇన్సాన్ బనో" "మనిషివి కమ్మనే" పిలుపునిచ్చాను. ఏ పని చేసినా వివేకంతో చేయి.

**"గురుపశు నరపశు వేదపశు త్రియా పశు సంసార్ ।**
**మానుష్ వాకో జానియే జాహి వివేక విచార్ " ॥**

ఆలోచించి అర్థం చేసుకుని పనిచేయి. ఏం చెప్పదలచుకుంటున్నాను? సంతానాన్ని సంతానం దృష్టితో కనండి. ప్రస్తుతం మనం అయాచిత సంతానాన్ని కంటున్నాం. ఆ అయాచిత సంతానం నీకు సేవ చేయాలని, నీ ఆజ్ఞను పాటించాలనీ ఆశిస్తావు. ఇదెలా వీలవుతుంది? నిన్న నా దగ్గరికి ఒక మనిషి ఏడుస్తూ వచ్చాడు. "పిల్లవాణ్ణి పెంచాను - చదువు చెప్పించాను. పెళ్ళి చేశాను. ఇప్పుడు వాడు మాతో పోట్లాడి వేరుగా ఉంటున్నాడు" అని వాపోయాడు. నేనా మనిషిని అడుగుతున్నాను. అతడు పిల్లవాణ్ణి పిల్లవాడు కావాలనే ఊహతోనే కన్నాడా? తన విషయభోగాల కోసం స్త్రీ దగ్గరికి వెళ్ళాడు. పిల్లవాడు గర్భంలోకి వచ్చాడు. ఇక పిల్లవాడు తన మాట వినాలని ఆశించటం వృధాయే. నేనివ్వదలచుకున్న వివేకం ఇదే! నీ ఊహలో, ఆలోచనా విచారంలో చాలా బలం వుంది. దీనికి ఉదాహరణ మీకు చెబుతాను - నేను మీ చేత గీత చదివించను. రామాయణం చదవమనను. ఇంజీల్ చదివించను. అసలు విషయం సూటిగా చెబుతాను. రాత్రికి నీవు పడుకుంటావు. కలలో ఎవరిపైనైనా కోపగించుకుంటావు. పిడికిలితో గుద్దుతావు. నీ చేయి కదులుతుంది. భయపెట్టే కలచూసి కంగారుగా కలవరిస్తుంటావు. నాలుక కదులుతుంది. స్వప్నంలో ఊహాసుందరిని ఏర్పర్చుకుంటావు. నీ వీర్యపాతమవుతుంది. స్వప్నంలోని విచారం నీ వశంలో లేదు. స్వప్నంలోని ఊహయే నీ శరీరంపై ప్రభావం చూపుతుండగా జాగ్రదవస్థలో అనగా మేల్కొని ఉండగా మనం కొందరిని ద్వేషిస్తాం, వ్యతిరేకిస్తాం, కొందరితో పోట్లాడుతాం, మరొకరి గురించి చెడుగా ఆలోచిస్తాం. మరి దాని ప్రభావం మన శరీరంపై పడదా? తప్పకుండా పడుతుంది. ఇది ఆలోచించాల్సిన విషయం. ఇందులో హిందువనిగానీ, ముస్లిం అనిగానీ, క్రైస్తవుడనిగానీ తేడా లేదు. ఇందులో మానవత్వం, ప్రకృతి నియమాల అంశమే ఉంది. మనిషి ఎవరు? వివేక విచారాలతో పని తీసుకునేవాడు. నేను అనుకున్న అర్థం

చేసుకున్న, నమ్మిన, వివేక విచారాలు నా కర్మ వశాన చెబుతాను, "ఓదాతా! నా మెదడు పాడయిందా? తెలియదు. శిక్షణను మార్చుమని మీరు చెప్పారు నాకు అర్థమైన, బోధపడిన విషయాన్నే చెబుతుంటాను. మంచిదా, చెడుదా అనేది నాకు తెలియదు". నేను మీకు సాక్ష్యం చూపాను. నియమాన్ని అనుసరించి ఒక వివేకం ఏమిటంటే నీ ఊహలో, ఆలోచనా విచారాలలో శక్తి ఉంది. మీరు ఇళ్ళల్లో ఉంటారు. ఎవరి గురించీ చెడుగా ఆలోచించకండి. అహితం కోరకండి. ఇవాళ కొడుకు తండ్రిని వ్యతిరేకిస్తాడు. భార్య భర్తను వ్యతిరేకిస్తుంది. అన్నదమ్ములు శత్రువులుగా మారతారు. ఫలితం ఏమవుతుంది? ఐక్యత లేకుండా నీ దేశం నీ ఇల్లు సుఖంగా ఉండాలనుకుంటావు? ఉంటుందా? ఉండదు.

ఇబ్త్ దాయే ఇశ్క్ హై రోతా హై క్యా । ఆగే - ఆగే దేఖియే హోతా హై క్యా ॥

మన భావాలు, ఊహలు, ఆలోచనా విచారాల ఫలితం ఏమవుతుందో చెప్పను గానీ వాటి ప్రభావం మన శరీరంపై పడుతుంది. పడుతుంది. పడుతుంది. ఎవరూ ఆపలేరు. ఏ రాజకీయ పార్టీ పదవిలోకి వచ్చినా మనను కష్టాల నుండి తప్పించజాలదు. ఎందుకంటే ఇది ప్రకృతి లీల ఈశ్వర లీల. విచారశక్తి లీల. రాజకీయ పార్టీలవారు అసహ్యం పెంచుకొంటారు. మనం ఇళ్ళలో ఏమేం చేస్తున్నాం? రోజూ పోట్లాటలు జరుగుతుంటాయి. పరస్పరం శీతయుద్ధం జరుగుతుంటుంది. ఇకనీవు సుఖంగా ఉండాలని ఆశిస్తే అది పొరపాటు. నా పైన ఒక బాధ్యత ఉంది చెప్పేశాను. మరొక మాట చెప్పదలచుకుంటున్నాను. యుక్తవయస్కులైన యువతీ,యువకులు సమయాని కంటే ముందే తమ బ్రహ్మచర్యాన్ని కోల్పోతారు. మురికి విషయాలు ఆలోచిస్తుంటారు. వీరి లోపల శారీరక లేదా మెదడుకి సంబంధించిన రోగాలు, సమస్యలు రావటం సహజం. ఎవరూ వీరిని రక్షించజాలరు. అందుకే నేను శిక్షణను మార్చాను. మంచి సంతానాన్ని కనండి. ఇళ్ళలో శాంతిని నెలకొల్పండి. మీ మానసిక, శారీరక బ్రహ్మచర్యాన్ని రక్షించుకొనండి. కనీసం మీరు పరిపక్వతను ప్రాప్తించుకొనే వరకైనా పాటించండి.

మూడవ అంశం మనిషి మనసు బలహీనంగా ఉంది. సంకల్ప శక్తిని పెంచుకునేటందుకు స్మరణ, ధ్యానం చేయండి. రాధాస్వామి నామ స్మరణనే చేయమని నేను చెప్పను. ఫలానా మతానికి సంబంధించిన ఇష్టునే ధ్యానించమని

చెప్పను. మనసును ఒకచోట నిలిపి, ఏకత్రితం చేసే ప్రయత్నం చేయి. ఇదిగో నేను చూపిస్తున్నా ఈ భ్రూమధ్యం లేదా తీస్రాతిల్ స్థానంలో, రెండుకనుబొమల మధ్య మనసు నిలపండి. రామ రామ అనైనా జపించు, అల్లాహ అనైనా జపించు, వాహెగురు అనైనా జపించు, ఒకటి, రెండు, మూడు, నాలుగు అంటూ అంకెలనైనా జపిస్తూ చేయి. నీ లక్ష్యంమనసు ఏకత్రితం కావాలి అంతే! ఎవరి మనసు ఏకాగ్రం అవుతుందో వారి ఇచ్ఛాశక్తి బాగా ఉంటుంది. వారి పనులు నెరవేరుతాయి. ఒక విషయం నేను చెప్పదలచుకుంటున్నాను. శిక్షణను మార్చే బాధ్యత నాపైన ఉంది. నేనే మతాన్నీ ప్రచారం చేసే ప్రచారకుణ్ణికాదు.

నేను హిందువును కాను, ముసల్మానును కాను. రాధాస్వామీయుణ్ణికాను. సిక్కును కాను. క్రైస్తవుణ్ణి కాను. మీలాగే నేనూ ఒక మనిషినే! మీలాగేనేనూ! బంధనాలన్నీ తెగిపోయాయి. దాతా ఎంతో దయ చూపాడు. మానవత్వం యొక్క నియమాన్ని నేను మీకు చెప్పాను. ఎందుకంటే మనస్సు మహా బలవంతమైనది. చంచలమైనది. దీనిని అదుపుచేయడం సులభం కాదు. అందుకే దీని చికిత్స ఒక్కటే. సత్యమైన సత్సంగం లభించాలి. రెండవ అంశం స్మరణ చేయండి. రాధాస్వామి అని జపించు అనో, పాంచ్‌నామ్‌ను జపించమనో చెప్పను. ఎవరైనా అడిగితే రాధాస్వామి అని చెబుతాను. నేను గురువును కావాలని నేనేనాడూ అనుకోలేదు. ఎవరినీ నా శిష్యులుగా కూడా చేసుకోలేదు. మీరు ప్రతిరోజూ నియమంగా 25 నిమిషాలు, అరగంట ఈ భ్రూమధ్య స్థానంపై ఉదయం, సాయంత్రం ధ్యానం చేయండి. మీ జీవితం మారిపోతుంది.

మూడవ విషయం. మనది సరైన సంపాదన అంటే కష్టించి సంపాదించిన న్యాయమైన సంపాదన కావాలి. కపటంతో తిమ్మిని బమ్మిని చేస్తుంటారు. మోసాలు చేస్తుంటారు. అన్యాయం చేస్తుంటారు. మన సంపాదన ఎలాంటిదైతే అలాంటి ప్రభావం మనసుపైన పడుతుంది. కొన్ని ముఖ్యమైన మాటలు మీకు చెప్పాను. నిన్న సాయంత్రం "ప్రేమ" గురించిన సత్సంగం జరిగింది. ఈ రోజు అధికంగా చెప్పలేకపోతున్నాను. టేప్‌రికార్డులున్నాయి. మనసు గురించి ఒక గంట సేపు సత్సంగం జరిగింది. ఇంకా ఎక్కువగా చెప్పలేక పోతున్నాను. మీరొస్తారు "దాతా! మీరు దయ చూపారు. నేను మీ నుండి పొందినదంతా లోకానికి ఇచ్చేశాను. ఇక నా వద్ద ఏమీ లేదు. మీరిచ్చిన సంస్కారాలు, మీరిచ్చిన పని పూర్తి చేశాను. మంచి చేశానో, చెడు చేశానో నాకు తెలియదు. జీవితం

చరమాంకం పైన ఉంది. ఓ భగవంతుడా! ప్రపంచాన్ని మరిచిపోయేలా, లోకాన్ని మరిచిపోయేలా నీ చరణ కమలాలలో నివాసం ఇవ్వు. మీ దయ. మీరు దాతా రూపంలో ఇచ్చిన ఆజ్ఞను నిర్వహించాను. క్షమను కోరుతున్నాను."

"అందరికీ శాంతి"

# నవ వివాహితులకు ఉపదేశం

## పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

### మానవతా మందిరం, హోషియార్‌పూర్

### సత్సంగం

### తేది 1-5-1968

రిటైర్డ్ రైల్వే ఆఫీసర్ మామ్‌చంద్‌శర్మగారి సుపుత్రుడు సంతోష్‌కుమార్ ఐ.ఏ.ఆర్.ఎస్‌తో లూథియానాకు చెందిన పండిత్ బల్దేదత్తా శర్మ వైద్యగారి సుపుత్రిక ఇందిర ఎం.ఏ., వివాహం జరిగింది. ఆ నవ దంపతులిద్దరూ పరమదయాల్ మహారాజ్ సత్సంగానికి వచ్చారు. వారిని ఉద్దేశించి గృహస్థ, పతివ్రతాధర్మాలపై మహారాజ్ గారు వారికి ప్రత్యేక సందేశాన్నిచ్చారు.

వందనమ్ సత్ జ్ఞాన్ దాతా, వందనం సత్ జ్ఞానమయ్ ।
వందనం నిర్వాణ రాతా, వందనం నిర్వాణ మయ్ ॥

భక్తి ముక్తి యోగ యుక్తీ, ఆప్‌కే ఆధీన సబ్ ।
ఆప్‌హీ హై సింధు సద్గతి, జీవ జంతూ మీన సబ్ ॥

ఆప్ గురు సతగురు దయా అవుర్, ప్రేమకే భండార్ హై ।
ఆప్ కర్తా ధర్తా హై, కర్తార్ జగదా ధార్ హై ॥

రిద్ధి సిద్ధి శక్తి నవనిధి, హై చరణ్ మే ఆప్ కే ।
బచ్ గయా భవ దుఃఖ్ సే జో, ఆయా శరణ మే ఆపకే ॥

భక్తి దీజే నామకీ, సత్ నామమే విశ్రామ్ దే ।
రాధాస్వామీ అప్నా కీజే, రాధాస్వామి ధామ్ దే ॥

దీని తరువాత సత్సంగం ప్రారంభమైంది. ఈ కింది శబ్దం చదవటం జరిగింది.

పత్నీ పతివ్రత ధర్మ నిబాహా ॥

అప్నే పతికీ ప్యారనీ, జగ్ కీ ప్యారీ హోయ్ ।
జో పతికీ ప్యారీ నహీం, దుఃఖ గ్రస్త రహే సోయ్ ॥

పత్నీ తో పతికీ బనీ, అవుర్ కా హియే మే ధ్యాన్ ।
తాకో ఇస్ సంసార్ మే, జీవన్ నరక్ నిదాన్ ॥

పతి బల్ అబలా బలీ హో, పతి సుఖ్ సే సుఖ్ రూప్ ।
ప్రేమ పతి కా చిత్త్ బసే, క్యాం పడే దుఃఖ్ కే కూప్ ॥

ఏక్ తత్వ కే రూప్ దో, పతి పత్నీ కే భావ్ ।
మిల్ జుల్ ఖేలేం జగత్ మే, ప్రేమ ప్రతీతి ప్రభావ్ ॥

ప్రీతమ పతి కా అంగ్ హై, ప్రేమీ పత్నీ భేస్ ।
అంతర్ బాహర్ ప్రేమ రంగ్, ప్యార్ ప్రీతి కే దేస్ ॥

పతివ్రతా కే ఏక్ హై, కుటిలా కే దో చార్ ।
కుటిలా నరకీ జీవ్ హై, పతివ్రతా వరనార్ ॥

సంత్ పంథ్ మే ఆయ్ కర్, చల్ తూ ప్రీతి కీ రాహ్ ।
ప్రేమ కీ దృఢతా మన్ రహే, సత గురు హాథ్ నిబాహా ॥

సత్సంగం నిర్వహించే పనిని దాతాదయాల్ మహారాజ్ నా మేలు కోరే అప్పగించాడు. ఏదో ఒక వస్తువు అన్వేషణలో జీవితం గడిచింది. "నేను లేను, నీవు లేవు! గురువులేడు, శిష్యుడు లేడు, చైతన్యం లేదు. చైతన్య రాహిత్యం లేదు. ఏదీ లేని స్థానం ఒకటుంది. ఏ సంతుగానీ, మహాత్ముడుగానీ శరీరంలో ఉంటూ ప్రతిక్షణం ఆ స్థానంలో నిలువజాలడు. అది పరమానందం లేదా పరమసుఖం యొక్క స్థితి. ఇది నా అనుభవం. శరీరాన్ని త్యజించాక ఏం జరుగుతుందో నాకు తెలియదు.

మామ్‌చంద్ గారి పుత్రుడు సంతోష్‌కు ఇందిరతో పెళ్ళి జరిగి రెండు రోజులైంది. వాళ్ళిద్దరూ సత్సంగానికి వచ్చారు. ఈ రోజు పైన చదివిన శబ్ద్ వల్ల నాకెంతో ఆనందమన్పించింది. ఎందుకంటే నా సురత్, ఆత్మికధార, జీవనధార,

కూడా పత్నే! భార్యే! దాని భర్త భగవంతుడు 'శబ్దం'. శబ్దాన్ని కలుసుకున్న తరువాతే ఆ పరమసుఖం, పరమానందం లభిస్తుంది. దీనిని పైన వివరించాను. ఇక్కడ ఏకత్వం తప్ప మరేదీ కాదు,

నేను జ్ఞానం, యోగం, ఆలోచన కర్మల క్రమంలో చాలా ఉరుకులు పరుగులు పెట్టాను. ఎంతలా పరుగెత్తి, అన్వేషించానో అంతగా శాంతికి దూరమయ్యాను.

అరే దీవానే క్యా ఖోజ్ కర్‌తా హై ।
ఖోజత్ ఖోజత్ ఖోగయా, పాయా నహీం అంతా ।
విర్థా నికలీ ఖోజ్, ఖోజ్ సే కుఛ్ నహీం బన్‌తా ॥

నా జీవన సారాంశం ఈ శబ్ద్‌లో ఉంది.

మరి సుఖం ఎక్కడుంది? జీవనం, చైతన్యం ఉన్నంత వరకు ప్రేమ, తత్పరత, ఆధారం పెంచుకోవాలనేదే ఈ ఎనభైయ్యొక్క సంవత్సరాల వయసులో అనుభవానికి వచ్చింది.

ఇక వ్యవహారిక జగత్తు గురించి చెప్పుకుంటే 'పతి' ఏమిటి? ఎవరు? 'పత్ని' ఎవరు? ఏమిటి? పత్ని, పతి అనే పదాలను లోకం ప్రాపంచిక వ్యవహారాలకోసం ప్రతిపాదించింది. ఇది స్థూల జగతి వర్ణన.

ఇప్పుడు మీకు పతి - పత్నిల రూపం చూపుతాను. కబీర్ శబ్దం జ్ఞాపకానికి వస్తోంది.

చర్‌ఖే కా సిర్‌జన్‌హార్, వఢైయా ఇక్ నా మరై ॥

బాబుల్ మేరా బ్యాహ కరాదో, అన్‌జాయా బర్ లాయ్ ।
అన్‌జాయా బర్ నా మిలే తో, తోహి సే మేరా బ్యాహ ॥

హరే హరే బాంస్ కటా మోరే బాబుల్, పావన్ మడవా ఛాయ్ ।
సురతి నిరతికో భాంవరి డారో, జ్ఞాన్ కీ గాంఠ్ లగాయ్ ॥

సాస్ మరే ననదీ మరే రే లహురా దేవర్ మర్‌జాయ్ ।
ఏక్ బఢైయా నా మరే, చరఖే కా సిర్‌జన్ హార్ ॥

కహ కబీర్ సునోభాయి సాధో చరఖా లఖో న జాయ్ ।
యా చరఖే కో జో లఖేరే, అవా గవన్ ఛుటి జాయ్ ॥

ఈ శబ్దంలో కబీర్ ఏం చెబుతున్నాడు?

తన సురత్ చెప్పినట్లు చెబుతున్నాడు. ఆయన మాటల్లో ఇలా ఉంది. "నా సురత్ (ఆత్మికధార) సర్వాధారుడైన భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉంది.

**ఏక తత్వకే రూప్ దో పతి పత్నీ కే భావ్ ।**
**మిల్‌జుల్ ఖేలే( జగత్ మే, పాయ్ ప్రతీత్ ప్రభావ్ ॥**

తత్వం ఒక్కటే! దానివి రెండు భాగాలు. శబ్ద రూపం ప్రగటం అయినపుడు దానితోపాటే శబ్దంలో చేతనత్వం వస్తుంది. దాని పేరు సురత్. అక్కడ వారు పతిపత్నులవుతారు. లేదా పితాపుత్రిలవుతారు. వస్తువు ఒకటే. దాని నుండి రెండు ధారలు వెలువడ్డాయి. ఒకటి నుండి రెండు అవుతాయి. సురత్ శబ్దం నుండి వెలువడింది. దానిని తండ్రి అంటుంది లేదా పతి అనైనా అంటుంది.

గురునానక్ సాహెబ్ తరువాత గురువులైన వారంతా తమను తాము మహిళలమనే చెప్పుకున్నారు. ఇప్పుడైతే అదొక మొహల్లాగా ఏర్పడింది. అసలు విషయమేమిటంటే గురునానక్ సాహబ్ సురత్‌ను స్త్రీ రూపంగా చెప్పేవారు. ఆయన ఉత్తరాధికారి కూడా తనను తాను స్త్రీ రూపంగా అంగీకరించేవాడు. ఉదా:- మొదటి మహిళ వాక్కు, రెండవ మహిళ వాక్కు అని ఈ దృష్టితో ఆయన 'వాణి'లో రాశారు. ఈ విషయం ఆధ్యాత్మికమైనది. అయితే భార్యాభర్తలెవరు? ఒక వస్తువులోని రెండు భాగాలు. వాళ్ళు రమిస్తారు. దీనిని మనం కేవలం కామానికి సంబంధించిన అంశంగానే భావిస్తాం. ఇది అన్నిటికంటే అథమస్థాయికి చెందుతుంది. మనసు రమించటం, ఆత్మ రమించటం గురించి ఆలోచించారా? తన వృత్తి, చిత్త ప్రవృత్తి వెంటబడి రమించటంలో జీవన ఆనందం, పోరాటం కూడా ఉంది.

ఇతి పతిపత్నుల రూపం. దీనిని ఏ విధంగానైనా అర్థం చేసుకో.

ఇక కబీర్ శబ్ద్‌లోని 'చరఖా' ఏమిటి?

**చర్‌ఖే కా సిర్ జన్ హార్, బఢైయా, ఇక్ న మరే ।**
**బాబుల్ మేరా బ్యాహ కరాదే, అన్ జాయా వర్ లాయా ।**
**అన్‌జాయా వర్ నా మిలే, తో తొహిసే మేరా బ్యాహ ॥**

భగవంతుణ్ణి భగవంతుడని, పరమాత్ముడని, పరమతత్వాధారుడని అంటాం. నన్ను పుట్టించిన భగవంతుడా! ఆధారుడా! నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. పెళ్ళికి అర్థం సంతోషం, ఆనందం! నిశ్చింత, సహకారం. అనగా

సురత్ పెళ్ళి చేసుకుని ఆనందంగా, నిశ్చింతగా ఉండడానికి సహాయ సహకారాలు కోరుతోంది. "ఎప్పుడూ జన్మించని వరుణ్ణి అన్వేషించు" అనగా జనన మరణాలు లేని, అవినాశి అయిన వరుణ్ణి తనకోసం వెదకమంటున్నది సురత్. ఇలాంటి వరుడు దొరకకుంటే నేను నిన్నే పెళ్ళి చేసుకుంటాను" అని అంటున్నది.

మరి పతి ఎవరు? పత్ని ఎవరు? అది ఒక తత్వం లేదా ఒక వస్తువు. దానివి రెండు ధారలు. ఒకటి ధనాత్మకం. రెండవది ఋణాత్మకం. రెండింటి కలయిక జరగడం అనగా సురత్ సదా ఆనందంలో ఉండటం శబ్దంలో లయ మవటం. పెళ్లి వలన ఆధారం, సహాయం లభిస్తుంది. స్త్రీలు భర్తను ప్రాణనాథుడని అనటం వింటుంటాం. ప్రాణనాథుడు అంటే ప్రాణాలకు నాథుడని అర్థం.

**"హరే హరే బాఁస్ కటా మోరే బాబుల్, పానన్ మడ్వా ఛాయ్ ।**
**సురత్ నిరతి కీ భాఁవర్ డారో, జ్ఞాన్ కీ గాఠ్ లగాయ్" ॥**

ఇది ఆధ్యాత్మిక వివాహం. సురత్ పెళ్ళి శబ్దంతో జరగాలి. హరే హరే బాఁస్ అంటే ప్రేమతో కూడిన జీవనం కావాలి. అనగా చిత్తం ఆనందంతో ఉండాలి. కాని ఈ ప్రేమలో బుద్ధి, జ్ఞానం, వివేకాలు ఉండాలి. అవివేకంతో కూడిన భక్తి, అజ్ఞానంతో కూడిన భక్తి ఆత్మిక జగత్తులో హానినే కలిగిస్తుంది. అజ్ఞాని, అర్థం చేసుకోని స్త్రీ పతి పరాయణురాలే అయినా దుఃఖ కారణమవు తుంటుంది. ఉదాహరణకు భర్త ఇంట్లోకి వచ్చాక ప్రేమవల్ల అతడు ఏదో ఒక విషయాన్ని, రహస్యాన్ని భార్యకు చెబుతాడనుకుందాం. ఆమె తెలివైనది కాదు గనుక ఆ రహస్యాన్ని ఇతరులకు చెప్పింది. ఆమెలో కల్మషం లేదు. మనస్ఫూర్తిగానే భర్తను ప్రేమిస్తుంది. కానీ ఆమె తెలివితక్కువతనం, అర్థం చేసుకోలేని గుణం హానిని కలిగించింది. పురుషుడు తన భార్యకు సంబంధించిన మాటలను ఇతరుల ఎదుట ప్రస్తావించరాదు. భర్తకు సంబంధించిన విషయాలను భార్య పరుల ఎదుట ప్రస్తావించరాదు. ఇదే గురువు.

జ్ఞాపకానికొస్తే నవ్వొస్తుంది. నా మొదటి పెళ్ళి జరిగినపుడు నాది చిన్న వయసు. ఊళ్లోని జాతరకు వెళ్లాను. భార్య కోసం ఏమైనా తీసుకువెళ్ళాలన్పించటం సహజం. శ్రీమంతులైతే భార్యకోసం చీరలో, నగలో కొంటారు. మేం పేదవాళ్ళం. అప్పట్లో నాకింకా ఉద్యోగం కూడా దొరకలేదు. మా అమ్మనడిగి అర్థరూపాయి తీసుకుని వెళ్ళాను. పావలా జిలేబీలు కొన్నా. మరో పావలాతో ఇంకేవో కొన్నాను. వాటిని తెచ్చి నా భార్య కిచ్చాను. ఆమె తన స్నేహితురాళ్ళకు చెప్పింది. ఆ సంగతి మా అమ్మ, తమ్ముడు, పెద్దమ్మలకు కూడా తెలిసింది.

వాళ్ళు నన్ను ఊళ్ళో అపఖ్యాతి పాలు చేశారు. నాకు బాధనిపించింది. విషయం సాధారణమైనదే! కానీ ఎంత దుఃఖం కలిగింది? అందుకే ఒక విషయం చెబుతాను. సంతోష్! జీవనం ఎలా గడపాలో వివరిస్తాను. పాఠం బోధిస్తాను.

**సాస్ మరే ననదీ మరీ, తాహరా దేవర్ మర్జాయ్ ।**
**ఏక్ బఢైయా న మరే, చర్ఖే కా సిర్ జన్ హార్ ॥**

ఆధ్యాత్మిక జగత్తులో అత్త = మాయ, ఆడపడుచు = బుద్ధి. మరిది = మనసు. మనిషి సురత్ - ఆత్మికధార శబ్దాన్ని విన్నప్పుడు ఈ మాయ, సంకల్ప వికల్పాలు, మనసు, బుద్ధి సమాప్తం కావు. సురత్ శబ్దం యొక్క ఆనందం లేదా రసం పొందజాలదు. ఇది సాధన విషయం. ఇదే విధంగా బాహ్య జగత్తులో భార్యాభర్తలు తమకు సంబంధించిన విషయాలను అత్త, ఆడపడచు, మరిది మున్నగు వారి వద్ద దాచి ఉంచకపోతే శాంతి, ఆనందం, గృహస్థసౌఖ్యం దొరకదు. రహస్యాన్ని దాచక అందరికీ గుట్టు విప్పి చెప్పుకుంటే ఆడపడుచు, వదిన, మరిది, అత్తాకోడళ్ళ మధ్య కలహాలు జరుగుతూనే ఉంటాయి.

ఆధ్యాత్మిక జగత్తులో సురత్ తన పతి శబ్దం నుండి అనగా శబ్ద బ్రహ్మ లేదా శబ్ద గురువు నుండి ఉన్నత స్థితిలో ఏ ఆనందాన్ని, ఏ సహాయాన్ని, ఏ సౌభాగ్యాన్ని పొందుతుందో దాని ముద్రే మనస్సుపై పడుతుంది. మనసులో ఏం జరుగుతుంది? సురత్ కేవలం శబ్దాన్ని వింటుంది. ప్రకాశాన్ని చూస్తుంది. దీని ముద్ర, ఛాయ మనసు పైకి వచ్చినప్పుడు మనసు యొక్క ధార శిష్యుని ఎదుట గురువు రూపాన్ని పెడుతుంది. శిష్యుడు గురువు రూపాన్ని ప్రేమిస్తాడు. భక్తుడు తన భగవంతుని స్వరూపాన్ని తన ఎదుట పెట్టుకుని ఆనందం పొందుతాడు. అదే విధంగా స్త్రీ తన పతి ముఖాన్ని చూసి ప్రసన్నురాలవుతుంది. ప్రేమ పెంచుకుంటుంది. ఏ సుఖాన్ని, సంతోషాన్ని భక్తుడు తన భగవంతుని దర్శనం చేసుకోవటం వలన, సేవించటం వలన, ప్రేమించటం వలన పొందుతాడో అదే సుఖసంతోషాలు పతివ్రత స్త్రీ తన భర్త దర్శనం, ప్రేమ, సేవల వలన పొందుతుంది. భక్తునికీ భగవంతునికి మధ్యగల ప్రేమకు, పతివ్రత ప్రేమకు మధ్య గల ఆహ్లాదంలో భేదమేమీ లేదని నేను భావిస్తాను. కేవలం స్థూల, సూక్ష్మముల తేడా ఉందంతే! భక్తుడు భగవంతుని సేవచేస్తాడు. పూజ చేస్తాడు. అతని మనసులో తన శారీరక అవసరాలు పూర్తి చేసుకోవాలనే కోరిక, సంస్కారాలు మిగిలి ఉంటాయి. పతివ్రత స్త్రీ కూడా సత్యమైన భావనతో

భర్తను సేవిస్తుంది. దర్శనం చేసుకుంటుంది. ఆమెకు అవసరమైన తిండి, గుడ్డ మొదలైనవి పతినుండి ఆశిస్తుంది. సత్యమైన భక్తుడు తన ఇష్ట దైవాన్ని తన విశ్వాసం మేరకే ఏర్పర్చుకుంటాడు. ఉదాహరణకు కొందరు రాముణ్ణి ఇష్టునిగా చేసుకుంటే మరికొందరు కృష్ణుణ్ణే విశ్వసిస్తారు. నమ్మిన భక్తుల ప్రాపంచిక జీవనానికి భగవంతుడు సహాయపడతాడు. నరసీ భక్తుడు, ద్రౌపది మొదలైన వారిని ఆపదలలో వారివారి ఇష్టదైవమే ఆదుకున్నాడు. పతివ్రతా స్త్రీల ప్రాపంచిక జీవన అవసరాలను వారి భర్తల రూపంలో భగవంతుడు పూర్తి చేయిస్తుంటాడు. అందుకే దాతా దయాల్ ఈ శబ్దలో రెండు రకాల భావాల్నీ ఇమిడ్చాడు.

ప్రాపంచికమైనదీ, ఆధ్యాత్మికమైనదీ!

ఇందిర, సంతోష్! మామ్‌చంద్ కారణంగా మీరు నా దగ్గరకు వచ్చారు. నేను ఉన్నత స్థితికి వెళ్ళి పోయాను. మీరు ఈ శిక్షణను ప్రాప్తింపచేసుకొనండి. మీ జీవనం ప్రేమమయం చేసుకొనండి. నియమ పూర్వకంగా ఉండండి.

*చివరి చరణం:*
**సంత్ పంథ్ మే ఆయ్‌కర్, చల్ తూ ప్రీతి కీ రాహ ।**
**ప్రేమ కీ దృఢతా మన్ రహే, సతగురు హోథ్ నివాహ ॥**

ఎవరితో నైనా స్నేహం చేస్తే ముందుగా వారి స్వభావాల్ని, అలవాట్లని, వారి ఆలోచనా విచారాలను, వారి చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. ప్రపంచంలో కొందరు పైకి ఒకరకంగా, లోపల మరొక రకంగా ఉంటారు. ఈ ప్రపంచం మోసకారి. అందుకే నీతో స్నేహం చేసేవారిని, నిన్ను కలుసుకునే వారిని కొద్దిమందికే పరిమితం చేసుకో. నీకు అవసరమనుకునే వారితో, పరిచయం, స్నేహం పెంచుకో. ఎక్కువ పరిచయాలు, స్నేహాలు వద్దు. ఇందిరను ఆదేశిస్తున్నాను. నీవు సమాజంలోకి వెళ్ళినా సమాజంలో స్వతంత్రంగా తిరగవద్దు. ఎల్లవేళలా గంభీరంగా ఉండాలి. గంభీరత్వం అంటే తెలుసు కదూ!

నా కూతురుంది. సుషుమ్న. చదువుకునేది. అమృతసర్‌కు వెళ్ళింది. బజార్లలో కుర్రవాళ్ళు తిరుగుతారు. దారిలో నడిచేటప్పుడు ఎవరితోనూ మాట్లాడొద్దు. నవ్వవద్దు అని ఆమెకు హితవుచెప్పాను. అనవసరంగా దారిలో ఏ స్త్రీ ఏ పురుషునితోనూ మాట్లాడొద్దు. తలెత్తి చూడకూడదు అని నా కూతురికి సూచించాను. ఇలా ప్రవర్తిస్తే నీకు ఏ కష్టమూ కలగదు అని చెప్పాను. ఆమె

నా ఆజ్ఞను పాటించింది. ఈనాటి వరకు ఏ సమస్యా ఆమెకు ఎదురవలేదు. అమ్మాయిల్లారా! వింటున్నారా? మీరు బయట తిరుగుతారు. నేను కళ్ళు మూసుకుంటాననుకోకండి. అంతా గమనిస్తుంటాను. అధిక స్వేచ్ఛ అపాయకరమవుతుంది. ఏ గురువూ, ఏ మహాత్ముడూ ఇలాంటి శిక్షణ నివ్వడు. ప్రస్తుతం ఇలాంటి బోధన అవసరమై ఉంది. ఎదురవుతున్న సమస్యలు, కలహాలకు అసలు కారణం స్వేచ్ఛా స్వతంత్ర్యాలే! అధిక స్వేచ్ఛ వినాశకరమవు తున్నది. ఇది మీకు నేనిచ్చే శిక్షణ.

**పతి బల్ అబలా బలీ హో, పతి సుఖ్ సే సుఖ్ రూప్ ।**
**ప్రేమ పతి కా చిత్ బసే, క్యోం పడే దుఃఖ్ కీ కూప్ ॥**

అబల = (అ=లేదు ; బల = శక్తి) బలహీనురాలు

నా కూతురుంది. ఆమె భర్త బి.డి.వో. భర్త స్థాయిని బట్టి భార్యకి గౌరవం ఉంటుంది. బి.డి.వో ఎక్కడికైనా వెళ్ళినప్పుడు వెంట భార్య ఉంటే ఆయనతో సమానంగా ఆమెని కూడా గౌరవిస్తారు. కుర్చీలు వేస్తారు. ఇలాగే సత్యమైన భక్తులుంటారు. వీరు భగవంతునితో బాంధవ్యం పెంచుకున్నవారు గనుక వీరికి ఆదరణ, గౌరవాలు లభిస్తుంటాయి. దొంగ భక్తులకు కూడా గౌరవాదరాలు లభిస్తుంటాయి. ఎందుకంటే కనీసం భగవంతుని ఊహతో, ఆలోచనతో కలిసిమెలిసి అతడు ఉన్నాడు. భగవంతుని పేరు వలన ఇతనికి కూడా గౌరవం లభిస్తుంది. అతడు పేదవాడైనా భగవంతునితో, ప్రియతమునితో సంబంధం కలిగి ఉన్నవాడు గనుక పెద్ద పెద్ద షావుకార్లు శ్రీమంతులు సైతం సంతులకు తలవంచి మరీ మొక్కుతుంటారు.

మీ ఇద్దరి గృహస్థ జీవనం బాగా గడవాలని నేను ఆశీర్వదిస్తున్నాను. ఈ చెవితో విని ఆ చెవితో వదిలేయవలసి వచ్చే వాతావరణం నెలకొని ఉంది. ఇతరుల మాటలను విని మనసులో పెట్టుకుంటే అశాంతి పాలవుతారు. నీ పనితోనే నీకు పని. నీవు సంతోషంగా ఎంత సహాయపడగలవో అంతే సహాయపడు. ఏ విధమైన బలవంతం లేదు. సత్సంగం నీకే ఇస్తున్నాను. అవసరాన్ని మించి నీ సోదరులకు సహాయం చేస్తే కష్టాలపాలవుతావు. ప్రతి ఒక్క జీవి తన కర్మను అనుభవిస్తాడు. చాలా వరకు సూచించాను. అర్థం చేసుకోవడం, చేసుకోకపోవడం నీపని. ఇంతే! ఇదే నా ఆశీర్వాదం.

కహే కబీర్ సునో భాయి సాధో, చరఖా లఖా న జాయ్ ।
యాచరఖే కో జో లఖేరే, ఆవాగవన్ ఛుట్ జాయ్ ॥

చర్ఖా ఏమిటి? రాట్నం! ఈ శరీరం. ఇందులో సదా మనసు పడుగును సాగదీస్తుంటుంది. దాని నుండి ఆలోచనా విచారాలు వెలువడుతుంటాయి. అవి దాని దారాలు. 'చర్ఖా' రాట్నాన్ని అర్థం చేసుకుంటే జీవితం సంతోషంగా గడుస్తుంది.

నేను ఆత్మిక జగత్తు లేదా దాని ముందరి స్థితిని వెదుకుతున్నాను. కేవలం సాధన సమయంలోనే మనిషి ఆ స్థితిలో ఉండగలడని నాఅనుభవం నిరూపిస్తోంది. జీవనం ఉన్నంత వరకు ఈ జీవన లీల తప్పదు. ఇందులో పురుషుడు మరియు ప్రకృతి; బ్రహ్మ, మాయ; స్త్రీ లేదా పురుషుడు జీవనంలోని ప్రతి ఆటలో ఉన్నారు. ఇద్దరిలో ఐక్యత, ప్రేమ లేకుంటే శారీరకంగా, మానసికంగా జీవితం సుఖంగా ఉండదు.

ఈ నియమాలతో జీవనం గడిపితే సత్పురుషుడు రాధాస్వామి దయాలుడు పరమాత్ముడు స్వయంగా నీ జరుగుబాటు చేస్తాడు. నాకు ఈ వయసులో చిత్తవృత్తి పైకి వెళ్ళిపోయింది. నేను శుభ భావనలిస్తాను. ఇందిరా! నీ సౌభాగ్యం చలించనిదై, నిత్యమైనదై, దృఢమైనదై ఉండనీ! నీ ఇంటి పేరు, గోత్రం మారింది. నీ కుటుంబం మర్యాద, గౌరవాలను, ఆచారాలను పాటించు. పేరు నిలబెట్టు. దీని వలన జీవితం సుఖంగా గడుస్తుంది. ఆధ్యాత్మికం గురించిన అంశం- ఇంకా ఇప్పుడే ఆ సమయం రాలేదు. ప్రతి పనికీ ఒక నిర్దిష్ట సమయం ఉంటుంది. నీ పెళ్ళి జరిగింది. ఎప్పుడు జరిగింది? సమయం వచ్చినప్పుడే జరిగింది గదా! రెండు సంవత్సరాలు ముందెందుకు కాలేదు? ఎందుకంటే అప్పుడు సమయం రాలేదు గనుక. అదే విధంగా ఆత్మ వైపు మరలడానికి కూడా సమయం రావాలి. సమయం వచ్చినప్పుడే జరుగుతుంది. సమయం కాకుండా, రాకుండా ఆయా కార్యాల కోసం ఆశపెంచుకోవటం చేస్తే చింతించవలసి వస్తుంది. ఈ శబ్దంలో సంకేతం ఉంది.

"అపనే పతి కే ప్యార్ నీ జగ్‌కీ ప్యార్ నీ హోయ్ ।
జో పతి కీ ప్యారీ నహీ, దుఃఖ గ్రస్త రహే సోయ్" ॥

సాంసారిక జీవనంలో పతి ప్రేమ పొందని స్త్రీని ఇతర బంధువులు,

అత్తమామలు కూడా ప్రేమించరు. అందుకే సంతోష్! ప్రస్తుతం నీ కర్తవ్యం ఏమిటి? ఇందిరను నిర్లక్ష్యం చేయకు. ఆమెకు గౌరవాదరాలు, ప్రేమను అందించు. ఆమె గురించి పట్టించుకో. ఆలోచించు. అప్పుడే బంధుమిత్రులు ఆమెను ఆదరిస్తారు. గౌరవిస్తారు. నేను వైరాగ్య దశలో ఉండే రోజుల్లో నా భార్యను పట్టించుకోలేదు. నిర్లక్ష్యం చేశాను. అప్పుడు ఇంట్లోని వారు, బంధువులు అందరూ ఆమెను బాధించేవారు. ఇది జీవనం కిటుకు. పతి ప్రేమ దొరకని స్త్రీ జీవితం అశాంతి మయమవుతుంది. సుఖం ఉండదు. ఇంట్లో శాంతి ఉండాలంటే ఆమెను కష్టపెట్టకు. ప్రస్తుతం సమాజం ఎలా ఉంది? స్త్రీకి స్త్రీగా మెదలడం చేతకాదు. భర్తకు భర్తగా బాధ్యతలు నిర్వహించటం రాదు. సోదరుడుకి సోదరుడిలా ఉండడం రాదు. తండ్రి తండ్రిలా ఉండడు. గురువుకు గురువులా ఉండటం రాదు. శిష్యునికి శిష్యునిలా నడచుకోవటం రాదు. అందుకే సత్సంగీయులకి నేను రామనామం జపించమని చెప్పను. లోపల గదిలో కూర్చోబెట్టి చెవుల్లో నామం చెప్పను. నేనిచ్చే సత్సంగ వచనాలే, నా నోటినుండి వెలువడే వాక్కులే నేనిచ్చే నామదానం. వాటిని ఆలోచించి, విచారించి, ఆచరించే వ్యక్తి సుఖంగా ఉండగలడు. ఇతరులు అలా ఉండజాలరు.

**పత్నితో పతికీ బనీ, అవుర్ కా హియే మే ధ్యాన్ ।**
**తాకో ఇస్ సంసార్ మే, జీవన్ నరక్ సమాన్ ॥**

నేను నీకు ఆదేశం, ఉపదేశం ఇస్తున్నాను. సూచిస్తున్నాను. అబ్బాయీ! నీవు ఆఫీసరువు. రకరకాల వ్యక్తులతో, వివిధ మనస్తత్వాలు గల స్నేహితులను కలుసుకోవలసి ఉంటుంది. వాళ్ళతో కలుపుగోరుగా వ్యవహరించకుంటే బాగుండదు. సంతోష్! కేవలం స్త్రీ మాయ యొక్క రూపం. యావత్ సృష్టి రచన, ఉత్పత్తి ఈ ప్రపంచంలోనూ, బ్రహ్మండం లోనూ 'మాయ' తోనే అవుతుంది. అందుకే స్త్రీ జాతి తన రూపం అర్థం చేసుకోవాలి. తెలుసుకోవాలి. ఈ జీవనంలోని ప్రతిదశలోనూ స్త్రీయే సుఖశాంతుల నివ్వగలుగుతుంది. స్త్రీ జాతి తనను తాను గౌరవించుకోవాలి. ఈ భావనతోనే నేను సత్సంగాలిచ్చాను. స్త్రీతో సంబంధం కేవలం విషయభోగాలకే పరిమితం కాదు. మాయ రూపమై కూడా ఈమె పురుషుని జీవితాన్ని అన్ని రకాలుగా సుఖవంతం చేయగలుగు తుంది. భార్యను నిరాదరించే భర్త, భర్తఅని చెప్పుకోడానికి అనర్హుడు. పురుషుడనిపించుకోడానికే అతడు అర్హుడు కాదు.

వ్యావహారిక జీవనంలో స్త్రీ పురుషులిద్దరికీ సత్యమైన బుద్ధి, జ్ఞానం వివేకాల అవసరముంది. బుద్ధిమంతులైన నవయువకులు, నా భావాన్ని అర్థం చేసుకుంటారు. వారు జీవనాన్ని, ఆనందంగా, సుఖ శాంతులలో గడపవలసి ఉంది.

చివరిగా నా హృదయపూర్వక శుభ భావనలిస్తున్నాను. మానవతా మందిరానికి వచ్చే కొత్తగా పెళ్ళయిన అన్ని జంటలు ప్రేమ, ఐకమత్యాలను తమ ధర్మంగా భావించి సాంసారిక జీవనాన్ని శాంతి పూర్వకంగా గడుపుదురుగాక!

"అందరికీ శాంతి"

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## మానవతా మందిరం, హోషియార్‌పూర్

## నూతన సంవత్సరం - సత్సంగం

## తేది 1-1-1975

ఈ రోజు కొత్త సంవత్సరం ప్రారంభమైంది. నన్ను కలుసుకునే వారికి, నా సాహిత్యం చదివేవారికి ఆరోగ్యం, ధనం, మనశ్శాంతి కలగాలని సత్యమైన హృదయంతో కోరుకుంటున్నాను.

నాకిప్పుడు 88 ఏళ్లు. 1905లో ఈ మార్గంలోకి వచ్చాను. వచ్చి 70 సంవత్సరాలు గడిచాయి. ఏదో ఒక వస్తువు కోసం అన్వేషించేవాణ్ణి. దానికి సంబంధించిన పనులే చేస్తూ వస్తున్నాను. ఈ మార్గంలో నడుస్తాను. నా అనుభవాలను ప్రపంచానికి చెప్పి పోతానని ప్రతిజ్ఞ చేశాను. తెలిసో తెలియకో జీవితంలో ఆ వస్తువు యొక్క అన్వేషణలో ఉన్నవారికి ఈ "నా అన్వేషణ దాని పరిణామం" ("మేరీ ఖోజ్ అవుర్ ఉస్‌కా పరిణామ్") అనే ఈ పుస్తకాన్ని సత్యమైన హృదయంతో మనస్పూర్తిగా అర్పిస్తున్నాను. ఈ రోజు ఉదయం నేను సమాధిలో కూర్చున్నాను. ఎక్కడ ఉన్నాను? దాతాదయాల్ మహర్షి శివవ్రత్‌లాల్ మహారాజ్ వర్ణించిన ఈ స్థానంపై ఉన్నాను. గురువు నేను, నీవు అనే రెండింటినీ తుడిచేసిన స్థానంపై నిలిచాను.

ఆప్ ఆప్ మే ఆప్ దిఖాయా! ఆప్ ఆప్ కో ఆప్ దిఖాయా ।
'మై' ఖుదాయా 'తూ' మే ఠహరాయా । 'మై' తూ కా ఫిర్ భేద్ మిటాయా ॥

నా ప్రస్తుత స్థితి ఇదే! నేను భగవంతుణ్ణి దాతాదయాల్‌జీ రూపంగా విశ్వసించి నీవు, నీవు అనేవాణ్ణి. 'నేను', 'నీవు' ల భావనలను నాలో నుండి తొలగించేటందుకే ఆయన నాకీ పనిని అప్పగించాడు. నిన్న శ్రీ బిహారీలాల్ పాఠక్ కూడా దాతాదయాల్ మహారాజ్ రాసిన ఈ శబ్దం చదివి వినిపించాడు.

మై హువా పహలే తో పీఛే తూ హువా ।
ఆయా గుల్ పహిలే యహ పీఛే బూ హువా ॥

మై కీ అజమత్ హై బడీ యా కి తూ కీ హై ।
ఆయా జబ్ మై మై తో ఫిర్ తూ తూ హువా ॥

దోనో జాహర్ హై ముహీతే కుల్ జహాఁ ।
యహ 'అనా' హై హక్ కా అవుర్ వహ 'హు' హువా ॥

నిగమయే 'హూ' హక్ హై ఆలమ్ మే బులంద్ ।
'హూ' కా నుక్తా రాజే జుస్తజూ హువా ॥

'మై' గయా నైయర్ నహీఁ మై కా పతా ।
ముహఁ సే నికలా మైతో యహ మై తూ హువా ॥

ప్రస్తుతం నా స్థితి ఇది! ఈ స్థితిలో అప్పుడప్పుడు నా అస్తిత్వం యొక్క జ్ఞానం ఉండదు. నా ఉనికి, అస్తిత్వం గురించిన స్పృహ, జ్ఞానమే లేనప్పుడు ఇక 'నీవు' కూడా సమాప్తమవుతుంది. కానీ ఈ స్థితిలో ఎల్లవేళలా ఉండటం నా వల్లకాదు. ఎందుకు? దీనికి జవాబు దొరకదు. ఎందుకంటే దాతాదయాల్‌జీ చెప్పారు, "ఫకీర్! బోధనా పద్ధతిని మార్చు" ఇక్కడ జరుగుతున్నదంతా ఏదో ఒక శక్తి ఆధీనం వలన లేదా ప్రభావం వలన జరుగుతున్నదంటాను నేను. పంథాయి, సంత్, ప్రపంచం, ప్రాపంచికమైనవి, జీవన్మరణాలు వంటివన్నీ ఆ శక్తి అధీనంలో ఉన్నాయి. ఎపుడైతే ఈ స్థితిలో మనిషి అన్వేషిస్తూ ఈ రహస్యాన్ని అర్థం చేసుకుంటాడో అప్పుడిక అతను తక్షణమే లయం కావాలి. కానీ దాతా దయాల్ తక్షణమే లయం కాలేదు. ఆయన ఆది గృహం వర్ణన చేస్తూ ఆ స్థితిలో ఖాలిక్, మఖలూక్, అనగా సృష్టి, సృష్టికర్త, రాముడు, రహీమ్, గురువు, శిష్యుడు ఎవరూ లేరని రాశారు. కబీర్ సాహెబ్ కూడా తక్షణమే విలీనం కాలేదు. ఆయన ఇలా చెప్పాడు.

జహాఁ పురుష్ తహఁవా కఛు నాహీఁ, కహే కబీర్ హమ్‌జానా ।
హమారీ సైన్ లఖే జో కోయీ, పావే పద నిర్వానా ॥

అయితే నేను శిక్షణను ఎలా మార్చాలి? జరుగుతున్నదేదో జరుగుతున్నది. జరుగుతూనే ఉంటుంది. నా వలె మస్తిష్కంలో అన్వేషించే తపన కలిగిన వారికి సంత్ మతం యొక్క శిక్షణ వలన కేవలం అనుభవం యొక్క శాంతి లభించింది. ఇక నేను జరుగవలసినది జరుగుతున్నది అనే పరిణామం పైకి వచ్చాను. ఒకవేళ మనిషి ఈ విషయంపై నిలువలేకపోతే సాధ్యమైనంతవరకు ప్రపంచంలో ఇతరులకు మేలు చేయాలి. పని చేయాలి. పరోపకారం చేయాలి. హర్షపూర్వకంగా అంటే సంతోషంగా, ప్రేమగా జీవనం గడపాలి. ఆయన కృప, ఇచ్ఛ కలిగితే ఎక్కడికైనా తీసుకువెళ్ళనీ! అందుకే నేను నా జీవితానుభవాల తరువాత మనిషివి కమ్మని పిలుపునిచ్చాను. 'ఇన్సాన్ బనో! జీవించు! జీవించనివ్వు!! తిను! తినిపించు!! నీవు సుఖంగా ఉండు! ఇతరులకూ సుఖసంతోషాలనందివ్వు!!

నేను అర్థం చేసుకున్నదంతా పొరపాటు కావచ్చు. నేను ఈ వయసులో ఈశ్వరపూజను కూడా ఒక భ్రమయే అని అనుకుంటున్నాను. ఈ ధర్మాలు, మార్గాలు, ఈశ్వర పూజలు మానవజాతిని ఛిన్నాభిన్నం చేశాయి. ఈర్ష్య, ద్వేషం, ఏహ్యాభావం కలిగించాయి. కొంత ప్రాపంచిక అవసరాల కారణంగా, మరికొంత శారీరిక అవసరాల కారణంగా, ఇంకొంత ధార్మిక ఆలోచనా విచారాల కారణంగా ఈ ప్రపంచంలో అశాంతి వ్యాపించింది. మనిషి సంశయాలు, భ్రమలు దూరం కావడానికీ, మనిషి మనిషిగానే ఉంటూ తన జీవనం యొక్క పనులు నిర్వర్తిస్తూ సంతోషంగా, చింతారహితంగా, శోకరహితంగా, పరోపకారంతో, ప్రేమ పూర్వకముగా తన జీవనం గడపాలనీ, కలియుగంలో సంత్ మతం ప్రాకట్యమైంది. శరీరం విడిచాక ఏం జరుగుతుంది? అని చాలాసార్లు ఆలోచిస్తుంటాను. దీని విషయంలో ధార్మిక జగతివారు ఎన్నో తర్కవితర్కాలు చేశారు. అనేక రకాలుగా చెప్పారు. కానీ ఇవన్నీ మనిషి మెదడులో పుట్టినవే! ఏం జరుగుతుంది? నాకేం తెలియదు. శరీరం త్యజించాక ఎక్కడైనా వెళ్ళాక అక్కడ ఏం జరుగుతుందో నా పరిణామం ఏమైందో లోకానికి చెప్పిపోవాలని అనుకుంటాను. కబీర్ సాహెబ్ రాశారు.

ఉత్ తే కోయీ న ఆయియా, జాసే పూఛూఁజాయ్ ।
ఇత్ తే సబ్ కోయి జాత్ హై, భార్ లదాయ్ లదాయ్ ॥

జీవనం చైతన్యపు బుడగ అని భావిస్తాను. అందులో "నేను" అనే భావం వస్తుంది. తరువాత "నేను" నుండి "నీవు" వెలువడుతుంది. అది అందులో చిక్కుకుంటూ సుఖదుఃఖాలు, ఆనందాలు, ఆనందరాహిత్యాలు, చింతాశోకాలు అన్నిటినీ అనుభూతి చెందుతుంటుంది.

ఇది నా నూతన సంవత్సర సందేశం. మానవజాతికి కళ్యాణం శుభం జరగాలని సత్యహృదయంతో కోరుకుంటున్నాను. నన్ను కలిసేవారికి, నా సాహిత్యం చదివే వారికి ఈ సంవత్సరం సుఖసంతోషాలు ఆనందాలు, సమృద్ధిగా ప్రాప్తించాలి.

"అందరికీ శాంతి"

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## మానవతా మందిరం, హోషియార్‌పూర్

## సత్సంగం

## శ్రావణమాసం, తేది 21-7-1974

నన్ను రూపొందించినవాడా! భగవంతుడా! జీవనంలో ఒక కోరిక, ధ్యాస ఉండేవి. జీవితమంతా ఉన్నాయి. ఇప్పటికీ ఉంది. ఎక్కడికో వెళ్ళాలని, ఎక్కడో నిలిచిపోవాలని కోరుకుంటున్నది జీవితం. దానిని మీరు విశ్రాంతే అనుకోండి. ముక్తి అనుకోండి. రాముని రూపమే అనుకోండి. నేను ఏదో అన్వేషిస్తూ బయల్దేరాను. ఒక దృశ్యం ద్వారా మహర్షి శివవ్రత్‌లాల్ జీ మహారాజ్ చరణాలలోకి చేరాను. ఆయన నాకు సంత్‌మతం శిక్షణ నిచ్చాడు.

సంతులు జీవనాన్ని ఆశతో ప్రారంభించారు. ఇది శ్రావణ మాసం, బాబా సావన్‌సింగ్‌జీ మహారాజ్ జన్మదినం కూడా ఈనెలలోనే వస్తుంది. ఆయన "ఫకీర్! నిర్భయుడివై పనిచేసి వెళ్ళు" అని చెప్పారు. ఒప్పో తప్పో నాకు తెలియదుగానీ పని చేస్తూనే ఉన్నాను -

సావన్ ఆయా మాస్ దూసరా, సాస్ మరీ ఘర్ ఆయా ససురా।
కాలీ ఘటా శ్యామ్ మన్ హువా, శ్యామ్ కుంజ్ మే యహ మన్ మువా॥

గరజే బాదల్ చమ్‌కే బిజ్‌లీ, మంసా మోడీ ఆసా బద్‌లీ।
సురత్ నిరత్ కీ ఝుడియా(లాగీ, ధున్ అనంత్ శబ్దన్ సే చాలీ(॥

వృద్ధ అవస్థా చేతన్ లాగీ, కాల్ ఆయ్ జబ్ సిర్ పర్ గాజీ।
జమ్‌పుర్ అబ్ సతగురు రాఖే, బహుతక్ జీవ్ మౌత్ దర్ తాకే॥

*(పూర్తి శబ్దం "సారవచనం పద్యభాగం" నుండి చదవండి)*

స్వర్గనరకాల ప్రస్తావన శాస్త్రాల్లో ఉంది. గరుడ పురాణంలో కూడా ఉంది. ఇతర సంప్రదాయాల్లోనూ ఉంది. భిన్న భిన్న ప్రకరాల శబ్దలు మెదడును చంచలం చేశాయి. ఇప్పటికీ కొంత వరకు ఉన్నాయి. నరకం, స్వర్గాలు ఉన్నాయా? అనేదే ఇప్పుడు ప్రశ్న. ఆఁ ఉన్నాయి. ఎలా? రాత్రికి నీవు పడుకుంటావు. కలలో నిన్ను పాము కరుస్తుంది. కొందరు బావిలో పడతారు. మరికొందరికి భయానక దృశ్యాలు కనిపిస్తాయి. నీవు భయపడతావు. అరుస్తావు, ఒకరు ఆకాశంలోకి ఎగిరి సంతోషపు దృశ్యాలు చూస్తారు. మనిషి శరీరంలోని బలం తక్కువైనపుడు అతని మస్తిష్కంపై ముద్ర వేసుకుని ఉన్న సంస్కారాలు, భావ విచారాలు రూపాలను దాల్చి అతని ఎదుటకు వస్తాయి. సంస్కారాలు మంచివైతే మంచి దృశ్యాలు కనిపిస్తాయి. సంస్కారాలు చెడువైతే చెడు దృశ్యాలు కనిపిస్తాయి. వీటి వలన మనిషికి సుఖదుఃఖాలు కలుగుతుంటాయి. ఈ స్వప్నస్థితి అందరికీ వస్తుంటుంది.

శరీరం వదలిపోవటం అంటే ఏమిటి? శరీరాన్ని మరిచిపోవటం! ఇది మన మృత్యువు. అది దీర్ఘ మృత్యువు. కేవలం ఇంతే తేడా! ఇది సరైనదే! నా వయసు ప్రస్తుతం 87 సంవత్సరాలు. వృద్ధుణ్ణయ్యాను. శరీరం నిర్బలమైంది. జీవనంలో నేను జాగ్రదవస్థలో చేసిన మంచి, చెడు, కర్మల సంస్కారాలు నా మస్తిష్కంపై నిలిచివున్నాయి. అవి స్ఫురిస్తుంటాయి. నేటికి 40 సంవత్సరాలకు పూర్వం జరిగిన సంఘటనలు, స్వప్నాలు కూడా ఎదుటికి వస్తుంటాయి. అత్తగారు చనిపోయినప్పుడే మామగారు మేల్కొంటారు. అంటే శరీరం నిర్బలమైనప్పుడే మస్తిష్కంపై పడిన సంస్కారాలు ఎదుటికి వస్తుంటాయి.

మూడు నాలుగు రోజుల నుండి నా తల గిర్రున తిరిగినట్లవుతున్నది.

డాక్టర్ దగ్గరికి వెళ్ళాను. తిరిగి వచ్చేటప్పుడు ఒక గేదెను చూశాను. అది శుభ్రంగా కడగబడి కట్టివేయబడి ఉంది. దానిని చూసి నాకు నా నలభై సంవత్సరాలకు పూర్వం ఉన్న గేదె జ్ఞాపకానికి వచ్చింది. అల్లాబఖ్ష్ ఫాటక్‌వాలా తెల్లవారుజాము 5 గంటలకు వచ్చి దాన్ని శుభ్రంగా కడిగేవాడు. జాగ్రతస్థితిలో కలిగిన ఆ సంస్కారాలు నలభై ఏళ్ళ తరువాత ఇప్పుడు ఎదుటికి వచ్చాయి. స్వప్నం విషయం వినండి. స్వప్నంలో నా కోసం ఒక మనిషి భోజనం తీసుకువచ్చాడు. అందులో మాంసం ఉంది. అది చూసి నాకు చాలా కోపం వచ్చింది. నేను కంచాన్ని విసిరిపారేశాను. అంతలో మెలకువ వచ్చింది. ఇలాంటి స్వప్నం ఎందుకు వచ్చింది? అని ఆలోచించాను. 50 సంవత్సరాల కిందటి సంఘటన జ్ఞాపకానికి వచ్చింది. రెండవ ప్రపంచయుద్ధం సమయంలో నేను శలవులో నౌకలో వస్తున్నాను. భోజనం తీసుకోవడానికి వెళ్ళాను. వైష్ణవభోజనం తెమ్మని చెప్పాను. అక్కడ నాకు మాంసాహారం వడ్డించారు. "ఇదేమిటి? ఎందుకిలా చేశావు" అని అడిగాను. "ఇందులో చేపలకూరే వడ్డించాను గదా! చేపలు మాంసం కాదు. మాంసాహారంగా భావించబడదు" అని జవాబు చెప్పాడు భోజనం తెచ్చినవాడు. నాకు కోపం వచ్చి, పళ్ళెం ఎత్తి విసిరిపారేశాను. ఆ సంఘటన చిత్రమే 50 సంవత్సరాల తరువాత నాకు కలలో వచ్చింది. ఇవాళ రాత్రి కూడా స్వప్నంలో నా తల్లిదండ్రుల్ని చూశాను. ఎన్నో సార్లు రైళ్ళు వస్తుంటాయి. రైళ్ళు ఢీకొన్నట్లు కలలు వస్తాయి. మెలకువ వచ్చేస్తుంది. స్వప్నంలో ఎన్నోసార్లు ప్రకాశాన్ని చూస్తుంటాను. శబ్దం కూడా వింటూ ఉంటాను.

నాకు స్వప్నంలో రైళ్ళు ఢీ కొనడాలు, రైలు యాక్సిడెంట్లు ఎందుకు కనిపిస్తుంటాయి? నేను స్టేషన్ మాస్టర్‌గా ఉండేవాణ్ణి. బండ్లొస్తున్నాయి. శంట్ మూసేయమని కాంటే వాడికి చెప్పాను. అతను మూసేశాడు. కాంటేలో బండ్లు వచ్చాయి. ఇక ఇప్పుడు దుర్ఘటన జరుగుతుందని రైళ్ళు ఢీ కొంటాయనీ భయపడ్డాను. నేను అరిచాను. జనం గుమిగూడారు. రైలును పక్కకు జరిపారు. దుర్ఘటన జరగలేదు. ఆ సమయంలో భయపడిన నా మెదడులో ఆ సంస్కారం దాగి ఉంది. అది ఇప్పటికే స్వప్నంలో నాకు కనిపిస్తూ ఉంటుంది.

సేఠ్ దుర్గాదాస్ ఎన్నోసార్లు కలలో దొంగ దొంగ అని అరుస్తుంటాడు. ఎందుకు? ఇతడు నాలుగైదేళ్ళ పిల్లవాడుగా ఉన్నప్పుడు ఇంట్లో దొంగలు పడ్డారు. ఇంట్లో వాళ్ళంతా దొంగ దొంగ అని అరుస్తుంటే ఇతను కూడా

వారిలా అరవసాగాడు. అప్పుడు మెదడుపై పడిన భయపూరిత సంస్కారాలు ఇప్పటికే 75 సంవత్సరాల వయసులో కూడా కల్లోకి వస్తుంటాయి.

ఈ సంస్కారాలను తొలగించుకోవడానికి ఉపాయం ఏమిటి? వినండి -

భక్తి బిన్ యహ గతి పాయ్యీ, నర్ దేహీ సబ్ బాద్ గంవాయీ ॥

ఆ గురుభక్తి ఏమిటి? ఎవరైనా గురువు దగ్గర నామం తీసుకొన్నాక ఈ సంస్కారాలు కడుక్కుపోతాయా? పోవు! నావి పోలేదు. ఇప్పటికీ స్వప్నంలో వస్తుంటాయి. మరణ సమయంలో ఏం జరుగుతుందో ఏం తెలుసు? ఈ సత్సంగీయులందరూ ఏ గురువు శిష్యులైనా కానీ, ఏ ఆశ్రమంతో సంబంధం కలవారైనా కానీ ఆలోచించాలి. నేను తప్పు చెబుతున్నానేమో ఆలోచించండి. నామం తీసుకో! నీవు తరించిపోతావు అని ప్రపంచానికి చెబుతారు కొందరు. ఇది పొరపాటు. ఇది గురుభక్తి కాదు. ఈ దృశ్యాలు కలలోకి రాకుండా ఉండాలంటే ఉపాయం ఏది? దీనికి చికిత్స ఏది?

నేను మానవతామందిరం నిర్మించాను. ఇదెప్పుడూ నా కలలోకి రాలేదు. వేలాది మందితో కలుస్తుంటాను. కానీ ఎప్పుడూ, ఎవరూ నా స్వప్నంలోకి రాలేదు. మామ్‌చంద్, పురుషోత్తమదాసు మందిరంలో వ్యాధిగ్రస్తులై పడి ఉన్నారు. చాలా కాలం నుండి నాతో ఉంటున్నారు. అయినా ఏనాడూ వీళ్ళు స్వప్నంలోకి రాలేదు. ఇక్కడి నుండి సాయంత్రం నేను ఇంటికి వెళ్లిపోతాను. ఇంట్లో కూడా ఎప్పుడూ నాకు ఈ మందిరం జ్ఞాపకానికి రాదు. మర్నాడు ఇక్కడికి వచ్చాక వీరందరినీ చూసినప్పుడే అంతా గుర్తుకొస్తుంది. దీనికి కారణం ఏమిటి? నా ఈ సమస్త కార్యం నిష్కామకర్మ అయి ఉండటమే! నా మస్తిష్కంపై దీని ప్రభావం సంస్కారాలు లేవు. మేధస్సుపై పడిన సంస్కారాలే స్వప్నంలో కనిపిస్తాయనడానికి ఇదే రుజువు!

నేను శాస్త్రాలు చదువుకోలేదు. ఇతరులకూ వాటిని బోధించను. ఏ ధార్మికగ్రంథాన్నీ ఉదాహరణగా చెప్పను. నేను కేవలం నా అనుభవాన్నే వర్ణిస్తాను. మన మెదడుపై పడి ఉండి మన స్వప్నంలో, సమాధిలో లేక అంత్యసమయంలో మన ఎదుటికి వచ్చే సంస్కాలు ఏవీ? ఎలాంటివో వినండి.

గురు మై గునహాగార్ అతి భారీ ।
కామక్రోధ్ అవుర్ ఛల్ చతురాయీ ఇన్ సంగ్ హై మేరీ యారీ ॥

నీకు స్వప్నంలో కోపం వస్తుంది. ఎవరినైనా గుద్దుతావు. నీ చేయి కదులుతుంది. ఇలా ఎందుకు జరుగుతుంది? జాగ్రదవస్థలోని కోరిక నీ మేధస్సుపై ముద్రితమై ఉండి, స్వప్నంలోకి వస్తుంది. నాకు ఇలాగే సంభవిస్తుంటుంది. నేను జీవితపు చివరి ఇరవై ఎనిమిది సంవత్సరాలలో నా భార్య వద్దకు వెళ్ళలేదు. ఆమె మరణించాక రెండు సంవత్సరాలకు నాకల్లోకి వచ్చి "నీవు నాకు చాలా అన్యాయం చేశావు నన్ను ఇన్నేళ్లు వదిలిపెట్టావు" అంది. స్వప్నంలో నేనామెతో భోగించాను. అందుకే కామం అనుభవించే ఆలోచనను తన మనసులో పెంచుకున్న మనిషికి స్వప్నంలో కామమే వస్తుంది.

900 ఎలుకల్ని తిన్న పిల్లి హజ్‌కు వెళ్ళినట్లుంది నీ స్థితి అని నాతో నేనే అనుకుంటూ ఉంటాను. దీనికి చికిత్స ఏమిటి? కర్మ అనుభవించటమే! చూడు! నీవు సంతానం ఉత్పన్నం చేసేటందుకో, విషయ వికారాలను అనుభవించడానికో స్త్రీ జన్మించలేదు. తన విధిని పూర్తిగా నిర్వహించిన వ్యక్తి మనసుపై కామపు సంస్కారాలు ఉండవు. స్వార్థం కోసం అనుభవించే మనిషి మనసుపై ఆయా సంస్కారాలు పడి స్వప్నంలోనో లేక అంత్య సమయంలోనో ఆ సంస్కారాలు అతని ఎదుటికి వస్తాయి. ఉదాహరణకు ఒక జడ్జి న్యాయ విచారణ జరిపాక నేరస్థునికి ఉరిశిక్ష విధిస్తాడు. అతని మనసుపై ఆ సంస్కారాలేవీ పడవు. ఎందుకంటె అతనికి ఆ నేరస్థునితో ఎలాంటి సంబంధమూ లేదు. అతడు తన విధి నిర్వహించాడు. నీ కర్తవ్యపాలన చేయమని సంత్‌లు ఇదే మాట చెబుతారు. అవసరమైనప్పుడు కోపగించుకో! సంతానం పొందు! వారి పాలన పోషణచూడు! కానీ ఏ పనిలోనూ చిక్కుపడకు. చిక్కుకోకు. ఇక నీ మనసుపై ఏ సంస్కారాలూ పడవు.

**"లోభ, మోహ, అహంకార్, ఈర్ష్యా, మాన్ బడాయీ ధారీ ।**

నీవు నీ లాభం కోసం కొందరిని మోసగిస్తావు. వారి సంస్కారాలు నీపై ఉంటాయి. దుకాణాదారులు తమ లాలూచి కోసం గిరాకీదార్లు అనగా కొనేవాళ్ళు తమ దుకాణానికే రావాలనీ, ఇతరుల దుకాణానికి వెళ్ళొద్దనీ అనుకుంటారు. ఆ సంస్కారాలు కూడా మస్తిష్కంలో ఉంటాయి. అయ్యో! వాళ్ళ దగ్గర ధనం ఉంది! నా దగ్గరెందుకు లేదో అనేది ఈర్ష్య. నీవు వాళ్ళకు హాని చేసేటందుకు ప్రయత్నిస్తావు. నీవు ఈ సంస్కారం నుండి తప్పించుకోలేవు.

కపటీ లంపట్ ఝూటా హింసక్, అస్ అస్ పాప్ కరారీ ।
దుఃఖ నిరాదర్ సహో న జాయీ, సుఖ్ ఆదర్ అభిలాష్ భరారీ ॥

మన మెదడుపై పడి స్వప్నంలో మన ఎదుటికి వచ్చే సంస్కారాలివే! వార్ధక్యం కారణంగా మనిషి అధికంగా నిర్బలుడైనప్పుడు ఈ సంస్కారాలు జాగ్రదవస్థలో లేక అంత్యసమయంలో స్పృహ లేనప్పుడు రూపాలు ఏర్పర్చుకుని ఎదుటికి వస్తాయి.

వ్యంజన్ స్వాద్ అధిక్ రస్ చాహే, మన్ రసనా యహీ చాట్ పడారీ ।
ధన్ అవుర్ కామిని చిత్త బసాయే, పుత్ర్ కలత్తర్ ఆస్ భరారీ ॥

నా భార్య నా స్వప్నంలోకి ఎందుకొస్తుంటుంది? ఎందుకంటే ఆమెను నేను ప్రేమించేవాణ్ణి. ఒకసారి స్వప్నంలో మా మామగారు వచ్చాడు. "నా కూతురు అనగా మీ మొదటి భార్య రామరిఖి మిమ్మల్ని వివాహం చేసుకోవాలను కుంటున్నది" అన్నాడు. " నేనైతే వృద్ధుణ్ణి. పెళ్ళి చేసుకోను" అన్నాను. "ఆమె మరణవ్రతం చేస్తోంది" అన్నాడు. "ఆమెనిటు పిలువు" అన్నాను. ఆమె వచ్చింది. నాకు మెలకువ వచ్చేసింది. నేను ఆమెను ఎక్కువగా ప్రేమించాను. ఎంతో అందంగా ఉండేది. ఆమె శరీరం నుండి సుగంధం వెలువడేది!

నానా విధి దుఃఖ్ పావత్ పాపీ ।
తో భీ యహ కర్‌తూత్ నఛాండీ ॥
యహ మన్ దుష్టకాల్ కా చేరా - నిత్ భర్ మావత్ నిడర్ హువారీ ॥

ఎవరినేం అనాలి? నా మనసే అనేక సార్లు భయరహితమవుతుంది. ఈ వయసులో కూడా నాకు చాలా సార్లు నేను రావద్దనుకున్న ఆలోచనలొస్తుంటాయి. పదే పదే వస్తాయి. వాటిని ఎవరు తొలగిస్తారు? గురువు. గురువు వాటిని తొలగిస్తాడు ఎలా తొలగిస్తాడో చెబుతాను.

జబ్ జబ్ చోట్‌పడీ దుఃఖన్ కీ, తబ్ డర్ డర్ కర్ భజన్ కరారీ ।
దేఖో దయా మహర్ సత గురు కీ, ఉసీ భజన్ కో మాన్‌లియా రీ ॥
బుధి చతురాయీ బచన్ బనావట్, హార్ జీత్‌కా చర్చా ధారీ ॥

ఈ దేశం ఏమవుతుందోనని అనేక సార్లు ఆలోచిస్తుంటాను. ఇంత గౌరవాదరాలున్న రాజకీయ నాయకుల పరిణామం ఏమవుతుందోననిపిస్తుంది. మీ ఇళ్ళల్లో చూడండి! ఎంత కపటం మోసం జరుగుతున్నదో? మన లోపల ఒకటి ఉంటుంది. బయట మరొకటి చెబుతాం.

**సేఖీ బహుత్ ప్రీతి నహీఁ అంతర్, భోలే భగతన్ ధోఖ్ దియారీ ॥**

ఇది హుజూర్ మహారాజ్ వాణి! ఆయన గురువు అయ్యారు. కాని తనను గురువని అనడానికి ఎవరికీ ఆజ్ఞ ఇచ్చేవారు కాదు. ఆయన అనేవారు. గురువు కేవలం రాధాస్వామి దయాలుడే! నేను సంత్‌ను కాను. నేను కేవలం సంతుల దాసుడను" అని ఆయన అనేవారు. **"భోలే భగతన్ దోఖ్ దియారీ"** గురువు అయి జీవులను మోసగించటం ఆయన గమనించేవారు. ప్రస్తుత గురువులు ఆలోచించాలి. "నామం తీసుకో! అంత్య సమయంలో గురువు వచ్చి నిన్ను తీసుకువెళ్తాడు" అని అనటం ఎంత మోసమో ఆలోచించండి. ఇది గురువుల మోసం. ఇప్పుడిక నీవు నీవైపు చూసుకో! నీవు దుకాణాదారుడవు. అమాయకపు గిరాకీ - నీ దగ్గరికి వస్తాడు. నీవు ఎక్కువ ధర చెబుతావు. మన ఆ కుకర్మలే రూపాలను ఏర్పర్చుకుని స్వప్నంలో లేక మన అంత్య సమయంలోనో ఎదుటికి వస్తాయి. మనం దుఃఖితులమవుతాం. చనిపోయే వారి స్థితిని ఎవరేం చెబుతారు? నీవు స్వప్నంలో భయపడి నప్పుడు నీ ఇంట్లో వాళ్ళు గానీ, బయటి గురువుగానీ ఎవరూ నీకు సహాయం చేయలేరు.

**నర్ నారీ బహు తక్ బస్ కీనే । మాన్ ప్రతిష్ఠా యోగ్ కియారీ ॥**

ఒక వేళ నేను పదిమంది శిష్యులను తయారు చేసుకుని వారి నుండి కానుకలు తీసుకుంటే నేనెక్కడికి పోతాను? అందుకే నేను గురువును కాలేదు. కాని గురువు యొక్క పనులు నిర్వహిస్తూ వస్తున్నాను. నామం ఇవ్వలేదు. కానీ సత్యమైన నామం ఇచ్చాను.

నేను నా **జీవితాన్ని** చాలా వరకు రక్షించుకునేటందుకే ప్రయత్నించాను. కాని మొదటి సంస్కారాలు ఫిలింగా మారి ఉన్నాయి. అంత్యసమయంలో నాకు గురువు జ్ఞాపకం ఉంటే దాటిపోతాను లేకుంటే అంతా వృథాయే! గురు నామం ఏమిటి? తెలివి, వివేకం, ప్రకాశం, శబ్దం, విశ్వాసాల పేరు గురువు.

**గురు సంగ్ ప్రీతి కపట్ కుఛ్ డర్ కీ । కభీ థోడీ కభీ బహుత్ కియారీ ॥**

గురువు ప్రేమ నిష్కామముద్దై ఉండాలి. కానీ జనం ఏం చేస్తారు? ముందుగా వచ్చి నాకు చాలా సేవ చేస్తారు. తరువాత అంటారు. "బాబాజీ! ఫలానా వ్యక్తికి చెప్పి నా కొడుకుకు ఉద్యోగం వేయించు" అని. ఇదీ ప్రస్తుతం కొందరి గురుప్రేమ.

కహాఁ లగ్ అవగుణ బరనూఁ అప్ నే । యాద్ నా ఆవత్ భూల్ గయా రీ ॥

"నేను నా అవగుణాన్ని ఎంతని వర్ణించాలి?" అని హుజూర్ మహారాజ్ అంటున్నారు. మనిషి మేధస్సుపై ఏ సంకేతాలు, చిహ్నాలు, ప్రభావాలు పడి ఉంటాయో అవే ఎదుటికి వస్తాయి. మనిషికి స్వప్నంలో భయం కలుగుతుంది. ఇదంతా తప్పుడు ఆలోచనల పరిణామమే! ఇదే యమధర్మరాజు!

సావన్ ఆయా మాస్ దూసరా । సాస్ మరీ ఘర్ ఆయా ససురా ॥

శారీరక వ్యవస్థ దుర్బలం అయితే మనస్సు బలవంతమైనదవుతుంది. నాదవుతున్నది. నేనిప్పుడు వృద్ధుడనయ్యాను. ఈ విషయాన్ని గమనిస్తున్నాను. అందుకే చెబుతున్నాను. స్వామీజీ మహారాజ్ వాక్కులు సంపూర్ణంగా సత్యమైనవి. ఎప్పటి దాకా శరీరం బలవంతమై ఉందో అప్పటివరకు మనిషి ప్రయత్నం చేసి తన మనసును వశం చేసుకోగలుగుతాడు కానీ వార్ధక్యం వచ్చాక శరీరం దుర్బలమవుతుంది. అప్పుడు మనసు పుష్టివంతమవుతుంది. వశం కానిదవుతుంది. చాలా మంది వృద్ధులు వ్యర్థంగామాట్లాడటం మీరు చూసే ఉంటారు. ఎందుకు? వయసులో ఉన్నప్పుడు వారిలో శక్తి ఉండేది. అధికారం చెలాయించారు. కానీ ముసలితనం వచ్చినా వారింకా అధికారం కొనసాగించాలనుకుంటారు. కానీ అప్పుడది సాధ్యపడదు. ఫలితంగా వాళ్ళు దుఃఖ పడతారు.

కాలీ ఘటా శ్యామ్ మన్ హోవా, శ్యామ్‌కుంజ్ మే యహమన్‌మువా ॥
గరజే బాదల్ చమ్‌కే బిజిలీ । మంసా మోడీ ఆసా బద్‌లీ ॥
సురత్ నిరత్ కీ ఝుడియాఁ లాగీఁ । ధున్ అనంత్ శబ్దన్ సే చాలీ ॥

మనిషి శరీర స్పృహ కోల్పోతాడు, మైమరచి పోతాడు. మనిషి మరణించబోతున్నప్పుడు అతని మెదడుపైన పడి ఉన్న సంస్కారాలు అతని ఎదుటికి వస్తాయి. అతను భయపడతాడు లేదా ప్రసన్నుడవుతాడు. అతనికి శరీర (స్పృహ) చైతన్యం ఉండదు.

వృద్ధ అవస్థా చేతన్ లాగీ । కాల్ ఆయ్ జబ్ సిర్ పర్ గాజీ ॥
యమపుర్ సే అబ్ సతగురు రాఖేఁ । బహు తక్ జీవ్ మౌత్ దర్ తాకేఁ ॥

యమపురం అంటే ఏమిటి? మన తప్పుడు, పొరపాటు విచారాల సంస్కారాలు మెదడుపై పడి ఉండి, రూపం ఏర్పరుచుకుని మన ఎదుటికి వస్తాయి. మనలను భయపెడతాయి. దీని పేరే యమపురం. సతగురువు

యమపురం నుండి ఎలా రక్షిస్తాడు? సంత్ మతంలోనూ, హిందువులలోను ఒక ఇష్టుని ఇస్తారు. వారివారి విశ్వాసానుసారం ఎవరికి ఎవరు ఇష్టుడైతే రాముడో, కృష్ణుడో, దేవో, దేవతో లేదా గురువు రూపమో మరణ సమయంలో ఎదుటికి వస్తే మనస్సు ఆ భయం కలిగించే రూపాలనుండి పక్కకు తొలగి ఇష్టుని వైపు మొగ్గుతుంది. ఆ భయం నుండి, అనగా యమరాజు నుండి మనిషి తప్పించుకోగలుగుతాడు. రక్షింపబడతాడు. అంత్య సమయంలో గురురూపం వచ్చినవారు ధన్యులు. ఆ యమరాజు నుండి తప్పించుకోగలుగుతారు. ధర్మరాజు దగ్గరకు వెళ్తారు. ధర్మరాజు అంటే ఎవరు? ఏమిటి? ఎవరికైతే అంత్య సమయంలో ఇష్టదైవం రూపం వస్తుందో వారు కూడా మళ్ళీ ఈ లోకంలోకి రావలసి వస్తుంది. జన్మించవలసి ఉంటుంది. ధర్మరాజు దగ్గరికి వెళ్ళటం వలన చిత్రగుప్తునిలోకి వెళ్ళవలసి ఉంటుంది. చిత్రగుప్తుడు ఏమిటి? చిత్రగుప్తుడంటే ఎవరోకాదు. మనిషి మెదడుపై పడిన సంస్కారాలే చిత్రగుప్తుడు. ఆ సంస్కారాలననుసరించి మనిషికి మరొక దేహం లభిస్తుంది. మురికి దృశ్యాలు రాకుండా ఉండాలంటే ఇష్టుని రూపమే శరణ్యాం. ఒక ఇష్టుణ్ణి ధారణ చేసుకో. అతన్ని పూర్తిగా నమ్ముకో. ఆతన్ని సుఖదాత, ఆనందదాత, ముక్తిదాత అని అనుకో! ఈ మాటనే హుజూర్ మహారాజ్ తన 'ప్రేమవాణి' అనే పుస్తకంలో చెప్పారు. అంత్యసమయంలో ఫిలిం నడుస్తుంది. నీవేమేం చేశావో అవి ఎదుటికి వస్తుంటాయి. గురువు కూడా వస్తాడు. శబ్దం కూడా వినిపిస్తాడు. తరువాత కొంత కాలం వరకు నీ కర్మానుసారం పైలోకాలలో ఉండవలసి వస్తుంది. మళ్ళీ ఎప్పుడైనా సంత్ సతగురు వక్త్ ప్రపంచంలోకి వచ్చినప్పుడు నీకు ఏదైనా మంచి ఇంట్లో జన్మ లభిస్తుంది. నీవు ఆ సంత్ సద్గురు వక్త్ సన్నిధిలోకి వచ్చి మిగిలిన ఆధ్యాత్మిక సంపాదన పూర్తి చేసుకొని నీ ఇంటికి చేరుకుంటావు. ఇప్పుడిక ఆలోచించు! మోసగాళ్ళయిన కొందరు మహాత్ములు అశాశ్వతమైన గౌరవాదరాలను పొంది మేం నిన్ను అంత్య సమయంలో సత్‌లోకానికి తీసుకువెళ్తామని చెబితే వారి స్థితేం అవుతుందో ఆలోచించు. నీవు నీ విశ్వాసంతో తరించిపోతావు. కానీ ఆ మహాత్ములు తమ ఈ కర్మఫలం నుండి తప్పించుకోజాలరు. అందుకే నేను భయపడ్డాను. నాకు బోధపడిన పూర్తి సత్యాన్ని వర్ణిస్తుంటాను. "నాకు శిష్యులు కావాలి" అనేకోరిక పెట్టుకున్నా నేను దోషినే అవుతాను. ఎందుకంటే ఈ నా కోరిక ఒక సంస్కారంగా మారి నా మెదడులో తిష్టవేసుకుంటుంది.

కాల్ ఘటా జబ్ ఆకార్ ఛాయీ । ధారా మౌత్ అధిక్ బర్సాయీ ॥
జీవ్ అనేక్ రహే ఘబరాయీ । కాయా గఢ్ ఉన్ దీన్ ఢవాయీ ॥
యమపుర్ జాతే జీవ పఛ్తావే । యమ కే దూత్ తిన్ బహుత్ సతావే ॥

మీరు గమనించరు. స్వప్నంలో నీవు ప్రపంచాన్ని మరిచిపోతావు. ప్రపంచంలో స్వప్నాన్ని మరిచిపోతావు. ఇలాగే మనిషి ఏ స్థాయిలో, ఏ శ్రేణిలో ఉంటాడో అతడు ఇతర శ్రేణులను, స్థాయిలను మరిచిపోతాడు.

నానా కష్ట్ దేయ్ పల్ పల్ మే । ఫిర్ ఫాంసీ డాలేఁ గల్ గల్ మే ॥
కభీ నరక్ మాఁహీ దే గోతే । జీవ సహే దుఃఖ్ అతికర్ రోతే ॥

ఇలాంటి 'వాక్కులు' అబద్ధాలని లోకం అనుకుంటుంది. కానీ అది సత్యమైనది. నీవు నీస్వప్నాన్నే చూడు! స్వప్నంలో భయపడతావు. కాని జాగ్రదవస్థ లోకి వచ్చాక ఆ స్వప్నాన్ని మరిచిపోతావు. స్వప్నం ఏమీ కాదని జనం అర్థం చేసుకుంటారు. ఇలాగే ఒక వేళ మనిషి నిజాయితీపరుడైతే అతడు జాగ్రదవస్థకు బదులుగా స్వప్నావస్థలో తన కర్మను అనుభవిస్తాడు. జాగ్రదవస్థలోకి రావటం వలన దానిని మరిచిపోతాడు. జాగ్రదవస్థలో మనం మన బుద్ధిని పరుగెత్తించటం మొదలుపెడతాం. సిక్కుల్లో ఒక గురు మహారాజ్ దగ్గరికి ఒక రాజు వచ్చాడు. రాత్రి కలలో ఆ రాజు పాకీవాని ఇంట్లో జన్మమెత్తినట్లు పెరిగి పెద్దవాడయి, పెళ్ళిచేసుకున్నట్లు, పిల్లల్నికన్నట్లు చెప్పాడు. 80 సంవత్సరాల వయసు స్వప్నంలో గడిచిపోయింది. పది నిమిషాల స్వప్నంలో ఎనభై ఏళ్ళు తను గడిపానని, నా కూతురు కూడా చెప్పింది. ఇదంతా ఏమిటి? జాగ్రదవస్థలో అనేక సంవత్సరాలలో గడిచే కర్మ స్వప్నంలో ఒకే రాత్రిలో గడిచిపోతుంది. ఇది నిత్యం. అందరికీ జరిగేదే! కానీ జనం జాగ్రదవస్థలోకి వచ్చాక ఇది పొరపాటనుకుంటారు. ఎందుకంటే అర్థం చేసుకునే వారెవరూ దొరకరు. అధిక స్వప్నాలు ఎవరికివస్తాయి? అధికంగా తినేవారికి, శరీరం నిర్బలంగా ఉండేవారికీ, ఋతుక్రమం సరిగ్గాలేని స్త్రీలకూ వస్తాయి. వారి పాత సంస్కారాలు ఉబికి వస్తాయి.

జాగ్రత, స్వప్న, సుషుప్తి, తురియ, తురియాతీతం ఇవి మన జీవనం యొక్క విభిన్న దశలు. ఈస్థితులను మనమే అనుభూతి చెందుతాం. గమనిస్తాం. ఏ స్థాయిలో, ఏ శ్రేణిలో మన జీవనం ఉంటుందో అక్కడి స్థితి మనదవుతుంది. సంతులన్నారు.

గురు భక్తి బిన్ యహ గతి పాయీ, నరదేహీ సబ్ బాద్ గంవాయీ ।

అన్ని స్థానాలలోని ఆనందాన్ని పొందటమే జీవిత ధ్యేయమై ఉంది. అందుకే జీవనంలో నవ్వండి, ఆడండి. సంతోషించండి. శరీరంలో ఉంటూ ఆరోగ్యపు ఆనందాన్ని పొందటం, మనసులో ఉంటూ మనసు యొక్క ఆనందాన్ని పొందటం, ఇలాగే సమస్త స్థితుల ఆనందాన్ని పొందటం, తరువాత ఎక్కడినుండి మనం వచ్చామో అందులో కలిసిపోవటం. ఆయా స్థానాలలోని ఆనందాన్ని పొందటం ఎలాగో సద్గురువు చెబుతాడు. ఈ లోకంలోకి మనం ప్రసన్నంగా ఉండడానికి వచ్చాం.

"నరదేహీ కా బాద్ గంవానా" అంటే ఏమిటి? ఈ శరీరాన్ని పొంది మన అస్థిత్వపు విభిన్న స్థితుల ఆనందాన్ని పొందకపోవటమే నరదేహాన్ని వృధాపరచుకోవటం. గురువు నామమిస్తాడు. స్మరణ, ధ్యానం, భజన చెబుతాడు. జీవనమున్నంత వరకు ఆనందాన్ని పొందండి. ఏపనైనా ఎక్కువగా చేస్తే అది దుఃఖకారణమవుతుంది. అధిక ధన సంపదకూడా దుఃఖకారణమే అవుతుంది. అధిక బాధ్యత కూడా కష్టానికి కారణమవుతుంది. అందుకే నెహ్రూ నిద్రమాత్రలు వేసుకునేవాడు.

గురువు చెప్పే దానిని ఆచరించండి. ఆచరించటానికి బదులు మీరు గురువుకు బాహ్య పూజలు చేస్తారు. మర్యాదలు చేస్తారు. దీని వలన మీకు క్షణికానందం తప్ప మరేదీ దొరకదు. నేను జీవనంలో ఎంతో సంతోషాన్ని పొందాను. ఇప్పటికీ సంతోషంగానే ఉంటాను. రోజంతా సంతోషంగా ఉంటాను. కానీ నా మనసుపైన పడి ఉన్న సంస్కారాల వలన భయపడుతుంటాను. ఏ మహాత్ముడూ తన లోపాల్ని చెప్పుకోడు. దోషాలు అందరిలో ఉంటాయి. ప్రతి ఒక్క స్థితి లేదా శ్రేణిలో ఆత్మ యొక్క దశ భిన్నంగా ఉంటుంది. విజ్ఞానమయకోశపు శిరస్సు ఆనందం అని ఒక శాస్త్రంలో రాశారు. కుడి భుజం సంతోషం. శరీరం ఆనందం. విజ్ఞాన మయపు కోశపు వెనుక భాగం బ్రహ్మ అయి ఉంది. బ్రహ్మ అనగా ఏమిటి? ప్రకాశం. ప్రకాశ సాధన చేయటం వలన నిశ్చింత, దుఃఖరాహిత్యం, ఆనందం ప్రాప్తిస్తాయి. ఈస్థితి కలగకుంటే నీ అభ్యాసంలో దోషం ఉందనుకోవచ్చు. ఈరోజు అంతరంలో బాబా ఫకీర్ రూపం కన్పించలేదు. సూర్యుడు గానీ చంద్రుడుగానీ కన్పించలేదు అని మీరు అనుకుంటూ ఉంటారు. ఈ రకమైన అభ్యాసం తప్పు. ఇది అభ్యాసంలోని

అ, ఇ, ఉ ల స్థాయి. హుజూర్ మహారాజ్ కూడా అంటారు - ఏమని? అభ్యాసం చేయటం వలన నీకు ఆనందం, తన్మయత్వం, దుఃఖరాహిత్యం, చింతారాహిత్యం కలగకుంటే నీ అభ్యాసం సరైనదిగా లేదని నిర్ధారణ అవుతుంది. దీని వలన నీకేమీ లభించదు. నేను నన్ను నిత్యం అవలోకనం చేస్తుంటాను. నా పరిణామం ఏమవుతుందో తెలియదు. బహుశా మీరు తరించినా నేను తరించనేమో! నేనిలా ఎందుకంటున్నానంటే నాకు ఇప్పటికీ స్వప్నాలు వస్తుంటాయి. ఏదో ఒక సమయంలో అది స్వప్నమేననే ఊహ కలుగుతుంది.

గురు భక్తి బిన్ యహ గతి పాయీ, నర దేహీ సబ్ బాద్ గంవాయీ ॥

నరదేహాన్ని పోగొట్టుకోవటం అంటే ఏమిటి? మనను మనం ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ప్రయత్నం చేయకపోవటం. ఆనందమయ జీవనం గడపడానికి ప్రయత్నం చేయండి. మనను మనం ఆరోగ్యంగా ఉంచుకోవడమే జీవనాన్ని సవరించుకోవటం.

నేను చెబుతున్న దానిని గురించి ప్రస్తుతం ఉన్న గురువులు ఆలోచించాలని కోరుతున్నాను. వాళ్ళు తమకు గౌరవాదరాలు లభించాలనే కోరిక లేని వారైతే తమ నడవడిని గమనించుకోవాలి. నేను తప్పు చెబుతున్నానని భావిస్తే వాళ్ళు నా వాదనను విమర్శించనీ! ఖండించనీ! నాకేం భయం లేదు, బాధ లేదు. నేను అనుభవించిన అంశాలనే చెప్పాను. చెబుతాను.

మనసు నుండి రక్షింపబడడానికి ఉపాయమేమిటి? చికిత్స ఏమిటి? మనసుకు పైన వెళ్ళిపోవటం. చాలా కష్టమైన పని. ప్రతి మనిషీ మనసుకు అతీతంగా పోజాలడు. నేను మనసు నుండి ఎలా బయటపడ్డాను? నా రూపం కొందరిలో సాక్షాత్కరించి వారికి రకరకాల సహాయాలు చేస్తుందని తెలిశాక నాకు ధృఢపడింది. నిశ్చయం కలిగింది. నాలో సాక్షాత్కరించిన రూపాలు కూడా నిజానికి లేవు. ఇది కేవలం మాయ. మేధస్సుపై పడిన సంస్కారాలే రూపాలేర్పర్చుకుని మీ ఎదుటికి వస్తాయనే అంశం స్పష్టమైపోయింది. ఇక మనసు కంటే పైకి, మరికొంత ముందుకు వెళ్ళేందుకు ప్రయత్నిస్తాను. నా సురత్ తన చైతన్య రూపంలో మన ఆదిగృహం దగ్గర- ప్రస్తుతం నేనున్న దగ్గర నిలుస్తుంది. నాకీ జ్ఞానం కలిగింది కానీ ఇంకా పరిపక్వం కాలేదు. ఎందుకంటే అప్పుడప్పుడు జాగ్రదవస్థలో లేక స్వప్నావస్థలోనో లేక సమాధి స్థితిలోనో నేను కూడా మరిచిపోతాను. అందుకే జ్ఞానమే గురునామం. గురునామమంటే జ్ఞానం.

మాయారూపాన్ని అర్థం చేసుకోనంతవరకు ముందుకుపోలేరు. అప్పటివరకు మనిషికి మోక్షం లేదు. ఇప్పుడు మీరు అర్థంచేసుకొనండి. చేసుకోకపోండి. నాకు అర్థమైన దానిని చెప్పాను.

మీరొస్తారు. మీకు కృతజ్ఞతలు. మీరు రాకుంటే నా కర్మలు ఎలా నశించిపోయేవి?

నా భావనలు, ఆలోచనా విచారాలు, అభిప్రాయాలు, అనుభవాలు, ప్రవచనాలు టేప్ రికార్డు చేయబడుతుంటాయి. జనతా జనార్థన్, హోషియార్‌పూర్ టైమ్స్, మనుష్యబనో, దయాల్, దయాల్ ఉత్తరాలలో ప్రచురించబడుతుంటాయి.

ఫకీర్! నీ ఈ కర్మ వలన ఎవరికైనా లాభం కలుగుతుందా అని అనుకుంటూ ఉంటాను. నేనెవరికైనా ఏమైనా మేలు చేయగలుగుతానా? లోకంలోకి చాలా మంది సంతులు వచ్చారు. చాలా ప్రయత్నించారు. ఎవరు తరించారు? అందుకే నేను నా కర్మ అనుభవిస్తున్నా ననుకుంటాను. యావత్ప్రపంచానికి నా శిక్షణ వలన లాభం కలుగజాలదని నాకు తెలుసు. ఇది కేవలం విశేషమైన, విలక్షణమైన కొందరికే పరిమితం. కొందరి కోసమే నా శిక్షణ. తన చరణాలలో విలీనం చేసుకోమని దాతాదయాల్‌ను ప్రార్థిస్తుంటాను. నా కర్మలు నశించిపోవాలని కోరతాను. జీవనపు ఆట చాలా ఆడుకున్నాను. ఎప్పుడు వెళ్ళిపోతానో తెలియదు.

మీరు గృహస్థులు. ప్రపంచపుమాటలు చెబుతాను. మీ మనస్సే అన్నీ! అంతే !! దానికి ఎలాంటి సంస్కారాలిస్తే మీరు అలాగే మారుతుంటారు. ఎంత మంచి సంస్కారాలిస్తే అంతగా మారుతుంటారు. మంచి సంస్కారాలిస్తే మంచి ప్రపంచం ఏర్పర్చుకుంటారు. చెడు సంస్కారాలిస్తే చెడు ప్రపంచం ఏర్పర్చు కుంటారు. ఫలితంగా ఇంకా దుఃఖితులవుతారు. ఒక బీదవాని కొడుకు ఒక చిన్న రాయికి దారం కట్టి ఆడుకుంటాడు. సంతోషిస్తాడు. ఒక శ్రీమంతుని కొడుకు చిన్న మోటారు బొమ్మ తీసుకుని దానితో ఆడుకుంటూ ఆనందిస్తాడు. సంతోషం ఇద్దరిదీ సమానమే. అందుకే మీ జీవనాన్ని సంతోషంతో గడపండి. నిర్ధనులు తమ పరిస్థితిలో సంతోషంగా ఉండాలి. శ్రీమంతులు తమ స్థితిలో సంతోషంగా ఉండాలి.

ఇప్పుడు కాలం మారింది. ఖర్చులు చాలా పెరిగాయి. మీ ఖర్చుల్ని తగ్గించండి. అయినంతవరకు మీకు అత్యవసరమైన వస్తువులనే వాడండి. ఆ

వస్తువు లేకుంటే మీకు గడవదనుకుంటేనే దానిని వాడండి. వృధాఖర్చులు చేసే కాలం కాదిది. దేశం నిరుపేదదనికొందరంటారు. అనేక చోట్ల రేడియోలు, టెలీవిజన్లు కన్పిస్తుంటాయి. అన్ని చోట్ల సినిమా హాళ్ళున్నాయి. అక్కడి విపరీతమైన జనం ఉంటారు. ట్రాన్సిస్టర్ల గురించి చెప్పేదేముంది? తక్కువ ఖర్చుచేసేవాడే గొప్పవాడు. సాధారణమైన, సరళమైన జీవనం గడుపుతూ ఉన్నతమైన ఆలోచనా విచారాలు కలిగి ఉండే నియమం ఆచరించండి. తక్కువ వెలగల ఔషధంతో పని జరిగినపుడు లేదా తక్కువ ధర గల దుస్తులు పనికి రాగలిగినప్పుడు ఎక్కువ రూపాయలను ఖర్చు పెట్టటం వలన లాభమేమిటి? ఒక వేళ భగవంతుడు నిన్ను ధనికుణ్ణి చేస్తే నీకుగాను తక్కువగా ఖర్చు పెట్టుకో. ఎవరైనా పేద వారికి సహాయపడి నీ జన్మను సార్థకం చేసుకో.

**మానుష్ జన్మ సుధారో సాధో, మానుష్ జన్మ సుధారో ॥**

ఈ జీవనంలో సంతోషంగా ఉండటం, నిశ్చింతగా ఉండటమే మానవజన్మను చక్క దిద్దుకోవటమవుతుంది.

**అప్నీ కర్నీ పార్ ఉతర్నీ, మన్ మే సమ్‌ఝో విచారో ।**
**జైసీ కర్నీ వైసీ భర్నీ, జన్మ జువా మత్ హారో ॥**

నేను చెప్పింది నిజమే అయితే ఈ హర్తాళ్ళు, ఘెరావులు చేస్తున్నవారు, ఇంఖిలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలిస్తున్న వాళ్ళు, ప్రభుత్వ సంపదకు నష్టం కలిగిస్తున్నవాళ్ళు ప్రస్తుతం ఘోరమైన తప్పు చేస్తున్నారు. ఈ ఇంఖిలాబ్ జిందాబాద్ నినాదాలు నేను 87 సంవత్సరాలనుండి వింటున్నాను. ఈ ఇంఖిలాబ్‌లో హిందు ముసల్మానుల కలహాలు జరిగాయి. తలలు తెగాయి. దేశం విభజింపబడింది. ఇప్పటి నాయకులు మరో రకమైన ఇంఖిలాబ్ చేయదలచుకుంటున్నారు. నేను ఫకీర్ అర్హతలో ఓ సాధువుగా చెబుతున్నాను. వీరు ఇలాగే ఉంటే, ఇదే స్థితిలో ఉంటే దేశాన్ని నాశనం చేసేస్తారు. మహాత్మాగాంధీ అనుసరించిన సిద్ధాంతాలు ఆ సమయానికి సరిపోయాయి. కానీ ప్రస్తుతం ఆ సిద్ధాంతాల్ని పాటించి ఎవరైనా ఘెరావ్‌లు, హర్తాళ్ళు చేస్తే, విప్లవం లేవదీయడానికి ప్రయత్నిస్తే అవి దేశాన్ని నాశనం చేస్తాయి.

కాంగ్రెస్ వారు గురుద్రోహులని గుల్జారీలాల్ నందాతో అన్నాను. వారు గురువు ఆజ్ఞను పాటించలేదు. స్వాతంత్ర్యం లభించాక మహాత్మాగాంధి ఒక సూచన చేస్తూ, "ఇక కాంగ్రెస్ పార్టీని సమాప్తం చేయండి. ఒక కొత్త పార్టీ

స్థాపించండి" అని చెప్పాడు. కానీ కాంగ్రెస్ వారు తమ స్వార్థం కోసం, గౌరవం కోసం, పదవుల కోసం కాంగ్రెస్ పార్టీని మూసేయలేదు. దాని పరిణామంగానే ప్రస్తుతం ప్రతిరోజూ పోట్లాటలు జరుగుతున్నాయి. ఒక శాంతిప్రియుడైన మనిషి బతకటం కష్టమవుతోంది. అందుకే సంత్ మతంలో గురు ఆజ్ఞాపాలన ఆవశ్యకం అని చెప్పటం జరిగింది. శిక్షణలో మార్పు తెమ్మని నా గురు మహారాజ్ నన్నాజ్ఞాపించాడు. నా అనుభవంలోకి వచ్చిన అంశాల ఆధారంగా నేను శిక్షణలో మార్పు తెచ్చాను. అయినా నేను చెప్పిందే సరైనదని నేనేం వాదించను. నాకు బోధపడిన దాన్నే చెప్పాను! అంతే !!

**ధన్ సంపత్తి అవుర్ హాట్ హవేలీ, ఏక్ భీ కామ్ న ఆవే ।**
**యహ బంధన్ హై జమ్ కీ ఫాంసీ, అంత కాల్ పఛ్‌తావే ॥**

**మాత్ పితా భాయీ సుత్ బంధు, సంగ్ న కోయీ సహాయీ**
**గురు కీ దయా సే కాజ్ సఁవారో, బనత్ బనత్ బన్‌జాయీ ॥**

"ఫకీర్! నిన్ను నీవు సంత్ సద్గురువునంటావు. ఎవరిపైనైనా నువ్వు ఏ దయ, ఎలా దయ చూపగలుగుతావు?" అని ఆలోచిస్తుంటాను. సద్గురు వంటే సత్యమైన జ్ఞానం. నేను సత్యమైన జ్ఞానాన్నిస్తున్నాను. ప్రస్తుతం దేశం పరిస్థితి చూడు! బీహార్, గుజరాత్‌లలో ఏం జరుగుతున్నది? మహాత్మాగాంధీ తన సమయంలో వచ్చిన అవతారం. కానీ సంత్‌మతం జీవించి ఉన్న గురువును నమ్ముతుంది. గురువుకు కాలమాన పరిస్థితులు చాలా బాగా తెలుసు. ఆయన రహస్యజ్ఞాత. ఆయన కాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూచన చేస్తాడు. కొన్నిసార్లు పోట్లాడవలసి వస్తుంది. కొన్నిసార్లు వంగి పోవలసి ఉంటుంది.

**అవసర్ పాయా నరతన్ పాయా, దుర్లభ్ అధిక్ అనూపా ।**
**కర్ సత్సంగ్ సార్ కుఛ్ సమఝో, నిరఖో అపనా రూపా ॥**

నీ రూపం చూడమని చెబుతుంటారు కొందరు. వేదాంతులు తమను తాము అహం బ్రహ్మ అంటారు. అనగా "మనం సత్యం" అని. జ్ఞానులు కూడా తమను తాము చాలా ఉన్నతులమని అనుకుంటారు. కానీ తమ రోగాన్ని దూరం చేసుకోరు. కష్టాలు వచ్చినప్పుడు అన్ని జ్ఞానాలను, ధ్యానాలను మరిచిపోతారు. ఉదాహరణకు ఓ చిలుకకు "రామ రామ" అనటం నేర్పించండి. అది "రామ రామ" అంటుంది. కానీ పిల్లి ఎదురుపడగానే అది రామరామను మరచిపోయి "కుయ్యో మొర్రో" అంటుంది.

సంతుల మార్గం అది కాదు. మన రూపాన్ని తెలుసుకొనేది ఈ మార్గం. నేనొక చైతన్యబుడగనని నేను నా రూపాన్ని తెలుసుకున్నాను. ఆ భగవంతుడు అనంతుడు. నేనాయన అంశమును. ఆయన ఇచ్ఛామేరకు ఈ శరీరంలోకి వచ్చాను. ఆయన ఇచ్ఛలోనే సంతోషంగా ఉంటాను. కానీ ఏదో సమయంలో పడిపోతుంటాను కూడా! ఇది కూడా ఆయన ఇచ్ఛయే. నా వశంలో ఏదీ లేదు. అందుకే జీవనమున్నంత వరకు ఆనందంగా గడపడానికి ప్రయత్నించండి. సాధ్యమైతే దుఃఖంలో ఉన్న వారికి సహాయపడండి. అన్నిటికంటే ముందు వృద్ధులైన మీ తల్లి దండ్రులకు, పేద సోదరుడు, సోదరి, పిల్లలకు మీ విధిగా భావించి వారిని సేవించండి. ఆ తరువాత ఏమైనా మిగిలితే, వీలైతే బాబా ఫకీర్‌కు సహాయం చేయండి. కానీ మీ పిల్లల కడుపు కొట్టి ఎవరికీ ఇవ్వకండి.

**రాధాస్వామి రాధాస్వామి రాధాస్వామి గావో ।**
**రాధాస్వామి చరనన్ ధ్యాన్ లగాకర్, ధృపద్ జాయ్ సమావో ॥**

నా చరణాలను ధ్యానం చేయటం వలన నీవు ధృపదానికి వెళ్ళజాలవు. హుజూర్ మహారాజ్ తమ 'ప్రేమవాణి' అనే పుస్తకంలో, "సద్గురు శబ్ద స్వరూపి రాధాస్వామి దయాల్. ఆయన చరణాలు ప్రకాశం" అని రాశారు. అది నీ అంతరంలో ఉంది. శాస్త్రాలు దానినే సావిత్రి అన్నాయి.

అచింత్య, అశోక, నిర్భయులై జీవనాన్ని గడుపండి. అయ్యో! అయ్యో! అనటం వలన ఏమీ జరగదు. ఇప్పుడు మామ్‌చంద్ జబ్బుతో ఉన్నాడు. గత 35 సంవత్సరాలుగా ఇతడు నా మిత్రుడు. నాకు ఎంతో సేవచేశాడు. అలాగే పురుషోత్తమదాసు కూడా 50 సంవత్సరాలుగా నా మిత్రుడు కానీ ఇప్పుడు వ్యాధిగ్రస్థుడయ్యాడు. నాలో జ్ఞానం లేకుంటే వీరు రోగగ్రస్థులైనందుకు ఎంతో బాధ కలిగేది. దాతా దయాల్ ఒకసారి నాపేరిట ఒక శబ్దం రాశారు.

**జిస్‌కే మన్ నహిఁ చింత వ్యాపే, జగ్ మే వహీహై దాస్ ఫకీర్ ।**
**అభయ రహే చిత్ గురు పద్ రాఖే, ధీర్ వీర్ గంభీర్ ॥**

గురువంటే రెండర్థాలున్నాయి. ఒకటి ప్రకాశం. మరొకటి జ్ఞానం.

**శాంత భావ వ్యవహార్ పరమారథ్, కభీ న హో దిల్ గీర్ ।**
**అప్‌నీ పీర్ న ఉర్ మే సాలే, లఖే పరాయీ పీర్ ॥**

**పర్ కీ పీర్ న జిసే సతావే, సో అధరమ బేపీర్ ।**

అప్‌నా రూప్ సంభాలే పల్ పల్, కాట్ మోహ జంజీర్ ॥

యహ ఫకీర్ హై గురుకా ప్యారా, మహావీర్ చిత్‌ధీర్ ॥

యావత్ప్రపంచంలోని కష్టాన్ని నీవు తొలగించజాలవు. భగవంతుడు ఎవరిని నీతో బాంధవ్యం ముడివేసి పెట్టాడో వారి కష్టాల్ని చూడు. దాతా దయాల్ భావమేమిటో ఆయనకే తెలుసు. కానీ భగవంతుడు నన్నిక్కడికి ఎందుకు పంపాడో నాకు తెలియదు. ఆయనకు ఇచ్ఛ కలిగిందని మాత్రం చెప్పగలను. ఇచ్ఛ కలిగినప్పుడు తిరిగి పిలుచుకుంటాడు. ఇప్పుడు నా కొడుకు ఉద్యోగస్థుడు. నాకు చాలా దూరంలో ఉన్నాడు. అతడు నా సేవ చేయజాలడు. అతడు నాకు ఆర్థిక సహాయం అందించే సేవ చేయగలుగుతాడు. దానిని అతడు చేస్తుంటాడు. మిగతా సేవ మీరు చేస్తారు. అందుకే నేను మీ కష్టాన్ని చూస్తాను.

యహ ఫకీర్ హై గురు కా ప్యారా, మహా వీర్ చిత్ ధీర్ ।

చాహ గయీ చింతా సబ్ భాగీ, ఆయా భవనిధి వీర్ ॥

హంస రూప్ ధర్ త్యాగ్ నీర్ కో, గహలియా జ్ఞాన్ కా క్షీర్ ।

రాధాస్వామి గురు కా సచ్చా బాలక్, పహర్ వైరాగ్ కా చీర్ ॥

తన్ కే రహతే ముక్త్ విదేహీ, సహే న ద్వంద్వ శరీర్ ॥

జ్ఞానమంటే నేను భగవంతుణ్ణి కానని కాదు అర్థం. నేను బ్రహ్మనని అనను. సత్, అలఖ్, అగమ్‌నని అనను. నేనాయన అంశాన్నని మాత్రం అనగలను. అయన అంతు దొరకదు.

ఖోజత్ ఖోజత్ ఖోగయా, పాయా నహిఁ అంతా ।

వృథా నికలీ ఖోజ్, ఖోజ్ సే కుఛ్ నహిఁ బన్‌తా ॥

"అందరికీ రాధాస్వామి"

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## సత్సంగం

## బొంబాయి, 14-1-1969

మిత్రులారా! నేను బొంబాయికి వచ్చాను. మీలో కొందరు సత్సంగీయులు ఢిల్లీ నుండి టేప్ రికార్డర్లు తీసుకొని వచ్చారు.

మరేంగే మర్ జాయేంగే కోయీ న లేగా నామ్ ॥

కొందరు గురువులు ఉపదేశాలిస్తారు. జనం వారి కాళ్ళకు మొక్కుతారు. సేవ చేస్తారు. నీవెవరు? ఎక్కడి నుండి వచ్చావు? నిన్నెవరు రూపొందించారు? అని నన్ను నేను ప్రశ్నించుకుంటూ ఉంటాను.

మనం ఈ ప్రపంచంలో పుడతాం. లోకాన్ని చూస్తాం. ఇదంతా చూస్తుంటే ఈ ప్రపంచాన్ని నిర్మించినవారు ఎవరో ఒకరు ఉండే ఉంటారని మనకు అనిపిస్తుంది. నేను కూడా ఈ ప్రపంచంలోకి వచ్చాను. ఎవరో ఈశ్వరుడు - పరమాత్ముడు ఉన్నాడనే ఆలోచన కలిగింది. అతనిని కలుసుకోవాలనే ఉత్కంఠ మస్తిష్కంలో కలిగింది. నేను హిందువును. బ్రాహ్మణుల ఇంట్లో జన్మమెత్తాను. రాముడు, కృష్ణుడు, శివులను పూజించేవాణ్ణి. భగవంతుణ్ణి మానవ ఆకృతిలో చూడాలనేకోరిక నాలో ఉండేది. రామాయణం, భాగవతం వంటి గ్రంథాలను చదివిన వాణ్ణి. గనుక భగవంతుడు అవతరిస్తాడనే నమ్మకం నాలో ప్రబలంగా ఉండేది. అందుకే భగవంతుడు మానవరూపంలో నాకు సాక్షాత్కరించాలనే కోరిక ఏళ్ళ తరబడిగా నాలో పాతుకుపోయింది. ఒక దృశ్యం నన్ను దాతాదయాల్ శివవ్రత్‌లాల్ మహారాజ్ చరణాలలోకి చేర్చింది. ఆ పవిత్ర విభూతి నాకు ఆ అసలైన భగవంతుణ్ణి కలుసుకోవడానికి నామదానం ఇవ్వటం జరిగింది. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ నామం జపిస్తూనే జీవితం గడిపేశాను. రాధాస్వామి మతగ్రంథాలలో, కబీర్ పుస్తకాలలో అన్ని ధర్మాల ఖండన ఉంది. వేదాంతం కూడా అసంపూర్ణం, సగుణోపాసకులు కూడా అసంపూర్ణంగా ఉన్నారు. కాలం అందరినీ మాయలోపల ఉంచింది అని వారు వివరించారు. సంతులు వర్ణించే, ప్రస్తావించే రాముణ్ణి కలుసుకోవాలనే జిజ్ఞాస హెచ్చుగా ఉండేది. ఆ ప్రత్యేకమైన స్థావరానికి కృష్ణుడు వెళ్ళలేదనీ, రాముడు చేరలేదని, పరాశరుడు, వశిష్ఠుడు, మహమ్మదు ఎవరూ చేరలేదని స్వామీజీ, కబీర్ మహారాజ్‌ల గ్రంథాల్లోచదివాను.

అది ఎంతవరకు నిజమో తెలుసుకోవాలనీ, అన్వేషించే హక్కు నాకు లేదా? అసలైన రాముడు ఎవరో ఏమిటో సందర్శించగోరటం సబబుకాదా? నా దాతాదయాల్ నాపైన అపారమైన దయను చూపాడు. దానిని నేను నా జీవితాంతం మరిచిపోలేను. నా దేహంపై నాకు స్పృహ ఉన్నంత వరకు మరువలేను. ఆయన నాకీ గురుపదవిని ఇచ్చి సత్యమైన అసలైన రాముని రహస్యం చెప్పి, చిరునామా అందించాడు. ఆ రహస్యం నాకు ఎలా బోధపడింది? ఢిల్లీ నుండి భూప్‌సింగ్ వచ్చాడు. ఇతడు ఎనిమిది సంవత్సరాల సంఘటనలను వినిపించాడు. ఇతడు కుతుబ్‌మినార్ నుండి పడి చావాలనుకున్నాడు యమునా నదిలో మునిగి మృతి చెంద ప్రయత్నించాడు. చివరికి కరెంటును తాకి చావాలనుకున్నాడు. ఆ సమయంలో నా రూపం ప్రకటమైందట! "మేలుకో! మేలుకో" అందట! కృషక్ - శ్రీ గోపిలాల్, అలీగఢ్ నివాసి తదితర ఇతర సత్సంగీయులు చెబుతారు నా రూపం స్వప్నంలో, అభ్యాసంలో ప్రకటమవుతుందని, ఆఫ్రికా, అమెరికాల్లో ఎందరిలోనో సాక్షాత్కరించిందని, చనిపోయేటపుడు తీసుకువెళ్తుందనీ! నాకా విషయాలే తెలియవు. నేను వారి అంతరంలోకి వెళ్ళలేదు. నేను రాముడిగా, గురువుగా పూజించే రూపాలు నాలో సాక్షాత్కరించేవి అవన్నీ నాకు నేను ఏర్పర్చుకున్నవే! అదంతా నా విశ్వాసఫలమేనని రుజువైంది. ఎందుకంటే నేను ఎవరిలోకీ వెళ్లి దర్శన మివ్వటం లేదు. ఇతర మహాత్ములు వెళ్తారేమో నాకు తెలియదు. దాతాదయాల్ మహారాజ్, స్వామీజీ మహారాజ్ వెళ్ళారేమో నాకు తెలియదు. నిజం చెప్పాలంటే వాళ్ళు కూడా వెళ్ళి ఉండరు. నేను వెళ్ళను. కొందరు మోసాల గురువులు నిజంపై తెరలు కప్పారు. ఫలితంగా గౌరవాలు ధనసంపదలు అందుకున్నారు. నేను నిర్భయుడినై ప్రపంచానికి చెప్పిపోతాను. హిందూ శాస్త్రం సరైనదే! జనన మరణాల చక్రం, కర్మఫలం ఎవరికైనా తప్పదు. ఈ అసలు విషయాన్ని మరుగునపెట్టి గౌరవాలందుకుని ధనం పోగుచేసుకున్నారు. గద్దెలు భద్రపరుచుకున్నారు. ఆశ్రమాలు నిర్మించుకున్నారు. కేవలం ఆ ఊహను పరదాలు పెట్టిన పరిణామంగా ఏం జరుగుతుంది? నాకు తెలియదు. దానిని తల్చుకుని భయపడతాను.

మీరు నా దగ్గరకు వచ్చారు. నన్ను మీరు గౌరవించాలనే కోరిక నాకు లేదు. మీ నుండి ధనం కావాలనే కోరికా లేదు. నా జీవనం మారిపోయింది. ప్రస్తుతం ఏ కోరికా లేదు.

ఆరజూ హై లో యహ హైకి కోయీ ఆరజూ న హో ।
మైకో మిటాదూం సాథ్ మే ఇస్ మే కి తూ న హో ।
ఖిర్ కీ న హో జిస్మ్ పర్ న సిర్ పర్‌శాహే తాజ్ ।
ముర్ఖుకో అబ అపనీ జాత్ కీ భీ జుస్తజూ న హో ॥

మీరొచ్చారు. నా వచనాలను రికార్డు చేసుకుంటారు. ఇతరులకు విన్పిస్తారు. ఇతరులకు విన్పించే బదులుగా వీటిని మీరే స్వయంగా వినండి. ఇతరులకి ఉపదేశం ఇవ్వటం వలన చిక్కుల్లో పడతారు. ఇతరులకు ఉపదేశం చేసే వ్యక్తి తను ఆచరించకుంటే తీరం చేరజాలడు. ఉదాహరణకు ఒక నావికుడున్నాడను కుందాం. అతడు ప్రజలను తన నావపై కూర్చోబెట్టుకుని తీరానికి చేరుస్తుంటాడు. యాత్రికులు దూరతీరాలకు వెళ్ళిపోతారు. కాని అతడు నదిలోనే, నావలోనే మిగిలిపోతాడు. ఏ దూర దేశానికీ అతను చేరుకోడు. ఇదే విధంగా మేం గురువులం ఇతరులకు ఉపదేశాలిస్తాం. మా మందిరాలు, మఠాలు, ఆశ్రమాలు కోసం ఉపదేశాలిస్తాం. ఇలాంటి గురువుల పాలబడితే మీరు తీరం చేరుకోలేరు.

## మనసు - సురత్

తూ సురత్ నైన్ నిహార్, యహ అండ్ కే పారా హై ।
తూ హిరదే సోచ్ విచార్, యహ దేశ్ హమారా హై ॥

ఆ పరమతత్వం అండానికి అతీతమని కబీర్, రాధాస్వామి దయాలుడు చెప్పిపోయారు. అండమని దేని నంటారు? మనసును! ఒక పిండం, ఒక అండము, ఒక బ్రహ్మాండము! ఆ పరమతత్వం మనసు కంటే అతీతమని చెప్పారు. ఆ పరమాత్ముడు, పరమతత్వం అండానికి, మనసుకు ఎలా అతీతమో నాకు అర్థమయ్యేది కాదు. నేనాయన్ని మనసుతోనే పూజించాను. నేననే ఏమిటి? సమస్త ధర్మాల వారు, సంప్రదాయాల వారు మనసులోనే పూజించారు. ఒకవేళ ఎవరైనా పరమాత్మునిది ఏదైనా రూపం ఏర్పరిస్తే దానిని వారి మనసే ఏర్పరిచింది. నిజానికి ఆ ఆకృతి భగవంతుడు కాదు. మనిషి ఒక ఆకృతిని ఇచ్చి దానిని పూజించాడు. ఇక ఈ అండము నుండి నన్ను ఎవరు బయటికి తీశారు? మీరు బయట పడేశారు. భూప్‌సింహ, గోపీలాల్ కృషక్, కమాల్ పురానికి చెందిన ఒక మహిళ నన్ను బయట పడేశారు. ఇంకా మరికొందరు సత్సంగీయులలో నా రూపం ప్రగటమై ఔషధం సూచించిందనీ, మరణ

సమయంలో తీసుకువెళ్ళటం జరిగిందని చెప్పిన సత్సంగీయులు నన్ను బయట పడేశారు. చూడు! ఆనంద దయాల్! మీరు వస్తారు. నేను మీ నుండి ఏ వస్తువునూ ఆశించను. ఎందుకు? ఈ తీసుకోవడం, ఇవ్వటం అనేవి పూర్వజన్మల కర్మల ననుసరించి జరుగుతాయని నా విశ్వాసం, నా అనుభవం. ఎవరి నుండి నేను తీసుకోవాలో వారి నుండి తీసుకోవాలి. నానుండి ఎవరైనా తీసుకోవాల్సి ఉన్నవారు తీసుకుంటారు. ఈ ఒక్క ఆలోచన నన్ను ప్రాపంచిక ఆశల నుండి విముఖుణ్ణి చేసింది.

ఆ పరమతత్వాధారుణ్ణి బాహ్య నేత్రాలతో చూశామని కొందరు, అంతరంలో దర్శించామని మరికొందరు చెబుతారు. భగవంతుని శబ్దాన్ని విన్నామని ఇంకొందరు చెబుతారు. భూప్‌సింహకు అంతరంలో "మేలుకో తమ్ముడూ! మేలుకో!" అన్న హెచ్చరిక విన్పించింది. అలా పిలిచి మేల్కొలిపింది నేను కాదు. మరి ఎవరు? అతని మనసే! మరొకరు కాదు. ఏ మనిషైనా ఈ అండం నుండి బయట పడ్డాక, ఆ భగవంతుణ్ణి ఎవరు చూస్తారు? ఎవరు అనుభవంలోకి తెచ్చుకుంటారు? సురత్. సురత్ ఎప్పుడూ రూపాన్ని ఏర్పర్చదు. రూపాన్ని ఏర్పరిచేది మనస్సు. సురత్ కేవలం ఆకర్షిస్తుంది. సురత్‌లో ఏదైనా శక్తి ఉందంటే అది లాగే శక్తి. ఆకర్షించే శక్తి ఒక్కటే ఉంది. అది ఒకవైపు నుండి మరొక వైపు వెళ్ళ వలసి ఉంది. మనసు రూపాన్ని ఏర్పర్చినపుడు ఆ సమయంలో సురత్ మనసు వెంట ఉంటుంది. మనసు మధ్యలో సురత్ ఉంటుంది. కానీ రూపాన్ని ఏర్పర్చేది మాత్రం మనసే. మనసు వచ్చినప్పుడు సురత్ పోతుంది. కానీ మనసు పొర, కవచంలో దాగి ఉంటుంది. సురత్ మనసును పొర వలె వాడుకుంటుంది. మనసుతో కలిసి ఆకర్షిస్తుంది. అలా ఆకర్షించటమే ఆనందం. ఆకర్షణ పేరే ఆనందము. నీవు ఆనందస్థితిలో రూపం ఏర్పర్చజాలవు. సురత్ యొక్క భక్తిపేరు నామం. లయం కావటం సమాధిష్టం కావటం. అందుకే వారంటారు.

**తూ సురత్ నైన్ నిహార్, యహ అండ్ కే పారా హై ॥**

సురత్ నయన్ అంటే ఏమిటి? ఆకర్షణ! నేను నిన్ను చూస్తున్నాను. ఇక్కడి నుండి అటువైపు చూడడానికి నేను ఏ రూపాన్నీ ఏర్పర్చలేదు. సురత్ కేవలం ఒక వైపు నుండి తొలిగి మరొక వైపు వెళ్ళింది. మనసు, రూపు రంగు రేఖలపై నుండి, సురత్ పక్కకు తప్పుకోవటం, దూరం జరగటమే సురత్ నయనాలతో చూడటం.

ఆ తరువాత అంటారు.

తూ హిరదే సోచ్ విచార్, యహ దేశ్ హమారా హై ॥

రంగు రూపు రేఖలను వదిలి ఎటు వైపు సురత్ వెళ్తుందో అదే మన దేశం. చెప్పడానికి చెబుతాను కానీ ఎవరు అర్థం చేసుకుంటారు? ఎవరి సురత్ ఈ రూపు రంగులను విడిచి అవి లేనివైపు ధ్యానం చేస్తుందో, ఒక వేళ సురత్ రూపురంగులను విడిచి రెండవ రూపులను రంగులను చూస్తుంటే అది సురతేగానీ దాని వెంట మనసు ఉంది. సురత్ రంగు రూపు రేఖలను విడిచి రూప రహిత, వర్ణరహితం వైపు వెళ్ళనంత వరకు మనిషి తన దేశం లేదా తన ఆది గృహాన్ని ప్రాప్తం చేసుకోజాలడు. ఆలోచించండి! మాస్టర్ మోహన్‌లాల్! ఎంత కఠినమైన పనో! ఈ స్థితికి ఎవ్వరైనా అర్హులైన వారున్నారా?

దాతాదయాల్ అనేవారు

కఠిన్ నామ హై కఠిన్ కామ్ హై కఠిన్ ఫకీర్ కమాయీ ।<br>జగ్ కే బౌ దుఃఖ్ నాసే పల్ మే, జబ్ కోయీ ఫకీర్ జగ్ ఆయీ ॥

నేను ఫకీరును! నా సాంగత్యం చేసినవారు నా మాటను అర్థం చేసుకున్న వారు ఈ భావజాలం నుండి బయటపడగలుగుతారు.

పహలే ధ్యాన్ గురు కో ధారో । సురత్ నిరత్ మే పవన్ చితారో ॥

ముందుగా గురువును ధ్యానించు అని అంటున్నారయన. అంతరంలో గురు ధ్యానం చేస్తాం కానీ ఎవరికైనా బయట పూర్ణగురువు దొరకకుంటే అతడు ఎంత ప్రయత్నించినా అంతరంలో గురురూపదర్శనం కఠినమవుతుంది. గురువు అంతరంలో ప్రగటమవుతాడు. అయినా ఆ రూపం నీ మనసుదే! నీ అంతరంలో ప్రకటమైన రూపం నిన్ను ఆ స్థితిలోకి అక్కడికి నడిపించదు. మార్గం చూపించదు.

కబీర్ కథనం ఇలా ఉంది.

సుహేల్ నా ధున్ మే నామ్ ఉచారో । తబ సత గురు లహో దీదారా హై ॥

అక్కడ దర్శనం ఇచ్చే సతగురువు ఎవరు? ప్రపంచం భ్రమలో ఉంది. వాస్తవాన్ని మరిచింది. కబీర్ మాటను ధృవపరిచే సతగురువు రూపం ఏమిటి? ధ్వనిలో నామం జపించిన తరువాత సతగురువు ప్రకటం అవుతాడు.

ఆ సద్గురువు ఎవరు? తనే-నీవే- అన్నాననుకోండి, మర్చిపోయి తెలియక అంటున్నాడంటారు మీరు. అది నీ యొక్క సురతే! అక్కడ మరొక గురువెవరూ లేరు. బాబా ఫకీర్ గానీ, బాబా సావన్‌సింగ్ గానీ, మరొకరు గానీ ఎవరూ లేరు. అది నీ నిజస్వరూపం.

దాతాదయాలుని శబ్దం ఉంది.

ఘట్ మే దర్శన్ పావోగే, సందేహ కుఛ్ ఇస్ మే నహీం ।
మై తో ఘట్ మే హూం తుమ్హారే, ఢూండ్ లో ముర్షు కో వహీం ॥

శబ్ద సున్‌తే హో మేరా, చిత్త్ కీ వృత్తి తాన్ కర్ ।
సురత్ మేరా రూప హై, ఇస్ కో సమఝ్‌లేనా వహీం ॥

పై శబ్దంలో మహర్షి జీ మహారాజ్ తెలిపినట్లు ఒక వేళ ఎవరికైనా పూర్ణ గురువు దొరికితే అతడే అక్కడి మార్గం చూపుతాడు. సంకేతం చేస్తాడు.

గురువుదో, రామునిదో, కృష్ణునిదో రూపం నీ మస్తిష్కంలో ఏర్పర్చుకుంటే ఆ రూపం నిన్ను నీ సురత్‌ను అంతరంలో రూపు రేఖలకు అతీతమైన స్థితి వైపు సంకేతం చేయదు. మార్గం చూపదు. సంకేతం చేసేది బాహ్యాపూర్ణ గురువొక్కడే! బాహ్య గురువు నీకు ఈ జ్ఞానమిస్తాడు. కానీ బాహ్యాపూర్ణ గురువును గుర్తించటం కూడా కష్టమే! మనసు యొక్క రూపురేఖలు ఎంత ప్రబలమైనవంటే అవి తన పరిధి నుండి సురత్‌ను బయటపడనీయవు. అందుకే ఈ ఉన్నత బోధనలను సంతులు గుప్తంగా ఉంచారు. నేను కూడా ఉంచవలసే ఉండింది. మనిషి మనసును ఏకాగ్రం చేసి, సూక్ష్మం చేసి, మనసును వశం చేసుకునే సాధన లభించనంత వరకు అతడు ముందుకు వెళ్ళలేడు. అందుకే నేను నామమివ్వను. ఇది నా కర్తవ్యం కాదు. ఇది సాధువుల, భక్తుల విధి. వీరు జీవులను మనసు యొక్క చక్రాలలో సూక్ష్మం చేయించాలి. ఎందుకంటే నీ మొదటి మెట్టులోని సాధన పూర్తి గాలేదు. అందుకే రాశారు.

పహిలే ధ్యాన్ గురు కా ధారో । సురత్ నిరత్ మన్ పవన్ చితారో ॥
సుహేల్‌నా ధున్ మే నామ్ ఉచారో । తబ్ సతగురు లహో దీదారా హై॥

మొదట్లో అందరూ ఈ స్మరణ, ధ్యానం, త్రికుటి, సున్న్, మహాసున్న్ సాధన చేయవలసి ఉంటుంది. ఇవి చేయనంతవరకు నీవు ముందుకుపోజాలవు. అందుకే సంతుల మార్గం సాధారణ మానవులకోసం కాదు. సాధకులకు

మహాపురుషులు పనులు అప్పజెప్పుతారు. ఈ పని వలన వారు కూడా మనసు లోపలికి వెళ్తుంటారు. కోట్లాది గద్దెలు ఏర్పడినా నాకు బాధలేదు. చాలా సంతోషించే విషయం. గద్దెలు ఆసనాలు లేనిదే పని నడవదు. ఒకే మనిషి వలన సమస్త ప్రపంచం ఎలా శిక్షణను పొందగలుగుతుంది? కోట్లాది మంది మనుషులున్నారు. పరస్పరం మాట్లాడడానికి కూడా సమయం దొరకదు. అందుకే నేనీ గద్దెలకూ, సాధువులకూ విరుద్ధంగా ఉంటానని ఎవరూ అనుకోవద్దు. నా భావాన్ని, నా అభిప్రాయాన్ని కొందరు అర్థం చేసుకోలేదు. ధ్యానం కుదిరితే మనసు ఏకాగ్రం కావటం మొదలుపెడుతుంది. సురత్ పూర్తిగా తనలోతానే నిలుస్తుంది.

**తూ సురత్ నైన్ నిహార్, యహ అండ్ కా పారా హై ।**
**తూ హిరదై సోచ్ విచార్, యహ దేశ్ హమారా హై ॥**

**పహలే ధ్యాన్ గురుకా ధారో, సురత్ నిరత్ మన్ పవన్ చితారో ।**
**సుహేల్‌నా ధుని మే నామ్ ఉచారో, తబ సత గురు లహో దీదారా హై ॥**

**సత గురు దరస్ హోయ్ జబ్ భాయీ, వేదేం తుమ్‌కో నామ చితాయీ ।**
**సురత్ శబ్ద్ దోవూ భేద్ బతాయీ, తబ్ దేఖే అండ్ కే పారా హై ॥**

మనసు స్థిరమైనప్పుడు బాహ్యగురువు నీకు రహస్యం చెబుతాడు. ఆనంద్ దయాల్! నీవు వస్తావు. మంచిదే! సంవత్సరాల తరబడిగా మన సంబంధం ఉంది. పూర్వజన్మల సంబంధం ఉండి వుండొచ్చు. నా సాంగత్యం లోకి వచ్చిన వారికందరికి రహస్యం చెప్పిపోవాలనీ, సత్యమేమిటో వివరించాలనీ నా కోరిక. జీవితమంతా నీవు బాబా ఫకీర్ కే డప్పు కొడుతూ ఉండకూడదు. ఏ ధ్యేయం కోసమైతే నీవు బాబా ఫకీర్ దగ్గరికి వచ్చావో అది పూర్తి కావాలి.

ఆ ధ్యేయం ఏమిటి? రహస్యం నీకు అంతుబట్టాలి. గురువుతో సంబంధం పెంచుకునే ఉద్దేశ్యం ఏమిటి? వాస్తవం ఏమిటో నీకు తెలియాలి. ఇదే కబీర్ చెప్పాడు. ఇదే స్వామీజీ చెప్పాడు. నేను కేవలం రహస్యం చెప్పడానికే సత్సంగం చేయిస్తాను. లోకులను బంధించడానికి చేయను. ఒక దృష్టి కోణం నుండి చూస్తే గురువులు ఇలా బంధించటం లాభదాయకం కూడా! ఎందుకంటే ఆయన ప్రపంచంలో చిక్కుబడి ఉన్న జీవులను ప్రపంచం నుండి వెలికిదీసి గురువుల వలలో చిక్కుబడేలా చేస్తాడు. లేదా సంప్రదాయపు వలలలో

చిక్కుబడేస్తాడు. అలా చిక్కుకున్నవారు ప్రపంచంలో చిక్కుకున్న వారైనా కావచ్చు. గురువు వలలో చిక్కుకున్న వారైనా కావచ్చు. దాని నుండి వెలికితీసే ఉద్దేశ్యంతో, అతని బంధనాలు తొలగిపోవాలని నేను సత్సంగం చేయిస్తాను. ప్రపంచపు వల ఉన్న చోట పంథ, ధర్మ, గురువుల వల కూడా ఉంది. నేను నిర్బంధ, ఆప్త, వీతరాగపురుషుణ్ణి. మాయాతీతుడను. బంధనం నుండి విడిపించగోరుతాను. అందుకే ఈ నామదానం. ప్రస్తుతం ఇది ప్రబలమై ఉంది. బహుశా ఉంటుంది. దీని వలన జీవుడు ఒక బంధనం నుండి విడివడి రెండవ బంధనంలోకి రావాలి. బయటి గురువుతో సంబంధం పెట్టుకోవటం వలన అంతర్ముఖుడవుతాడు. నేను పైన చెప్పిన ఉద్దేశ్యాన్నే కబీర్ చెప్పాడు. దీనినే స్వామీజీ చెప్పాడు.

**గురునే అబ్ దీన్హా భేద్ అగమ్ కా । సురత్ చలీ తజ్ దేశ్ భరమ్ కా ॥**
**భట్‌కన్ ఛూటా దహర్ వ హరమ్ కా ॥**

దాతాదయాల్ నాకు రహస్యం చెప్పేవాడు. ఆ కాలం వేరు. ఆయన సైన్‌బైన్ లేదా సంకేతాలలో వాణి-శబ్దముల ద్వారా రహస్యం ఇచ్చాడు.

**ప్యార్ ఛాయా సే కియా, ఛాయా కా రూప్ జానా నహీఁ ।**
**తుమనే అపనే అవుర్ ఉస్‌కా రూప్ పహచానా నహీఁ ॥**

ఆ రోజుల్లో లేదా అంతకు ముందు పరదాలో గుప్తంగా ఉంచి రహస్యం చెప్పబడింది. నేను ఆ తెరను తీసేశాను. తెరను తొలగించటం వలన ఏం జరిగింది? పరమార్థంలో ఆసక్తిగల కొందరే నా దగ్గరికి వస్తారు. ఇతరులు రారు. రాలేరు. జనం నా వద్దకు రావాలని నేను కోరుకోను కూడా! నాకా అవసరం లేదు. ఎందుకు? ఎందుకంటే నేను నా కర్మను అనుభవిస్తున్నాను. నా అనుభవం చెప్పిపోతానని ప్రతిజ్ఞ చేశాను. కబీర్ కూడా ఈ శబ్ద్‌లో గురువు నీకు రహస్యం ఇస్తాడని రాశాడు.

**సతగురు దరశ్ హోయ్ జబ్ భాయీ, వేదేఁ తుమ్ కో నామ్ చితాయీ।**
**సురత్ శబ్ద్ దోవు భేద్ బతాయీ, తబ్ దేఖే అండ్ కే పారా హై ॥**

ఎవరిదైనా సురత్ శబ్దంను అందుకోకుంటే వారు అండం దాటి పోలేరు. బ్రహ్మాండం దాటిపోలేరు. నీ సురత్ రూపు రేఖలలో చిక్కువడి ఉన్నంత వరకు నీవు అండం దాటి పోజాలవు. గురువు ఏం చేస్తాడు? ఆ రహస్యం

ఇస్తాడు. అందుకే నన్ను నేను సంత సతగురువక్త్ అన్నాను. సత్సంగాలలో నేనేం చేస్తాను? పుస్తకాలలో ఏం రాస్తాను? ప్రపంచ రహస్యమే చెబుతాను. సతగురువు రహస్యం చెబుతాడన్నాడు కబీర్. నేను రహస్యం చెబుతున్నాను గనుక నన్ను నేను సత్‌గురువు అంటే తప్పేమిటి?

**సతగురు కృషా దృష్టి పహచానా, అండ శిఖర్ బేహద్ మైదానా ।**
**సహజ్ దాస్ తహాఁ రోపా థానా, జో అగ్ర దీప్ సర్‌దారా హై ॥**

సత గురువు కృపజూపాడు. ఏ కృప? అతడు రహస్యం చెప్పాడు. వాస్తవం చూపాడు. జీవులారా! నీవొక వేళ ఈ మాయ, కాలచక్రంల నుండి బయట పడదలచుకుంటే, జన్మ మరణాల చక్రం నుండి రక్షింపబడాలనుకుంటే, సతగురువు శరణులోకి వెళ్ళి రహస్యం తెలుసుకో. కానీ ఈ చక్రం నుండి బయటపడదలచుకోరెవరూ! మీ మనసులనడగండి. మీరు చేసే లీలంతా ఏమిటి? ఇవన్నీ మీ మనసులోని భావాలు. మనసు భావాలలో సిద్ధిశక్తి ఉంది. ఇచ్ఛాశక్తి పెరిగి ఉంటే ప్రేమ హృదయులైన-భక్తజనులలో తెలిసినా-తెలియకున్నా తనకు తానుగా రిద్ధి సిద్ధి అవుతుంటుంది. జీవుల తమతమ శ్రద్ధ విశ్వాసం, మనసు యొక్క ఏకాగ్రతల కారణంగా లాభం పొందుతారు. మేమేదో మంత్రం వేసి మీకు మేలు చేశామంటూ కీర్తి గురువులం తీసుకుంటాం.

ఈ జనన మరణ చక్రం ఎంతో ప్రబలమైనది. మొదట్లో విశ్వాసం లేదు. బహుశా జనన మరణాలు ఉండవని ఆలోచన వచ్చింది. హిందువులలో ఇదొక భ్రమ నెలకొని ఉందనిపించింది. కానీ జనన మరణ చక్రం ఉందని పరిస్థితులు చెబుతున్నాయి. నేను చాలా మందికి సంబంధించిన జన్మ కుండలిని భృగు సంహిత నుండి తీయించి పరిశీలించాను. వారి స్థితులను విన్నాను. హర్‌విలాస్ ఇక్కడే ఉన్నాడు. ఇతని కొడుకు జన్మ కుండలి తీశారు. అది తీసిన వ్యక్తి ఇతన్ని ఎంతగానో ప్రేమించే వ్యక్తి. భృగు సంహిత నుండి కుండలి తీసి చెప్పేవారు మోసం చేస్తారని నేనెలా అంగీకరిస్తాను? అందులో రాసినదంతా చదివి వినిపించాడు. ఇతడు ఎవరినో మోసగించాడని దానికి ప్రతిఫలంగా ఇతనికి జీవితంలో కష్టాలొచ్చాయి అని అందులో స్పష్టంగా రాసి ఉంది.

ఒక కుర్రవాడు ఐదేసి గంటలు అభ్యాసం చేస్తుంటాడు. అతడు నా దగ్గరికి వచ్చాడు. తక్కువగా మాట్లాడతాడు. ఆ జ్యోతిష్యుడు ఇతనిది కూడా కుండలి భృగుసంహిత నుండి తీసి ఇలా చెప్పాడు "ఈ కుర్రవాడు పూర్వజన్మలో

ఒకానొకప్పుడు ఎంతో పెద్ద పండితుడు. వేద శాస్త్రాలను నేర్చినవాడు. ఒక శిష్యునికీ, తన కొడుకుకూ ఒక ముఖ్య అంశంపై శిక్షణ నిచ్చేవాడు. ఓ రోజు పండితుని కొడుకు తండ్రితో అన్నాడు "నాన్నగారూ! సంపూర్ణ శిక్షణ ఈ శిష్యునికిస్తే నా గౌరవం తగ్గిపోతుంది. ప్రపంచంలో ఏ ఉన్నతిని పొంది యశస్సును గడించాలనుకుంటున్నానో అది దొరకదు" అన్నాడు. పండితుడు కొడుకు మాటల వలలో చిక్కుకున్నాడు. ఆయన శిష్యునికి అసలు విషయాన్ని చెప్పలేదు. సంపూర్ణ బోధననివ్వలేదు. తన పుత్రునికి సంపూర్ణ విద్యను ప్రదానం చేశాడు. తనకు బోధనలు పూర్తిగా లభించలేదని తెలిసిన శిష్యుడు ఆ తరువాత ఎంతో బాధపడ్డాడు. ఆ దుఃఖంతోనే మరణించాడు. పండితుడు శరీరం త్యజించినప్పుడు అతనికి విరుద్ధంగా ఏ ఫిర్యాదు లేదు. శిష్యుని పట్ల పక్షపాతం చూపిన ఈ ఒక్క విషయం తప్ప! పుత్ర వాత్సల్యం కారణంగా శిష్యునికి సంపూర్ణ బోధనలివ్వని నేరం ఒక్కటే అతను చేసింది. ఫలితంగా స్వర్గంలో ఉంచడానికి బదులు చేసిననేరానికి గాను పక్షియోనిలోకి పంపించబడ్డాడు అని భృగు సంహితలో ఉంది. నిజానిజాలు భగవంతునికే తెలుసు. కాని పరిస్థితుల కంటే ఈ కుండలిలు వేలాది సంవత్సరాలు ముందే రాసి ఉన్నాయి. దీనిని రూపొందించిన వారిని మనం విశ్వసిస్తాం. వారు ఎలాంటి మోసమూ చేయలేదని నమ్ముతాం. అందుకే మనం జనన మరణాలను విశ్వసిస్తాం. హిందువులే కాదు బౌద్ధులుకూడా నమ్ముతారు. సంతులు కూడా అంగీకరిస్తారు. పండితుని - కొడుకు ముసల్మానుగా జన్మించాడు. బెంగాల్‌లో చైతన్య మహాప్రభువు మానవదేహంలోకి వచ్చినప్పుడు 500 సంవంత్సరాల క్రితం అతడు ముసల్మానుగా జన్మించాడు. చైతన్య మహా ప్రభువుకు విరుద్ధంగా ఉండేవాడు. చైతన్య మహాప్రభువు ఆరతి చేస్తూ అతని దగ్గరగా వెళ్ళారు. ముందుగా అతడు పారిపోయాడు. తరువాత వచ్చాడు. ఆయన రేడియేషన్ వలన సంస్కారాల వలన ముస్లింగా జన్మించిన కుర్రవాని సంస్కారాలు మారాయి. చైతన్య మహాప్రభువు సాంగత్యంలోకి వచ్చాడు. ముస్లిం శరీరం తర్వాత ప్రస్తుతం అతనికి ఈ శరీరం లభించింది. ఇతడు ఈ జన్మంలో తన పరమార్థ సంపాదన పూర్తి చేసుకుని జనన మరణాలనుండి రక్షింపబడతాడు అని అందులో రాసి ఉంది.

నేను బ్రాహ్మణుణ్ణి. సంతులవద్దకు వచ్చాను. ఆలోచిస్తాను. ఆ విద్వాంసుడు ఒక చిన్న కుట్ర చేశాడు. తన కొడుకు గౌరవం పెంచడానికి శిష్యునికి పూర్ణ

శిక్షణ నివ్వలేదు. దాని ఫలితాన్ని అతడు అనుభవించవలసి వచ్చింది. ఇతర గురువులు తమ గురుత్వం కోసం, తమ గౌరవ ప్రతిష్టలకోసం, గద్దెల కోసం శిష్యులకు పూర్తి శిక్షణ నివ్వరు. సత్యమైన విషయం చెప్పరు. ప్రతి విషయాన్నీ తెరలో, ముసుగులో దాస్తారు. వాళ్ళెక్కడికిపోతారు? ఇక ఇప్పుడీ కర్మల వల నుండి బయటపడడానికి మీన జనన మరణాలు చక్రం శాశ్వతంగా సమాప్తం కావాలంటే ఏం చేయవలసి ఉంటుంది?

సాధారణులకు "ఉన్నదంతా నీ శరీరంలోనే ఉంది. ఆయన్ని అక్కడ వెదకు" అనే చెబుతాం. అలా చెబితే వారు స్థూలాన్ని దాటి పైకి పోతారు. సూక్ష్మ శరీరంలో ప్రవేశించినప్పుడు వారికి "ఉన్నదంతా నీ మనసులోనే ఉంది. ఈ స్థూల దేహంలో ఏమీ లేదు" అని చెప్పబడుతుంది. ఇక అతనికి మనసులో అనుభవం జరిగాక "ఉన్నదంతా సురత్‌లో ఉంది. నీవు సురత్‌ను దర్శించు" అని చెప్పటం జరుగుతుంది.

మీరు ప్రేమ వలన ఢిల్లీ నుండి యిక్కడికి వచ్చారు. నాకు కూడా కష్టం కలిగింది. ఇతరుల ఇంటికి వచ్చాను. కానీ ఈ ప్రేమ పిచ్చిది. ఎవరి వశంలోని విషయం కాదు. ఇది మనసు యొక్క భావం. మనసు పరిధిలోకి వచ్చిన మనిషి ఎవరైనా స్త్రీ యొక్క మోహంలో చిక్కుబడితే ఆమెను కలుసుకోవడానికి ఆమె సామీప్యాన్ని పొందడం కోసం తన గౌరవం, అగౌరవం ధనసంపదలను లెక్క చేయడు అలాగే జీవుడు ఈ మార్గంలో నడచినప్పుడు భగవదన్వేషణలో, పరమార్థ ఆసక్తిలోనో పయనించినప్పుడు ప్రాపంచిక గౌరవం, అగౌరవాలనుండి గానీ, లోకం ఏమనుకుంటుందోననే భయం నుండిగానీ ఎవరికైనా కష్టం కలుగుతుందా? లేదా అనిగాని చూడడు. మజ్నుకథ వినే ఉంటారు. మీకు అసలైన సత్యమైన మాట చెప్పటం నా విధి అనుకుంటాను. ఒకవేళ ప్రపంచంలోని వస్తువులను కోరి వస్తే మీకు ఎవరిపైన సంపూర్ణ విశ్వాసం ఉంటే వారిని విశ్వసించండి. నీ ఆశ ఎలా ఉంటే అలా జరుగుతుంది. ఒకవేళ నీవు నీ ఇంటికి వెళ్ళడానికే వస్తే నేను ఆ మార్గాన్ని తేటతెల్లం చేశాను. ఏమిటా మార్గం! నీ అంతరంలో శబ్దాన్ని అందుకో. నామాన్ని అందుకో! ప్రయత్నించు. భూప్‌సింగ్ ఉన్నాడు. మాస్టర్ మోహన్‌లాల్ ఉన్నాడు. మామ్‌చంద్ ఉన్నాడు. మీరు శబ్దాన్ని గ్రహించ లేకపోతే పైకి వెళ్ళజాలరు. అయితే దానికి చికిత్స ఏమిటంటే ఏ గురురూపాన్ని నీవు నీ అంతరంలో ఏర్పర్చుకుంటావో ఆయన్ని బాబా ఫకీర్

మస్త్‌రామ్ యొక్క పుత్రుడని భావించకు. ఆయన్ని శబ్దస్వరూపుడనీ, భగవంతుడనీ అనుకో. అందుకే సంతులు లేదా ధార్మిక జగతి వారు రోచకమైన మాటలను చెప్పి కృష్ణుణ్ణి బ్రహ్మ యొక్క అవతారం అని చెప్పి ప్రజలు విశ్వాసాన్ని పెంచారు. దీని వలన కృష్ణుణ్ణి ధ్యానించినపుడు వారికి విశ్వాసం కుదిరితే వారు ఆ రూపాన్ని బ్రిజ్ దేశంలో పుట్టిన కృష్ణుడనుకోరు. వారు ఆ కృష్ణ స్వరూపాన్ని బ్రహ్మ స్వరూపం అని భావిస్తారు. అందుకే సంతులు చెప్పారు:

గురు ర్బ్రహ్మ గురు ర్విష్ణు గురు ర్దేవో మహేశ్వర: ।
గురు స్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమ: ॥

"అందరికీ శాంతి"

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## సత్సంగం

## పరమ శాంతి

## 31-5-1970 - అమృతసర్

నేను గత మాసంలో కూడా ఇక్కడికి వచ్చాను. నా జీవితానుభవాలను మీకు చెప్పాను. రాధాస్వామి మతం లేదా సంత్ మతం శిక్షణల నుండి, బోధనల నుండి నాకు పరమశాంతి లభించింది. అందుకే నేనీ సంత్ మతాన్ని ప్రశంసిస్తాను.

'సత్ గురు' అని ఎవరిని అనవచ్చు? అనే సందేహం చాలా మందికి కలుగుతుంటుంది. సత్యమైన రహస్యం, సత్యమైన జ్ఞానాల పేరే సత్‌గురునామం. సత్ గురువు సత్య జ్ఞానప్రదానం చేస్తాడు. రాధాస్వామి దయాల్ వాణి ఇలా ఉంది.

"గురునే దీనా భేద్ అగమ్‌కా, సురత్ చలీ తజ్ దేశ్ భరమ్‌కా ।
బల్‌పాయా అబ్ విరహ మరమ్‌కా, భటకన్ ఛూటా దైరో హరమ్‌కా" ॥

స్వామీజీ ఈ శబ్దంతో చెబుతున్నారిలా "గురువు ఒకానొక రహస్యం, అసలు విషయం విప్పి చెప్పగానే అటూ ఇటూ వ్యాకుల పడుతూ తిరగడం

ఆగిపోయింది. జనన మరణాల గురించి, 84 లక్షల జీవరాశుల జన్మలెత్తవలసి వస్తుందేమోనన్న భయం క్రమంగా తగ్గిపోసాగింది. 84 లక్షల జన్మల నుండి తప్పించుకోవడానికి మనిషి ఎన్నెన్ని ఉపాయాలు, మార్గాలు వెదుక్కుంటాడు? ఇందుకోసం బ్యాస్‌కి వెళ్తాడు. ఆగ్రాకి వెళ్తాడు లేదా మరో చోటికి వెళ్ళి గురువు ఎదురుగా చేతులు కట్టుకుని తిరుగుతాడు. ఈ విధంగా చేసినందున 84 లక్షల జన్మలు తప్పిపోతాయా? తమ్ముడూ! ఏ మాత్రం తప్పవు. నీకు అసలైన జ్ఞానం ప్రాప్తించనంతవరకు ఈ 84 లక్షల జన్మల బాధ తప్పించుకోలేవు. బాబా సావన్‌సింగ్‌నో, బాబా ఫకీర్ చంద్‌నో, రాముడినో, కృష్ణుడినో, గురువునో, ఇష్టదైవంగా భావించుకున్నా 84 లక్షల జీవరాసుల యోనుల్లో ప్రవేశించే భ్రమ, భయం తొలగిపోదు. వాస్తవమేమిటనేది తెలిసినపుడే ఈ భ్రమలు తొలగిపోతాయి.

ఆ రహస్యం, ఆ వాస్తవం ఈ రోజు నేను ఈ సత్సంగంలో మీకు విప్పి చెప్పాలనుకుంటున్నాను. ఇది అందరికీ అర్థం కాకపోవచ్చు. ఎందుకంటే అందరి మనస్సులూ ఒకేలా ఉండవు. స్థిరంగా ఉండవు. సురత్ స్థిరంగా లేదు. మనిషి మనసు, సురత్ స్థిరం కానంతవరకు జ్ఞానం కలగదు. మనసును స్థిరం చేసేటందుకు సంతులు సుమిరణ, ధ్యాన, భజనల పద్ధతి చూపించారు. సుమిరణ్, ధ్యాన్, భజనల వల్ల మనసు నెమ్మదిగా ఏకాగ్రమవుతుంది. అప్పుడు నీవు గురువు బోధనలను అర్థం చేసుకోవడానికి యోగ్యుడవుతావు. ఈ స్థిరత్వం వలన మనసుకు శాంతి లభిస్తుంది.

**బర్‌సన్ లాగా మేఘ్ కరమ్‌కా, సంశయ భాగా జనమ మరణ్ కా ।**
**తోడ్ దియా సబ్ జాల్ నిగమ్ కా, సుఖ్ పాయా అబ్ హమ్ దమ్ దమ్ కా ॥**

నేను సంత్ సద్గురు వక్త్ నని ఇంతకు ముందే చెప్పాను. ఈ మాట నేను గర్వంతో అన్నది కాదు. నేను మీకు సత్యమైన జ్ఞాన ప్రదానం చేస్తున్నానని నన్ను నేను సద్గురువు అని అన్నాను. నీ మరణ సమయంలో గురువు వచ్చి నిన్ను తీసుకువెళ్తాడని భయంకరమైన మాటల వలలో పడి నీవు మోసగింపబడుతున్నావు. నేను మిమ్మల్ని ఈ మోసం నుండి తప్పించాలనుకుంటున్నాను. బాబా ఫకీర్ అంత్య సమయంలో మిమ్మల్ని సత్ లోకానికి తీసుకుపోవడానికి వస్తాడన్న భ్రమతో మానవతా మందిరానికి మీరు డబ్బులిస్తే చాలా పొరపాటు. బాబా ఫకీర్ మిమ్మల్ని సత్యలోకానికి తీసుకుపోతాడనుకోవడం మీ బలహీనత. ఈ భ్రమతో మందిరానికి పైసలివ్వకండి.

ప్రతి వ్యక్తికీ అంత్య సమయంలో ఫిలిం రీలులా అతని జీవితంలో గడిచిన సంఘటనలు వరుసగా జ్ఞాపకానికి వస్తాయి అని రాయసాలిగ్రాం సాహెబ్ తన 'ప్రేమబాణి'లో స్పష్టంగా రాశాడు. ఏయే వ్యక్తులతో అతనికి ప్రేమ అభిమానాలు, బంధాలు ఉన్నాయో వాళ్ళంతా ఆ సమయంలో అతని మనో నేత్రానికి కనిపిస్తారు. ఏ గురువు దగ్గర నామదానం పొందాడో ఆ గురువు కూడా కనిపిస్తాడు. శాశ్వతంగా ఈ భ్రమల నుండి రక్షింపబడతల్చుకుంటున్న వారికి, తప్పించుకోదల్చుకుంటున్న వారికి నేనీ రహస్యం చెప్పదల్చుకున్నాను. నీవు చూస్తున్నది నీ మనసు యొక్క ఆలోచనా విచారాలే! మీరంతా అజ్ఞానంలో ఉన్నారు. ఎవరి అంతరంలోనైనా రాముడు కనిపిస్తే ఆ రాముడే క్లిష్టమైన తన పనిచేసి పెట్టాడని భావించి కృతజ్ఞతగా ఓ రామమందిరం కట్టించాడు. మరొకతను కృష్ణుడే తనని ఆపదలో ఆదుకున్నాడనుకుని కృష్ణుని మందిరం నిర్మించాడు. నేను మీకీ విషయం స్పష్టంగా చెబుతున్నాను. తమ్ముడూ! బయటి నుండి రాముడుగానీ, కృష్ణుడు గానీ, బాబాసావన్‌సింగ్ గానీ, బాబా ఫకీర్ గానీ, ఇతర గురువు గానీ, మహాత్ముడు గానీ ఎవరూ రారు. ఇదంతా ఒక ఆట! నీ మనసు ఆడే ఆట. భట్నాగర్ సాహెబ్! నీవు పదే పదే నన్ను అమృత్‌సర్‌కి పిలుస్తావు. నేను వస్తాను. కాని ఇక్కడ కూర్చున్న మీలో చాలా మందికి నా సత్సంగం వినే యోగ్యత లేదని నాకు తెలుసు. నేను సంత్ సద్గురు వక్త్. వక్త్ అంటే సమయం. సమయానుసారం, ఆవశ్యకతానుసారం బోధిస్తున్నాను. అమాయకులైన మీకు అసలు విషయం తెలియదు. నేను వచ్చాను. మిమ్మల్ని నా వలలో వేసుకున్నాను. మీరు చిక్కుకున్నారు. మరొకడు వచ్చాడు.తన వలలో మిమ్మల్ని బంధించాడు. మీరు చిక్కుపడ్డారు. వచ్చేవారంతా మిమ్మల్ని బంధిస్తూనే ఉన్నారు. సత్యాన్ని ఎవరూ విప్పి చెప్పలేదు. ఆర్య సమాజం వారు వచ్చి నిన్ను ఆర్యసమాజంలో కలుపుకున్నారు. సిక్కులు వచ్చి తమ మతంలోని గొప్ప గుణాల్ని వర్ణించి మిమ్మల్ని అటువైపు ఆకర్షించి సిక్కును చేశారు. జైనులు జైనమతంలోకి నిన్ను ఆకర్షించారు. క్రైస్తవులు నిన్ను క్రైస్తవుణ్ణి చేశారు. ముస్లిములు నిన్ను ముస్లింగా మార్చారు.

**గురు నే దీనా భేద్ అగమ్ కా, సురత్ చలీ తజ్ భేద్ భరమ్ కా ॥**

ఓ నా ప్రియమైన సత్సంగీయులారా! మీ అనుభవాలవల్ల నా భ్రమలు దూరమయ్యాయి. నేను నిజగృహానికి వెళ్ళేందుకు యోగ్యుడినయ్యాను. నా

రూపం భారతదేశంలోనే గాక అమెరికా, ఆఫ్రికా, కెనడా, యూరప్ దేశస్థుల అంతరాల్లో ప్రకటించిందని తెలిసింది. నేను అంత దూరం వాళ్ళ అంతరాల్లోకి వెళ్ళలేదు గదా? ఈ విషయం తెలిసిన తర్వాత నాకళ్ళు తెరుచుకున్నాయి. దృఢ విశ్వాసం కలిగింది. ఒకప్పుడు నాకు కనిపించిన రూపం, ఉత్పన్నమైన భావాలు, విచారాలు నిజానికి లేవు. వాటికి అస్తిత్వం లేదు. కాని స్ఫురించేవి. నాలో నిజగృహానికి, ధామానికి చేరుకోవాలనే కోరిక బలంగా వుండేది. ఒక తహ తహ, తపన, ప్రగాఢమైన వాంఛ ఉండేది. అందుకే నేను రూపం, రంగు మొదలైన వాటిని విడిచిపెట్టి ప్రకాశం లేదా పరబ్రహ్మ వైపు వివశుడనై వెళ్ళిపోయాను. మనసు లోపల ఉన్న విచారాలన్నీ మాయేననే రహస్యం నాకు అవగతమైంది. నేను పై స్థాయిలో సత్సంగం చెబుతున్నానని నాకు తెలుసు. అసలైన ధామానికి, నిజగృహానికి అనగా మనం ఏ ఇంటి నుండి వచ్చామో తిరిగి ఆ ఇంటికి వెళ్ళడానికి జీవులకు శక్తి లేదని నాకు తెలుసు. ప్రయత్నం చేయడం వల్ల అక్కడికి చేరుకోవచ్చు. ఈ ప్రయత్నం ఏమిటి? పూర్ణ గురువు శరణంలోకి, సాంగత్యంలోకి వెళ్ళి కూర్చోవటం, అయన్ని దర్శించుకోవటం, ఆయన్ని మనస్ఫూర్తిగా ప్రేమించటం, ఆయన వచనాల్ని శ్రద్ధాసక్తులతో వినటం, మననం చేయటం ముఖ్యం. సత్యసాధనలో సత్యమార్గంలో వీటిని ముఖ్య కర్మలని చెబుతారు. ఎవరికోసం ఇవి అంటే నిజగృహానికి తిరిగి వెళ్ళగోరే వారికోసమే అని చెప్పవచ్చు. ప్రపంచంలో సత్యమైన శాంతి దొరకలేదనుకునేవారికీ, 84 లక్షల జన్మలని తప్పించుకునే చింతలో ఉన్న వారి కోసమే ఈపై సూత్రాలు వర్తిస్తాయని చెప్పవచ్చు. ఈ మార్గం ప్రాపంచిక జీవులందరి కోసం కాదు. ప్రపంచంలో ఉంటూ మంచి విచారాలు పెట్టుకో. ఎందుకంటే మనిషి విచారాలు దృఢమైనప్పుడవి రూపం ఏర్పర్చుకుంటాయి. నీ విచారాలు సంకల్పాలు అతి తీవ్రమైన వైన కారణాన, ప్రేమ కారణాన దృఢమైనప్పుడవి స్థూలరూప ధారణ చేసుకుంటాయి.

ఇది మనోమయ జగత్తు. ఇప్పుడు దీని అనుభవం కలిగింది. ఇక్కడ ఎదురుగా ఒక తాడు పడి ఉందనుకొండి. చీకట్లో నీవు దూరంనుండి చూసి పాముగా భావించవచ్చు. పామనే భ్రమవల్ల నీవు దానికి దూరంగా పారిపోతావు. ఎందుకంటే దాన్ని నీవు తాడనుకోక పామనుకున్నావు. నిజగృహం వెళ్ళాలని తీవ్రమైన కోరిక గల వారి భ్రమలను దూరం చేయదల్చుకున్నాను.

సూరత్ సింహ అనే ఓ సత్సంగి ఉండేవాడు. **475/-** రూపాయల వేతనంతో కలకత్తాలో లోకోఫోర్మెన్‌గా ఉద్యోగం చేసేవాడు. దాతాదయాళుని సమాధి తయారయ్యేటప్పుడు ఆయన అంతరంలో నా రూపం ప్రగటమైందట. సూరత్ సింహను **501/-** రూపాయల్ని రాధాస్వామి ధామంకు పంపించుమని నా రూపం అతనిని ఆదేశించిందట. ఈ విషయం నాతో చెప్పాడతడు. కాని " నేను నీలోకి రాలేదు. డబ్బు అడగలేదు" అని నేను ఆ రోజు ఆయనకు స్పష్టంగా చెప్పలేదు. అతను చెప్పేది వింటూ మౌనంగా ఊర్కుండిపోయాను. అతను **501** రూపాయలు ధామానికి పంపించాడు. ఒక సంవత్సరం తర్వాత సూరత్ సింహ ఏదో చెడు కర్మ చేశాడు. దాని పరిణామం అతడు అనుభవించాల్సి వచ్చింది. ఆ సంకటసమయంలో సూరత్‌సింగ్ నాకు ఉత్తరం రాశాడు. దాని సారాంశం ఇలా ఉంది. "బాబా! నీవు తమాషా మనిషివి సుమా! నీకు పైసలు అవసరమైనప్పుడు తెప్పించుకున్నావు. నేను పంపించాను. కానీ నేను చెడు పనులు చేస్తున్నప్పుడు నన్నెందుకు వారించలేదు. ఈ విధంగా ఎందుకు చేశావు" అని అడిగాడు. ఆ చెడు పని చేసిన ఫలితంగా అతను పిచ్చివాడయ్యాడు. ఒకటిన్నర సంవత్సరంలోగా మరణించాడు. అందుకే నేను మీ భ్రమల్ని తొలగించదలచాను. మీ అనుభవాలు నా భ్రమలను దూరం చేశాయి. మీలో నా రూపం ప్రకటిస్తుంది. కానీ అది నేను కాదు. నాలో ప్రకటించిన రూపాలు కూడా నిజానికి అవి ఎక్కడినుండో రాలేదు. ప్రకాశం శరీరంలోకి ప్రవేశించినపుడే మనుసు, బుద్ధి, చిత్తం, అహంకారం ఉద్భవిస్తాయి. నేను ఇప్పుడు ఎక్కడ సాధన చేస్తాను?

**బరసన్ లాగా మేఘ కర్‌మకా, సంశయ భాగా జనమ మరణ్‌కా ॥**
**తోడ్ దియా సబ్ జాల్ నిగమ్ కా, సుఖ్ పాయా అబ్ హంహందంకా ॥**
**ఫల్ పాయా హమ్ ఆజ్ సమ్ దమ్ కా, భవర్ హువా మన్ సేత్ పదమ్ కా ॥**

సేత్ అంటే శ్వేత వర్ణం, తెలుపు రంగు- ఆ పరబ్రహ్మ శ్వేతవర్ణంలో ఉన్న ప్రకాశం. నేను అక్కడికి వెళ్ళేందుకు యోగ్యుడినయ్యాను. ఎందుకంటే మనసులోని విచారాలన్నీ మాయేననే అసలు విషయం నాకు అర్థమైపోయింది. సంకల్పం దృఢమై పోతుంది. అందుకే మీకు పదే పదే జాగృతి కలిగిస్తున్నాను. ఎప్పుడూ ఎవరి విషయంలోనూ చెడుగా ఆలోచించకు. ఒకవేళ నీవు ఎవరి విషయంలోనైనా చెడుగా ఆలోచిస్తే దాని ప్రభావం వెంటనే నీపై పడుతుంది. రోజంతా

గొణుగుతూ వుండి, ఎవరినైనా ద్వేషిస్తుంటే, దురాలోచనలు చేస్తుంటే ఆ చెడు విచారాలు నీకు హాని కలిగిస్తాయి. ఎవరి గురించైతే నీవు ఆలోచిస్తున్నావో వారికి కష్టాలొస్తాయి. ద్వేషం, వైరం మొదలైన వ్యతిరేక భావనలతో నిండిన నీ ఆలోచనలు తీయని విషంగా మారి నీ సుఖశాంతుల్ని హరించి, తీరని నష్టం కలిగించి నీ పతన్నానికీ, నష్టానికీ, కష్టాలకీ కారణం అవుతాయి. గురువేం చేయగలడు? నీకు ఏదో మాయమంత్రం చేసి, చమత్కారం చూపి క్షణాల వ్యవధిలో నీ కష్టాలనైతే హరించడు కదా! ఆయన నీకు పరమార్థపరమైన సత్యాన్ని, అసలు విషయాన్ని బోధిస్తాడు. నీవు సిక్కువు. నేను హిందువును. నేను పొరపాటున కూడా గురునానక్ సాహెబ్‌ను విమర్శిస్తే నీవు నా తల తీసెయ్యడానికి పరుగెత్తుకొస్తావు. స్వామీజీ తన వాణిలో వశిష్ఠుణ్ణి, పరాశరుణ్ణి, వ్యాసుణ్ణి, వేదాంతుల్ని ఎవర్నీ విడిచిపెట్టకుండా అందర్నీ విమర్శించాడు. అయితే ఆయన్ని కొట్టడానికి పరుగెత్తామా? లేదు! ఆయన అనుభవంలోకి వచ్చినదాన్నే ఆయన చెప్పాడు. ప్రతివారికీ తమ తమ అనుభవాల్ని చెప్పే హక్కు ఉంటుంది. విను :-

**గురునే దీనా భేద్ అగమ్‌కా, సురత్ చలీ తజ్ దేశ్ భరమ్‌కా ।**
**బల్ పాయా అబ్ విరహ మరంకా, భటకన్ ఛూటా దైరోహరంకా ॥**

ఐతే నరకం-స్వర్గం ఏమిటి? ఎలా ఉంటాయి? ఎక్కడుంటాయి? అని సందేహాలు రావటం సహజమే! మనం శుభవిచారాలుంచుకోవటం, ఆనందంగా ఉండటం స్వర్గం. చెడు విచారాల కారణంగా దుఃఖపడటమే నరకం. నాకు ఈ స్వర్గం నరకంల అనుభవాలెలా అయ్యాయో చెబుతాను వినండి.

కొన్ని నెలలకు పూర్వం ఇక్కడికి వచ్చాను. అప్పుడు హజారీసింగ్ అనే ఓ సుబేదారు నా వద్దకు వచ్చాడు. ఆయన జరిగిన ఒక యథార్థ సంఘటనను ఇలా వివరించాడు. "బాబాజీ! మా చిన్నాయనను భయంకరమైన పుండు బాధించింది. దానికి డాక్టర్లు ఆపరేషన్ చేశారు. కానీ అతనిక బ్రతకడని వాళ్ళు అనుమానం వ్యక్తం చేశారు. మా చిన్నాయన ఆపరేషన్ తర్వాత సుమారు గంటన్నర తర్వాత స్పృహలోకి వచ్చాడు. మెలుకువ వస్తూనే నన్ను పిలిచి "హజారీ సింగ్! ఈ రోజు నా ప్రాణాల్ని నువ్వే రక్షించావు సుమా" అంటూ అతనికి కలలో జరిగిన అనుభవం ఇలా చెప్పాడు. "నా సూక్ష్మ శరీరాన్ని ఎవరో వచ్చి తీసుకువెళ్ళసాగారు. కొంచెం ముందుకు వెళ్ళాక ఓ భయంకరాకృతి గల

స్త్రీ కనిపించింది. ఆమె ఎదురుగా సూక్ష్మశరీరాలు అనేకం ఉన్నాయి. ఆమె వాటిని తింటోంది. నేను భయపడ్డాను. ఇక ఆమె నన్ను కూడా తినేస్తుందని, ఎలాగైనా చావు తప్పదని తీర్మానించుకున్నాను. ధైర్యం తెచ్చుకుని నేను హజారీసింగ్‌ని కలుసుకోవాలని అడిగాను. అంతలోనే నువ్వొచ్చావు. బాబూ హజారీ! ఎలాగైనా బాబాజీతో చెప్పి నన్ను విడిపించు, రక్షించుమని బాబాతో చెప్పు" అని నిన్ను వేడుకున్నాను. అదే క్షణంలో బాబాజీ అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఆయన ఆ భయంకర స్త్రీమూర్తి వైపు చూస్తూ, "ఈ వ్యక్తిని నీవు తినలేవు. తిరిగి నీ స్థావరానికి వెళ్ళిపో" అన్నాడు. నన్ను జోరుగా విసిరిపారేశాడు. నాకు మెలకువ వచ్చింది" అన్నాడు.

ఈ విషయం వివరంగా హజారీసింగ్ చెబుతుంటే విన్నాను. నేను హజారిసింగ్ చిన్నాయన దగ్గరికి వెళ్ళానా? అతన చూసిన నరకం ఎక్కడిది? అది అతని మనసు యొక్క కల్పనే? మనసు యొక్క కల్పనే మాయ. నీ విచారాలు చెడువై వుంటే స్వప్నాలు కూడా భయంకరమైనవి, దుస్వప్నాలే వస్తాయి. అవి భయపెడతాయి. బయటి నుండి రాముడో, కృష్ణుడో, భూతమో ఏదీ రాదు. ఎవరూ రారు. ఇది నీలోనే దాగుంది. నీ మనసే మంచీ-చెడుల ఆకృతులు తయారుచేసుకుంటుంది.

పాపం, పుణ్యాం, స్వర్గం, నరకాలను నేనెలా అర్థంచేసుకున్నాను? ఇవన్నీ మనసు యొక్క విచారాలే నని తెల్సుకున్నాను. ప్రకాశం, శబ్దం, సత్‌లను పొందేటందుకు ప్రయాసపడ్డాను. మీరూ, నేనూ అందరమూ సత్పురుషుని అంశలమే! "ఓ సురత్! నీవు ఆ భగవంతుని అంశానివి. శబ్ద బ్రహ్మ లేక పారబ్రహ్మ యొక్క అంశానివే! నీవు మాయలో ఎందుకు చిక్కుకొన్నావు. ఇక్కడికి ఎందుకు వచ్చావు? నీ నిజరూపాన్ని, వాస్తవాన్ని ఎందుకు మర్చి పోయావు?"

నేనెవరిని అని నేను చాలాసార్లు ఆలోచిస్తాను. ప్రకాశంలో ఉంటూ ప్రకాశాన్ని చూసే వస్తువు, శబ్దంలో ఉంటూ శబ్దాన్ని వినే వస్తువు ఏదైతే ఉందో ఆ వస్తువునే నేను. ఈ నా స్వరూపాన్ని ఆకహ, అపార్, అగాధ్, అనామీ అంటారు. దీనికి రూపం లేదు. రంగు లేదు. అది అలఖ్ కాదు. అకహ కాదు. అలఖ్ అంటే రాయులేనిది. అకహ అంటే చెప్పలేనిది. ఈ రెండూ కాదని భావం. ఏదీకాక పోయినా ఆ వస్తువు మాత్రం ఉంది. ఆ వస్తువు ఉందనటంలో

సందేహం ఏ మాత్రం లేదు. కానీ అదేమిటో చెప్పేటందుకు ఎవరికీ హక్కులేదు. శబ్ద ప్రకాశాల అస్థిత్వం వల్ల చేతనాశక్తి ఉత్పన్నమవుతుంది. నేను ఆ చైతన్యపు బిందువును. భగవదేచ్ఛ మేరకు శబ్దం, ప్రకాశం ప్రకటమైనందున నేను నేనెవరినో తెలుసుకోగలిగాను. ఆయన ఇచ్ఛా మేరకు, సంకల్పం మేరకు ఎలా ఆడించినా ఆడతాను. నన్నెక్కడ ఉంచితే అక్కడుంటాను.

సముద్రం సంక్షోభం వలన చంద్రుడు, నక్షత్రాలు, ఏనుగు, గుర్రాలు తయారవుతుంటాయి. దీని వలన శరీరం కూడా ఏర్పడుతుంది. మరో జన్మ ఎత్తాల్సి వస్తుందేమోనన్న నా భయం, బాధ ఇప్పుడు శాంతించాయి. జనన మరణాల భ్రమ తొలగిపోయింది.

నేనొక అన్వేషిని. ఏదో ఒక వస్తువు కోసం నిరంతరం అన్వేషించేవాడిని. నా రాముడు ఎక్కడున్నాడో తెలుసుకోగోరే వాణ్ణి. ఆయన అనంతుడు, కూటస్థుడు. గతి, చలనం ఏర్పడినప్పుడు శబ్దం, ప్రకాశం పుడతాయి. ఒక చేతనాశక్తి ఉత్పన్నమవుతుంది.

ఈ రహస్యం వల్ల ఏ విషయం స్పష్టమైంది? శాంతి, పరమశాంతి లభించింది. భ్రమలు దూరం అయ్యాయి. కర్మమనే మేఘం అంటే ఏమిటో తెలిసిపోయింది. ఇది అనుభవ జ్ఞానం. నేను బాల్యంనుండే భగవంతుణ్ణి కలుసుకోవడానికి బయల్దేరాను. ఆ భగవంతుణ్ణి కొన్నిసార్లు రామునిరూపంలో, కొన్ని సార్లు కృష్ణుని రూపంలో, ఆ తరువాత కొన్నిసార్లు దాతాదయాళుని రూపంలో భక్తి ప్రపత్తులతో కొలిచే వాణ్ణి. ఇదంతా నా మనస్సు యొక్క చక్రమే అని విశ్వాసం కలిగాక నా భ్రమలు విడిపోయాయి. ఇప్పుడు నేను పారబ్రహ్మ, శబ్ద బ్రహ్మల పట్ల భక్తి చూపుతాను. ఇదే నాల్గవ పదం, చౌథాపదం.

అసలైన భక్తి మహిమ సంతులకే తెలుస్తుంది. ప్రకాశం, శబ్దాలపట్ల చూపే భక్తే అసలైన భక్తి. అదే మన సత్ కర్త. ప్రపంచంలో ఉండండి. ప్రపంచంలో ఉంటూ మీపనులు, బాధ్యతలు నిర్వర్తించండి. కాని జీవనలక్ష్యంగా మీ ఇష్టునిగా, ఓ సత్పురుషుణ్ణి భావించుకొనండి. ఫకీర్ చంద్‌నే పూజించాలని నేను కోరటం లేదు. ఆ విధంగా చెబితే మోసం అవుతుంది. మీకెవరిపై నమ్మకం వుంటే ఆ ఒక్కరినే పరిపూర్ణంగా విశ్వసించండి.

నిన్న సాయంత్రం వి.వి. భట్నాగర్ గారి భార్య ఓ విషయం చెప్పింది.

ఒకసారి ఆమె చిన్న కొడుకు రాహుల్ నాలుగేళ్ళ ప్రాయంలో ఉన్నప్పుడు వాడిని అమృతసర్‌లోనే విడిచి కొన్ని రోజుల కోసం తను మరో వూరు వెళ్ళవలసి వచ్చిందట. తల్లిని వెళ్ళిపొమ్మని అన్నా ఆమె వెళ్ళిన తర్వాత పదే పదే అతనికి తల్లి జ్ఞాపకం వచ్చేది. "అటు చూడు! అమ్మ వచ్చేసింది. కూర్చుంది. మాట్లాడుతోంది" అనేవాడు. కాని తల్లి ఎక్కడి నుండి వచ్చింది; ఆమె ఊరికి వెళ్ళింది కదా! మరి రాహుల్ దగ్గరికి ఎవరు వచ్చారు? అతని ఊహ, ఆలోచన.

ప్రతి గ్రంథంలో పూర్ణ గురువు మహిమ వివరించబడింది. పూర్ణ జ్ఞానాన్ని, పూర్ణ వివేకాన్ని పూర్ణ గురువు అని అంటారు. సుఖమని సాహెబ్‌లో రాశారు.

సత్పురుష్ జిన్ వివేక్ కియా, సతగురు తిన్ కా నామ్ ।
తాకే సంగ్ శిష్ ఉభరే, నానక్ హరి గున్ గాన్ ॥

ఈ పంథాయిలోకి, ఈ సంత్ మతం లోకి వచ్చినందుకు నాకు శాంతి, పరమ శాంతి లభించింది. మీ అంతరంలోకి వెళ్ళండి. బయటేమీ లేదు అంతే!

"అందరికీ రాధాస్వామి"

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## సత్సంగం

## సారతత్వసత్యం - శాంతి - వాస్తవం

1905లో రాముణ్ణి దర్శించాలని కంటికి మంటికి ఏకధారగా విలపించే వాడిని. ఒకరోజు 24 గంటలపాటు నిర్విరామంగా రోదించిన తరువాత ప్రాతః కాలంలో సుమారు అయిదుగంటలకు నా ఆరాధ్య దైవం రూపంలో దాతాదయాళ్ మహర్షి శివవ్రత్‌లాల్‌జీ మహారాజ్ సాక్షాత్కరించారు. ఆ రోజు నుండి ప్రతివారం ఒక ఉత్తరం ఆయనకి రాసేవాణ్ణి. పదినెలలు గడిచిన తరువాత ఆయన నుండి నాకు జవాబుగా వుత్తరం వచ్చింది. అందులో ఆయనిలా రాశారు, "ఫకీర్! నీ ఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. నీ భావనలకు విలువిస్తాను. సారతత్వం, సత్యం, శాంతి, రాధాస్వామి మతంలో నాకు హుజూర్ రాయ్‌సాలిగ్రాం మహారాజ్ ద్వారా ప్రాప్తించాయి. నా ఈ మార్గంలో నడిచేందుకు నీకు అభ్యంతరం

లేకుంటే నీవు లాహోర్‌కి వచ్చి నన్ను కలవవచ్చు''..... తన సన్నిధిలోకి వెళ్ళిన నాకు ఆయన "సారబచన్" ఇచ్చి చదువుకోమన్నారు. అందులో ప్రస్తావించిన మాయ సంవాదం చదివి ఎంతో గాబరాపడ్డాను. ఎందుకంటే అందులో అన్ని ధర్మాల ఖండన కనిపించింది. అన్ని ధర్మాలు, వేదాంతాలూ, సూఫీ మతాలు, అన్నీ కాలపురుషుని మాయా ప్రభావంలోనివే నని చెబుతూ సంత్ మతం ఒక్కటే నిర్మలమైనదీ, సత్యమైనదీ అని అందులో వర్ణింపబడింది. నన్ను చూసిన దాతాదయాళ్, "ఫకీర్! "సారబచన్" ని పక్కనపెట్టు. సంత్ కబీర్ శబ్దావళి, హుజూర్ మహారాజ్ జీవనచరిత్రల్ని కూడా చదువు" అంటూ ఆ పుస్తకాలిచ్చారు. ఆ తరువాత ఆయన నాకు "నామదానం" ఇచ్చారు. ఈ మార్గంలో నడుస్తున్నందువల్ల, ఆచరించటం వలన, నాకే జ్ఞానం లభించినా దానిని ప్రపంచానికి అందిస్తానని ఆరోజే ప్రతిజ్ఞ చేశాను. నిబల, అబల, అజ్ఞానులైన జీవులకు జ్ఞానం ప్రసాదించుమని, మానవజాతి నుద్ధరించుమని, భవసాగరం నుండి దాటిపోయేందుకు నిజ అనుభవాలను వెల్లడించుమని దాతాదయాల్ నన్నాదేశించారు. నేను అనుభవించిన స్థితినే, సంఘటనలే మీకు వివరిస్తాను.

సత్యం, శాంతిలపై నా నిజ అనుభవాలను వర్ణిస్తాను.

వాస్తవం అంటే ఏమిటి? నిజానికి ఈ యావత్ప్రపంచం, మనిషి ఏమిటనేది చెప్పే జ్ఞానమే వాస్తవం. ఈ వాస్తవం నాకు ఏ విధంగా తెలిసిందో, దేనిని నేను వాస్తవమని భావిం నో అదే మీకు చెబుతాను. గురు పదవికి వచ్చిన్నుండీ నారూపం కనిపించి తమకు కావలసిన సాయం అందించిందనీ, జాగ్రదవస్థల్లో , స్వప్నావస్థల్లో వారివారి ఆపదలు గట్టెక్కించిందనీ, మృత్యుసమయంలో కూడా నారూపం దర్శన మిచ్చి పల్లకీ తెచ్చిందనీ ఇలా ఎందరెందరో విభిన్న ప్రాంతాల నుండి, దేశ విదేశాల నుండీ నాకు ఉత్తరాలు రాశారు. నన్ను కలిసినపుడు చెబుతారు. నా రూపం వారికి ప్రకటమై సహాయం చేసిందని విని నేను ఆశ్చర్య పోతుంటాను. నేను వెళ్ళలేదు కాబట్టి నాకా విషయాలు ఏమీ తెలియవు. దీనిని బట్టి నాలో ప్రకటించిన రూపాలూ, కనిపించిన దృశ్యాలు కూడా బయటి నుండి రాలేదని నాకు అర్థమైపోయింది. ఇవన్నీ మనస్సు ఏర్పర్చుకున్న రూపాలేనని నిశ్చయించుకున్నాను. మనిషి చూసింది తన మనస్సు రూపమే నన్నమాట! జాగ్రదవస్థలో, స్వప్నావస్థలో, సుషుప్త్యావస్థలో, తురియా వస్థలో, తురియాతీతా

వస్థలో లేక సహస్రదళ కమలం, త్రికుటీ, సున్న్, మహాసున్న్ల స్థానాలలో ప్రకటమైనవన్నీ బాహ్య జగత్తు ప్రభావాలూ, సంస్కారాలే. మనిషి మేధస్సు పైన లీలగా పడిన భావాల ప్రభావాలే! మేధస్సు పైన ఆకాశంలోని తారలు, సూర్యుడు, చంద్రుడు మొదలైన లోక లోకాంతరాల కిరణాలతో ప్రాకృతిక రూపంలో కొంత, తల్లి దండ్రుల ద్వారా కొంత, తినే ఆహార పదార్థాల ద్వారా మరికొన్ని ప్రభావాలు పడుతుంటాయి. నిజానికి ఏదైనా నిజమైన వస్తువంటూ వుంటే అది మేధస్సులో స్థిరపడి ఈ సమస్త బాహ్య ప్రభావాలనూ. మెదడు ప్రభావాలనూ చూపిస్తుంది. ఏది ఏమయినా మనిషికి తన స్వరూపం ముఖ్యమనీ, మిగతాదంతా అప్రధానమనే అంశం నిశ్చయం కావటం అవసరం. ఇదే వాస్తవం అని నాకు అర్థమైంది.

నా చిన్ననాటినుండి ఈ సృష్టిని విరచించిన భగవంతుణ్ణి కలుసు కోవాలనుకొనే వాడిని. అసలైన సత్యమైన భగవంతుడు ఈ ప్రపంచంలో లేడనిపించింది. ఈ లోకంలో ఏదైనా వుందంటే అది ప్రకృతి, మాయ, స్థూల, సూక్ష్మ పదార్థాలే! స్థూల సూక్ష్మ కారణ పదార్థాలేవీ లేని స్థానమే అసలైన పరమాత్ముని స్థావరం. 'ఎన్ని సృష్టి రచనలున్నా అన్నీ ఈ సృష్టి రచన కంటే పూర్తిగా విభిన్నంగా వున్నాయి. ఆయనకి జనన మరణాలు లేవు. ఇలా వుంటాడని వర్ణించజాలము. వర్ణనకి అందడు. అర్థంకాడు. అతనున్నాడని ఒక అవస్థలో అనుభవానికి వస్తుంది. అతనున్నాడు తప్పక ఉన్నాడు. అతను ఆధారపురుషుడు, కూటస్థుడు.

మనిషిలోని శక్తి సురత్ దేహాన్ని, మనసుని, ప్రకాశాన్ని, శబ్దాన్ని విడిచి పరమాత్ముని అన్వేషిస్తూ పైకి పోతుంది. అది ఆ పరమాత్ముని అంశంగా వుంది. ఇదీ నా అనుభవమే. కాని అపుడప్పుడు ఈ అనుభవం కూడా పొరపాటే ననిపిస్తుంటుంది నాకు. నా సురత్ - దేహం, మనస్సు, ఆత్మల పరిధి నుండి దాటి ఆ పరమాత్మునిలో విలీనం కాగలిగినా మళ్ళీ ఈ లోకంలోకి ఎందుకు వస్తుంది? తన శారీరిక, మానసిక, ఆత్మిక స్థితులపై వాటిని మార్చగలిగే నియంత్రణ శక్తి సురత్‌కు ఉండాలి. అది ఆ సర్వాధారుని అంశమే గనుక దానికి శక్తి వుండాలి మరి!

నా అనుభవం పొరపాటేమోనని చాలాసార్లు ఆలోచిస్తాను. నేను అక్కడి వరకు చేరలేదు. కొందరు మహాపురుషులు, సంత్‌సద్గురువుల జీవన సరళిని

చూసినపుడు, చదివినపుడు తెలిసిందేమిటంటే వారు కూడా తమ ప్రాపంచిక, మానసిక, ఆత్మిక స్థితులను తమ తమ ఇచ్ఛానుసారం మార్చలేకపోయారు. ఉదాహరణలు వినండి!

దాతాదయాల్ మహర్షి శివబ్రతలాల్ మహారాజ్ ధామ్ కట్టించాడు. అది ఆయన జీవితకాలంలోనే పతనమయ్యింది. దాన్ని విడిచి వెళ్ళిపోయేలా పరిస్థితులు ఆయన్ని వివశుణ్ణి చేశాయి. బాబాసావన్ సింగ్ సద్గురువుగా పిలువబడ్డా అవసానదశలో శారీరక కష్టాలు ఆయన్ని అమితంగా పీడించాయి. 1942లో నేను ఆయన వద్దకి వెళ్ళినపుడు సత్సంగంలో తన తర్వాత తన గురుపీఠాన్ని తన వారికి అప్పగించనని చెప్పినా బంధువుల వత్తిడిని తట్టుకోలేక తన పీఠాన్ని తన కుటుంబీకులకే అప్పగించాడు.

సాహెబ్‌జీ మహారాజ్ చివరిదశలో దయాల్‌బాగ్‌లో ప్రతికూల పరిస్థితులుద్భవించినందున మద్రాస్ వెళ్ళిపోయాడు. అక్కడే దేహాన్ని త్యజించాడు.

స్వామి రామకృష్ణ పరమహంస గొంతు కాన్సర్‌వల్ల బాధపడి శరీరత్యాగం చేశాడు.

పల్టూ సాహెబ్ గొప్ప సంత్‌గా వ్యవహరింపబడేవాడు. ఆయన "సంత్ ఈశ్వరుని ఆజ్ఞల్ని కూడా తిరస్కరించగలడు" అంటూ సందేశాలిచ్చాడు. అయితే తనను తోటిసాధువులు సజీవంగానే మరిగే నూనెలో పడేసినా తనను తాను రక్షించుకోలేకపోయాడు. రామాయణ గ్రంథకర్త గోస్వామి తులసీదాస్ వృద్ధాప్యంలో మూడు సంవత్సరాలు శారీరక వ్యాధి పీడితుడయ్యాడు. స్వామీజీ శివదయాల్ సింహ మహారాజ్ అంతిమ దినాల్లో రెండు సంవత్సరాలు రోగ గ్రస్తుడు కాక తప్పలేదు. ఇవన్నీ ఎందుకు జరిగాయి? వారి వారి కర్మ ఫలితంగా ఏర్పడ్డాయి.

ఓ భారత వర్ష ధార్మిక, పాంథిక నివాసులారా! నేను నా అనుభవాలని లోకానికి అందిస్తానని ప్రతిజ్ఞ చేశాను. ఈ ప్రజాతంత్ర రాజ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అనుభవాలు చెప్పే హక్కు ఉంది. ఆ హక్కుతోనే నేను కూడా చెబుతున్నాను. వాస్తవం, సత్యం అంటే ఏమిటి? వాస్తవం, సత్యం అంటే అదొక తత్వం. మానవ బుద్ధి యొక్క దృష్టి కోణం నుండి చెబుతున్నాను. ఈ ప్రపంచానికి ఎవరో ఆధారంగా వుండటం సత్యం. ఈ ప్రపంచం సంకల్పం

పైనే ఆధారపడి వుంది. కర్మాధారంగా ఉంది. నియమ రహితంగా ఏ పనీ కాజాలదు. అందుకే వాస్తవం, సత్యం అంటే ఏమిటి? మనిషి తన స్వార్థం కోసం మరొక వ్యక్తిని బాధించకూడదు. తనది కాని సొమ్మును కబళించకూడదు. ఏ ప్రాణికీ దుఃఖం కలిగించరాదు. ఇవన్నీ నేనెందుకు చెబుతున్నానంటే ఋషులు, సంతులు, బౌద్ధ, జైన మహాత్ములు అంతా కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. ఈ మహాపురుషులందరికీ ఏదైనా గౌరవమో, పెద్దరికమో, పీఠాలో, గురుపదవులో, కష్టనష్టాలో వారి వారి కర్మానుసారమే లభించాయి. మనకీ పీఠాలు, గౌరవ మర్యాదలు లభించటం మన పూర్వజన్మ కర్మ ఫలితాలేనని డెహరాడూన్‌లో కలిసినపుడు సంత్ కృపాల్‌సింగ్‌తో చెప్పాను కూడా. ఇవి వర్తమాన కర్మల ఫలితాలు కావు. కొందరు గురువు రూపం తమలో ప్రగటమైందని, కష్టాలను తప్పించిందనీ గురువుకి కొందరు శిష్యులు డబ్బు దస్కం ఇస్తారు. నా రూపం ఎందరికో ప్రకటించినా, సహాయాలు అందించినా నేను ఎవరి అంతరంలోకీ వెళ్ళలేదు. వారికి కనిపించినది వారి విశ్వాసానికి ప్రతిరూపం. రేడియేషన్ పనిచేస్తున్న ప్రభావం. నేను చెప్పదలుచుకున్న వాస్తవం ఇదే! ఈ వాస్తవానికి సంబంధించిన సంపూర్ణజ్ఞానం అర్థమైన వారికి శాంతి లభిస్తుంది. ఇదే శాంతి హుజూర్ రాయ్ సాలిగ్రాం మహారాజ్‌కి లభించింది. ఆయన తన 'ప్రేమబాణీ'లో తన సద్గురువును ప్రశంసిస్తూ రాధాస్వామి దయాళుడు తనకు అనుభవాన్ని ఇచ్చి, దర్శనం చేయించి, శాంతి నిచ్చాడని రాశాడు.

ఆధ్యాత్మికమనే లేబిల్‌ని తీసేసి 'మానవత' అనే నినాదాన్ని నేను ఎలుగెత్తి చాటాను. ఓ మనిషీ! మనిషిగా మారు! సత్యమైన జ్ఞానాన్ని ప్రాప్తించుకో!!

## పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్ సత్సంగం - ప్రతిష్ఠించని దేవుడు
### తేది 25-3-1973

అన్ గఢియా దేవా కౌన్ కరే తేరీ సేవా ।

గఢే దేవ కో సబ్ కోయీ పూజే, నిత్ హీ లావే సేవా ।
పూరన్ బ్రహ్మ అఖండత్ స్వామీ, తాకో న జానే భేవా ॥

దస్ అవతార్ నిరంజన్ కహియే, సో అపనో న హోయీ ।
యహ తో అపనీ కరనీ భోగే, కర్తా ఔర్ హి కోయీ ॥

బ్రహ్మ విష్ణు మహేశ్వర కహియే, ఇన్ సిర్ లాగీ కాయా ।
ఇన్ కీ భరోసే మత్ కోయీ రహియో, ఇన్ హి ముక్తి నహి పాయీ ॥

జోగీ జపీ తపీ సన్యాసీ, ఆప్ ఆప్ మే లడియా ।
కహే కబీర్ సునో భాయీ సాధో, శబ్ద లఖే సోయీ తరియా ॥

జీవితమంతా అన్వేషణలోనే గడిచింది. ఆ అన్వేషణ ఇంకా సమాప్తం కాలేదు. ఇప్పుడు సమాధిలో కూడా అన్వేషణ చేస్తున్నాను. భారత వాసులారా! నేను నా సమస్త జీవనం సంతుల సంస్కారాల కారణంగా అన్వేషణలో గడిపాను. హిందువులు రామకృష్ణులను పూజిస్తారు. ముసల్మానులు మహ్మద్ సాహబ్‌ను కొలుస్తారు. కొందరు బుద్ధుణ్ణి, మరికొందరు యేసునూ పూజిస్తారు. కబీర్‌సాహెబ్, రాధాస్వామి దయాలుడు, మరి ఇతర గొప్ప సంతులు అన్నిటినీ ఖండించారు. విమర్శించారు. ఈ సంతులు తాము నమ్మిన, అంగీకరించిన, భగవంతుణ్ణి అందరికంటే గొప్పవాడని ధృవీకరించారు. ఈ విషయం నాకు బోధపడేదికాదు.

దాతాదయాల్ శివవ్రతలాల్ మహారాజ్‌ను భగవంతుని రూపుడని నమ్మాను. ఇప్పటికీ నమ్ముతాను. అన్ని సహాయాలు అన్ని వైపుల నుండి తెగిపోయినప్పుడు దాతాదయాల్‌జీ సహాయం తీసుకుంటాను. నన్ను భగవంతుడుగా నమ్మి ధ్యానించేవారిలో నా రూపం సాక్షాత్కరించి సహాయపడుతుంది. అందుకే కబీర్ సాహెబ్ వాణిని విశ్వసించక తప్పలేదు.

అన్ గఢియా దేవా కౌన్ కరే తేరీ సేవా ।
గఢే దేవకో సబ్ కోయి పూజే, నిత్ హీ లావే సేవా ॥

"ప్రతిష్టించని దేవుడా! నీ సేవ ఎవరు చేయగలరు?" అంటున్నారాయన. నేను పద భ్రష్టుడనయ్యాను కాబోలు! కొన్ని వాక్కులు నా మెదడును భ్రమలలో వేశాయి. పూజారులు, భక్తులందరూ ప్రతిష్ఠించి కల్పించుకున్న నిర్మించుకున్న దేవుణ్ణి పూజిస్తారు. ప్రతిష్ఠించని దేవుణ్ణి ఎవరూ పూజించరు. మనం రాముణ్ణి, కృష్ణుణ్ణి, దేవీ దేవతలను, గురువును, రాధాస్వామి దయాల్‌ను, కబీర్ సాహెబ్‌ను, బాబా సావన్ సింగ్‌ను, ఫకీర్‌చంద్‌ను విశ్వసిస్తాం. పూజిస్తాం. వారిని మీరు మీ అంతరంలో స్వయంగా రూపొందించుకున్నారు. ప్రతిష్టించుకున్నారు. మీ అంతరంలో సాక్షాత్కరించే రూపం మనసు నిర్మించుకున్నదే! మీ మనసు కల్పించుకున్నదే! ప్రతిష్టించుకున్నదే! నా మొదటి భార్య

చనిపోవడానికి మూడు రోజులు ముందే ఇక తను వెళ్ళిపోతున్నానని చెప్పింది. ఆమె చనిపోయిన వేళలో ఆమె దగ్గర రామాయణ పఠనం జరుగుతోంది. ఆమె ఉన్నట్లుండి "ఇక పఠనం చాలించండి. ఇప్పుడు రామలక్ష్మణులు, సీత, హనుమంతుడు పల్లకీ తీసుకుని వచ్చారు" అంది. "రామ రామ" స్మరణ చేస్తూ ప్రాణాన్ని త్యజించింది. అప్పట్లో నేను ప్రతిరోజూ రామాయణం పఠించేవాణ్ణి. నేను అలా చదివినప్పుడు, నైవేద్యాలు చేసినపుడు ఆమె నా దగ్గర ఉండేది. అందుకే అమె మేధస్సుపైన రామలక్ష్మణ సీతా హనుమంతుల సంస్కారాలు పడిఉన్నాయి. అవే ఆమె అంత్య సమయంలో సాక్షాత్కరించాయి.

సత్సంగీయులంతా తమలోపల కల్పించుకున్న, ప్రతిష్ఠించుకున్న దేవుణ్ణి పూజిస్తారని వారి అనుభవాల వలన నాకు విశ్వాసం కుదిరింది. అసలైన ఆ పరమతత్వ ఆధారం, స్వస్వరూపాన్ని ఎవరూ సేవించరు. ఎందుకంటే ఆ భగవంతునికి ఏ రూపమూ లేదు. బుద్ధి అక్కడి దాకా చేరదు. స్మరణ ధ్యానంలలోకి అది రాజాలదు. అందుకే కబీర్ సాహెబ్ రాసింది అక్షరాలా నిజం. దాతాదయాల్ మహర్షి శివ్రవత్‌లాల్‌జీ విగ్రహం ఉంది. ఇది నేను నిర్మింపజేసింది. ప్రతిష్ఠింపజేసింది. ఒకటి - బాహ్య విగ్రహాన్ని రూపొందించి పూజించాను. మరొకటి అంతరంలో మూర్తిని రూపొందించుకుని ప్రతిష్ఠించుకుని పూజించాను. కానీ ఈ రూపొందించని, కల్పించని, నిర్మించని, ప్రతిష్ఠించని దేవుణ్ణి ఎవరూ పూజించటం లేదు. ప్రతిష్ఠించని దేవుని వరకు చేరుకోలేకపోతే జన్మ మరణ చక్రాలనుండి ఎవరూ తప్పించుకొనజాలరు. వారు జన్మనెత్తవలసే ఉంటుంది. వాళ్ళు స్థూల జీవనంలో ఉన్నా, సూక్ష్మ జీవనంలో ఉన్నా, కారణ జీవనంలో ఉన్నా రాకపోకలు తప్పవు. వారు వారి సుఖ దుఃఖాల నుండి తప్పించుకోలేరు. మీరు నన్ను పరమసంత్ అంటారు. నా ఆరోగ్యం బాగా లేదు. డాక్టర్లిచ్చే ఔషధాలు తీసుకొంటుంటాను. సంత్‌లందరూ వ్యాధిగ్రస్థులయ్యారు. అధిక కష్టాలనుభవించారు.

గఢే దేవ్ కో సబ్ కోయి పూజే నిత్ హీ లావే సేవా ।
పూరణ్ బ్రహ్మ అఖండత్ స్వామీ తా కో న జానే భేవా ॥

ఆ అసలైన పరబ్రహ్మ అఖండమని చెప్పవచ్చు. అతని రహస్యాన్ని ఎవరూ తెలుసుకోలేరు. ప్రపంచం తాను నిర్మించుకున్న, ప్రతిష్ఠించుకున్న దేవుణ్ణి పూజిస్తుంది. దీని పరిణామం ఏమవుతుంది? ప్రతిష్ఠించుకున్న దేవత ఎవరు?

అంతరంలో ప్రకటమయ్యే రూపాలన్నీ నీ మనసు నిర్మించుకున్నవే. ఒకరి అంతరంలో రాముడు సాక్షాత్కరిస్తే మరొకరిలో బాబా ఫకీర్, ఇంకొకరి అంతరంలో గురువు ప్రత్యక్షమవుతారు. ఈ రూపాలన్నీ నీ మనసు నిర్మించుకున్న రూపాలు. ఆ ప్రతిష్ఠించబడలేనివాడు మరొకడున్నాడు. నీవు అతనివైపు శ్రద్ధచూపకపోతే అక్కడిదాకా చేరుకోలేవు.

**దస్ అవతార్ నిరంజన్ కహియే । సో అపనో న హోయీ ।**

**యహ తో అపనీ కరనీ భోగే । కర్తా అవురహి కోయీ ॥**

అవతారాలు ధరించి వచ్చిన వారంతా తమ కర్మలనుభవించారు. సీతాదేవి కూడా తన కర్మఫలమనుభవించింది. సీతాపహరణం జరిగినప్పుడు రాముడు విలపించాడు. ప్రపంచానికి చూపడానికి రాముడు విలపించాడని రామభక్తులనవచ్చు. అది వేరే విషయం. శరీరానికో, మనసుకో దుఃఖం కలిగినప్పుడు ప్రతి వ్యక్తీ సంతైనా, పరమసంతైనా అయ్యో- అయ్యో అనటం సహజం. నాకు కష్టం వచ్చినప్పుడు నాకు ఆ విషయం అనుభవానికి వస్తుంది.

బాబా ఫకీరు గానీ మరో గురువును గానీ లేక ఏదైనా అవతారాన్ని గానీ, దేవీ దేవతను గానీ సేవించి, పూజచేసేవారు తనను తన ఇష్టదైవం తీరం చేరుస్తారనుకుంటే భ్రమలో ఉన్నట్లే. అతడు మోక్షాన్ని పొందజాలడు. ఆ ఇష్టదైవం చెప్పిన మాటలను అర్థం చేసుకుని, వాటిని ఆచరిస్తే మోక్షం పొందగలడు.

ప్రస్తుత కాలపు గురువుల అనుయాయులందరూ భ్రమలలో ఉన్నారు. ఈ మహాపురుషుల మాటలు విని, అర్థం చేసుకుని, ప్రతిష్ఠించని దేవుని వైపు వెళ్ళకుంటే నీవు తీరం చేరుకోలేవు. భవసాగరం దాటి పోలేవు.

**బ్రహ్మ విష్ణు మహేశ్వర్ కహియే, ఇన్‌సిర్ లాగీ కాయీ ।**
**ఇన్ కీ భరోసే మత్ కోయి రహియో ఇన్‌హి ముక్తి నహి పాయీ ॥**

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ప్రకృతి శక్తులు. ప్రళయం కంటే ముందు వీరికి ముక్తి లభించదు. సృష్టి ఉన్నంతవరకు వారు తమ కర్మను అనుభవిస్తారు. వీరిని ధ్యానించటం వలన ముక్తి లభించదు.

**జోగీ జపీ తపీ సన్యాసీ, ఆప్ ఆప్ మే లడియా ।**
**కహె కబీర్ సునో భాయి సాధో, శబ్ద లఖే సోయీ తరియా ॥**

జోగి, జపీ, తపీ, సన్యాసీ అనగా యోగులు, జపాలు చేసేవారు తపస్సులు చేసేవారు, సన్యాసులు, మహాత్ములు అందరూ తమను తాము గురువుల మనుకుంటారు. గద్దెల కోసం పరస్పరం కొట్లాడుకుంటారు. అందుకే అనుభవంతో చెబుతున్నాను. మనిషి తన ఇష్టుణ్ణి ఏర్పర్చుకోనంతవరకు రాకపోకలను దాటి పోజాలడు. అందుకే శబ్ద బ్రహ్మ ఉంది. ఇదే మాటను గరుడపురాణం చెబుతోంది. నీవు రాకపోకలనుండి తప్పించుకోగోరితే శబ్దబ్రహ్మ, పారబ్రహ్మల నుండి ముందుకు వెళ్ళు.

అన్నిటికంటే ముందు దశమ ద్వారం రూపొందించుకో. విచారయోగంతోనైనా, లేక నిష్కామ కార్యంతో నైనా లేక ప్రేమభక్తులతోనైనా లేక మూర్తి పూజతోనైనా రూపొందించుకో. గురువు పట్ల నిష్కామ ప్రేమతో కూడా దశమ ద్వారానికి వెళ్ళగలవు. దశమద్వారానికి వెళ్ళనంత వరకు ఈ జపం, తపం, పూజ, సేవ తప్పనిసరి అవుతాయి. మనసు నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళనంతవరకు నీవు శబ్దాన్ని పట్టుకోజాలవు. అందుకే సాధారణ జనులకోసం ప్రేమ,భక్తి గురుసేవ, మూర్తి పూజలున్నాయి. కాని ఇవి తొలి శ్రేణులే! ఓ కుర్రవాడు అకస్మాత్తుగా పదవతరగతిలోకి వెళ్ళాలనుకుంటే అది అసాధ్యం. అసంభవం. అలాగే పదవ తరగతి కుర్రవాడికి ఒకటో తరగతి పుస్తకాల పట్ల ఆసక్తి ఉండదు. అందుకే నేను దేని ఖండనా చేయను. ఖండన చేయటం వలన ఈర్ష్య, ఏహ్యాభావం ఉత్పన్నమవుతుంది. నీవే స్థితిలో ఉన్నా, ఏ స్థానంలో ఉన్నా దానిని చివరి సీమ వరకు చేర్చు. దానికి హద్దుగీయి. ప్రేమ గల భక్తులు చేసే పూజా పునస్కారాలకి హద్దు ఏర్పర్చండి. మనసు చక్రంలో అంతిమసీమకు చేరుకున్న వాడివి అయితేనే నీవు నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళగలవు.

సంతుల మార్గం నిర్వాణం కోసమే! ప్రాపంచికుల కోసం వేదమార్గం ఉంది. శివసంకల్పమస్తు. ఇంత పైకి వెళ్ళి పోయాక కూడా ఇప్పటికీ దాతాదయాల్ స్మరణ ధ్యానం చేస్తాను. దీనిని వదిలిపెట్టకుంటే చాలాకష్టం. శరీరం ఉన్నంతవరకు మరొకరి సహాయం తీసుకోక తప్పదు. నీ మనసును ఏకాగ్రం చేయడానికి నీ విశ్వాసాను సారం ఇష్టమైన వారి నెవరినైనా పూజించు. సంత్ మార్గంలో రాకపోకల నుండి తప్పించుకోవడానికి కేవలం శబ్దయోగమే శరణ్యమై ఉంది.

" అందరికీ రాధాస్వామి"

# సంత్ మతం - ఆత్మానుభూతి

## పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహరాజ్

మానవతా మందిరం, హోషియార్‌పూర్

### సత్సంగం ద్వారా జ్ఞాన ప్రాప్తి

### సత్సంగం

### తేది 11-1-1973

గురు చరన కమల మే వినయ కరూం ।
వినయ కరూం మై వినయ కరూ, గురు చరణ కమల్ మే వినయ కరూం ॥

విశ్వామిత్ర విశ్వహిత కారీ, విశ్వంభర్ విశ్వాసీ ।
అపనీ దయాసే పార్ లగాదే, కటే బంధ చౌరాసీ ॥

కరుణామయ కరుణా కేసాగర్, కరుణా కే భండారా ।
కామ క్రోధ సే ముఝే ఛుడాకర్, లే చల్ భవ కే పారా ॥

దీన హితైషీ దీన దయాలా, దీన అధీన సహాయీ ।
దీన సమఝ భక్తి దే ముఝ్‌కో, లహూం చరణ్ శరణాయీ ॥

గున్ కీ ఖానీ గున్ మే ఆగర్, గున్ నాగర్ గుణకారీ ।
అవగుణ మేట్ కే గుణీ బనాదే, కర్ దే ముఝే సుఖారీ ॥

రాధాస్వామీ భక్తి పదారథ్, కా హూం మై అభిలాషీ ।
ప్రేమభావ్ దియే అంతర్ ఆవే, భ జూం గురు అవినాశీ ॥

*రాధాస్వామి !*

నేను కూడా మహర్షి శివవ్రత్‌లాల్ మహారాజ్ చరణాలలో బాహ్యాపూజలు ప్రార్థనలు చేశాను. చిన్నప్పుడు ఏదో ఒక వస్తువును అన్వేషిస్తూ ఎంతగానో ఏడ్చేవాణ్ణి.

ఓ సారి నేను సరసోం హేరీ (సహరన్ పూర్-జిల్లా)కి వెళ్ళాను. అక్కడ కొందరు తమ అనుభవాలను చెప్పారు. వాటిని విని ఆశ్చర్యపోయాను. నాకు అసలైన, సత్యమైన గురురూపం చూపి, సత్యమైన భక్తిమార్గం చూపి గురువు నన్ను కరుణించాడు. బాబా ఫకీర్ వచ్చాడనీ, పల్లకీ తెచ్చాడనీ, విమానం

తెచ్చాడనీ వారివారి అంత్యసమయాలలో కొందరు చెబుతుంటారు. కానీ నాకా సంగతులే తెలియవు. ఎవరినీ తీసుకువెళ్ళడానికి వారి ఎదుటికి నేను వెళ్ళను. అంత్య సమయంలో నా స్థితి ఎలా ఉంటుందో కూడా నాకు తెలియదు.,

**రాధాస్వామి భక్తి పదారథ్ కా, హూం మై అభిలాషీ ।**
**ప్రేమ భావ్ సే హియే అంతర్ ఆవే, భజూం గురు అవినాశీ ॥**

ఇప్పుడు కొందరు ఫకీర్ చంద్‌ను భజిస్తారు. ఫకీర్‌చంద్ ఏదో ఒకనాటికి మరణిస్తాడు. మరణించేవాణ్ణి అవినాశి అని ఎలా అంటారు? హుజూర్ బాబాసావన్ సింగ్‌జీ మహారాజ్ అవినాశి అయితే ఎందుకు మృతి చెందాడు? రామచంద్రుడు, కృష్ణుడు అవినాశి అయితే వాళ్ళు ఎందుకు మృత్యువాతపడ్డారు? ఏ దయ నాపై ప్రసరించిందో దానిని మీకు చెబుతున్నాను. కానీ దానిని వినడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఎవరినో అనటం దేనికి? అన్నీ తెలిసికూడా నేను కిందికిపడిపోతుంటాను. అవినాశి రూపం గురించి, నేను తెలుసుకున్నాను అయినా గానీ ఆ మనసు నన్ను కిందికి లాగి తెస్తుంది. ఇక అక్కడ నిలబడలేను. నిజం చెబుతున్నాను. లోకులిచ్చే గౌరవమర్యాదలు నాకేమీ అవసరం లేదు. అవినాశి అయిన గురువుపట్ల కలిగి ఉండేదే అసలైన భక్తి. అవినాశి గురువులోకి వెళ్ళనంతవరకు జనన మరణాలు సమాప్తం కావు. రామాయణంలో ఇదేరాశారు. రామచంద్రుడు లంకపై విజయం పొందాక అక్కడికి దేవతలు అందరూ రామదర్శనార్థం వచ్చారు. వారితోపాటు దశరథ మహారాజుకూడా వచ్చాడు. అలా ఎందుకు వచ్చాడంటే ఆయనకు రాముని సగుణరూపంలో ప్రేమ మిక్కుటంగా ఉండేది. అత్యధికంగా రాముని సగుణ రూపాన్ని ప్రేమించాడు. గనుక మోక్షాన్ని పొందలేకపోయాడు. ఆ సమయంలో రామచంద్రుడు స్థిరమైన జ్ఞానం యిచ్చాడు. అప్పుడు దశరథుడు ముక్తుడయ్యాడు. సగుణమును పూజించే వారికి మోక్షం లేదని రామాయణంలో రాసి ఉంది. సగుణమని శరీరధారిని అంటారు.

రాముడు, కృష్ణుడు శరీరధారులు! ఈ గురువులంతా శరీరధారులు. ఫకీర్‌చంద్ శరీరధారి! అంత్యసమయంలో గురువు వస్తాడు: శబ్దం వినిపిస్తాడు. ఆ జీవుడు కొంతకాలంపాటు పైలోకాలలో ఉంటాడు. తరువాత ఎవరైనా సంత్ సతగురువు ఈ ప్రపంచంలోకి వచ్చినప్పుడు ఆ జీవుడు మళ్ళీ జన్మించి ఆ సంత్ సద్గురువు సంపర్కంలోకి వస్తాడు. తన మిగిలిన సాధనను

సంపాదించుకుంటాడని తన "ప్రేమబాణి"లో హుజూర్ రాయ్‌సాలిగ్‌రామ్ సాహబ్ మహారాజ్ స్పష్టంగా రాశాడు.

రామాయణం చెప్పిన దానినే హుజూర్ మహారాజ్ ధృవీకరించాడు. దశరథమహారాజు రామునిపట్ల గల మోహంతో శరీరాన్ని త్యజించాడు. కనుక అతడు ముక్తుడు కాలేదు. ఎవరైనా బాబాఫకీర్‌పైన మోహంతో శరీరాన్ని త్యాగం చేస్తే, లేదా మరొకరు వారి కొడుకు పైగల మోహంతో మృతిచెందితే, ఎవరైనా తమ గురువు మీది మోహంతో తనువు చాలిస్తే ముక్తులు కాజాలరు. ఏది ఏమైనా మోహం మోహమే! వీరు ఎలా విముక్తులు కాగలరు?

మీరొస్తారు. నాపై ఒక బాధ్యత ఉందనుకుంటూ ఉంటాను. నా కర్తవ్యం పూర్తి చేసి పోవాలనుకుంటూ ఉంటాను. మీరు నా మాటలను వినండి, వినకపోండి. ఆచరించండి. ఆచరించకపోండి. వాటితో నాకు పనిలేదు. వాస్తవాన్ని ఇలా స్పష్టంగా చెబుతున్నందున గురువునైన పాపం నన్నంటదు.

లోకుల అజ్ఞానం ఎంత తీవ్రంగా ఉంటుందో ఇటీవలే జరిగిన ఒక తాజా సంఘటన మీకు వినిపిస్తాను. మా ఇంటికి కొంచెం దూరంలోనే ఒక ఇల్లుంది. అందులో ఓ వృద్ధురాలుంటుంది. ఆమె అస్వస్థతతో ఉంది. ఎన్నో రోజులనుండి బాధపడుతోంది. ఆ శారీరక బాధలు భరించటం కష్టమై ప్రాణంపోతే బాగుండుననుకుంటోంది. కానీ మృత్యువు రావటం-రాకపోవటం ఎవరిచేతిలోనూ ఉండదుగదా! ఆమె ప్రాణాలు దేహాన్ని విడువటం లేదు.

ఆ వృద్ధురాలి ఉదంతాన్ని గోపాలదాసుభార్య నా కూతురు సురత్ ప్యారీకి చెప్పిందట. "పద! ఆమె ప్రాణాలు పోయేలా చేస్తాను" అని సురత్‌ప్యారీ బయల్దేరింది. గోపాల్‌దాస్ భార్య, సురత్‌ప్యారీ ఇద్దరూ ఆ ముసలమ్మ ఇంటికి వెళ్ళారు. అక్కడికి వెళ్ళేసరికి వృద్ధురాలు ముఖంపై కొంగు కప్పుకుని పడుకుని ఉంది. "నాకామె ముఖం చూపండి" అంది సురత్ ప్యారీ. పక్కనే ఉన్న వారు వృద్ధురాలి ముఖంపై నున్న గుడ్డను తీశారు. ఆమె ముఖం వైపు చూసి ఆమెతో, "చనిపోవమ్మా" అందట సురత్‌ప్యారీ. ఆమె ఈ మాటకోసమే ఎదురు చూస్తున్నట్లు ఆ క్షణమే ప్రాణం విడిచింది. చుట్టు పక్కల కూర్చుని ఉన్న బంధు మిత్రులు ఆశ్చర్యచకితులయ్యారు. స్త్రీలు తలవంచి సురత్ ప్యారీ కాళ్ళకు మొక్కసాగారు. పరస్పరం చర్చించుకోసాగారు. సురత్‌ప్యారీని ప్రశంసించసాగారు. "ఈ అమ్మాయి గొప్ప సంత్ సుమా" అన్నారు కొందరు.

"ఈమె సంత్ కూతురు గదా" అని మరికొందరన్నారు. ఒకరు ఒకటన్నారు. మరొకరు మరొకటన్నారు.

ఇక్కడొక ప్రశ్న! సురత్ ప్యారీ ఆ వృద్ధురాలి ప్రాణాలు తీసిందా? లేదు. ఇది ఎలాగైనా జరగవలసిన సంఘటనే! ఆ ముసలామె ప్రాణాలు పోవలసే ఉన్నాయి. పోయాయి. సురత్ప్యారీ ఉన్మత్తురాలు. సగం పిచ్చిది. కానీ జనం ఆమెను సంత్ అన్నారు. సంత్ను చేశారు. ఇది అజ్ఞానం.

ఇలాంటి సంఘటనల నెన్నింటినో చూశాను. సునామ్లో ఒక వ్యాపారస్తుని కూతురుకి అమ్మవారయింది. ఆ అమ్మాయి చాలా బాధననుభవిస్తోంది. కానీ ప్రాణం పోవటం లేదు. ఆ వ్యాపారి నాదగ్గరికి వచ్చి, "మీరు మహాత్ములు. నా కూతురు మృత్యువు కోరల్లో చిక్కుకుని ఉంది" అన్నాడు. "నేను వచ్చి ఏం చేయగలను చెప్పండి" అన్నాను. "మీరు రావలసిందే" అంటూ అతడు పట్టుపట్టాడు. నేనతని వెంట వెళ్ళాను. ఆ తరువాత ఆ పిల్ల చనిపోయింది. నేను వెళ్ళి ఏమైనా మంత్రమేశానా? ఆమె చనిపోవలసే ఉంది. చనిపోయింది అంతే! ఇలాంటి మాటలవల్ల లోకం భ్రమలలో పడిపోతుంది. దోపిడీకి లోనవుతుంది. మీరూ మాటల వలలో చిక్కుపడుతుంటారు. అందుకే నేను మీ వద్దకు రాను. గురువు దయ ఏమిటి? ఆయన సత్సంగాలలో బోధనలు చేసి జీవులకు జ్ఞానాన్ని ప్రదానం చేస్తాడు. వాస్తవికతను చూపిస్తాడు.

బిన్ సత్సంగ్ న పాయియే । గురు గమ జ్ఞాన విచార్ ॥

సత్సంగం లేకుంటే ఈ రహస్యం ఎవరికీ అందదు. నేను వాస్తవాన్ని ప్రపంచానికి చెప్పదలచుకున్నాను. అందుకే మానవతా మందిరాన్ని నిర్మించాను. ఈ శిక్షణను వ్యాపింపచేయడానికి నాకు తమ స్వార్థం, యశస్సు, గౌరవ మర్యాదల కోసం ప్రలోభపడని వ్యక్తులు కావాలి. వాళ్ళు ఎవరినీ దోచుకోకూడదు. సత్యం పైనే నడవాలి. మీకు నా కూతురుని గురించిన ఉదాహరణ చెప్పాను. పురుషోత్తమ్దాస్! నేనేమీ చేయను. లోకులు సత్యసంధతతో, నిజాయితీతో మందిరానికి డబ్బులిస్తుంటారు.

లోకులు నాకు ఏ సంఘటనలు వినిపించారో వాటిని విని నా బుద్ధి నిర్ఘాంతపోతుంది. ఆశ్చర్యపోతుంటాను. ఇతర మహాత్ములు భక్తుల అంతరంలోకి వెళ్తారు కాబోలు. నేను వెళ్ళను. "వహేడీ" అనే ఊళ్ళో ఓ స్త్రీ చనిపోయింది. ఆమె కొడుకు మిలిట్రీలో ఉద్యోగం చేస్తున్నాడు. పాకిస్తాన్తో జరిగిన యుద్ధంలో

అతడు అదృశ్యమయ్యాడు. "నీ కొడుకు కనిపించటంలేదు" అంటూ ఆమెకు రక్షణదళం నుండి టెలిగ్రామ్ వచ్చింది. ఆమె భక్తురాలు. "దయచేసి చెప్పు! నాకొడుకు బతికివస్తాడా లేదా?" అని తన ఇష్టుణ్ణి లోలోపలే ప్రశ్నించుకోసాగింది. టెలిగ్రాం అందించిన వారితో "ఆగండి! నేను బాబాజీని అడిగిచెబుతాను" అంటూ అభ్యాసంలోకి వెళ్ళి పోయింది. ధ్యానం ముగిశాక "నా కొడుకు బతికే వున్నాడనీ, మళ్ళీ వచ్చేస్తాడనీ బాబాజీ చెబుతున్నాడు. కనుక నా కొడుకు వచ్చేస్తాడు" అంది. ఆమె కొడుకు సిపాయి ఖైదీగా బందీ అయి తరువాత విడుదలయ్యాడట. ఇప్పుడతడు వచ్చేశాడు. అతడు అలా ప్రాణాలతో తిరిగి వస్తాడని ఆ స్త్రీ అంతరంలోకి వెళ్ళి నేను చెప్పానా? లేదు. ఇది ఆమె మనసు ఆడిన ఆట. ఇష్టమైన వారు నా సత్సంగం వినండి లేని వారు వినకండి. మీకు ఇష్టమైతే నా పుస్తకాలు చదవండి. లేకుంటే చదవకండి. మీకిష్టమైతే నాలుగు పైసలు మందిరానికి ఇవ్వండి. లేకుంటే ఇవ్వకండి. నేను దీనిని లెక్క చెయ్యను. ఎందుకంటే నేను సంత్ సతగురు వక్తను. కనుక నా కర్తవ్యాన్ని నెరవేర్చదలుచుకోవాలనుకుంటున్నాను. భవసాగరాన్ని ఎలా దాటగలుగుతారు? నేను సత్యమైన జ్ఞానమిస్తాను. ఏమని? "ఓ మనిషీ! నీ లోపల ఏ భావం, విచారం, ఊహ పుడుతున్నదో అది మాయ. ఎక్కడి నుండి నీవొచ్చావో అది పారబ్రహ్మ. శుద్ధ బ్రహ్మ, నీవు దానిని అందుకో. పట్టుకో. అదే సత్యమైన గురువు. రామాయణం కూడా ఇదే చెప్పింది. ప్రేమ భక్తిల నుండి బయటపడని వ్యక్తికి జనన మరణాలు-రాక పోకలు సమాప్తం కావు. రామాయణాన్ననుసరించి దశరథ మహారాజు రాముని వియోగంలో ప్రాణాలు వదిలి ముక్తి పదాన్ని ప్రాప్తించుకోలేకపోయాడు. కానీ ఇది నీ వశంలో ఉన్న విషయం కాదు. మిమ్మల్ని అనటం ఎందుకు? అన్నీ తెలిసికూడా నేనూ పడిపోతుంటాను. కానీ వెంటనే సంభాళించుకుంటాను. నా జీవన నిర్ణయం, ఏర్పాటు ఏమవుతుందో నాకు తెలియదు. నీకు ఏ రూపంపై విశ్వాసం ఉంటే దానిని అవినాశి అని విశ్వసించు. ఈ స్థితి నీకు రానంతవరకు తీరం దాటిపోలేవు. రాముడు సర్వవ్యాపకుడని, అయనలో నుండి కోట్లాది సూర్యచంద్రులు వెలువడతారని రామాయణంలో రాశారు. ఆ రాముణ్ణి నీ ఇష్టునిగా చేసుకో.

నా దగ్గరేం ఉంది? లోకులను దోచుకోవడానికి నేను ఈ లోకంలోకి వచ్చానా? లేదు. సత్యాన్ని తెలుసుకుని, సత్యాన్నిచాటడానికి వచ్చాను. తిమ్మిని బమ్మిని చేసే కుతంత్రపు మాటలు చెప్పను. ఇతరులతో పొగిడించుకుని,

ప్రచారం చేయించుకోను. "ఔను! బాబాజీ ప్రసాదంతో కొడుకు పుట్టాడు. ఈ పని నెరవేరింది. ఇంగ్లండులో, అమెరికాలో కూడా బాబాజీ ఎందరిలోనో సాక్షాత్కరిస్తుంటాడు. ఇంగ్లీష్ వారెందరో బాబాజీకి శిష్యులయ్యారు" వంటి మాటలను, గొప్పలను చెప్పించుకోను. అలా చెప్పించుకోవటం ఓ మోసాల వల. నాకు దాని అవసరం లేదు.

అందరికీ రాధాస్వామి

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## సత్సంగం

## వేర్పాటు భక్తి వలన ముక్తి లభించదు

### తేది 14-1-1973

రాధాస్వామి! ఇంతకుముందు సమాధి స్థితిలో ఉన్నాను. సమాధిలో సాధన చేస్తూ ఎందుకు కూర్చుంటాను? సాధనలోనే సమస్త ఆయువు గడిచి పోయింది. ఏదో ఒక వస్తువును గురించిన, అన్వేషణ సమాప్తమై పోయింది. ప్రపంచాన్ని చూశాను. ధనాన్ని చూశాను. గౌరవాదరాలనూ ఎక్కువగానే పొందాను. పేదరికాన్ని చూశాను. ఈ అన్వేషణ నాలో ఏడేళ్ళ వయసు నుండే ఉంది. నేను భగవంతుణ్ణి వెదికే వాణ్ణి. ప్రారంభంలో ఠాకుర్లను నా ఇష్టులనుగా చేసుకుని చాలా ప్రేమతో పూజించేవాణ్ణి. ఆ విగ్రహాలకు స్నానం చేయించేవాణ్ణి. పువ్వులర్పించే వాణ్ణి. ధూపం వేసి దీపం వెలిగించేవాణ్ణి. శంఖాలు మోగించే వాణ్ణి. అలా కొన్నాళ్ళు గడిచాయి. ఆ తరువాత కాలంతోపాటు నాలోనూ మార్పు వచ్చింది. నా బహిర్ముఖ ప్రేమ అంతర్ముఖమై పోయింది. ఊహాస్వరూపాన్ని అంతరంలో ఏర్పర్చుకుని ఊహలలోనే ఆ విగ్రహ రూపాలకు స్నానం చేయించేవాణ్ణి. పువ్వులర్పించి నైవేద్యం పెట్టే వాణ్ణి.

ఓ రోజు మా అమ్మ పూజాగది వైపు చూసి, "బాబూ! నువ్వు గత ఏడు రోజులుగా ఠాకూర్ పూజ చేయటం లేదుకదూ" అంది. "లేదమ్మా! ప్రతిరోజూ నేను పూజ చేస్తూనే ఉన్నాను" అన్నాను. ఆమె నన్ను పూజాగృహం లోకి తీసుకువెళ్ళి ఠాకుర్ విగ్రహాలపై మూగిన ధూళిని చూపించింది. నా ఆలోచనా విచారాల ధార ఇటువైపు నుండి మరోవైపు మళ్ళింది. నేను బాహ్యమైన ఠాకుర్ని వదలిపెట్టి అంతరంలోని రాముణ్ణి, కృష్ణుణ్ణి ఏర్పర్చుకొని ప్రేమించటం

ప్రారంభించాను. ధనుర్ధారి రాముడు, మురళీధరుడైన కృష్ణుడు నా ఎదురుగా నడిచేవారు. కొన్నాళ్ళపాటు ఎంతో ఆనందం లభించింది. తరువాత అందులోనూ మార్పు వచ్చింది. నేను పనిచేసే రైల్వేస్టేషన్ నుండి చిన్న తీర్థానికి బయల్దేరాను. నేను నడుస్తుంటే నాకంటే ముందు, నా ఎదురుగా శ్రీకృష్ణుడు నడుస్తున్నాడు. ఆయన వెనక నేను నడుస్తున్నాను. ఆ కృష్ణుడు పరుగెత్తసాగాడు. నన్నూ పరుగెత్తమన్నాడు. ప్రయాణంలో రెండు గంటలు పట్టింది. వెనుదిరిగి వచ్చేటప్పుడు నేను స్టేషన్ దగ్గరికి వచ్చాక దారిలో కొంత పేడ కనిపించింది. నా ఎదురుగా నడుస్తున్న కృష్ణుడు దానిని చూపి ఆ ఆవు పెండను తినమన్నాడు. నేను వంగి దానిని తీసుకుని తిన్నాను. స్టేషన్‌కు వచ్చి కూర్చుని ఆలోచించసాగాను. "నువ్వు రామాయణం చదువుతావు, భక్తమాల చదువుతావు. ఎక్కడా ఏనాడూ ఇలాంటి సంఘటన జరిగిన దృష్టాంతం కనిపించలేదు. రాముడుగానీ, కృష్ణుడుగానీ తన భక్తులను పేడ తినమని చెప్పాడని ఏ గ్రంథంలోనూ చదవలేదు. ఎక్కడా వినలేదు. మరినాకు ఇలాంటి సంఘటన ఎందుకు ఎదురైంది? ఫకీర్‌చంద్! నువ్వేం చేశావు? రోడ్డుపై పడి ఉన్న పేడ తిన్నావు? అలా తినుమని నిన్ను ప్రబోధించిన కృష్ణుడు అసలైన కృష్ణుడు కాడు అనుకున్నాను. అంతే ఆలోచనా విచారాలలో మార్పు వచ్చింది. ఎందుకంటే

**"నానా భాంతి రామ అవతారా - రామాయణ శతకోటి అపారా" అని**

రామాయణంలో రాశారు. నా కుతూహలం పెరిగింది. " ఓ భగవంతుడా! రాముని అవతారం లోగడ వచ్చినట్లే నీవు మానవరూపంలో నాకు కనిపించు! ఆ అన్వేషణలో నేను నిరంతరం ఇరవై నాలుగు గంటలపాటు ఎడతెరిపిలేకుండా ఏడ్చాను. నేనెందుకలా ఏడుస్తున్నానో బోధపడక మా వాళ్ళు డాక్టర్ని పిలిపించి నన్ను చూపించారు. ఆయన పరిశీలించి పిచ్చివాడయ్యాడని నిర్ధారించాడు. నా తలపైనా, నొసలు పైన వెన్నపెట్టారు. నా భావావేశంలో నేనున్నాను. రోదించటం ఆపలేదు. తెల్లవారుజామున ఐదు గంటల వేళ హుజూర్ దాతాదయాల్ మహర్షి శివవ్రత్‌లాల్‌జీ మహారాజ్ స్వప్నంలో కనిపించి తన చిరునామా చెప్పారు. నన్ను తన చరణాలలోకి చేర్చుకున్నారు. నేను వెళ్లాను. ఆయన నన్ను బావి దగ్గరికి తీసుకువెళ్ళి స్వయంగా స్నానం చేయించారు. నేనాయన్ని ప్రేమించసాగాను. తరువాత మా నాన్న గారొచ్చారు. హుజూర్ దాతా దయాల్‌జీ ఆయనతో మాట్లాడుతూ, "ఇతడు నన్ను చాలా బాధపెడతుంటాడు" అని చెప్పారు. నేను మళ్ళీ ఏడవసాగాను. ఆ దృశ్యం చెదిరిపోయింది. కొన్నాళ్ళకు ఆ సమయం

వచ్చింది. నేను దాతాదయాల్ సన్నిధికి చేరుకున్నాను. ఆయన్ని రామునిగా భావించి విపరీతంగా ప్రేమించాను. ఆయనకు బంగారు కిరీటం చేయించాను. వెండి సింహాసనం చేయించాను. ఎన్నెన్నో హారతులిచ్చాను. ఆయన ఒడిలోకూర్చుని ఆయనకు నైవేద్యం పెట్టాను. నా మనసుకు సంతృప్తి కలిగించుకున్నాను. ఆయన్ని నేనిలా ప్రేమచేసేవాణ్ణి. ఆయన నన్ను చీవాట్లేసేవాడు. ఒకసారి ఆయన నా పేరిట ఒక శబ్ద్ రాశారు.

**ఫకీరా! సోచ్ సమర్ఝ పగ్ ధార్।**

**బిన్ సమఝే కోయీ పార్ న పావే, భట్ కే బారంబార్।**
**సంశయ దువిధా అవుర్ చతురాయీ, యహ అజ్ఞాన్ విచార్॥**

**కోయీ నర పశు హై కోయీ త్రియా పశు, గురు పశు కోయి గఁవార్।**
**వేద పశూ హై సబ్ సంసారా, బినా వివేక్ విచార్॥**

**మాయా కా పశు మాయా కా బంధువా, ముక్తి పశు స్వీకార్।**
**భక్తి పశు బంధన్ నహీఁ కాటే, బూడా కాలీ ధార్॥**

**జ్ఞాన్ పశు కీ క్యాకరూఁ నిందా, వహ గ్రంథన్ కీ లార్।**
**జడ్ చేతన్ కీ గాఁఠ్ న ఖోలే, ఉరఝ్ ఉరఝ్ రహా హార్॥**

**యోగ పశు బందే యోగ్ కీ రసరీ, బైఠే ఆసన్ మార్।**
**రాధాస్వామి చరన్ శరణ బలిహారీ, సేవక్ హువా భవ పార్॥ ఫకీరా॥**

నేను నా భావావేశంతో ప్రేమలోకంలోకి వచ్చి ఆయన కోసం కిరీటం తీసుకువెళ్ళినప్పుడు ఆయన ఈ శబ్దం నా పేరిట రాశారు.

**చేత్ చేత్ చేత్ అభీ, చేత్ మేరే భాయీ॥**
**రాహ సే కురాహ భయా, భూలా భర్మానా।**
**కహీఁ బసే కహీఁ నసే, ఠౌర్ న ఠికానా॥**
**సంగీ నాహీఁ సాథీ నాహీఁ కోయీ నా సహాయీ।**
**తాక్ మే హైఁ చోర్ డాకూ, కోయి నా సహాయీ॥**
**సోయా సో పుంజీ ఖోయా, పుంజీ ఖోయ్ రోయా।**
**ఫల్ పాయా ఆప్ బురా, జైసా బీజ్ బోయా॥**
**యహ తో నహీఁ తేరా దేస్, దేస్ హై బేగానా।**
**యహాఁ సబ్ బేగానే బసేఁ, కోయీ న యేగానా॥**

గురు నే ఉపదేశ్ దియా, అవుర్ తుఝే చితాయా ।
సంత్ పంథ్ ధార్ హియే, కటే మోహ మాయా ॥

లూట్ పడీ లూట్ లే, బచా లే ధన్ అప్నా ।
సహ న కాల్ కర్మచోట్, సోధ్ లే మన్ అప్నా ॥

రాధాస్వామి సంత్ రూప్, తేరే హైం సహాయీ
ఉన్ కీ ఓర్ ధ్యాన్ లగా లే; చరణ్ శరణాయీ ॥

సంత్ మతం శిక్షణ నాకు అర్థమయ్యేది కాదు. ఆయన నా భ్రమలు, అజ్ఞానం దూరం చేయడానికి అసలైన సత్యమైన భగవంతుణ్ణి కలుసుకోవడానికి నాకు ఈ గురుపదవిని ఇచ్చాడు. 1919లో ఆయన, "ఫకీర్! నీకు ఒక పని అప్పగిస్తాను. దానిని నిర్వర్తించు. సత్యమైన సద్గురువు నీకు సత్సంగీయుల రూపంలో దర్శన మిస్తాడు" అని ఆదేశించాడు. అది నిజమైందిప్పుడు. భగవంతుడు ఎవరు, ఏమిటి అనే జ్ఞానం కలిగింది. నేను ఏ భగవంతుణ్ణి అన్వేషించానో అతని రూపాన్ని హుజూర్ దాతాదయాల్‌జీ ఈ శబ్దంలో దర్శింపచేశాడు.

మంగళం అశబ్ద అరూప శబ్ద రూప స్వామీ ।
మంగళం అలఖ అనామ అగమ నామ నామీ ॥

మంగళం ఏ దీనబంధు, దీనానాథ్ దాతా ।
మంగళం అభేద్ భేద్ అనంద్ ధన్ త్రాతా ॥

మహిమా అనంత ఆద్, అంత్ కౌన్ గావే ।
భేద్ తేరా కౌన్ జానే, కౌన్ కహ సునావే ॥

సంత్ భేష్ ప్రగటే జగత్, దీన్ కో చితాయా ।
కాల్ కర్మ ఫంద్ కాట్, ధుర్ లే పహుంచాయా ॥

ప్రథమ తత్వ నిజ స్వరూప, పద కమల్ నమామి ।
గావూం ధ్యావూ రాత్ దివస్, భజూం రాధాస్వామి ॥

నేను సమాధిలోకి ఎందుకు వెళ్తుంటాను? ఆ పరమ తత్వం నన్ను ఆకర్షిస్తుంటుంది. పై వైపులాగుతుంటుంది. ఇది నా వశంలో లేదు. అక్కడే ఉండిపోవాలనిపిస్తూ ఉంటుంది. కానీ ఎక్కువ సేపు అక్కడ నిలువజాలను. ఎందుకంటే నాపైన నిబల, అబల, అజ్ఞాన జీవులకు సహాయం చేసి, వారిని

భవసాగరం నుండి దాటించి, జగత్కల్యాణం చేసే బాధ్యత ఉంది. అందుకే నేనీ పనిచేస్తున్నాను. హుజూర్ దాతాదయాల్‌జీ ఈ పనిని నాకు అప్పగించాడు. కనుక వివశుడనై ఈ పనిచేస్తున్నాను.

నన్ను గురువుగా భావించే వారికి నా అనుభవంలోకి వచ్చిన అంశాలను ఈ రోజు ప్రత్యేకంగా చెప్పదలచుకుంటున్నాను. ఆ భగవంతుడి సగుణ స్వరూప ధ్యానం చేసేవారు లేదా మూర్తి (విగ్రహం) పూజ చేసేవారు లేదా ఆ భగవంతుణ్ణి ఏదో ఒకరూపంలో తన అంతరంలో పూజించేవారు మానసిక ఆనందం పొందుతారు. వారిలో రిద్ధిసిద్ధి శక్తులు వచ్చేస్తాయి. కానీ భవసాగరం నుండి దాటిపోలేరు. ఇది నా అనుభవం. కొన్నాళ్ళ క్రింద ఉత్తరప్రదేశ్‌లోని మౌజా విరకలిలో ఒక స్త్రీ చనిపోయింది. ఆమె భర్త వకీలు. పాండిచ్చేరి వాస్తవ్యురాలైన ఓ భక్తురాలికి శిష్యుడు. కానీ ఆయన భార్య నన్ను విశ్వసించేది ఆమె మరణించడానికి నాలుగు రోజులు ముందే తన మృత్యువును గురించి చెప్పింది. ఇంకాస్సేపైతే చనిపోతుందనగా 'మానవతా జండా' గీతం పాడింది. ఆ తరువాత, "బాబాజీ, భండారో మాతా ఇద్దరూ వచ్చారు. వారి కోసం రెండు కుర్చీలు తెండీ" అందట. కుర్చీలను తెచ్చివేశారు. ఆమె కుర్చీలకు నమస్కరించి ప్రాణాలను విడిచింది. మరి నేనైతే వెళ్ళలేదు. "నువ్వు, వెళ్ళావా?" అని భండారోను అడిగాను. "పితాజీ! నేను వెళ్ళలేదు" అందామె. ఇలాంటి సంఘటనలు ప్రతిరోజూ నా ఎదుటికి వస్తుంటాయి.

నేనీ ఉదంతాలు ఎందుకు చెబుతున్నానంటే ఈ మహాత్ములు అసత్య ప్రచారం చేసి అజ్ఞానులైన జీవులను తమ వలలో చిక్కుబడేసుకుంటున్నారు. మన ధనం దోచుకుంటున్నారు. సగుణ రూపధ్యానం చేసే వారి ఎదుట వారి అంత్య సమయంలో రాముని రూపం ప్రత్యక్షమైనా, బాబా ఫకీర్ ఆకృతి దర్శనమిచ్చినా మరే ఇతర గురు రూపం వచ్చినా వారి రాకపోకలు సమాప్తం కావు. ఒక్కటి మాత్రం చెప్పవచ్చు. ఇలా రూపం కనిపిస్తే వారు నరకం నుండి తప్పించుకుంటారు. వారికి ఏదైనా మంచి దేహం, మంచి గర్భం, మంచి జన్మం లభిస్తుంది.

కొన్నాళ్ళకిందట నేను సరసోహేడీకి వెళ్ళాను. అక్కడ రాత్రికి రామాయణపు చౌపాయీలు చదవటం రివాజు. విన్నవాటిని కొన్నింటిని నోట్ చేసుకుని తీసుకువచ్చాను.

**తాత్ సకల్ తవ పుణ్య ప్రభావూ, జీతహూఁ అజయ నిశాచర్ రావూఁ।**
**సున్ సుత్ బచన్ ప్రీత్ అతి బాఢీ, నైన్ నీర్ రోమావలి ఠాఢీ ॥**

రావణుని మరణంతో లంకపై విజయం లభించింది. ఆ సమయంలో అక్కడికి దేవతలు వచ్చి రాముణ్ణి అభినందించారు. వారి వెంట దశరథ మహారాజుకూడా వచ్చాడు. రాముని వచనాలను విని దశరథునికి సంతోషం కలిగింది. ఆయన కళ్ళల్లో ప్రేమాశ్రువులు ఊరాయి. అతని అణువణువూ ఆనందించింది.

**రఘుపతి ప్రథమ ప్రేమ అనుమానా। చితే పితా దీనో దృఢ జానా ॥**

ఆ సమయంలో రాముడు దశరథ మహారాజుకు దృఢమైన జ్ఞానం ప్రసాదించాడు.

**తాతే ఉమా మోక్ష నహిఁ పావా, దశరథ భేద భక్తి మన్ లావా ॥**

ఓ హిందుజాతీ! నీవు నీ రామాయణంలోని అసలైన అంతరార్థాన్ని విస్మరించావు. శివుడు పార్వతితో చెబుతున్నాడు. మహారాజు దశరథుడు రాముణ్ణి తల్చుకుంటూ ప్రాణాలను వదిలాడు. కానీ ఆయనకు మోక్ష ప్రాప్తి కలుగలేదు. ఎందుకు? ఎందుకంటే వేర్పాటు భక్తి, భేదా భక్తి ఉండేది. అతడు రాముణ్ణి లేదా భగవంతుణ్ణి తనలో గాక ఇంకెక్కడో ఉన్నాడనుకునేవాడు. తన నుండి వేరుగా ఉన్నాడనుకునేవాడు. రామాయణాన్ని అనుసరించి ఏ వ్యక్తి తన అంత్య సమయంలో రామచంద్రుని లేదా శ్రీకృష్ణుని లేదా సతగురువును తనకంటే భిన్నమని భావించి ఆయన్ని పిలిస్తే ఆ వ్యక్తి జనన మరణాల నుండి బయటపడజాలడు.

దుర్గాదాస్! కళ్ళు తెరువు! నీవు నాకు చాలా సేవలు చేశావు. నేను నా కర్తవ్యాన్ని పూర్తి చేయాలనుకుంటున్నాను. నీవు మరొక శరీరం ధరించవలసిన అవసరం రాకూడదని నీకు చెబుతున్నాను. భేదభక్తి - వేర్పాటుభక్తి గలవారు తప్పక మరో జన్మ ఎత్తవలసి ఉంటుంది.

**"సగుణ ఉపాసక్ మోక్ష న లేహిఁ, తిన్ కే రామ భక్తి నిజ దేహిఁ"**

సగుణోపాసకులు - రాముని శరీరాన్ని విశ్వసించేవారైనా, కృష్ణుని శరీరాన్ని విశ్వసించేవారైనా లేదా గురుదేహాన్ని నమ్మేవారైనా ప్రాణం విడిచాక మోక్షాన్ని పొందజాలరు. విశ్వాసానికి ప్రతిఫలంగా మంచి గర్భం, మంచి జన్మం

లభిస్తుంది. మంచి కుటుంబం లభిస్తుంది. సంత్ సతగురువు లభించి జ్ఞాన ప్రదానం చేస్తాడు. ఇక అతడు తన లోపాన్ని అనగా అవసరమున్న నామ ధన సంపాదన పూర్తి చేసుకుంటాడు. ఈ విషయాన్నే హుజూర్ రాయ్ సాలిగ్రామ్ మహారాజ్ తన "ప్రేమవాణి"లో స్పష్టంగా చెప్పారు. ఏ గురువు వద్ద నీవు నామం ఉపదేశం పొందితే అంత్య సమయంలో ఆ గురువు నీ ఎదుట సాక్షాత్కరించి శబ్దం వినిపిస్తాడు. తరువాత ఆ వ్యక్తి సూక్ష్మ శరీరం కొంత కాలం వరకు పైలోకాల్లో ఉంటుంది. ఆ తరువాత ఎవరైనా సంత్ సద్గురువు ప్రపంచంలో అవతరిస్తే ఆ అసంపూర్ణ సాధనాపరుడైన జీవుడు జన్మించి ఆ సంత్ సద్గురువు సంపర్కంలోకి వచ్చి తన అసంపూర్ణ సంపాదన పూర్తిచేసుకుంటాడు. అప్పుడతనికి మోక్షం లభిస్తుంది.

సూక్ష్మ శరీరం పై లోకాల్లో ఉంటుందా అని మనసులో ఆలోచన వచ్చేది. వుంటుందని నా అనుభవం రుజువుచేసింది. మనిషి మరణానంతరం సూక్ష్మశరీరం పై లోకాల్లో వుంటుంది. ఆత్మభారం 21 గ్రాములని స్విట్జర్లాండులోని డాక్టరు చెప్పాడు. ఓ రోగి మృత్యుశయ్యమీద ఉన్నప్పుడు త్రాసులో అతని బరువును తూయించాడు. రోగి మరణించగానే వెంటనే మళ్ళీ తూచాడు. అప్పుడు 21 గ్రాముల బరువు తగ్గటం గమనించాడు. ఆత్మభారం 21 గ్రాములని అతడు నిర్ధారించాడు. ఈ అంశాన్ని నేను అంగీకరిస్తాను. కానీ అది ఆత్మభారం కాదు. నేను సురత్‌ను అధిరోహింపచేసి ప్రకాశంలో విలీనమై, ప్రకాశమయమైనప్పుడు దానిది కొంత భారం అవుతుంది. శబ్దంలో శబ్దమయమైనప్పుడు దానిది కూడా భారం వుంటుంది. కాని ఏ వస్తువు ప్రకాశంలో ఉంటూ శబ్దాన్ని వింటుందో, ప్రకాశంలో ఉంటూ ప్రకాశాన్ని చూస్తుందో దానిది ఏ భారమూ ఉండదు. ఆ భగవంతుడు పుష్ప సుగంధం కంటే పల్చని వాడని కబీర్ సాహెబ్ ఒక చోట చెప్పాడు.

స్థూల శరీరం నుండి వెలువడిన వస్తువు సూక్ష్మశరీరం. దాని భారం ఉంటుంది. ఎందుకంటే దానిలో కోరికలు, వాసనలుంటాయి. అందుకే అది బరువుగా ఉంటుంది. భారీగా - బరువుగా ఉండటం వలన భూమి యొక్క గురుత్వాకర్షణ శక్తి దానిని పైకి వెళ్ళనీయదు. సూక్ష్మశరీరంలో మనసు, మనసు యొక్క వాసనలు ఉంటాయి. కోరికలు భారంతో ఉంటాయి. అందుకే అది భూమ్యాకర్షణకు అతీతంగా పోజాలదు. దాని సంకల్పానుసారం, వాసనల

కనుగుణంగా దానికి స్వర్గం, నరకం లేదా విభిన్న ప్రకారాల రూపాలు కనిపిస్తుంటాయి. ఒకవేళ ఎవరిలోనైనా మానసిక కామనలు లేకుంటే, అంత్య సమయంలో అతనికి ప్రకాశ, శబ్దాలు సాక్షాత్కరిస్తే అతడు శబ్ద ప్రకాశాల మయమైపోతే అతడు తేలిక అవుతాడు. ఇక అతడు మళ్ళీ నేలపైన జన్మించకుండా పైలోకాలకు వెళ్ళిపోతాడు. ఒకవేళ ఎవరైనా ఈ జీవనంలో తన ఇష్టుణ్ణి దాతాదయాల్ మహారాజ్ ఈ కింద రాసిన శబ్దంలో చెప్పినట్లు ఏర్పర్చుకుంటే అతడు ఆ పరమతత్వంలో విలీనం చెందుతాడు. చూడండి! మీరు ఇందోర్ నుండి వచ్చారు. సత్సంగాన్ని శ్రద్ధగా వినండి.

"మంగళం అశబ్ద అరూప, శబ్ద రూప స్వామి"

ఆ భగవంతుడు శబ్ద గతిని పుట్టించే అశబ్దగతి అయి ఉన్నాడు. శబ్దం చలనం నుండి పుడుతుంది. నీవు శబ్ద బ్రహ్మను అందుకోనంతవరకు నీ జనన మరణాలు సమాప్తం కావు. నీ జన్మ పై లోకాలలో అవుతుంది. ఉన్నత స్థానంలో జన్మిస్తావు కానీ జన్మమెత్తటం మాత్రం తప్పదు. దుర్గియా! అర్థమైందా? మీరు నన్ను గురువుగా భావిస్తారు. మిమ్మల్ని మేల్కొల్పటం నాకర్తవ్యంగా భావిస్తాను. నన్ను కూడా హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ మేల్కొలిపాడు. ఆయన రాసిన శబ్దను మీరు విన్నారు.

సంత్ మతపు అసలైన బోధనలను నేను మీకు అందిస్తున్నాను. జీవుల్ని మేల్కొల్పి, వారికి గురువు యొక్క అసలు రూపం చూపించటం నా కర్తవ్యం. హుజూర్ దాతాదయాల్‌జీ నాకు గురు రూపం బోధించేందుకు చాలా ప్రయత్నించాడు. కానీ అప్పట్లో నాకు అర్థమయ్యేది కాదు. మీ వలన నాకీ జ్ఞానం కలిగింది. నా భ్రమలు పటాపంచలయ్యాయి. అందుకే మీరు నాకు సద్గురువులని అంటున్నాను.

భూదేవ్ ఒకసారి నాతో ఇలా చెప్పాడు. "బాబాజీ! మీరు ఉంటాసానీకి వచ్చేవారు. జనం మీ దగ్గరికి వచ్చి పాదాభివందనాలు చేసేవారు. కానీ నేను మాత్రం మీ దగ్గరికి వచ్చేవాణ్ణి కాదు. నాకు అయిష్టత, ఏహ్యభావం ఉండేవి. ఒకసారి నేను మీఫోటో చూశాను. మీరు మీ కళ్ళు నా కళ్ళలో కలిపినట్లు, నన్నే చూసినట్లు, కునికిపాటుపడినట్లు అనిపించింది" అన్నాడు. నేనలా చేశానా? తన అంతరంలో నా రూపం సాక్షాత్కరించిందని వ్యాస్‌జీ చెప్పాడు. నా స్వరూపం అతనితో అనేకమాటలు మాట్లాడిందనీ అన్నాడు. నేను వెళ్ళలేదు. మాట్లాడలేదు. ఇలాంటి సంఘటనలు నా కళ్ళు తెరిపించాయి.

గోపాల్‌దాస్ ఉదయమే నా దగ్గరికి వచ్చాడు. "పితాజీ! రాత్రి నాకొక కల వచ్చింది. మీరు చాలా పెద్ద - విశాల ప్రకాశంలో తిరుగుతున్నారు. మీ వెంట నేను కూడా ఉన్నాను. మీ వెంట రెండు పులులున్నాయి" అన్నాడు. "ఓ మానవా! ఇదంతా నీ మనసు ఆడే ఆటే తప్ప మరేమీ కాదు. నీ శ్రద్ధా విశ్వాసాల ననుసరించి నీకు ఫలితం దొరుకుతుంది. జీవులు అజ్ఞానులు. భ్రమలలో ఉన్నారు.

గురువు ఏం చేస్తాడు? తులసీదాసు గారి వాక్యాలను వినండి.

**వందో గురు పద కంజ కృపా, సింధు నర రూప హరి ।**
**మహా మోహ తమ్ పుంజ జాసు బచన్ రవి కరనీకర్ ॥**

నేను గురురూపాన్ని భగవంతుని రూపంగా భావించి ప్రణామం చేస్తాను. నా వంటి గురువు ఈనాటి వరకూ రాలేదంటాను. మీరు నన్ను అహంకారి అనుకోండి. మరేమైనా అనుకోండి. కానీ సత్యం చెబుతున్నాను. ఈ రహస్యం ఏ గురువూ, చెప్పలేదు. ప్రస్తుతం కొందరు గురువులు ప్రాపంచీకులను అజ్ఞానంలో ఉంచి వారి ధనాన్ని కబళిస్తున్నారు. నేను కూడా మోహం, భ్రమ, మనసు పరిభ్రమణం లోకి వచ్చాను. కానీ సద్గురువు యొక్క అమృత వచనాలు వాటిని దూరం తరిమేశాయి. మీరు మీ అజ్ఞానాన్ని వదలుకోదలచుకోరు. కొందరు పరువుప్రతిష్ఠల కోసం, మరికొందరు ధనసంపదల కోసం నా దగ్గరికి వస్తుంటారు. నన్ను నేను సంత్ సద్గురువునని చాటాను. సత్యాన్ని చాటడానికే నేనీ రహస్యాన్ని విప్పి చెప్పాను. ఇనుప తెరలను తొలగించాను. తమ నిజగృహానికి వెళ్ళాలనుకుంటున్న వారి మార్గం నిష్కంటకం చేశాను. శుభ్రం చేశాను. ఇక సాధన చేయటం మీ పని.

**బందో గురు పద పరమ పరాగా । సురుచి సుబాస్ సరస్ అనురాగా ॥**
**అభయ మూర్‌మయ చూరణ చారూ । శమన సకల భవ రుజ పరివారూ ॥**

గురు వచనాల వలన మనిషి భ్రమలు దూరమవుతాయి. ఇక అతడు భవసాగరం నుండి దాటిపోతాడు.

**సుకృత్ శంభు తన్ విమల్ విభూతి । మంజుల మంగల మోద ప్రసూతి ॥**
**జన్ మన్ మంజు ముకుర్‌మల్ హర్‌నీ, కియే తిలక్ గున్ గన్ విష్ కర్‌నీ ॥**

గురువు గుర్తింపు ఇది! ఆయన సత్సంగం వలన మనసు భ్రమలు దూరమవుతాయి. ప్రేమ పుడుతుంది. లైన్ ఆఫ్ యాక్షన్ లభిస్తుంది.

**శ్రీ గురుపద నఖ మణి గన్ జ్యోతి । సుమిరత్ దివ్యదృష్టి హై హోతీ ॥**

**దలన్ మోహ తుమ్ సో ప్రకాసు । బడే భాగ్ ఉర్ ఆవే జాసు ॥**

ఎవరి ప్రారబ్ధ కర్మలైనా చాలా మంచివై ఉంటే వారికి సంత్ సతగురు వక్త్ లభిస్తాడు. ఎంతో గొప్ప అదృష్టం ఉంటే వారికి సత్సంగం లభిస్తుంది. దానికంటే కూడా మంచి కర్మలు నీ ఖాతాలో ఉంటే సత్సంగంలో చెబుతున్న విషయాలు అర్థమవుతాయి. ఎవరి సత్కర్మలు ఉచ్చకోటికి చెంది ఉన్నతోన్నతమైనవీ, చాలా గొప్పవీ అయి ఉంటే వారు సత్సంగంలో చెప్పిన వచనాలను ఆచరిస్తారు.

**ఉధరి విమల్ విలోచన్ హియ్ కే , మిటేఁ దుఃఖ భీ రజనీ కే ॥**

**సూఝే రామ చరిత మని మానిక్ । గుప్త ప్రకట్ జహాఁ జో యహ ఖానిక్ ॥**

రాముడు నీ ఆత్మ! మనసు!! జీవునికి గురుజ్ఞానం కలిగినప్పుడు రాముని చరిత్ర యొక్క చిరునామా తెలుస్తుంది. అతడు మనసు వలయం నుండి బయటపడతాడు. ఈ భవసాగరం నుండి దాటి పోతాడు.

**నేహొ సునిరంజన్, ఆంజి దృగ్, సాధక్ సిద్ధి సమాన్ ।**<br>**కౌతిక్ దేఖేఁ శైల్ బన్, భూలన్ భౌ నిధాన్ ॥**

గురు వచనాలను విశ్వసించిన వారిపైనే గురువుకు దయ కలుగుతుందని తులసీదాస్ ఒకచోట రాశాడు. మీరొస్తారు. నేను నా బాధ్యతను నిర్వర్తిస్తున్నాను. మీరు శాశ్వతంగా జనన మరణ చక్రం నుండి బయటపడ దలుచుకుంటే శబ్ద, ప్రకాశాల సాధన చేయండి. సత్యమైన విషయం చెబుతున్నా దీని వలన నీవు ఫకీర్ చంద్ వలలో చిక్కుపడవు. సాధనలో ప్రకాశాన్ని దర్శించుకుని నీవే ప్రకాశమయమై దేహం వదిలితే పై లోకాలకు వెళ్తావు. ఒకవేళ నీవు సాధన చేయలేకుంటే పరోపకారం చేయి. నిజాయితీగా ఉండు. ఇతరులకు ఉపకారం చేయి. దుఃఖితులకు సహాయపడు. ఒక్క రూపాన్నే నమ్ముకో. అది రామునిదైనా కానీ, కృష్ణునిదైనా కానీ గురు రూపమైనా కానీ! దానిని మనస్ఫూర్తిగా ప్రేమించు! అభిమానించు! గౌరవించు. పతివ్రత అయిన స్త్రీ కేవలం తన పతినే విశ్వసిస్తుంది. అందుకే ఆమె స్వర్గానికి వెళ్తుంది. ఎప్పుడైతే నీవు ఒకే రూపాన్ని నమ్ముతావో దేహం త్యజించాక నీకు మంచి జన్మలభిస్తుంది. రాధాస్వామి మతంలోని చాలా మంది చెబుతుంటారు. ఏమని? నామదానం తీసుకుంటే ఇక పుణ్యదానాలు

చేసే అవసరమే లేదని! కానీ, నీవు అక్కడికి వెళ్తావో లేదో ఎవరికి తెలుసు? నీవిటు పుణ్యదానాలు చేయలేదు. ఇక నీకేం లభిస్తుంది? నేను నా కర్తవ్యాన్ని పూర్తి చేయాలనుకుంటున్నాను. నా సాధన చాలా ఉన్నత స్థాయిలో ఉంది.

**"మంగళం అశబ్ద అరూప, శబ్ద రూప స్వామి ।**
**మంగళం అలఖ అనామ, అగమ నామ నామీ" ॥**

నేను ఆ స్వామితత్వం భగవత్తత్వంలో నిలువడానికి ఆయన ధ్యాసలోనే సమయం గడుపుతాను. ఇప్పుడిక వార్ధక్యం వచ్చేసింది. శరీరం రోగగ్రస్తమవుతుంది. ఎప్పుడు రాలిపోతుందో తెలియదు. అందుకే నాకు అప్పగించిన విధులను ఇతరులకు అప్పగించాను. హైద్రాబాద్ వైపు నా గురుభాయి నందూసింగ్, ఆనందరావులున్నారు. హుజూర్ దాతాదయాల్ జీ శిక్షణ వ్యాపింపచేసి ప్రచారం చేసే పనిని వారికి అప్పగించాను. రాధాస్వామి ధామంలో ప్రేమానందరాయ్‌ను ఆచార్యునిగా చేశాను. అతడుకూడా నా గురుభాయి. గురుభాయి అంటే ఒకే గురువు శిష్యులమని అర్థం. ధామ్‌లో ఒక స్థూపాన్ని కట్టాలని కోరుతున్నాను. కృషక్‌జీ నా ఉత్తరాన్ని నామం అని భావించి అభ్యాసం చేయసాగాడు. ఆయన అంతరంలో నా రూపం ప్రగటం కాసాగింది. నేనాయన అజ్ఞానాన్ని దూరం చేయడానికి కొబ్బరికాయ, ఐదు పైసలు ఆయన చేతిలో పెట్టి తలవంచాను. నామదాన మివ్వమని సలహా ఇచ్చాను. ఇప్పుడతడు రాజస్థాన్‌లో పని చేస్తున్నాడు. మహాత్మా భూప్‌సింగ్ అనేక సంవత్సరాలు టేప్‌రికార్డు పట్టుకుని నా వెంట తిరిగాడు. ఎందుకిలా తిరుగుతున్నావని ఓ రోజు అడిగాను. "కొన్ని కారణాల వలన ఎంతో బాధపడేవాణ్ణి. ఓ రోజు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాను. అప్పుడు మీ రూపం సాక్షాత్కరించి, "భూప్‌సింగ్ మేలుకో! మేలుకో! నీవు మేల్కొనే సమయం ఇప్పుడు వచ్చింది" అన్నానట.

**"ఏక్ హీ సాథే సబ్ సదే సబ్ సాధే సబ్ జాయ్"**

ఇతనికి ఒక బాధ్యత అప్పగించాను. "నీవు లోకులకు టేప్‌రికార్డును వినిపిస్తుండు. ప్రసాదం ఇస్తుండు" అని చెప్పాను. కనుక ఇతనిచ్చే ప్రసాదానికి శక్తి ఉంటుంది. ఉంది.

సంత్ తారాచంద్ హరియాణాలోని హిసార్ భివాని జిల్లాలోని దినోద్ గ్రామంలో సత్సంగాలు నిర్వహిస్తాడు. దుఃఖితులకు సహాయం చేస్తాడు. ఆయనకు చాలా పెద్ద ఆశ్రమం ఉంది. స్వంత భూమి ఉంది. వ్యవసాయం చేయిస్తాడు.

పొలంలో పండిన ధాన్యం ఆశ్రమానికి ఉపయోగపడుతున్నది. హరియాణా ప్రాంతంలో సంత్ మతాన్ని వ్యాపింపచేయమని నేనాయన్ని ఆదేశించాను. ఎందుకు? ఒకటి ఆయన పూర్వజన్మ కర్మ. రెండవది ఆయన ఏదో విశ్వాసంతో నా వద్దకి వచ్చాడు. ఆ తరువాత అతని విశ్వాసం మరింత దృఢతరం అయింది. నేను మధ్యాహ్నం ఎండలో అతనితోపాటు పొలంలో శనగపంట కోతలకు వెళ్ళానని, పంటను కోశానని ఆయన చెప్పాడు. మరి నేను అలా సంత్ తారాచంద్ పొలానికి వెళ్ళి శనగ పైరు కోశానా? లేదు. నేను వెళ్ళలేదు. ఆయన చెప్పే వరకు ఆ సంగతి నాకు తెలియదు. ఆయన విచారంలో చాలా శక్తి ఉందని నాకు నమ్మకం కలిగింది. ఇలాంటి వ్యక్తి దుఃఖజీవులకు శుభభావనలిస్తే, వారి మేలు కోరితే వారికి తప్పకుండా శుభం జరుగుతుందనిపించి సంత్ మత శిక్షణా ప్రచార బాధ్యతను అయనకు అప్పగించాను.

ఆలీగఢ్‌లో ఒక ముస్లిం కాదరీ బాబా ఉండేవాడు. పానిపట్టులో ఎవరో ఫకీర్ ఆస్థానంలో కూర్చుని ఉన్న అతని అంతరంలో నా రూపం సాక్షాత్కరించింది. ఇక అతడు నా దగ్గరికి వచ్చాడు. అతనికి నేను సత్సంగం ఇచ్చాను. అతనిలో ప్రకాశం ఉద్భవించేది. ఆ ప్రకాశంలో నా స్వరూపం, దాతాదయాల్ స్వరూపం, ఇతర పైగంబరుల స్వరూపాలు ప్రగటమయ్యేవి. మొదట్లో కూడా అతడు గురువుగా పనిచేసేవాడు. అందుకే నేనతన్ని ముసల్మానులకు సత్యప్రియత, సత్యసంధతను ప్రచారం చేయడానికి నియమించాను. ముసల్మానులలో స్వతంత్రాలోచనను విస్తరింపచేశాను.

ఢిల్లీలో సంత్ నందలాల్‌కు సంత్ మత ప్రచారాన్ని అప్పగించాను. అవకాశం దొరికిన తరువాత డాక్టర్ ఐ.సి. శర్మ ఇక్కడికి వస్తాడు. ఇక్కడ ఉంటూ విదేశాల నుండి వచ్చే సత్సంగీయుల కోసం పనిచేస్తాడు. సత్యసంధత, ఆలోచనా విచారాల ప్రచారం విస్తృతంగా చేయమని నేనతన్ని ఆదేశించాను. అయితే ఒక నియమం! నా పేరు చెప్పుకునో, దాతాదయాల్ పేరు చెప్పుకునో అనుచితమైన స్వలాభం పొందకూడదనీ, మీరందరినీ చేతులు జోడించి మరీ ప్రార్థిస్తున్నాను. సంత్ మత ప్రచారం జనుల సేవ. ధనం ఉంటే ధనంతో ఈ సేవ చెయ్యి. ప్రేమ నీలో ఉంటే ప్రేమతో జనుల సేవ చేయి. జ్ఞానం ఉంటే జ్ఞానంతో చేయి. అదీ లేకుంటే మనసుతో సేవ చేయి.

జనరల్ జయసింహ! నీవు నన్ను ప్రేమించావు. నేను నా ఆత్మను

సత్యసంధతతో ఉంచి ప్రపంచం నుండి వెళ్ళిపోదలచుకుంటున్నాను. నా అనుభవాన్నే లోకానికి చెప్పాను. హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ ఆజ్ఞను పాటించాను. నా ఆలోచనా విచారాలు లోకంలో వ్యాపించడానికి భగవంతునికి ఇష్టమైతే స్వయంగా వాటికి తగిన ఏర్పాట్లు జరిగిపోతాయి. లేకుంటే దాని గురించి నాకు చింతేం లేదు.

ఇక్కడి పనులలో అందరికంటే ఎక్కువ బాధ్యతలు మానవతామందిరం ఏర్పాట్లు మున్షిరామ్ భగత్ ఆధీనంలో ఉన్నాయి. జనుల దగ్గరి నుండి డబ్బు లొస్తున్నాయి. వీటితో అయినంత వరకు దుఃఖితులకు సహాయం చేయాలి.

దుర్గియా! నీ లోపల శబ్ద ప్రకాశాలు ఉద్భవించేలా ప్రయత్నం చేయి. శబ్దం రాకుంటే కనీసం ప్రకాశాన్నైనా ఉత్పన్నం చేసుకో. మరణ సమయంలో జీవికి జ్యోతిని ఎందుకు చూపుతారు? నీ అసలు స్వరూపం ప్రకాశం సుమా అని అతనికి గుర్తు చేయటం కోసం. నా సత్సంగాన్ని శ్రద్ధగా విన్నవారికి రహస్యం తెలిసిపోయింది. ఒకవేళ ఈ జీవన కాలంలో వారి ఆధ్యాత్మిక సంపాదన పూర్తి కాకున్నా వారి ఆచార వ్యవహారాలు, ప్రవర్తన సరిగ్గా ఉంటే మరణ సమయంలో వారికి నా మాటలు జ్ఞాపకానికి వస్తాయి. భావ విచారాలు, ఆలోచనలు, ఊహలు, రూపురేఖలు, ఆ సమయంలో వారి మనో నేత్రం ముందుకు వస్తాయి. నా బోధనానుసారం వాటిని వారు మాయ అనుకుంటారు. వారి సురత్ వివశత్వంతో ప్రకాశంలోకి వెళ్ళిపోతుంది.

ఇప్పుడు నాకు వార్ధక్యం వచ్చింది. మూత్ర విసర్జన సమస్య ఉంది. రేపు ఏం జరుగుతుందో తెలియదు. హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ బోధనా పద్ధతిని మార్చమని నాకు ఆజ్ఞ ఇచ్చాడు. నా అనుభవాల ఆధారంగా సముచిత మనిపించినట్లు బోధనాపద్ధతిని మార్చాను. ప్రారబ్ధ కర్మ అందరికీ అనుభవించవలసి ఉంటుంది. నేను కూడా అనుభవిస్తున్నాను. జనరల్ సాహెబ్ కూడా అనుభవిస్తున్నాడు. నేడు నేను మీకు సత్యాన్ని చెప్పాను. నా పై నమ్మకంతో ఉండకండి. నా వాక్కులపై నమ్మకంతో ఉండండి. అప్పుడు మీకు శుభం జరుగుతుంది. అంతిమ సమయంలో బాబా ఫకీర్ వస్తే నీవు మళ్ళీ జన్మ ఎత్తవలసి ఉంటుంది. మంచి జన్మం లభిస్తుంది. బాబా ఫకీర్ వచ్చినా, రాముడొచ్చినా, ఆవు వచ్చినా విషయం ఒక్కటే! మరణ సమయంలో గోదానం చేసే ఆచారంలోని అంతరార్థం ఏమిటి? ఆవు పవిత్రం అని భావించబడింది

కనుక దాని తోక మనిషి చేతికిస్తారు. "నిన్ను ఈ ఆవు వైతరణి నది నుండి దాటిస్తుంది. నరకానికి పోనీయదు" అనే భావన అతనిలో మేల్కొల్పుతారు. సురత్ ఆ భావనలోకి వస్తుంది. నరకానికి వెళ్ళ కుండా తప్పించుకుంటుంది.

అందరికీ రాధాస్వామి

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## సత్సంగం

## స్మరణ, ధ్యానం, భజనల ద్వారా ఇష్టప్రాప్తి

## తేది 21-1-1973

**ఉత్‌తే కోయీ న ఆయియా, జాసే పూఛూ( జాయె,**
**ఇతతే సబ కోయీ జాత్ హై, భార్ లదాయ్ లదాయ్ ॥**

**ఉత్‌తే సతగురు ఆయియా, జాకీ మతి బుద్ధి ధీర్,**

**భవసాగర్ కే జీవ్ కో ఖేవ్ లగావే తీర్ ॥**

రాధాస్వామి! ఇప్పుడు నేనెవరికీ సత్సంగం చేయించను. ఊహ తెలిశాక నా జీవనంలో ఏదో ఒక వస్తువును అన్వేషించటం ప్రారంభించాను. ఆ అన్వేషణ ఏమిటో స్పష్టంగా తెలియదుగానీ వెదకటం మాత్రం నిశ్చయంగా వెదికాను. అంతరంలో ఒక రకమైన ఆకర్షణ ఉండేది. ఇప్పుడు వృద్ధాప్యం వచ్చింది. నా కళ్ళతో ప్రతి రోజూ ప్రపంచం మరణించటం చూస్తుంటాను! హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ కూడా వెళ్ళిపోయాడు. పెద్దపెద్ద గొప్ప గొప్ప సంతులు వెళ్ళిపోయారు. వీళ్ళంతా ఎక్కడికి వెళ్ళి ఉంటారు? అని ఆలోచిస్తుంటాను. నేనెక్కడికి వెళ్తాను? మొదట్లో మనసులో ఒకవేళ ఏదైనా విచారం లేదా ప్రశ్న వస్తే రామచంద్రుడు లేదా కృష్ణుడు లేదా హుజూర్ దాతాదయాల్‌జీ మహారాజ్ ఎవరైనా వచ్చి జవాబు ఇచ్చి వెళ్ళేవారు. నా జీవితంలో మంచే జరిగిందో, చెడే జరిగిందో జరిగింది. కాని ఇప్పుడు విశ్వాసం మిగలలేదు. ఎందుకు? నా రూపం కొందరి అంతరంలోనో, స్వప్నంలోనో, జాగ్రదవస్థలోనో కనిపించి వారికి ఔషధాలు చెబుతుంది. కొడుకులు కలుగుతారని ఆశీర్వదిస్తుంది. వారి సురత్‌లను పై వైపు మళ్ళిస్తుంది కానీ అది నేను కాను. ఇది వారి మనసు, ఆత్మ అనే సమాధానం దొరికింది. బయటినుండి ఏ శక్తీ

వచ్చి జవాబులివ్వదు. వారి వారి ఆశ, భావనలకు అనుకూలంగా వారికి సమాధానాలు లభిస్తాయి.

పై నుండి సత గురువు వస్తాడని కబీర్ సాహెబ్ చెప్పాడు. ఆ సత గురువు గుర్తింపేమిటి? ఆయన బుద్ధి, తెలివి, మతి దృఢమైనదై, గంభీరమైనదై, స్థిరమైనదై ఉంటుంది. మతి, బుద్ధి స్థిరమయిన వారే జీవులను భవసాగరం నుండి దాటించగలరు. భవసాగరపు జీవులంటే ఎవరు? "నేనెవరిని? ఎక్కడినుండి వచ్చాను? ఎక్కడికి వెళ్తాను? నా ఆది ఏమిటి? అంతం ఏమిటి? పరమేశ్వరుడు ఎవరు? ఎలా ఉద్భవించాను?" మొదలైన వాటి గురించిన అన్వేషణ గలవారే భవసాగరపు జీవులు. నాలాగే ఇలాంటి విచారాలు కలవారుకూడా భవసాగరంలో కొట్టుకుపోతున్నారు. పుత్రులు లేరనీ, ధనసంపదలు లేవనీ, ఇతర కష్టాలున్నాయనీ, ప్రాపంచిక కష్టాలు, కోరికలు కలవారు కూడా భవ సాగరంలో ఉన్నారు.

ఎన్నోసార్లు ఆలోచిస్తుంటాను, "ఫకీర్ చంద్! గురువువయ్యావు. కాళ్ళు మొక్కించుకుంటూ గౌరవ మర్యాదలను పొందుతున్నావు. ఈ రకమైన మోసపు గురుత్వం వలన నీకేమైనా లభిస్తుందా?" అని. నేనొక అన్వేషకుణ్ణి. సత్యం కోరేవాణ్ణి. సత్యాన్నే ఇష్టపడే వాణ్ణి. 'బుద్ధిమతి ధీర్' అంటే ఏమిటి? శాంత చిత్తుడవు కావటం! మనసులో స్ఫురణలు స్ఫురించకుండా ఉండటం, చంచలత్వం దూరం కావటం!

**తన్ థిర్ మన్ థిర్ సురత్ నిరత్ థిర్ హోయ్ ।**
**కహేఁ కబీర తా పలక్ లోఁ పా సకే న కోయ్ ॥**

అనగా మన ఉనికి, అస్తిత్వం స్థిరం కావటం. ఇలా అనటంలో కబీర్ సాహెబ్ ఉద్దేశ్యం ఏమిటి? అదాయనకే తెలియాలి. సంతుల సందేశం, వాణి బోధపడేది కాదు. ఆలోచించి, అన్వేషించే వస్తువు మనలోనే ఉంది. అది మనబుద్ధి. బుద్ధి, మనసు, చిత్తం, అహంకారం, జ్ఞానేంద్రియాలే అంతరంలో అన్వేషిస్తుంటాయి. అవి స్థిరమయినప్పుడు జీవుని భావం స్థిరమవుతుంది. అతని ప్రశ్నలు, సమాధానాలు సమాప్తమవుతాయి. అన్వేషించే వస్తువు సమాప్తమవుతుంది. అప్పుడు ఈ బుద్ధి, మనసు, చిత్తం, అహంకారం, సంకల్ప వికల్పాలు, వాసనలు, పుట్టేస్థితి నుండి ఈ భవసాగరం నుండి దాటి పోయే స్థితి ఏర్పడుతుంది.

ఉఠ్‌తే సతగురు ఆయియా, జాకీ బుద్ధి మత్ ధీర్ ।
భవసాగర్ కే జీవ్‌కో, ఖేయ లగావే, తీర్ ॥

ఆయన జీవులను ఎలా దాటిస్తాడు? ఎలా తరింపజేస్తాడు? నేను అర్థం చేసుకున్న దానిని నా శాంతి కోసమే చెబుతాను. నా కర్మలు చెడువైనందున నేనీ పని చేయవలసి వస్తున్నది. ఇందులో అబద్ధం చెప్పవలసి వుంటుంది. పాపాన్ని తీసుకోవలసి వస్తుంది. ఈరోజు పొద్దున లేచాక గోపాలదాస్, సీత, రామచంద్రుని పత్ని ధూపం వేశారు. దీపం వెలిగించి, మిఠాయి తెచ్చి నా హారతి చేశారు. నేననుకున్నాను "ఊఁ చేయించుకో హారతులు!" అని. ఇది అబద్ధపు గౌరవాలు కావా? జీవులు తన భావాలతో, విశ్వాసాలతో ఎవరినో గొప్పవారనుకుని వారికి గౌరవ మర్యాదలిస్తారు. వారికి వారి భావన యొక్క ఫలితమే లభిస్తుంది. హారతి చేసే వారు తరిస్తారు. హారతి చేయించుకునేవారు మరణిస్తారు.

నేను అన్వేషకుణ్ణి. భగవంతుణ్ణి కలుసుకోవడానికి బయల్దేరాను. కర్మేంద్రియాలకు, జ్ఞానేంద్రియాలకు అతీతంగా వెళ్ళి పోవటం కోసం ప్రయత్నిస్తుంటాను. కానీ సదా అక్కడ ఉండజాలను. సద్గురువు ఏం చేస్తాడు? "స్మరణ చేయి, ధ్యానం చేయి, మనసును ఏకత్రితం చేయి. శబ్దాన్ని విను" అని చెబుతాడు. దీని వలన నీ మతి, బుద్ధి స్థిరపడాలని, గంభీరం కావాలని ఇలా చెబుతాడు. ఇది స్థిరపడి గంభీరమైనప్పుడు నీవు మొదట్లో లాగే మారిపోతావు. నీ ప్రారంభిక స్థితి సత్ దై ఉండేది. అందులో శరీరం లేదు. సంకల్ప వికల్పాలు లేవు. కర్మేంద్రియాలు లేవు: జ్ఞానేంద్రియాలు లేవు. అది మనతొలి స్థితి-ఆది అవస్థ అని నేననుకుంటున్నాను. ఇందులో నాకు శాంతి లభిస్తుంది. ఉదయం, సాయంత్రం ఆ భగవంతుణ్ణి కలుసుకునేందుకు ప్రయత్నం చేస్తుంటాను. ప్రారంభంలో ఆ రూపం వచ్చేది కాదు. అందుకే గురుస్వరూపాన్ని భగవంతుడేనని భావించి, విశ్వసించి, నడవవలసి ఉంటుంది. ఫకీర్‌చంద్‌ను లేదా బాబాసావన్ సింగ్‌జీ మహారాజ్‌ను, లేదా ఇతర మరొక గురువును భగవంతుని రూపం అని అనుకోక వారిని శరీర ధారిగా భావించి ధ్యానం చేసేవారు భవసాగరం నుండి దాటిపోజాలరు. హుజూర్ దాతాదయల్‌జీ మహారాజ్ తన ఒక శబ్దంలో ఆ భగవంతుని రూపాన్ని ఇలా అవిష్కరించారు.

మంగళం అశబ్ద అరూప, శబ్ద రూప స్వామీ ।
మంగళం అలఖ అనామ అగమ నామ నామీ ॥

ఆయన అందరికీ స్వామి, ప్రభువు. ఆయన తన అశబ్ద గతిలో, తనలో తానే ఉండేవాడు. తరువాత ఆయనలో చలనం కలిగింది. దాని వలన శబ్దం ఉద్భవించింది. ఆ స్వామి మంగళాన్ని ఇచ్చేవాడు, శుభాన్ని ఇచ్చే వాడు. ఆయన అందరికీ ఆధారుడు. ఆయన వలననే సమస్త సృష్టి రచన జరిగింది. లోకలోకాంతరాలన్నీ వెలువడ్డాయి.

**మంగళం ఏ దీనబంధు దీనానాథ్ దాతా ।**
**మంగళం అభేదభేద ఆనంద ధన్ త్రాతా ॥**

ఆ భగవంతుణ్ణి కలుసుకునేందుకు ప్రయత్నించావు. కానీ నీవు అక్కడిదాకా చేరుకోలేదు.

**మహిమా అనంత్ ఆద్ అంత్ కౌన్‌గావే ।**
**భేద్ తేరా కౌన్ జానే, కౌన్ కహ సునావే ॥**

**సంత్ భేష్ ప్రగటే జగత్ జీవ కో చితాయా ।**
**కాల్ కర్మ ఫంద్ కాట్ ధుర్ లే పహూంచాయా ॥**

ఆ భగవంతుడు సంత్ రూపంలో వచ్చి జీవులను మేల్కొలుపుతాడు. కాలకర్మలు ఏమిటి? కాలమంటే సమయం, సమయంలో గతి, చలనం ఉంటుంది. ఆ గతి, చలనం యొక్క విభిన్న ఆటల, లీలల పేరే కర్మ. మన సురత్ సాధన చేస్తూ అగతి (చలన రాహిత్యం) లోకి వెళ్ళనంతవరకు మన కాల, కర్మలు సమాప్తం కావు. శరీరంలో సదా గతి-చలనం అవుతూ ఉంటుంది. రక్తం ప్రవహిస్తూ ఉంటుంది. శరీరంలో కొత్త కణాలు ఏర్పడుతుంటాయని డాక్టర్లు చెబుతారు. అవి అలా పెరగటం వల్లనే శరీరం పెరుగుతుంది. వార్థక్యంలో ఈ కణాలు తగ్గటం మొదలవుతుంది. అందుకే భగవంతుడు చలన రాహిత్య స్థితిలో ఉన్నాడు. దీనిని విసమాధి అనికూడా అనవచ్చు.

**తీన్ సున్న్ సే పారా, వహ హై దేశ్ హమారా ।**

అక్కడి నుండి వచ్చి గురువు రహస్యం చెబుతాడు. ఈ ప్రపంచంలో దుఃఖం ఉంది, సుఖం ఉంది. బాధ ఉంది, సంతోషం ఉంది. శాశ్వతంగా వీటి నుండి తప్పించుకోవాలనుకుంటే స్మరణ, ధ్యానం, భజన చేసి నీ మనసును ఏకాగ్రం చేయి. దీని వలన నీకు ఆ స్థితి లభిస్తుంది.

మీరొస్తారు. నేను కృతజ్ఞతలు చెబుతాను. ఎందుకంటే మీ చరణాల కారణంగా నాకు ఈ రహస్యం లభించింది. ఇంకా గమ్యానికి చేరలేదు. కానీ ప్రయత్నం చేస్తుంటాను. ఆ అశబ్దంతో లేదా శబ్దంతో లేదా శబ్దం యొక్క ఆధారునితో ప్రేమ తత్పరత కలిగి ఉండాలని ప్రయత్నిస్తాను. ఆ తరువాత పరిణామం ఏమవుతుందో తెలియదు. సేవారామ్! నీవొచ్చావు! సేవలు చేస్తున్నావు. నేను నా బాధ్యతను గుర్తు చేసుకుంటున్నాను. నా విధిని నిర్వర్తించుకుని పోవాలనుకుంటున్నాను. ఒక రూపాన్ని, నీ ఆరాధ్యం 'ఇష్టం'గా నమ్ముకో. నా రూపాన్ని నమ్ముకొమ్మని నేను చెప్పను. నీ విశ్వాసం ఎవరిపై ఉంటే వారి రూపాన్ని నమ్ముకో. ఆ రూపాన్ని పరిపూర్ణమని భావించి, గాఢంగా విశ్వసించి, దాని స్మరణ, ధ్యానం, భజన చేస్తూ ఉండు. నీ-నడవడి-ప్రవర్తనను శుద్ధిగా ఉంచుకో. ఈ కాలకర్మలో మనకు లభించేదంతా మన నిజాయితీ -నడవడిల ఫలితమే!

**ప్రథమ తత్వ నిజస్వరూప్, పద్ కమల్ నమామి ।**
**గాఁవూఁ, ధ్యావూఁ, రాత్ దివస్, భజూఁ రాధాస్వామి ॥**

'రాధాస్వామి' అని నోటితో భజించటం ఒక పద్ధతి. 'రాధాస్వామి' యొక్క వాస్తవిక భజన ఏమిటి? సురత్‌ను శబ్దంతో కలపటమే రాధాస్వామి భజన. ఇప్పుడు వార్ధక్యం పై బడింది. ఆలోచిస్తుంటాను. ఇక బయల్దేరవలసి ఉంది. ఎక్కడికి వెళ్తాను? ఆయన దయ కలిగితే ఆ స్థితిలో లయమై నా ఉనికిని, అస్తిత్వాన్ని పోగొట్టుకుంటాను. ఒకవేళ గురువు కావడానికి, లేదా మరొకటి కావడానికి ఏదైనా వాంఛ శేషించి ఉంటే ఎక్కడికి వెళ్తానో తెలియదు.

**అబ్ హమ్ చలే అమర పురీ, టూరే తూరే టాట్ ।**
**ఆవన్ హోయ్ సో ఆయియే సూలీ ఊపర్ వాట్ ॥**

ఆ అమరపురికి వెళ్ళడానికి సంపూర్ణంగా ఆలోచనా విచారాలు, భావాలు, ఆశలు మొదలైన వాటిని సమాప్తం చేసి ఉరికంభం పై ఎక్కవలసి ఉంటుంది. ఉరిమాను పై ఎక్కడం అంటే ఏమిటి? ఎవరికైనా ఉరిశిక్ష విధిస్తే వారి మెడలో తాడు బిగించి వేలాడదీస్తారు. అతని చేతులకు, కాళ్ళకు లేదా అతని శరీరపు ఏ ఒక్క భాగానికీ ఏ సహాయమూ లభించదు. అందదు. ఇలాగే సురత్ ఆ పరమతత్వం వైపు లాగబడగా మనసుకు లేదా సురత్‌కు స్మరణ, ధ్యానం, భజన, భావం, విచారం, ఆశ, వాసనల సహాయం అందనివ్వక పోవటమే

శిలువపై-ఉరికంబంపై ఎక్కడం అవుతుందని, నేను అర్థం చేసుకున్నాను. ఉరికంబమంటే అత్యున్నతమైనస్థాయి - శిఖరాగ్రస్థానం అని ఇక్కడ అర్థం చేసుకోవాలి.

ఓ ఫకీర్! ఈ సత్సంగీయులు నీకు శిఖరం పైకి ఎక్కే పద్ధతి చూపారు. ఎలా? నేను ఏ ఒక్కరి అంతరంలోకీ వెళ్ళలేదనే ఒకే ఒక్క వాస్తవం నా జీవనాన్ని మార్చివేసింది. తమ మనసుతో నా రూపాన్ని, ఏర్పర్చుకుని దాని సహాయం తీసుకున్న వాళ్ళిక ఉరికంభంపైకి ఎక్కినట్లు ఎలా అవుతుంది? వారు నా రూప సహాయం తీసుకున్నారు. ఉరికంభంపై ఎక్కితే ఏ వస్తువు సహాయమూ ఉండదు, అందదు. ఇక్కడ ఉరికంభం అనగా - చాలా ఉన్నతమైన గమ్యం. ఉన్నతమైన అంతస్తు, శిఖరాగ్రస్థాయి. ఎవరైనా ఈ ఉరికంబం ఎక్కదలచుకుంటే వాళ్ళు కేవలం పరమతత్వాన్ని ఇష్టునిగా ఏర్పర్చుకోవాల్సి ఉంటుంది. నీవు నీ ఇష్టుణ్ణి సగుణుడని నమ్మితే నీవు అక్కడి వరకు చేరుకోజాలవు. నీవు నీ ఇంటికి వెళ్ళదలచుకుంటే కేవలం ఆ భగవంతునిపై విశ్వాసం పెట్టుకో. నీ సురత్ అక్కడి వరకు వెళ్ళదు. అందుకే నీవు ఏ రూపాన్ని నమ్మినా దానిని ప్రకాశ స్వరూపమని భావించు. ఆ రూపం గల వ్యక్తి హోషియార్‌పూర్‌లోనో, బ్యాస్‌లోనో, ఆగ్రాలోనో ఉంటాడని అనుకోకు. ఆయన సదా నీ దగ్గరే ఉంటాడు.

సూలీ ఉపర్ ఘర్ కియా, విష్ కా కరే అహార్
తాకో కాల్ క్యా కరే, ఆఠ్‌పహర్ హోషియార్ ॥

ఆ భగవంతుడు తమ రూపుడేననీ వేదాంతుల అభిప్రాయం. గురు మతం వారికి ఆ భగవంతుడే గురు స్వరూపుడు. ఇవన్నీ మాటల, పదాల జగడాలు. వాస్తవిక వస్తువు తన సురత్‌ను ఆటువైపు లాగి ఉంచటం.

'విష్‌కా ఆహార్ కరే' అనగా మన అంతరంలో ఎలాంటి విషయాలు ఉంచకూడదు. విషయాలలో వాసనలు, కోరికలు ఉంటాయి. ఎలాంటి వాసనా-కోరికా పెట్టుకోకూడదు. అప్పుడే ఆ వ్యక్తి తన ఇంటికి చేరుకోగలడు.

యార్ బులావే భావ్ సే మోపే గయా న జాయ్ ।
ధన్ మైలీ పియా ఉజలా లాగ్ న సకే పాయ్ ॥

మన అంతరంలో ఎల్లవేళలా ఆ భగవంతుని శబ్దం ప్రతిధ్వనిస్తుంటుంది. దీనిలో సాంసారిక వాసనలు, మురికి నిలిచి ఉన్నాయి గనుక మన సురత్ దానిని పట్టుకోజాలదు.

**జిస్ కారణ మై ఆప్ థా, సోతో మిలయా ఆమ్ ।**
**సాంయీ తో సన్ముఖ్ ఖఢా, లాగ్ కబీరా పాయ్ ॥**

ఏ అంశం కోసం నీవు తీర్థాలకు, మందిరాలకు, మసీదులకు వెళ్తావో అది నీ దగ్గరే ఉంది. కానీ ఈ అంతస్థు, గమ్యం చాలా కఠినతరమైనది. అందుకే నేనంటూ ఉంటాను. నేనిప్పుడిక సత్సంగాలు చేయించడానికి అర్హుణ్ణి కాదు. ఆ స్థాయిని దాటి వెళ్ళాను.

ఇక ఇప్పుడు నీకు పనికి వచ్చే నీవు ఇష్టపడే విషయం చెబుతాను. నీకు ఎవరిపై విశ్వాసం వుంటే వారిని నీ ఇష్టునిగా చేసుకో. ఏ నామాన్ని నీకు నీ గురువు ఇచ్చాడో ఆ నామాన్ని పట్టుకో. స్మరణ, ధ్యానాలతో మనసును ఏకాగ్రం చేయి. లేకుంటే శాంతి లభించదు. అంతిమ మజిలీ, అంతిమస్థానం మిగిలింది. ఇది అందరికీ దొరకదు. లక్షలకొకరో, ఇద్దరో ఆ అంతస్థుకు చేరుకోవాలనుకుంటారు. పురుషోత్తమ్‌దాస్! నీవు నా స్నేహితునివి. నా సమస్త ఆయువు ఈ అన్వేషణలోనే గడిచిపోయింది. సత్సంగీయుల వలన నా కళ్ళు తెరుచుకున్నాయి. ఇప్పుడు శిఖరం పైకి ఎక్కే ప్రయత్నం చేస్తుంటాను. కానీ మీ కోసం ఈ బోధన కాదు. మీరు వేదమార్గంలో నడవండి. మనసును పవిత్రంగా ఉంచుకొనండి. శుభవిచారాలుపెట్టుకోండి. ఒక్కచోట విశ్వాసం ఉంచండి. సనాతనులు రామచంద్రునిపై లేదా కృష్ణునిపై, ముస్లింలు మహమ్మద్ సాహబ్‌పై, ఇలా మీ మీ ధర్మాన్ననుసరించి విశ్వసించండి. ఆయన సదా మీ దగ్గరే ఉన్నాడని భావించండి. ఎవరి అదృష్టంలో ఉంటే వారు ముందుకు వెళ్ళగలరు.

అందరికీ రాధాస్వామి

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## సత్సంగం

## సాధన ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి

## తేది 22-1-1973

హే విద్యా తూ బడీ అవిద్యా, సంతన్ కీ తైఁ కదర్ న జానీ ।
సంత్ ప్రేమ కే సింధు భరే హైఁ, తైఁ ఉల్టీ బుద్ధి కీచడ్ సానీ ।
సంతన్ ప్రేమ లగా ప్యార్ సే, ఉన్ కీ సురత్ శబ్ద సమానీ ।
**తూ ధన్, మాన్, ప్రతిష్ఠాచాహే, అవుర్ చతురతా మే లిపటానీ ॥**

రాధాస్వామి! నా అనుభవాలను వివరిస్తానని శపథం చేశాను. పై శబ్ద వాణిని మీరు విన్నారు. ఇదే గాక ఇంకా మరికొన్నింటిని వింటుంటారు. నా భగవంతుడు లేక ఆధారుడు ఎక్కడున్నాడని నా చిన్నప్పటి నుండీ అన్వేషించాను. గురుఋణం నాపై ఉంది గనుక నా అనుభవాలనే చెబుతుంటాను. భగవంతుణ్ణి అన్వేషిస్తున్న క్రమంలో నా అనుభవంలోకి వచ్చిందేమిటంటే భగవంతుడు ఇక్కడ ఉండడు. ఆయన చాలా ఉన్నతమైనవాడు. ఆయన అంశ సురత్ రూపంలో ఇక్కడుంది. సూర్యుడు ఇక్కడ ఉండడు గానీ తన కిరణాల రూపంలో ఉంటున్నాడు. "శాస్త్రాలను, వేదాలనూ చదివినవారు సైతం తప్పుపట్టకుండా ఉండేలా రాయండి. మాట్లాడండి" అంటూ ఒక సజ్జనుడు నాతో అన్నాడు. నా అనుభవం వేదాలకంటే అతీతమైనదని ఈ రోజు నా మనసులో ఆలోచన వచ్చింది. జ్ఞానం, వివేకం, అనుభవాల పేరే వేదం. నేను చెప్పే ఇంద్రలోకం, బ్రహ్మలోకం, శబ్దలోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, త్రికుటి, సున్న్, మహాసున్న్ లేదా భఁవర్ గుఫా ఇవన్నీ పైన ఉన్నాయి. మరి శాస్త్రాల్లో వీటి ప్రమాణం ఉందా? నిన్న నేను జంత్రి-(పంచాంగం)లో చదివాను. సూర్యుడు నాల్గవ ఆకాశంలో ఉంటాడు. ఆయన కిరణాలు బ్రహ్మలోకం వరకే వెళ్తాయి. జ్యోతిషం ఋజువు చేస్తున్నదేమిటంటే బ్రహ్మలోకం వేరు. ఇంద్రలోకం వేరు, చంద్రలోకం వేరు. సూర్యలోకం వేరు. శాస్త్రాలు పూర్తిగా సత్యం చెప్పాయి. విద్వాంసులు శాస్త్రాలను చదువుతారు. ఉటంకిస్తారుగానీ తమ క్రియాత్మక జీవనం వైపు ఎవరూ చూసుకోరు. జ్యోతిషం చెబుతోంది. సూర్యుని కిరణాలు బ్రహ్మలోకం వరకే పోతాయి. అంటే బ్రహ్మలోకం ఇక్కడ లేదని

రుజువవుతున్నది. ఇప్పుడిక ఎవరైనా బ్రహ్మలోకానికి వెళ్ళాలని కోరితే వారు తమను తాము కేవలం అహం బ్రహ్మ అని పోజాలరు. అక్కడికి ఎప్పుడు వెళ్ళగలరు? ఎప్పుడైతే అతని సురత్ మొదట సూర్యలోకంలోకి, తరువాత అక్కడి నుండి బ్రహ్మలోకంలోకి వెళ్ళినప్పుడు అక్కడికి వెళ్ళగలరు. సూర్యుని కిరణాలు ఇక్కడికి కూడా వస్తాయి. బ్రహ్మలోకం వరకు కూడా వెళ్తాయి. అందుకే అంతరంలో తెల్లని ప్రకాశంలోకి మనిషి వెళ్ళనంతవరకు బ్రహ్మలోకంలోకి వెళ్ళజాలడు. సంతుల మార్గంలో సాధన ఉంది. ఒకవేళ ఎవరైనా బ్రహ్మలోకం లోకి వెళ్ళదలచి, బ్రహ్మమయం కాగోరితే వారికి ప్రకాశ సాధన అవసరం. ఇట్లాగాక రాముణ్ణి, కృష్ణుణ్ణి, బాబా ఫకీర్ను లేదా మరొక గురువును ఎంత ధ్యానం చేసినా - అలా ధ్యానం చేయటం వలన తను బ్రహ్మమయమవుతాననీ, బ్రహ్మలోకంలోకి వెళ్ళిపోతాననీ అనుకుంటే అది అసంభవం. ఇదే మాట నేను గత సత్సంగంలో కూడా చెప్పాను. ఇది నా అనుభవం. ఇప్పుడిక "నడువు-నడిపించు" సమయం వచ్చింది. నా కర్మవశాన సత్సంగీయులకు నా అనుభవం చెబుతుంటాను. నాకు నా పేరు, నా గుర్తు నిలవాలనే ఆశ లేదు. నాకు నా ఇంటికి వెళ్ళాలనే తపన వుండేది. మన ఆదిగృహం ఆ బ్రహ్మలోకం కంటే కూడా పైన ఉంది. ఒకటి బ్రహ్మలోకం, ఒక పారబ్రహ్మలోకం, ఒక సత్ లోకం. ఒక అలఖ లోకం. ఎలాగైతే పృథ్వీమండలం, తారల మండలం ఉందో అలాగే ఈ లోకాలవి కూడా మండలాలున్నాయి. సూర్యుడు పృథ్వి కంటే మూడు వేల రెట్లు అధికంగా పెద్దగా ఉన్నాడు. నేలకంటే నీటి వైశాల్యం చాలా అధికంగా ఉంది. నీటికంటే గాలి వైశాల్యం మరీ మరీ ఎక్కువగా ఉంది. గాలికంటే ప్రకాశం వైశాల్యం ఎంతో అధికంగా ఉంది. ప్రకాశంకంటే ఆకాశపు వైశాల్యం చాలా ఎక్కువగా ఉంది. రాధాస్వామి దయాలుడు తన వాణిలో ఈ అన్నింటి దూరాలు చెప్పాడు. తన జీవనకాలంలో, అంతరంలో ప్రకాశాన్ని అందుకోని వ్యక్తి బ్రహ్మ లోకం లోకి వెళ్ళజాలడు. హిందువులలో దేవయాన పంథ, పితృయాన పంథ, అంధకార పంథ (క్రిమి, కీటకాల పంథ) అని మూడు పంథాలను అంగీకరించారు.

సేవారామ్! నీవొచ్చావ్! సేవ చేస్తావు. నేను నా బాధ్యతను అర్థం చేసుకుంటాను. అందుకే నీతో చెబుతున్నాను. ఈ జీవనంలో కొంత కొంత సాధన చేసి నీ అంతరంలో ప్రకాశాన్ని ఉద్భవింపచేయి. శబ్దం వినవస్తే అభినందనలు. నేను జమలను నా వెంట తిప్పుకోవాలనుకోను. ఈ బాహ్య

గురుసేవ, అంతరంలో గురువు పట్ల ప్రేమ జీవులకు అవసరం. దీని వలన నీ మనసు ఏకాగ్రమవుతుంది. మానసిక అనందం లభిస్తుంది. నీలో సిద్ధి శక్తులు వస్తాయి. కానీ దీని వలన నీవు బ్రహ్మలోకం లోకి వెళ్ళజాలవు. ఇది నా అనుభవం. ఈ సంగతి పంచాంగంలో చదివాను. జ్యోతిషంలో ఎంతో సత్యాన్ని చెప్పారు. బ్రహ్మలోకం చాలా దూరం అని అది చెబుతోంది. కేవలం సూర్యకిరణాలే బ్రహ్మలోకం వరకు చేరుతాయి. ఇతర తారకల కిరణాలు చేరజాలవు. మార్తాండ జంత్రిలో రాశారు సూర్యుని కిరణాలు కేవలం బ్రహ్మ లోకం వరకే చేరాయి. బ్రహ్మలోకం కంటే పైన కూడా ఇంకా లోకాలున్నాయి. దీని వలన ఋజువవుతున్నది. అవి కాలలోకం, సత్‌లోకం, అలఖ లోకం, అగమ లోకం, చివరికి అనామీ ధామం. ఈ లోకాల చిరునామా సంత్‌లిస్తారు. అందుకే ఎవరైనా బ్రహ్మలోకం లోకి వెళ్ళదలిస్తే ముందుగా వారు తమ అంతరంలో ప్రకాశాన్ని ప్రభవింపచేయాలి. దేవయాన పంథను పట్టుకోవాలి. దీని తరువాత శబ్దం ద్వారా సత్ లోకంలోకి వెళ్ళవలసి ఉంటుంది. ప్రపంచం వేదం వేదం అని అరుస్తుంది. వేదాల పరిశోధన జరుగుతుంది. ఒకటి శృతి మార్గం. శృతి అంటే అంతరంలో ఏ ధ్వని వినబడుతుందో అది శృతి. మరొకటి స్మృతి మార్గం. ప్రతి ఒక లోకపు ధ్వని వుంటుంది. పృథ్వి చలిస్తుంటుంది. పృథ్వి గతి-చలనం యొక్క శబ్దాన్ని మన చెవులు వినజాలవు. ఎందుకంటే ఇవి అందుకు అర్హం కావు. యోగ్యం కావు. దీనిని విరాట్ ధ్వని అంటారు. వీటన్నిటి ప్రతిబింబం, నీడలు మనిషి మేధస్సులో మూడవ నేత్రం నుండి శిఖాస్థానం వరకు ఉన్నాయి. ఏ వ్యక్తి తన అంతరంలో ఏ గమ్యం సాధన చేస్తాడో అతనికి ఆ లోకపు ధ్వని వినిపిస్తుంది. దాని రూపం కనిపిస్తుంది. ఏదైతే వినిపిస్తుందో అది శృతి. దాని ప్రభావం మానవుని మేధస్సుపై స్థిరపడితే దాని పేరు స్మృతి. ఋషులు తమ అంతరంలో ఆ ఉద్గీత లేదా అనహదనాదాన్ని విన్నారు. వారు గమ్యస్థానం అభ్యాసం చేశారు, ఆనందం పొందారు. దానిని అనుసరించే కొందరు ఒకటి, మరొకరు మరొకటి పుస్తకాలు రాశారు.

మీరొస్తారు. నేను నా కర్మను అనుభవిస్తున్నాను. మీరు నా సత్సంగానికి అర్హులు కారు. నేను మనసు నుండి బయటపడగలిగే వాణ్ణి కాదు. మనసు దయలేనిది. మానసిక ప్రేమలో నుండి, గౌరవ, ప్రతిష్టలలోనుండి, అభిమాన

గమ్యాలనుండి ఇది బయటపడనీయదు. నా రూపం మీ లోపల సాక్షాత్కరిస్తుంది. మీరు చెప్పినప్పటినుండి, అది నేను కాదు గనుక నాపైన దయ కలిగింది. నా అంతరంలో శబ్ద ప్రకాశాలను అందుకోవడానికి ప్రయత్నిస్తుంటాను. ఈ మాటనే రాధాస్వామి మతాన్ని నడిపించిన హుజూర్ రాయ్‌సాలిగ్‌రామ్ మహారాజ్ సతగురు శబ్ద స్వరూపుడు. ఆయన చరణాలే ప్రకాశం అని చెప్పాడు. బాహ్యగురువు కర్తవ్యం ఏమిటంటే ఆయిన జీవులకు సత్సంగం చేయించి వారి వృత్తిని బహిర్ముఖం నుండి అంతర్ముఖంగా చేయాలి. భిన్న విభిన్న ధర్మాల, మార్గాల, వాణిల కారణంగా వారి మేధస్సుకై పడి ఉన్న భ్రమలు, సంశయాలు, శుద్ధి కావాలి. ఎవరైనా పూర్ణ పురుషుని సత్సంగం ఆవశ్యకమని అనడానికి ఇదే కారణం.

ఒక సజ్జనుడు నాతో అన్నాడు "మీరు ఏ పుస్తకం రాసినా ఇతర విద్వాంసులు తప్పులెన్నకుండా రాయండి అని''... విద్వాంసులు నా అనుభవం ఎదుట ఏం చేస్తారు? ఆ భగవంతుడు ఇక్కడ లేడని మీకు చెప్పాను. సూర్యుని కిరణాలు బ్రహ్మలోకాన్ని దాటిపోలేవు అని జ్యోతిషశాస్త్రం చెబుతుంది. బ్రహ్మలోకం మరో వస్తువని, మాతృలోకం మరో వస్తువని దీని అర్థం. అందుకే సంతులు సాధన చెప్పారు. నా ఆలోచనా విచారాలను చదివి విద్వాంసులేం చేస్తారు? సంతుల మార్గం పూర్తిగా సత్యమార్గం. భగవంతుడు ఇక్కడ ఉండడు. ఆయన అంశలే ఆత్మలు. అందుకే మనిషి మనిషి సేవ చేయాలి. సేవ అందుకోవాలి. ఒకవేళ భగవంతుణ్ణి కలుసుకోదలచినవారు శబ్దాన్ని ఆధారంగా చేసుకొని తమ అంతరంలోకి వెళ్ళాలి. అతడు చనిపోయినపుడు ఏ అంతస్థు స్థాయిపై అతని నిలకడ ఉండెనో అదే అంతస్థుపై "అంత్ మతసోగతా" నియమానుసారం చేరుకుంటాడు. నాకు అర్థమైంది ఇది.

నోట్:- అందరికీ నా ఈ ఉన్నత శిక్షణ క్రియాత్మక జీవనంలోకి తేవటం కష్టం అని నాకు తెలుసు. కాని నేను కేవలం ఈ రహస్యాన్ని ఎందుకు విప్పానంటే ప్రపంచంలో మనిషి ఆ భగవంతుణ్ణి మందిరాలలో, మసీదులలో, చర్చిలలో, అన్య ధార్మిక స్థానాలలో వెదుకుతున్నాడు. ఆ భగవంతుడు ఇక్కడ సురత్ రూపంలో అనగా ఆత్మ రూపంలో ప్రతి ఒక్క మనిషి అంతరంలో ఉన్నాడని వారికి అర్థం కావాలి. అందుకే మనిషి మరో మనిషిని ఆదరించాలి. పరస్పరం సహాయం అందించాలి. అందుకోవాలి. అంతరంలో ద్వైత భావం

దూరం కావాలి. దీని వలన జీవనం సుఖంగా గడవాలి. ఒకవేళ వ్యక్తి పైలోకాలలోకి వెళ్ళదలిస్తే తన అంతరంలో సాధన చేయాలి. ఆ స్థానానిది ఎక్కడ సాధన చేయాలి ఎలా చేయాలి అనేది సద్గురువు నుండి తెలుసుకోవాలి.

"అందరికీ రాధాస్వామి"

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

మానవతా మందిరం, హోషియార్‌పూర్

## సత్సంగం

## నిజమైన రహస్యం

## తేది 17-11-1973

భజన్ బినా అవసర్ బీతా జాత్,
నర దేహీ కీ సార్ నా జానీ, చిత్ నహిం గురు బసాత్ ।
సుఖ్ నిద్రా మే రాత్ గంవాయీ, దివస్ గంవాయా ఖాత్ ।
దేఖత్ దేఖత్ బిన్‌సేంగే సబ్, జ్యోం తారా ప్రభాత్ ।
అవసర్ పాయ్ న చేతే ప్రాణీ, అంత్ సహే యమ్ లాత్ ।
రాధాస్వామీ చరణ్ శరన్ బలిహారీ, గురు వహ భేద్ బతాత్ ॥

* * * * * *

చల్ హంసా వా దేస్ జహాం తోరే పియా బసత్ హైం ।
నౌ దిస్ మూంద్ దిశా దస్ ఖోలో ధరతీ గగన్ మలాయీ
ఖోల్ కబాడీ చఢో అటారీ మోతియా ఝుర్ ఝుర్ ఆయీ ।
చారోం వేద్ భరేం యహాం పానీ లక్ష్మీ ఝూడూ లగాయీ ।
ఆఠోం సిద్ధ్ ఖడే కర్ జోడే బ్రహ్మ వేద్ సునాయీ ।
ఝిల్‌మిల్ జ్యోతి అధర్ మే ఝుల్‌కే ఝీనా శబ్ద సునాయీ ।
మధుర్ మధుర్ ధున్ మురలీ బాజే బంసీ శబ్ద్ సునాయీ ।

**జగ్ మే బడే గురు కన్ఫూ(కూ ఫాఁసీ డార్ బుఝాయీ ।**

**కహే కబీర్ సునో హో సంతో బిఛుడా హంస్ మలాయీ ।**

రాధాస్వామీ! కబీర్ సాహెబ్ శబ్దం విన్నారు. దీనిని విన్నవారు అన్వేషణ ప్రారంభిస్తారు. నేను కూడా ఈ శబ్ద్ చదివాను. జీవితమంతా అభ్యాసం చేస్తూ ఆ ఇంటికోసం అన్వేషణ చేస్తూ వస్తున్నాను.

**చల్ హంసా వా దేస్ జహాఁ తోరే పియా బసత్ హైఁ ।**
**నౌ దిస్ మూంద్ దిశా దస్ ఖోలో ధర్తీ గగన్ మలాయీ ॥**

**చల్ హంసా వా దేస్ జహాఁ తోరే పియా బసత్ హైఁ ।**

అక్కడికి వెళ్ళడానికి ఏం చేయవలసి ఉంటుంది? నవద్వారాలను మూసివేయండి. అంటే నీ ధ్యానం ఇంద్రియాలవైపు వెళ్ళకుండా ఉండాలి. దశమద్వారం మహాసున్న్. అక్కడ మనసు సంకల్పాలు చేయదు. నీ దేశానికి వెళ్ళడానికి ముందు నీవు అక్కడికి వెళ్ళాల్సి ఉంటుంది. నా తొమ్మిది ద్వారాలు మూసుకుపోయేవి కాదు. నేను అక్కడికి చేరుకోలేక పోయాను. నాలో నా ఇంటికి వెళ్ళాలనే అన్వేషణ ఉండేది గనుక ప్రకృతి సరైన ఏర్పాటు చేసింది. మీ దయ వలన నిజమైన రహస్యం తెలిసింది. ఇప్పుడు నేను సాధన చేస్తాను. నా అనుభవాలను ప్రపంచానికి చెబుతాను. నేనే పరదాలూ ఉంచలేదు. కాని కబీర్ సాహెబ్ లేదా ఇతర సంతులు తెర మరుగు చేశారు. ఎంతో సాహసంతో చెబుతున్నాను. నిజం చెప్పాలంటే గృహస్థులు కూడా మోసగింపబడటంలోనే ఆనందం అనుభవిస్తారు. పేరాశ కల్పించి లోకాన్ని మోసం చేస్తుంటారు. అంత్యసమయంలో నిన్ను గురువు వచ్చి తీసుకువెళ్తాడని జీవులకు ఒక ఆలోచన, భావన ఇస్తారు. ఇదెంతటి మోసం! అన్నిచోట్లా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. నష్టపోయినప్పుడు జనం ఏడుస్తుంటారు.

**ఖోల్ కబాడీ చఢో అటారీ, మోతియా ఝుర్ ఝుర్ ఆయీ ।**

ఈ రోజు బొంబాయి నుండి శ్రీమతి కృష్ణాదేవి దగ్గరనుండి ఓ ఉత్తరం వచ్చింది. అందులో ఆమె, "మహారాజ్! మీరు, మామ్‌చంద్‌గారు ఇద్దరూ జబ్బు పడ్డట్లుగా నాకు కల వచ్చింది. నిజంగానే మీకిద్దరికీ సుస్తీ చేసిందా? మీ వద్దకు త్వరలో రావాలనుకుంటున్నాను" అని రాసింది. ఆమెకీ స్వప్నం ఎందుకొచ్చింది? బాబాజీ వృద్ధుడయ్యాడు. 87 ఏళ్ళు. ఏ సమయంలో ఏం జరుగుతుందో ఏమో

ఏం చెప్పగలం? అనే ఆలోచన, భావన ఆమె మనసులో ఏర్పడి ఉంది. కనుక ఆమెకీ స్వప్నం వచ్చింది. నన్ను చూడండి. ఆరోగ్యంగా ఉన్నాను. మామ్‌చంద్ కూడా క్షేమంగా ఉన్నాడు. ఆమె భావనా విచారాలననుసరించి ఆమెకు కల వచ్చింది. ప్రాపంచిక వస్తువుల పట్ల కోరిక కలిగినవారు, జీవితంపట్ల ప్రేమ ఉన్నవారు ఆ దేశంలోకి వెళ్ళజాలరని నేనర్థం చేసుకున్నాను. జీవనం వేరు, అస్తిత్వం వేరు. అస్తిత్వం పేరే సత్. జీవనం పేరు రచన-సృష్టి. సంతులు తెరమరుగుచేయకుంటే వారి ఆశ్రమాలు, పీఠాలు, గురుద్వారాలు, మఠాలు ఎలా నిర్మాణమవుతాయి? ఉదాహరణకు ఓ స్త్రీని తెరమరుగున-పరదామాటున ముసుగులో ఉంచినప్పుడే ఆమెను చూడాలనే కాంక్ష యువకులలో ప్రబలమవుతుంది. తెర ఉన్నంతవరకు ఆకర్షణ ఉంటుంది. తెర తొలగిపోతే ఆకర్షణ తగ్గిపోతుంది. తెర చాటున ఉన్న వస్తువు గురించి నువ్వేం చెప్పినా లోకం నమ్ముతుంది. ఈ తెరల వల్ల నీవు కావలసినంత లాభాన్ని పొందు. కానీ ఆ తెర తొలగిపోయినప్పుడు దాని వాస్తవికత అందరి దృష్టిలోకి వస్తుంది. నేను తెరలు పెట్టలేదు. అందుకే నన్ను నేను సంత్ సద్గురు వక్త్ అని చెబుతుంటాను. పరదా ఉంచటం వలన లాభనష్టాలు రెండూ ఉన్నాయి. సత్యాన్ని వాంఛించేవారు. సత్యకాంక్షగలవారు స్పష్టమైన వ్యాఖ్యానం వలన లాభం పొందుతారు. ఈ పరదా కారణంగా తమ జీవనాన్ని ఆనందింపచేసుకుంటారు. ఇక నష్టం ఎవరికి కలుగుతుందనేది ప్రశ్న. పరదా పెట్టకుంటే గురువులకు డబ్బు రాదు. అదీ హాని.

**చారోఁ వేద్ భరే యహాఁ పానీ, లక్ష్మీ ఝూడూ లగాయీ ।**
**ఆఠోఁ సిద్ధ్ ఖడేకర్ జోడీ, బ్రహ్మ వేద్ సునాయీ ॥**

ఈ శబ్దాలను చదివే వారికి యథార్థం అర్థం కాలేదు. కనుక వాళ్ళు అలవాటుగా వేదాల గురించి చెబుతారు. ఒకటికొకటి చెబుతారు. శబ్ద ప్రకాశాలలోనికి వెళ్ళిన వ్యక్తికి వేదమంటే జ్ఞానమేనని తెలిసిపోతుంది. అతనికి సృష్టి రచన, స్తుతి, పరదాలోని వాస్తవం బోధపడుతుంది. ఇక అతడు జ్ఞానవంతుడవుతాడు. లక్ష్మి మిగిలిపోయింది. జ్ఞాని అయిన వాడు ధనాన్ని గానీ, స్త్రీ వ్యామోహాన్ని గానీ లక్ష్యపెట్టడు. అతని అవసరాలను ప్రకృతే తీరుస్తుంది. అతనికి కావలసిన వాటిని ప్రకృతే సమకూరుస్తుంది. నియమమేమిటంటే అతడు వాచకజ్ఞాని కాకూడదు. నేను ఇప్పటివరకు పూర్తిగా పైకి వెళ్లలేకపోయాను.

అయినా ప్రకృతి నా అవసరాలను పూర్తి చేస్తుంటుంది. ఇలాంటి వ్యక్తి సిద్ధి, శక్తులను కోరకపోయినా సిద్ధి శక్తులు స్వాభావికంగానే అతనికి వస్తాయి.

**ఝిల్‌మిల్ జ్యోతి అధర్ మే ఝుల్ కే, ఝీనా శబ్ద సునాయీ ।**

అక్కడ ఘంట, శంఖాలు మోగవు. ఈ మాయా దేశం అనగా స్థూల, సూక్ష్మములు ప్రకృతి శబ్దాలు. వీటినుండి బయటపడి పైకి వెళ్ళిన వ్యక్తికి అక్కడొక అనహద, అఖండ శబ్దం వినిపిస్తుంది. అది వీణ కాదు. మురళికాదు. అది ఆనందస్థితిలోని ధ్వని. వీణ, మురళి ధ్వనులు కింది స్థాయిలోనే ఉండిపోతాయి.

**మధుర్ మధుర్ ధున్ మురళీ బాజే, బంసీ శబ్ద సునాయీ ।**
**జగ్ మే బడే గురు కన్‌ఫూంకూ, ఫాంసీ డార్ బురఝాయీ ।**
**కోహ కబీర్ సునోహో సంతో, బిఛుడా హంస్ మలాయీ ॥**

ప్రాపంచిక కోరికలు, మనసులో ఊహలు ఆలోచనలు వదలనంతవరకు, గురు రూపాన్ని వదలనంతవరకు ఆ అనహదవాణి శబ్దమును నీవు వినజాలవు. అక్కడికి చేరుకున్న వ్యక్తికి ఈ ప్రపంచంపట్ల ప్రేమ ఉండదు. కనుక వారికి ప్రాపంచిక సుఖం కొద్దిగానే దొరుకుతుంది. మీరు ప్రాపంచికులు. పిల్లా పాప గల వాళ్ళు. అందుకే మెల్లమెల్లగా ఈ మార్గంలో నడక కొనసాగించండి. శ్రీమంతుని ముంగిట్లో పడి ఉండి అతని తోపుళ్ళు తింటూ ఉండండి. ఏదో ఒకనాటికి గమ్యస్థానానికి తప్పకుండా చేరుకుంటారు. శ్రీమంతుని తోపుళ్ళు అంటే ఏమిటి? అవి ఎలాంటివి? మనం పైకి వెళ్ళడానికి ప్రయత్నిస్తాం. కింద పడిపోతాం. మళ్ళీ పడిపోతాం. ఇలా కిందికి పడిపోవటమే శ్రీమంతుని చేత ఢక్కామొక్కీలు తినటం అవుతుంది. భావం దృఢతరమైనప్పుడు సురత్ తనకు తానుగా పైకి అధిరోహిస్తుంది. గురువు నీ చెవులలో నామం ఉపదేశిస్తాడు. ఈ నామం కింది స్థాయిల కోసం ఇస్తాడు. పై స్థానాలలో, పై అంతస్థులలో సాధన చేసే వారికి చెవుల్లో రహస్యంగా నామదానమిచ్చే అవసరం లేదు. అందుకే నేనెవరికీ నామదానమివ్వను. సత్సంగంలో వచనాలు చెబుతాను. వీటిని వినండి. అర్థం చేసుకుని ఆచరించండి. ఆ వాస్తవ అంశాన్ని అర్థం చేసుకున్న వారి పని సఫలమవుతుంది. కింది స్థానాల కోసం నామజపం స్మరణ, ధ్యానం నిర్దేశించబడ్డాయి. అసలైన నామం పై స్థానాల కోసమే ఉంది. ఇప్పటి గురువులు శిష్యుల్ని వారి జీవితమంతా తమ ఆధీనంలోనే పడి ఉండేలా ప్రవర్తిస్తారు.

ఆ శిష్యులు ఎప్పటికీ తమ దగ్గరికి వస్తూ ఉండాలి. కానుకలు అర్పిస్తుండాలి. అందుకే వారిని విముక్తుల్ని చేయరు. విముక్తుల్ని చేస్తే ఆ శిష్యులు మళ్ళీ తమ దగ్గరికి రారు గదా! వేరైన హంసలు కలవడం అంటే ఏమిటి? మన సురత్ తన మాతృకలో. అంటే తనలో తాను కలిసిపోవడమన్న మాట! పాలను, నీటిని వేరు చేసే శక్తి హంసకుంటుంది. మన సురత్ తన నిజగృహానికి వెళ్ళాలని కోరుకుంటుంది. అక్కడికి వెళ్ళడానికి పలురకాల ప్రయత్నాలు చేస్తుంది. ఇది విడిపోయిన హంస. ఈ ప్రయత్నం ఫలిస్తే సురత్ భగవంతుణ్ణి కలుసుకున్నట్లు అనుకోవాలి. కొందరు ఆ భగవంతుణ్ణి తండ్రిగా భావిస్తారు. మరికొందరు ప్రియుడిగా భావిస్తారు. ఇంకొందరు భర్తగా భావిస్తారు. సిక్కు గురువులు ఆ భగవంతుణ్ణి భర్తగా, తనను తాను భార్యగా అనుకుంటారు. వారి శబ్దాలలో ముహల్లా అనే పదం ప్రయోగిస్తారు. మొదటి ముహల్లా, రెండవ ముహల్లా మున్నగు శబ్ద అంతస్థులున్నాయి. ఇదొక నిష్ఠ

**భజన్ బిన్ అవసర బీతా జాత్ ।**
**నరదేహీ కీ సార్ న జానీ చిత్త్ నహిఁ గురు బసాత్ ॥**

మనసులో బాబా ఫకీర్ రూపం ఏర్పడితే చాలు నావతీరం చేరుతుందనుకుంటుంది ప్రపంచం. రూపం ఏర్పడటం సాధనలో తొలి మెట్టు! అంతే!! అనుభవ జ్ఞానాలపేరే గురువు. అనుభవజ్ఞానాలు సంపాదించినవారు చిత్తంలో గురువును స్థిరంగా నిలపుకున్నారని అర్థం చేసుకో. గురురూపాన్ని తమ అంతరంలో ఏర్పరుచుకున్న వారికి సుఖదుఃఖాలు కలుగవా? వారు కామ, క్రోధ, లోభ, మోహ అహంకారాలలో చిక్కుకోరా? వారికి అశాంతి కలుగదా? గురు స్వరూపాన్ని అంతరంలో ఏర్పర్చి స్థిరపరచుకోవటమంటే మనసును ఏకాగ్రం చేసేటందుకు అదొక సాధన మాత్రమే! ఇదే వాస్తవం, ఇదే గమ్యం కాదు. ఇది తొలిమెట్టు. అసలు గమ్యం దీనికంటే పై స్థానంలో ఉంది.

**సుఖ్ నిద్రా మే రాత్ గఁవాయీ దివస్ గఁవాయా ఖాత్ ।**
**దేఖత్ దేఖత్ బినసేంగే సబ్ జ్యోఁ తారా పర్‌భాత్ ॥**

రాత్రింబగళ్ళు మనం తినటం, తాగటం, పడుకోవటం లేదా విశ్రాంతి మున్నగు వాటిలోనే నిమగ్నమవుతాం. ప్రాతః సమయంలో తారకలు క్షణకాలం ఆలస్యం చేయకుండా నిష్క్రమించినట్లే మనం కూడా ఒకరోజు అలాగే వెళ్ళిపోవలసి ఉందనే అంశాన్ని ఏనాడూ ఆలోచించం.

అవసర్ పాయే న చేతే ప్రాణీ అంత్ సహే యమ్ లాత్।
రాధాస్వామి చరణ శరణ బలిహారీ గురు యహ భేద్ బతాత్॥

నీవు వెళ్ళవలసిన నిజధామం, నీ అసలు గృహం ఎక్కడుంది? అనే ఈ అసలు రహస్యాన్ని గురువు చెబుతాడు. అంత్య సమయంలో ప్రకాశ, శబ్దాలలోకి వెళ్ళలేనివారు జనన మరణాలనుండి తప్పించుకోలేరు. మరణ సమయంలో వారి ఎదుట రాముడు, కృష్ణుడు, దేవుళ్ళు, దేవతలు, గురు రూపాలు వచ్చినా వారికి పునర్జన్మ తప్పదు.

చూడు బల్ బీర్! నీవొచ్చావు. నీకు రహస్యం చెప్పాను. ఇప్పుడు సాధన చేస్తూ ఉండు. సాధన చేయడం సాహసవంతుల, అభివృద్ధిలోకి రాదలచి, ఉత్సాహం చూపేవారి లక్షణం. యుద్ధభూమిలో యుద్ధమే తప్ప సైనికునికి ఇంకేదీ జ్ఞాపకానికి రాదు. ఆ సమయంలో అతనికి మృత్యువు కూడా గుర్తు రాదు. రాకూడదు.

ఉన్నతస్థాయి బోధనకు అర్హులెవరూ లేకపోవడాన్ని సంతులు గమనించారు. అందుకే వారు సాధారణ జనులకు స్మరణ, ధ్యానం చేయమని నిర్దేశిస్తారు.

ఏక్ జన్మ్ గురు భక్తి కర్, జన్మ దూసరే నామ్।
జన్మ తీసరే ముక్తి పద్, చౌథే మే నిజధామ్॥

జీవనంలో ముఖ్యభాగం అధిక కాలం సత్సంగంలో గడుపు. రహస్యాన్ని అర్థం చేసుకో. తరువాత అభ్యాసం చేయి. నామాన్ని వదలకు. అప్పుడు ముక్తి లభిస్తుంది. భ్రమల నుండి, సంశయాల నుండి ముక్తి లభిస్తుంది. ఇక శరీరాన్ని త్యజించాక నీ ఇంటికి చేరుకుంటావు.

అందరికీ రాధాస్వామి

# పరమ సంత్ పరమదయాల్ ఫకీర్‌చంద్‌జీ మహారాజ్

## సత్సంగం

## సత్యమేవ జయతే

## తేది 23-12-1973

నేను గాఢ నిద్రలోకి వెళ్ళినప్పుడు లేదా సాధన సమయంలో ప్రకాశం, శబ్దం, ఆలోచన, విచారం అన్నీ మరిచిపోతాను. ఈ స్థితి అప్పుడప్పుడు వస్తుంటుంది. హిందూమతంలో పుట్టాను గనుక ఈశ్వరభక్తి, సత్యప్రియత,

మంచితనం మొదలైన సంస్కారాలు లభించాయి. సత్యప్రియత నా తత్వం. ప్రతి వస్తువునూ సత్యదృష్టితో, సత్యసంధతతో చూడటం, సత్యమే చెప్పటం, వినటం, ఆలోచించటం చిన్న నాటినుండే అలవాటు. వయసు గడిచిపోయింది. నిన్న రాత్రి నా మనసులో ఆలోచన వచ్చింది. "ఫకీర్ చంద్! సత్యం మాట్లాడటమే సత్యం నిజాయితీ అనుకుంటావు. మనం ప్రపంచంలో ఉంటాం. నోటితో పలికే దానినే సత్యం, అబద్ధం అని విశ్వసిస్తే ఒక వైపు మన దగ్గర ఎవరి మనసూ కష్టపెట్టకూడదనే సిద్ధాంతం ఉంది కదా! సత్యమైన వాక్కులను చెబితే ఎవరి మనసైనా బాధపడే అవకాశం కూడా ఉంది. నిరాపరాధి అయిన మనిషిని రక్షించడానికి అబద్ధం చెబితే నష్టం లేదు. నిజం చెబితే అతని ప్రాణం పోతుంది. అందుకే నిజం-అబద్ధం, సత్యం-అసత్యంల విషయంలో మొదట్లో నేను నమ్మిన నమ్మకం కొంత విసుగుపుట్టించింది. నేను ఏ ఫలితానికీ చేరలేకపోయే వాడిని. ఇతరుల మనసు బాధపడేలా అయితే ఆ సత్యం చెప్పకూడదని అందరూ చెబుతుంటారు. రాత్రి ఆలోచిస్తుంటే మనిషి ఏమిటి? ఎవరు? అనే ఊహ కలిగింది.

మనిషి లోపల మూడు వస్తువులున్నాయి. శరీరం, మనసు, ఆత్మ. స్థూల ప్రకృతి, సూక్ష్మ ప్రకృతి, కారణప్రకృతి. ఈ మూడింటికిపైన ఈ మూడింటిని చూసే సాక్షి ఉంది. సంత్‌లు ఈ నాల్గవ వస్తువును సురత్ అంటారు. ఆ సాక్షి రూపం ఏమిటోనని నేను దానిని చూసేందుకు ప్రయత్నించాను. అది తెలియలేదు. అదేమిటి? అది ఉంది అంతే! నిజాయితి-సత్యం ఏమిటి? సత్, చిత్, ఆనందం మన ఆత్మ. మూడింటి కూర్పు మనం. ఈ మార్గంలో సత్యసంధతతో నడుస్తానని ప్రతిజ్ఞ చేశాను. ఈ మార్గంలో అన్వేషించాను. నా అన్వేషణ అంతా తప్పు కావచ్చు. దాని గురించి నాకు చింతలేదు. నా ఆలోచన, మనసు, నడవడి పవిత్రంగా ఉంది. నా నడవడి మచ్చలేనిదై దాపరికం లేనిదై, నిర్మలమై, పవిత్రమై, శుద్ధమై ఉంది. సత్యత ఏమిటి? ఈ శరీరంలో లేదా ప్రపంచంలో జాగ్రదవస్థలో ఉంటూ చూస్తుంటాం. ఒక వేళ మనం విషం తింటే చనిపోతాం. నిజమాకాదా? నేనొక వేళ నిన్ను తిడితే నీవు నన్ను తిడతావు. ఔనా కాదా? అయితే మరి ప్రపంచంలో సత్యవస్తువు ఏమిటి? ఏదైతే మనం చూస్తామో, ఎలా ఎలా కర్మలు, విచారాలు చేస్తుంటామో వాటి ఫలం మనకు అవశ్యం దొరుకుతుంది. ఇది నిజం కాదా? కర్మ చేయటం, దాని ఫలితాన్ని పొందటం ఈ జాగ్రదవస్థలోని సత్యం. మనకు కర్మల ఫలితంగా శిక్ష లేదా రక్ష

లభిస్తుంది. "సత్యమేవ జయతే","సత్యమే పలుకుము" అనే వాక్యాలను వినేవాణ్ణి. ఈ ప్రపంచంలో సత్యమైనది ఏదని నాకు అర్థమైంది? తమ్ముడూ! నీవెలా చేస్తే అలా అనుభవిస్తావు? ఇది నాకర్థమైంది. అనుభవమైనది. దీనికి ఋజువు? ప్రస్తుత సైన్స్-విజ్ఞానం చెబుతుంది ఏమిటి? నీవు చేయి కదలించినా నీ ఈ కదలిక ప్రభావం పైన తారకల వరకు వెళ్తుంది. న్యూటన్ సిద్ధాంతం చెబుతోంది. చెబుతున్నదా లేదా? మన ఆలోచనా విచారాలు, శారీరక చలనం ఆకాశం వరకు పోతాయి. అక్కడి నుండి కొంత సమయం తరువాత ఫలిత రూపంలో వెనక్కి తిరిగి మన దగ్గరికి వస్తాయి. ఇవాళ చేసిన పనికి ఫలితం ఇవాళే దొరకాలనేం లేదు. దానికి సమయం పడుతుంది. సూర్యుని కిరణాలు ఇక్కడికి రావడానికి 7.5 సెకన్లు పడుతుంది. ఈ ప్రపంచమంతా కిరణాలదే! ఊహల, ఆలోచనల ధారలదే! దీని వలన ఋజువవుతున్న దేమిటంటే మనం ఎవరి గురించైనా చెడు ఆలోచిస్తే ఆ విచారాలు పైకి వెళ్లి అక్కడి నుండి వెనక్కి తిరిగి కిందికి వస్తాయి. దీనిని సైన్స్ నిరూపించింది. రెండవ సాక్ష్యం గురునానక్ సాహబ్.

"మందీ-కమ్మీ నానకా, జద్ కద్ మందా హోయ్"

లేదా

"చంగీ-కమ్మీ నానకా, జద్ కద్ చంగా హోయ్"

రెండు విషయాలు ఉన్నాయా లేదా? గురునానక్ సాహబ్ వ్యాఖ్యానించారు. మన శాస్త్రాలు కూడా

**కర్మ ప్రధాన్ విశ్వకరి రాఖా । జో జస్ కీ న్హ సు తస్ ఫల్ చాఖా ॥**

నీవు చేసేదానిదీ, ఆలోచించేదానిదీ ఫలితం నీకు లభిస్తుంది. ఇది ప్రపంచంలో జాగ్రదవస్థ లోని సత్యం. జాగ్రదవస్థలో 'సత్యమేవజయతే' ఇదే! ఒకవేళ 'నీవు నిరపరాధిని రక్షించడానికి అబద్ధం చెబితే నీకు ఏ పాపమూ లేదు. నీ కర్మ యొక్క నడవడి సరైనది. నా మాట. పొరపాటు కాదు. నేను రుజువు చేశాను. రాధాస్వామి దయాళుడు కూడా తనవాణిలో **"కరమ్ జో జో కరేగా తూ అంత్ మే భోగ్నా పడ్నా"** అన్నాడు. వేదాలు కూడా 'శివ సంకల్పమస్తు' అని ఈ విషయాన్నే చెప్పాయి. శుభాన్నే ఆలోచించు. ఎవరికీ చెడు కావాలని ఆలోచించకు. సంధ్యామంత్రం ఉంది. దాని అర్థం. "ఓ భగవంతుడా! మాతో శత్రుత్వం చేసే వారి భావాలను లేదా ఎవరితో మేం శత్రుత్వం చేస్తామో

మా ఇద్దరి భావాలనూ కాల్చివేయి". ఇది సరైనది! మహాత్మాగాంధీ ఓర్పు-గురించే చెప్పాడు. వీటన్నిటి ఉద్దేశ్యం ఏమిటి? జాగ్రదవస్థలో మన కర్మను మనం మన మనసు, వచనం, కర్మలను సంభాళించుకుని, సరైనవిగా ఉంచుకోవాలి. మన సుఖం, లాభాల కోసం మన నడవడి ద్వారా ఎవరికీ దుఃఖం, బాధ కలిగించకూడదు. ఎవరికీ చెడు కలగాలని ఆలోచించకూడదు. జీవుల హత్య కూడా దీనిలోకే వస్తుంది. మాంసం తినటం, మద్యం తాగటం, తాగి మత్తులో మునగటం, ఎవరినైనా తిట్టటం, దుఃఖం కలిగించటం అన్నీ అశుభకర్మలు. దాతా దయాల్‌జీ తన శబ్దాలలో ఈ మాటేరాశారు. అందరి ఉద్దేశాలు ఒక్కటే! నా మనసులో ఊహ కలిగింది, కొందరు సదా సత్యం, సత్యం అంటూ, "నేనెంతో సత్యమైన వాణ్ణి ఎదుటి వారు కారు" అని అనుకొంటారు. ఈ ప్రపంచంలో జాగ్రదవస్థలో మనం ఏ కర్మలు చేస్తుంటామో అది సత్యమైనది. మన స్వార్థం కోసం, స్వప్రయోజనం కోసం ఎవరికీ నష్టం కలిగించక పోవటం "సత్యం" అవుతుంది. నిజాయితీ అవుతుంది. ఒక యుక్తవయస్కుడైన కుర్రవాడున్నాడు. పెళ్ళిచేసుకున్న భార్య ఉంది. లేదా మరొక అమ్మాయి ఉంది. వీరిని అతడు బాధపెడుతుంటాడు. వారి మనసులను దుఃఖపెడుతుంటాడు. తన కుటుంబ సభ్యుల మనసులను దుఃఖపెడుతుంటాడు. అతడు పాపం చేస్తున్నాడు. నిజాయితీపరుడు కాడు. "సత్యమేవ జయతే" యొక్క సారం, దీనిలోకే వస్తుంది. ఈ మార్గంలో నడుస్తూ నా అనుభవానికొచ్చిన విషయాలను ప్రపంచానికి చెప్పి పోతానని శపథం చేశాను. మొన్నటినుండీ నా మనసులో "సత్యమేవ జయతే" అంటే ఏమిటనే ఆలోచన వస్తోంది. నా అనుభవంలోకి వచ్చిన అంశాన్ని ప్రస్తుత విజ్ఞానంతో, వేదాలతో, గురునానక్ సాహెబ్ వాణిలో సరిపోల్చి చూపాను. ఇప్పుడు దాతాదయాల్ శబ్ద్ వినండి.

**ఏ మేరే ప్యారే భాయీ, దేఖో సంభల్ కే రహనా ।**
**ఖోటే కరమ్ న కర్‌నా, ఖోటీ న బాత్ కహనా ॥**

**దుఃఖ్ దోగే దుఃఖ్ మిలేగా, సుఖ్ దోగే సుఖ్ మిలేగా ।**
**మారోగే తుమ్ కిసీ కో, ఫిర్ గమ్ పడేగా సహనా ॥**

**కాలో ఖ్యాల్ కర్ తబ్, దరియా సె హై ముశాబా ।**
**తుమ్ దేఖ్ నా న ఇన్‌కీ, లహరోఁ మే పడ్‌కే బహనా ॥**

**మన్ ఇంద్రియోఁపే భాయీ, జబత్ రఖ్‌నా తుమ్ బరాబర్ ।**

జీవిత్ బనే రహోగే, ఖుశ్ హాల్ హోకే రహనా ॥

అప్‌నీ న శస్త్ర రఖనా, తుమ్ ఆత్‌మా పే హర్‌దమ్ ।
ఆత్మ స్వరూప్ రక్షాకర్, సంసార్ మే విచార్‌నా ॥

నాకప్పగించిన జగత్ కళ్యాణం విధిని నిర్వహించ వలసిన బాధ్యత నాకుంది. గనుక ప్రపంచానికి సత్యాన్ని చెప్పిపోవాలని ప్రయత్నిస్తుంటాను. దేశంలో ప్రస్తుతం ఏం జరుగుతూ ఉంది? గృహస్థ జీవనంలో ప్రతి వ్యక్తీ స్వార్థపరుడే. తన స్వార్థం కోసం కుయుక్తులు పన్నుతుంటాడు. ఇతరుల మనసులు నొప్పిస్తుంటాడు. ఇతరులకు హాని కష్టం కలిగించేలా తిమ్మిని బమ్మిగా చేస్తుంటాడు. దుకాణాదారుడు ధర చెప్పటంలో, తూకంలో మోసం చేస్తుంటాడు. అది నేరమే! అతడు నేరస్థుడే! ఈ హర్తాళ్ళు దొమ్మీలు "సత్యమేవ జయతే"కి సంబంధించినవేనా? లేదు. వీటి పరిణామం సదా చెడుగా అవుతుంది. సుమారు 30 సంవత్సరాలయ్యాయి. నేను పిలుపు నిచ్చాను. ప్రస్తుత జనతంత్రం డెమోక్రసీలో ఎన్నికల పద్ధతి తప్పు. ఇదొక తీయని విషం వంటిది. ఆ విషమే ఇప్పుడు అందరినీ తినేస్తోంది. రవాణా సిబ్బంది సమ్మె చేస్తారు. దీని వలన ఎంత మంది ప్రయాణీకులకు ఇబ్బంది కలుగుతుంది? వస్తువులు సమయానికి చేరుకోవు. ఈ సమస్త చెడు కర్మలు ఈ సమ్మె చేసేవారి ప్రాణం తీస్తాయి. అది ఇవాళనో, రేపో, ఎల్లుండో, ఈజన్మలోనో, వచ్చే జన్మలోనో ఎప్పుడైనా కావచ్చు. వీరు తప్పించుకోలేరు. రాజనైతిక పార్టీలున్నాయి. పరస్పరం వ్యతిరేకంగా విషం చిమ్ముకుంటూ ఉంటాయి. వీరు తమ తమ గద్దెలకోసం ద్వేషాలను వెదజల్లు తుంటారు. ఈ కర్మల ఫలం తప్పక చెడుగా వస్తుంది. కర్మ ఫలం నుండి ఎవరికీ మినహాయింపు లేదు. నాకు దాతాదయాల్ జగత్కల్యాణ విధిని అప్పగించాడు.

**తూతో ఆయా నర దేహీ మే ధర్ ఫకీర్ కా భేషా ।**
**దుఃఖీ జీవ్ కోఅంగ్ లగాకర్ లేజా గురు కీ దేశా ॥**

ఈ విధిని పూర్తి చేసేందుకు నేనేం చేయగలనని ఆలోచిస్తుంటాను. ఉఫ్‌మని మంత్రం ఊదలేను. నాకు ఆ శక్తి లేదు. ప్రజల విశ్వాసం పనిచేస్తుంది. నేను స్వయంగా ఆశ్చర్యపోతుంటాను. బయటకు వెళ్ళినప్పుడు రకరకాల వ్యక్తులు రకరకాలుగా తమ సంఘటనలను, అనుభవాలను చెబుతుంటారు. నా రూపం సాక్షాత్కరించి వారికి సహాయపడుతుందని, దర్శనం ఇస్తుందని

చెబుతారు. ప్రజలకు సిద్ధి శక్తులు వస్తుంటాయి. నాకు ఆ విషయాలేవీ తెలియవు. ఈ విషయాన్ని నేను వాళ్ళకు స్పష్టంగా చెప్పకుండా, నా గొప్ప కోసం, మర్యాదగౌరవాల కోసం, సత్యంపైన తెర కప్పితే నేను "సత్యమేవ జయతే" సూత్రాన్ని ఆచరించి నట్లవుతుందా? పెద్ద పెద్ద గురువుల స్థితి చూశాను. వాళ్ళంతా పెద్ద పెద్ద కష్టాలనెదుర్కొన్నారు. భగవంతుని భక్తులు, మహాత్ములు, సమాధిలోకి వెళ్ళేవారికి ఈ చెడు ఫలితాలు ఎందుకు కలిగాయని ఆలోచిస్తుంటాను. ఇవన్నీ వీరికర్మల ఫలితాలేనని నమ్మవలసి వస్తుంది. "సత్యమేవ జయతే"! మన స్వార్థం కోసం, స్వప్రయోజనం కోసం ఎవరినీ మోసగించకూడదు. అన్యాయం చేయకూడదు. నడవడిని, కర్మను పవిత్రంగా, మచ్చలేనిదిగా, పవిత్రంగా ఉంచుకోవాలి. అయితే ఏమవుతుంది? నీ సత్యకర్మ విచారాల వలన నీకు సుఖం లభిస్తుంది. గురునామం అంటే బుద్ధి, తెలివి, వివేకాలే! గురునామం సత్యానిది. నిజాయితీది. ఎవరికి ఏది దొరికినా తమ కర్మల ఫలితం దొరుకుతుంది. వారు మహాత్ములైనా కానీ, సాధువులైనా కానీ, పీర్ పైగంబర్ లైనా కానీ! శుభ-అశుభ కర్మల ఫలం ప్రతివారికీ అనుభవించవలసి వచ్చింది. దాతాదయాలుని శబ్ద్ ఉంది.

"సబ్ భోగే బారంబార్ అవశ్య ఫల్ కర్మకియేకా"

రాముడు రాక్షసులను సంహరించాడు. దానిని నేను చెడుకర్మ అని అనను. ఇక్కడొక సర్పం కన్పించిందనుకుందాం. అది అనేక మందిని కరువగలుగుతుంది. దానిని ఎవరైనా చంపేస్తే అది పాపం కాదు. ఎందుకు కాదు? దానిని చంపటం వలన ఎందరి ప్రాణాలో కాపాడబడతాయి. యుద్ధరంగంలో వీరులు పోట్లాడుతారు. లక్షలాది స్త్రీల మానాలు కాపాడడానికీ దేశాన్ని కాపాడడానికీ వారు యుద్ధం చేస్తుంటారు. దేశ రక్షణ, సమాజ రక్షణ కోసం దండెత్తి వచ్చిన వారిని సంహరించటం పాపం కాదు. అది పుణ్యకార్యం. రణరంగంలో తన దేశ రక్షణ కోసం పోరాడుతూ మరణించిన వీరుడు స్వర్గానికి వెళ్తాడని శాస్త్రం చెబుతుంది. పూర్వకాలంలో యుద్ధం, పోరాటం జరిగేది. దాని వలన సామాన్య ప్రజలకు జనులకు ఏ నష్టం కలిగేది కాదు. ప్రస్తుతం బాంబులతో యుద్ధాలు. ఇది మంచిది కాదు. వీటివలన నిరపరాధులైన ప్రజలు వినాశనం పాలవుతారు. ఇది కుకర్మ. రాక్షసులను దునిమి రాముడు అశుభ కర్మ చేయలేదు. రాముడు పొరపాటు చేసిన సందర్భం ఒకటుంది.

తనను తాను మర్యాదా పురుషోత్తముడనిపించుకోవడానికి నిర్దోషి అయిన అబల సీతను తను అగ్నిపరీక్ష చేసి కూడా ఒక చాకలి ఏదో అన్నాడని, గర్భవతిగా ఉన్నదని కూడా చూడకుండా బహిష్కరించాడు. అదే ఆయన చేసిన పొరపాటు. నిజానికి సీతను నిర్వాసితురాలిని చేసే అవసరమేం లేదు. ఈ అనుచిత కర్మ చేసినందున చెడుపరిణామాన్ని రాముడు అనుభవించవలసి వచ్చింది. భరత, శత్రుఘ్న సహితంగా రామ, లక్ష్మణ, హనుమంతులను లవకుశులు అశ్వమేధయజ్ఞం సందర్భంగా ఓడించారు. హనుమంతుణ్ణి తాడుతో కట్టివేసి ఆయన కిరీటం తీసేశారు. సీత దగ్గరికి తీసుకువెళ్ళారు. ఇది చూసిన సీతకు ఎంతో క్లేశం కలిగింది. ప్రతి వారికీ తమ శుభ-అశుభ కర్మల ఫలాన్ని అవశ్యం అనుభవించవలసి వుంటుంది. కృష్ణుడు మహాభారత సమరం చేయించాడు. ఫలితంగా యాదవకులం నాశనమైంది. కర్మఫలం నుండి ఎవరూ తప్పించు కోలేకపోయారు. నేనెన్నోసార్లు ఆలోచిస్తుంటాను. "ఫకీర్‌చంద్! ఈ మోసాల వల నేర్పర్చావు? కృష్ణుని బలగం అతని నియమానుసారం ప్రవర్తించక అవహేళన చేశారు. పరస్పరం కలహించుకుని మరణించారు. అటువంటప్పుడు నీవు ఇతరులకు మేలు చేయాలని ఎందుకు అనుకుంటున్నావు. ఇక్కడ ఉండే 20-30 మందికి నీవు ఎలా మేలు చేయగలుగుతావు? ఇది కూడా నీ కర్మ ఫలితమే! బోధనా పద్ధతిని మార్చమని గురువు ఆజ్ఞాపించాడు. నేను బోధనా పద్ధతిని మార్చాను. చూడండి! పంచపాండవులుండే వారు. యుద్ధం జరిగింది. వీరు గెల్చారు. కానీ ఎవరిపైన అధికారం చూపుతారు? వంశం నాశనమై పోయింది. మనసులో ఉదాసీనత ప్రవేశించింది. మృత్యువును ఆలింగనం చేసుకోవడానికి హిమాలయాలలోకి వెళ్ళారు. మంచులో కరిగిపోయారు. నలుగురు దారిలో నడుస్తూ నడుస్తూ మరణించారని మహాభారతం చెబుతోంది. ద్రౌపది మరణించినప్పుడు అర్జునుడు ధర్మరాజుతో, 'ఈమె ఎందుకు మరణించింది?' అని అడిగాడు. "అమ్మగారి ఆజ్ఞ ప్రకారం ద్రౌపది మన ఐదుగురికీ భార్యగా ఉన్నా నిన్ను అధికంగా ప్రేమించెడిది. అది పాపం! అందుకే చనిపోయింది" అని చెప్పాడాయన. ఇదెంత గూఢమైన విషయం అని ఆలోచిస్తుంటాను. మనకు నలుగురు పిల్లలుంటే, వారిలో ఒకరిని ఎక్కువగా ఇష్టపడతాం. మిగతా వారిని తక్కువగా ప్రేమిస్తాం. అయితే ఇది మనం చేస్తున్న పాపం. మనం ఏం చేయాలి? మన మనసు స్థితిని సరియైన పద్ధతిలో ఉంచుకోవాలి. ఒకరిపట్ల ఎక్కువగా- మరొకరిపట్ల తక్కువ ప్రేమను కలిగి ఉంటే నేను దోషిని. అందుకే